


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 65

మంగళవారం 27-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పంజాబ్ 'టాప్' షో

ముంబై ఇండియన్స్‌పై గెలుపుతో ఐపీఎల్ క్వాలిఫయర్–1 మ్యాచ్‌కు అర్హత -14లో



సుప్రీం న్యాయమూర్తులుగా..

ముగ్గురిని సిఫార్సు చేసిన సీజేఐ సారథ్యంలోని కొలీజియం -6లో







ఏపీలో దళిత, మైనార్టీల ఆత్మగౌరవంపై బాబు సర్కార్ 'బూటు' దెబ్బ

- తెనాలి పట్టణంలో ముగ్గురు దళిత, మైనారిటీ యువకులపై థర్డ్ డిగ్రీ
- నడిరోడ్డుపై.. పట్టపగలే.. ప్రజల కళ్లెదుటే.. అరికాళ్లపై లాఠీలతో స్వైరవిహారం
- ఒక సీఐ బూటు కాలితో తొక్కిపెట్టగా.. మరో సీఐ దాష్టీకం
- ఆలస్యంగా వెలుగులోకి.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో
- బరి తెగింపులో ఏపీ సీఎం చంద్రబాబు బాటలోనే ఆ రాష్ట్ర పోలీసులు

12 లో

న్యూస్‌రీల్


మాక్రాన్‌కు చెంపదెబ్బ?



వియత్నాం పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న ఉదంతం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌ను ఇబ్బందులపాలు చేసింది. విమానం దిగే క్రమంలో భార్య బ్రిగెట్ ఒక్కసారిగా మాక్రాన్ ముఖంపై కొడుతున్నట్టుగా కన్పించారు.

- వివరాలు 6లో▶

పాక్‌కు టెర్రరిజమే టూరిజం



ఆపరేషన్ సిందూర్‌తో పాక్ ఉగ్రవాదులు, సైన్యం, పాలకులకు బుద్ధిచెప్పిన ప్రధాని మోదీ ఇప్పుడు ఆ దేశ ప్రజలకూ హితవు పలికారు. ఉగ్రవాదం మీ ప్రభుత్వం, సైన్యానికి ఆదాయ వనరుగా మారిందని, ఇకనైనా మీరు మేల్కొనాలని పిలుపునిచ్చారు.

- వివరాలు 6లో▶

పుతిన్‌కు పిచ్చెక్కింది: ట్రంప్




- ఉక్రెయిన్ స్వాధీనమంటే రష్యా పతనమే
- జెలెన్‌స్కీ నోరు మూసుకోవాలన్న అధ్యక్షుడు - 6లో

కుదరని ఏకాభిప్రాయం!

కేబినెట్ విస్తరణ మరోసారి వాయిదా • కేసీ, మహేశ్‌గౌడ్‌తోనే రాహుల్ చర్చలు

- సామాజికవర్గాలు, జిల్లాల వారీగా ఆశావహుల ఎంపికపై భిన్నాభిప్రాయాలు
- ఏఐసీసీ ఆలోచనలకు, పీసీసీ ప్రతిపాదనలకు, సీఎం ఉద్దేశాలకు మధ్య వైరుధ్యం!
- ఒకరిద్దరి విషయంలో రేవంత్, ఏఐసీసీ పెద్దల పట్టుదల
- బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలంటున్న మహేశ్‌గౌడ్
- ఢిల్లీలోనే ఉన్నా సమావేశానికి దూరంగా ముఖ్యమంత్రి
- రాహుల్‌తో చర్చల సారాంశాన్ని సీఎంకు వివరించిన పీసీసీ చీఫ్
- హైదరాబాద్‌కు రేవంత్.. ఢిల్లీలోనే మహేశ్‌గౌడ్
- 30న మరోసారి మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కూర్పుపై సమావేశం



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన చర్చలు మళ్లీ అసంపూర్తిగానే ముగిశాయి. ఆశావహుల తుది జాబితాపై ఏకాభిప్రాయం కుదరలేదని తెలిసింది. సామాజిక సమీకరణాల మేరకు తుది జాబితాను ఖరారు చేయడంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో దీనిపై మరోసారి భేటీ కావాలని కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ భావించినట్లు సమాచారం. దీంతో కేబినెట్ విస్తరణపై ఏదో ఒకటి తేల్చుకుని హైదరాబాద్ తిరిగి వెళ్లాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీలోనే వేచి ఉన్నప్పటికీ ఫలితం దక్కలేదు. చివరకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో కూడా భేటీ కాకుండానే ఆయన తిరుగు పయనమయ్యారు. కాగా ఈ నెల 30న ఢిల్లీలో మరోసారి తెలంగాణ కాంగ్రెస్ నాయకులతో అధిష్టానం సమావేశం కానుంది. శుక్రవారం మళ్లీ ఢిల్లీకి రావాలని

మిగతా 2వ పేజీలో ▶


నేడు ఖర్గేతో మహేశ్‌గౌడ్ భేటీ

4 రోజుల కిందట ఢిల్లీకి వచ్చిన మహేశ్‌గౌడ్ కులగణన అంశంపై రాహుల్‌గాంధీ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగానూ రాహుల్‌తో మహేశ్‌గౌడ్ చాలాసేపు మాట్లాడారు. ఇలా మూడు రోజుల వ్యవధిలోనే రెండుసార్లు రాహుల్‌గాంధీతో మహేశ్‌గౌడ్ భేటీ అయ్యారు. కాగా సోమవారం ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన ఆలిండియా ఓబీసీ నేతల సమావేశంలో పాల్గొన్న పీసీసీ అధ్యక్షుడు కులగణన గురించి మాట్లాడారు. మంగళవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో ఆయన భేటీ కానున్నారు.

సాగుకు దన్నుగా ప్రభుత్వ బ్యాంకులు

2024-25లో రూ.84,610 కోట్లు ఇచ్చిన ప్రభుత్వ రంగ బ్యాంకులు

- నిర్దేశిత లక్ష్యం 98.41% సాధన
- ఎస్‌ఎల్‌బీసీ 2024–25 వార్షిక నివేదిక వెల్లడి
- ఒక్క ఎస్‌బీఐ రుణమే రూ. 41,630 కోట్లు
- వెనుకంజలో ప్రైవేటు రంగ బ్యాంకులు
- అసలు లక్ష్యాన్ని నిర్దేశించుకోవడంలోనే ఉదాసీనత!
- రూ.21,616 కోట్లు మాత్రమే ఇచ్చిన వైనం
- టాప్ త్రీలో హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంకులు




సాక్షి, హైదరాబాద్

రైతులకు రుణాల మంజూరులో ప్రభుత్వ రంగ బ్యాంకులు ముందుంటూ ఆదుకుంటుంటే ప్రైవేటు బ్యాంకులు వెనుకంజలో ఉంటున్నాయి. ప్రైవేటు బ్యాంకులు అసలు రుణ మంజూరులో కాదు..రుణ మంజూరు లక్ష్యాలను నిర్దేశించుకోవడంలోనే ఉదాసీనంగా ఉంటున్నాయనే ఫిర్యాదులున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులన్నీ కలిపి రూ.84,610 కోట్ల మేర రుణాలు ఇస్తే, ప్రైవేటు బ్యాంకులు కేవలం రూ.21,616 కోట్లు మాత్రమే ఇవ్వడం గమనార్హం. రుణాల మంజూరుకు సంబంధించి 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ నిర్దేశిత లక్ష్యాలను 98.41 శాతం నెరవేర్చగా, 21 ప్రైవేటు రంగ బ్యాంకులు మొత్తంగా 84 శాతం అందుకున్నాయి. అయితే ఒకటి రెండు బ్యాంకులు తమ నిర్దేశిత లక్ష్యాలకు చేరువగా రుణాలు మంజూరు చేయడంతో ఇది సాధ్యమైంది. కాగా కొన్ని ప్రైవేటు బ్యాంకులు రైతులకు రూపాయి కూడా రుణంగా ఇవ్వలేదు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) తాజా

మిగతా 12వ పేజీలో ▶

పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఉప ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి: కేటీఆర్

- వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరిన వారిని ఓడించాలి
- గద్వాల ఉప ఎన్నికలో సామాన్యుడికి టికెట్ ఇస్తాం
- జూన్ చివరి వారంలో బీఆర్‌ఎస్ సభ్యత్వం ప్రారంభం



కర్రు కాల్చి వాత పెట్టాలి

సాక్షి, హైదరాబాద్: 'బీఆర్‌ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలను పండబెట్టి తొక్కాలి. ఇది ఆవేశంతో చెప్పడం లేదు బాధతో చెప్తున్నా. మనతోనే ఉండి మనకు వెన్నుపోటు పొడిచి పార్టీని విడిచి వెళ్లిన పది మంది ఎమ్మెల్యేలకు కర్రు కాల్చి వాత పెట్టాలి. ఉప ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు చెప్పారు. కాంగ్రెస్ దరిద్రాన్ని ఇంకా ఎన్ని రోజులు చూడాలని ప్రజలు బాధ పడుతూ వారిని గద్దె దించేందుకు ఏదైనా మార్గం చూపమని అడుగుతున్నారన్నారు. గద్వాల నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం కేటీఆర్ సమక్షంలో తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్‌లో చేరారు. రాష్ట్రంలో ఎన్నిక ఏదైనా కాంగ్రెస్, బీజేపీకి బుద్ధి చెప్పేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని

మిగతా 3వ పేజీలో ▶



ముగిసిన పుష్కరాలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఈనెల 15న ప్రారంభమైన సరస్వతీ నది పుష్కరాలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజు లక్ష మందికిపైగా భక్తులు పుష్కర స్నానాలు చేసినట్లు అంచనా. - 3లో

లూటీ అయిన రాష్ట్రాన్ని గాడిలోకి తెస్తున్నాం

- తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం
- సంపద సృష్టించి ప్రజలకు పంచుతాం
- రెండు దశాబ్దాలపాటు రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నాం
- మేం తెచ్చిన ప్రతి పథకం దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తోంది

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

- నాగర్‌కర్నూల్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

2 లో



విద్యుత్ కార్మికులకు రూ.కోటి ప్రమాద బీమా

- వివరాలు 2లో▶

కేటీఆర్‌కు మళ్లీ నోటీసులు

ఫార్ములా–ఈ రేసు కేసులో మరోసారి ఏసీబీ పిలుపు

- ఈనెల 28న హాజరుకావాలని నోటీసు
- కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తున్నందుకే నోటీసులు: కేటీఆర్
- తనపై ప్రతీకారంతో సీఎం రేవంత్ ఎంతకైనా దిగజారతారని ధ్వజం

3 లో

పలకరించిన తొలకరి వాన..

- రాష్ట్రంలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు

3 లో



ముందస్తు నైరుతి ఎందుకంటే..

- వివరాలు 6లో▶

'నైపుణ్యం'గా నయా మోసం

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో స్కిల్స్ పేరుతో కొత్త దోపిడీ

- ఉద్యోగానికి కావాల్సిన స్కిల్‌కు అడ్డదారి మార్గం.. ఏజెన్సీలతో కలిసి నైపుణ్య శిక్షణకు షార్ట్ కట్
- జాబ్ వచ్చినా బేసిక్స్ రాని విద్యార్థులకు కష్టాలు
- ఐటీ సెక్టార్ హెచ్చరికతో అప్రమత్తమైన ప్రభుత్వం.. డీమ్డ్ వర్సిటీల బాగోతంపై ఏఐసీటీఈకి ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్‌లో నైపుణ్య శిక్షణ వక్రమార్గం పడుతోంది. ముఖ్యంగా స్వతంత్ర ప్రతిపత్తి గల ప్రైవేటు కాలేజీలు స్కిల్స్ పేరుతో విద్యార్థులను మోసం చేస్తున్నాయి. కాలేజీతో సంబంధం లేని కొన్ని కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుంటున్నాయి. సబ్జెక్టులకు ప్రాధాన్యమివ్వకుండా కేవలం ఉద్యోగం పొందేందుకు చాట్ జీపీటీ, ఏఐ సంబంధిత టెక్నాలజీపైనే షార్ట్ కట్స్ బోధిస్తున్నాయి. ఎమర్జింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు కాలేజీల్లో కాకుండా, స్కిల్ కేంద్రాల్లో బోధిస్తున్నారు. పరీక్షలు నిర్వహించడం, డిగ్రీలు ఇవ్వడం మాత్రం కాలేజీల్లో జరుగుతోంది. ఈ క్రమంలో కీలకమైన ఫ్యాకల్టీని తగ్గిస్తున్నాయి. ఇదంతా చట్టవిరుద్ధమని

మిగతా 3వ పేజీలో ▶

సజీవంగా పట్టుకుని కాల్చి చంపారు



లొంగిపోయిన ద్రోహులే నంబాల సమాచారం ఇచ్చారు

- సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని కోరినా నంబాల అంగీకరించలేదు..
- శాంతి చర్చల కోసం 40 రోజుల కాల్పుల విరమణ పాటించాం..
- మా నిర్ణయాన్ని ప్రత్యర్థి అనుకూలంగా మార్చుకున్నాడు
- అబూజ్‌మఢ్ ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టుల సుదీర్ఘ లేఖ

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు అలియాస్ బీఆర్ దాదాను పోలీసులు సజీవంగానే పట్టుకుని కాల్చిచంపినట్టు మావోయిస్టు పార్టీ ప్రకటించింది. లొంగిపోయిన కొందరు ద్రోహులు ఇచ్చిన సమాచారంతోనే పోలీసులు ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లా, అబూజ్‌మఢ్ ప్రాంతంలో ఈనెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో విజయం సాధించగల్గినట్టు పేర్కొంది. నంబాల సహా ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 27 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయినట్టు వెల్లడించింది. ప్రాణాలను త్యాగం చేసిన వారికి

మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



జీవ వైవిధ్యమే!

అక్కడ ఒకలా.. ఇక్కడ మరోలా..

- కవ్వాల్, అమ్రాబాద్‌లో పెరుగుతున్న జీవజాలం
- సత్ఫలితాలిస్తున్న అటవీ శాఖ ప్రత్యేక చర్యలు
- గోదావరి, మంజీర తీరాల్లో ప్రమాదంలో జీవవైవిధ్యం
- జింకలు, విదేశీ పక్షులను చంపి తింటున్న ఊరకుక్కలు
- శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో పరిస్థితి విషమం



నీటి కుంటల వద్ద ఉప్పు గడ్డలను చప్పరిస్తున్న నీల్గాయిలు



అమ్రాబాద్ పరిధిలో సందర్శకులకు కనిపించిన పెద్దపులి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఒక్క గాండ్రింపుతో అడవిని వణికించే పులుల రాజ్యంలో సాధు జంతువులు మందలు మందలుగా వృద్ధి చెందుతున్నాయి. పులులే లేని అరణ్యాల్లో స్వేచ్ఛగా సంతతిని వృద్ధి చేసుకునే అవకాశమున్న చోట మాత్రం శాఖాహార జీవులు నశించిపోతున్నాయి. కవ్వాల్, అమ్రాబాద్ పులుల అభయారణ్యాల్లో అత్యంత శ్రద్ధతో జీవవైవిధ్యాన్ని పెంపొందిస్తున్న అటవీశాఖ అధికారులు.. నిజామాబాద్ జిల్లాలోని గోదావరి, మంజీరా పరీవాహకం, శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ప్రాంతాల్లో జీవజాలాన్ని కాపాడటంలో విఫలమవుతున్నారే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో జింకలు, దుప్పుల వంటి వణ్యప్రాణులు ఊరకుక్కలు, వేటగాళ్ల దాడుల్లో వేగంగా నశించిపోతున్నాయి.

పెరుగుతున్న జంతుజాలం

మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వర్ నుంచి పులులు పెన్‌గంగా, ప్రాణహిత దాటి కవ్వాల్‌లోకి వస్తున్నాయి. ప్రస్తుతం ఇక్కడ ఏడు వరకు పులులు సంచరిస్తున్నాయి. అమ్రాబాద్ పరిధిలో 36 వరకు ఉన్నాయి. గత నాలుగేళ్లుగా క్రమంగా వీటి సంఖ్య పెరుగుతోంది. టైగర్ సఫారీకి వెళ్తున్న సమయంలోనూ సందర్శకులు ఈ పులులను నేరుగా చూడగలుగుతున్నారు. నల్లమలలో చింకార జాతి చిరుతలు, అడవి పందులు, అడవి దున్నలు, సాంబార్, చుక్కల, కొమ్ముల జింకలు, దుప్పిలు, నీల్గాయిలు, రేస్ కుక్కల, అలుగులు తదితర జంతువుల సంఖ్య పెరుగుతోంది. అనేక రకాల పక్షి జాతులు కూడా ఉన్నాయి. వీటికోసం అటవీశాఖ అధికారులు వేసవికాలంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నీటి కుంటలు, గడ్డి క్షేత్రాలు పెంచి వేసవిలోనూ పచ్చదనం ఉండేలా చూస్తున్నారు. జంతువులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా మట్టితో పాటు ఉప్పు కుండీలు ఏర్పాటుచేస్తున్నారు.

కోర్‌లోని గ్రామాల తరలింపు

అభయారణ్యాల్లోని కోర్ గ్రామాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కవ్వాల్‌లో 37 ఆవాసాలు గుర్తించగా, కడెం మండలం రాంపూర్, మైసంపేటలోని 142 మంది నిర్వాసితులను పునరావాసాలకు తరలించారు. తదుపరి జన్నారం మండలం దొంగపల్లి, అల్లీనగర్, మల్యాలను తరలించనున్నారు. అమ్రాబాద్ పరిధి సార్లపల్లి, కుడిచింతలబైల్, కొల్లంపెంట, తాటిగుండాల చెంచుపెంట గ్రామాల ప్రజలకు పెద్దకొత్తపల్లి మండలం బాచారంలో పునరావాసం కల్పించనున్నారు. ఈ చర్యలతో ఇక్కడ మానవ సంచారాన్ని కూడా తగ్గిస్తుండటంతో జంతుజాలం మరింత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

> **కవ్వాల్‌లో ప్రత్యేక చర్యలు**
>
> కవ్వాల్ అడవుల్లో చేపడుతున్న ప్రత్యేక చర్యలతో వన్యప్రాణుల సంఖ్య పెరుగుతోంది. ఎప్పటికప్పుడు ఆవాసాల్లో జంతువుల పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. విద్యుత్ తీగలతో వేటాడకుండా ఆ శాఖ అధికారులతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. – శాంతారాం, ఫీల్డ్ డైరెక్టర్, ప్రాజెక్ట్ టైగర్, కవ్వాల్ టైగర్ రిజర్వు

తగ్గుతున్న జీవవైవిధ్యం

నిజామాబాద్ జిల్లాలోని గోదావరి, మంజీరా నదుల పరీవాహకం, నాగ్‌పూర్–హైదరాబాద్ జాతీయ రహదారికి ఇరువైపులా ఇందల్వాయి ప్రాంతం వన్యప్రాణులకు, వలస పక్షులకు ఆలవాలంగా ఉంది. ఇటీవలికాలంలో ఈ జీవవైవిధ్యం తగ్గుతూ వస్తోంది. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ ఏరియాలో బాసర సరస్వతి అమ్మవారి ఆలయం వరకు ఎకోటూరిజం అభివృద్ధికి సర్వే కొనసాగుతుండగానే జంతువుల సంఖ్య మాత్రం వేగంగా తగ్గిపోతోంది. శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ప్రాంతంలోని నందిపేట, డొంకేశ్వర్, నవీపేట, మెండోరా మండలాల్లో, గోదావరి ఎడమవైపున నిర్మల్ జిల్లాలోని లోకేశ్వరం మండలంలో జింకలు, దుప్పులు, నెమళ్ల ఆహారం కోసం సమీప గ్రామాల్లోని పంటపొలాల్లోకి వస్తుంటాయి. అటవీ అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో ఈ వన్యమృగాలను ఊరకుక్కలు వేటాడి చంపి తింటున్నాయి. దీంతో వాటి సంఖ్య తగ్గిపోతోంది. ఈ కుక్కల దెబ్బకు విదేశీ వలస పక్షుల (ఫ్లెమింగో, పెలికాన్, పెయింటెడ్ స్టోర్క్, హెరోన్) రాక కూడా తగ్గిపోయింది. ఇక్కడ వేటగాళ్ల బెడద కూడా అధికంగా ఉంది. గత ఏడాది జింక చర్మం, కొమ్ములు, నాటు తుపాకిని అధికారులు ఓ ఇంట్లో పట్టుకున్నారు. తరువాత బోధన్ మండలంలోని ఖండ్‌గావ్ చెక్‌పోస్టు వద్ద వేటగాళ్ల ముఠా పట్టుబడింది.



గోదావరి బ్యాక్ వాటర్‌లో విదేశీ పక్షిని వేటాడుతున్న కుక్క



ఎన్‌హెచ్44పై వాహనం ఢీకొని మృతిచెందిన చిరుత

తరచూ రోడ్డు ప్రమాదాలు

నాగ్‌పూర్–హైదరాబాద్ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఇందల్వాయి మండలంలోని అటవీ ప్రాంతంలో వన్యమృగాలు వాహనాల కింద పడి మరణిస్తున్నాయి. 2018 జనవరిలో రైలు ఢీకొనడంతో సిర్నాపల్లి వద్ద చిరుత మృతి చెందింది. 2019 మేలో రూప్లానాయక్ తండా వద్ద జాతీయ రహదారిపై వాహనం ఢీకొని చిరుత మృతి చెందింది. 2023 ఫిబ్రవరిలో చంద్రాయన్‌పల్లి అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని చిరుత మరణించింది. ఈ నెల 7న చంద్రాయన్‌పల్లి జాతీయ రహదారిపై వాహనం ఢీకొని చిరుత మృత్యువాత పడింది. వన్యమృగాలు సంచరించే అటవీ ప్రాంతం గుండా జాతీయ రహదారి వెళుతున్నప్పటికీ అండర్‌పాస్‌లు నిర్మించాలనే ఆలోచన అధికార యంత్రాంగానికి లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



గోదావరి బ్యాక్ వాటర్ వద్ద ఫ్లెమింగో పక్షుల సందడి

‘తూనికల’ శాఖలో ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

‘రెన్యువల్‌కూ ఓ రేటుంది’ కథనానికి పౌరసరఫరాల శాఖ స్పందన

సాక్షి, హైదరాబాద్: తూనికలు, కొలతల శాఖలో తూకం, మోసాలు, నిబంధనల ఉల్లంఘనలపై చట్టపరమైన ప్రాసిక్యూషన్‌కు బదులుగా విధించే కాంపౌండింగ్ (జరిమానా) రుసుం వసూళ్లలో చేతివాటం ప్రదర్శించిన గద్వాల్ జిల్లా ఇన్‌చార్జి, వనపర్తి జిల్లా ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణపై సస్పెన్షన్ వేటు పడింది. గత నెల 8న ‘సాక్షి’దినపత్రికలో ‘రెన్యువల్‌కూ ఓ రేటుంది’అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై విచారణ నిర్వహించిన పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ విభాగం నివేదిక సమర్పించడంతో రాష్ట్ర కంట్రోలర్ డీఎస్ చౌహాన్ సోమవారం వనపర్తి జిల్లా ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. పెట్రోల్ బంక్‌లో డీఎస్ఎస్ఆర్ బుక్ మెయింటెనెన్స్ నిర్లక్ష్యంపై జరిమానా విధించిన గద్వాల్ జిల్లా ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ నాలుగింతలు నగదు సొమ్మును జేబులో వేసుకున్నారు. అయితే తూ.కొ. విజిలెన్స్ విభాగం విచారణ కాలయాపనపై పత్రికల్లో కథనం వచ్చింది. శాఖాపరమైన విచారణపై సంతృప్తి చెందని రాష్ట్ర కంట్రోలర్ విజిలెన్స్ విభాగానికి విచారణకు ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా ఇన్‌స్పెక్టర్‌పై సెస్పెన్షన్ వేటు పడింది.

సాక్షి ఎఫెక్ట్

ఏపీ డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా



సాక్షి, అమరావతి: ఏపీ డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా నియమితులయ్యారు. ఇప్పటివరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న ఆయన డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజాగా.. పూర్తి స్థాయి డీజీపీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

లూటీ అయిన రాష్ట్రాన్ని గాడిలోకి తెస్తున్నాం

తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం

- సంపద సృష్టించి ప్రజలకు పంచుతాం
- త్వరితగతిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



గట్టుతుమ్మన్‌లో జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టిని సత్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో మంత్రి జూపల్లి

అచ్చంపేట/ఆమనగల్లు: ‘ప్రజాప్రభుత్వంలో సమగ్ర ప్రణాళికతో సంపద సృష్టించి ప్రజలకు పంచుతాం. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని లూటీ చేసింది. మేము గాడిలోకి తెచ్చి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం. ప్రపంచం మొత్తం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది. మేం తెచ్చిన ప్రతి పథకం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తోంది.. ఇప్పటికే మీ మోడల్ మాకు చెప్పండంటూ ఇతర రాష్ట్రాలు అడుగుతున్నాయి’అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని గట్టుతుమ్మన్ గ్రామంతోపాటు రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు.

కులగణనతో దేశానికే ఆదర్శంగా నిలిచాం

గట్టుతుమ్మన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ కులగణన 50 రోజుల్లో పూర్తి చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని ఆయన కుమార్తె కవిత ఇప్పుడు చెబుతోందని.. కానీ రాష్ట్ర ప్రజలు ఎన్నికల్లోనే ఈ దెయ్యాలను వదిలించుకొని ప్రజాప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని భట్టి ఎద్దేవా చేశారు. రెండు దశాబ్దాలపాటు రాష్ట్రాభివృద్ధికి కావాల్సిన ప్రణాళికను తాము తయారు చేస్తున్నామన్నారు.

కాంగ్రెస్ వస్తే కరెంట్ పోతుందని కేసీఆర్ దుష్ప్రచారం చేశారు..

‘మా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల కేసీఆర్ వద్దకు ఎవరూ రావట్లేదని ఆయన బాధపడుతున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ పోతుందని కేసీఆర్ దుష్ప్రచారం చేశారు. అప్పట్లో మేము సవాల్ చేశాం. చెప్పినట్లుగానే డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుదుత్పత్తి చేస్తున్నాం’అని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా మరో 50 ఏళ్ల విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని తమ ప్రభుత్వం ప్రణాళికలను రచిస్తోందని భట్టి చెప్పారు. 2029–30 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో భవిష్యత్ తరాలకు మిగులు విద్యుత్ అందిస్తామని.. ఇతర రాష్ట్రాలకు విద్యుత్‌ను అమ్మే స్థాయికి ఎదుగుతామని పేర్కొన్నారు.

సంక్షేమానికి ఏటా రూ.70 వేల కోట్లు

రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు ఏటా రూ. 70 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో రూ. 200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ. 18 కోట్లతో నిర్మించనున్న 8 విద్యుత్ సబ్ స్టేషన్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన బహిరంగ సభలో పాల్గొన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తిచేసి సాగునీరు అందించడమే ప్రజాప్రభుత్వ ఎజెండా అని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రిజర్వాయర్ల భూసేకరణ నిధులను వెంటనే విడుదల చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులకు రూ.కోటి ప్రమాద బీమా

దేశ చరిత్రలోనే ఓ రికార్డు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్/హన్మకొండ: విద్యుత్ కార్మికులకు కోటి రూపాయలకు పైబడి ప్రమాద బీమా అందించడం దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్) పరిధిలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జోగు నరేశ్ కుటుంబ సభ్యులకు సోమవారం ప్రజాభవన్‌లో కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కుతో పాటు విద్యుత్ శాఖలో నరేశ్ శ్రీమతికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేసిన సందర్భంగా భట్టి మాట్లాడారు. విద్యుత్ కార్మికునికి కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును అందించడం కేవలం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. గతంలో కార్మికుల కోసం ఏ ప్రభుత్వం ఇంత గొప్పగా ఆలోచన, ప్రయత్నం చేయలేదని చెప్పారు. ప్రమాద బీమా, కారుణ్య నియామక పత్రం అందించడం ప్రభుత్వ ఆలోచనకు, మానవీయ కోణానికి అద్దం పడుతోందని, విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ సీఎం కోరారు. ప్రభుత్వ ఆలోచనను సమర్థవంతంగా అమలు చేసిన ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డిని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి విద్యుత్, బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



జోగు నరేశ్ సతీమణి సుష్మకు రూ.కోటి బీమా చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో వేం నరేందర్‌రెడ్డి తదితరులు

భారతీయ సంస్కృతి ప్రపంచానికి ఆదర్శం

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

- ఐఐటీహెచ్‌లో ప్రారంభమైన 10వ అంతర్జాతీయ సాంస్కృతిక, సంగీత సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. దేశ సంస్కృతిలో సమాఖ్య విధానం, ధర్మం ఉందన్నారు. యువతలో భారతీయ శాస్త్రీయ సంగీతం, సంస్కృతి పట్ల మక్కువ పెంచేందుకు ఏర్పాటు చేసిన సంస్థ ఎస్‌పీఐసీఎంఏసీవై (సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చరల్ అమాంగెస్ట్ యూత్) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ ఐఐటీహెచ్‌లో 10వ అంతర్జాతీయ సాంస్కృతిక, సంగీత సదస్సు సోమవారం ప్రారంభమైంది. జూన్ 1 వరకు జరగనున్న ఈ సదస్సులో దేశ విదేశాలకు చెందిన సుమారు 1,500 మంది కళాకారులు, సంగీత విద్వాంసులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ మాట్లాడుతూ.. త్రిపుర రాష్ట్ర నృత్యరూపం హోజగిరిని సంరక్షిస్తుండటం, ఈ సదస్సుల్లో ఈ కళారూపాన్ని ప్రదర్శించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కళల పట్ల అవగాహన పెంచుకోవాలని గవర్నర్ సూచించారు. భారతీయ కళలను, సంస్కృతి, సాంప్రదాయాల పట్ల యువతలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న ఎస్పీఐసీ ఎంఏసీవై సంస్థను గవర్నర్ అభినందించారు. తొలిరోజు పద్మభూషణ్ అవార్డు గ్రహీతలు రాజా, రాధారెడ్డిల కూచిపూడి కచేరీ అలరించింది. పద్మభూషణ్ డాక్టర్ ఎన్.రాజం హిందుస్తానీ వయోలిన్ కచేరీ, గాయని అంగ్‌శైలి రాగాలు సంగీత ప్రియులను అలరించాయి. కార్యక్రమంలో ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, స్పిక్‌మకే నేషనల్ చైర్మన్ రాధామోహన్ తివారీ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

‘ఇందిరమ్మ’ లబ్ధిదారులతో మంత్రి పొంగులేటి ముఖాముఖి

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భేటీ అయిన మంత్రి

సాక్షి, హైదరాబాద్: ‘సొంతంగా పక్కా ఇల్లు సమకూరుతుందని కలలో కూడా ఊహించలేదు. ఇంతకాలంగా గుడిసెలు, రేకుల షెడ్లలోనే గడుపుతున్నాం. ఇప్పుడు ఇందిరమ్మ పథకం ద్వారా పక్కా ఇల్లు సమకూరుతోంది. త్వరలో గృహప్రవేశం చేస్తాం’అంటూ పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పలువురు ఇందిరమ్మ ఇంటి పథకం లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భేటీ అయ్యారు. వారు ఇళ్లను కట్టుకుంటున్న తీరు, ప్రభుత్వం నుంచి అందుతున్న ఆర్థిక సాయం, ఇతర అంశాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. తాను నిర్మించుకుంటున్న ఇంటికి పునాది, గోడల స్థాయి వరకు రెండు దఫాలుగా రూ.లక్ష చొప్పున రూ.2 లక్షల ఆర్థిక సాయం అందిందని, ఇప్పుడు పైకప్పు నిర్మించుకుంటున్నానని, ఇందిరమ్మ పథకం ద్వారా తనకు పక్కా ఇంటి బెంగ తీరిందని ఖమ్మంకు చెందిన ఉమ తెలిపారు. అలాగే.. తమకు ఈరోజే పైకప్పునకు సంబంధించి రూ.2 లక్షల సాయం అందిందని, త్వరలో నిర్మాణం పూర్తవుతుందని, గృహప్రవేశానికి ముఖ్యమంత్రిని తీసుకుని మంత్రి పొంగులేటి రావాలని కొడంగల్ నాగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన లక్ష్మి పేర్కొన్నారు. తనకు ఇద్దరు పిల్లలని, ఇన్నాళ్లూ గుడిసెలో ఉండేవారమని, ఇలాంటి తరుణంలో గౌరవంగా ఉండేలా ఇందిరమ్మ ఇంటిని ప్రభుత్వం మంజూరు చేసిందని నిర్మల్‌కు చెందిన సుభావతి తెలిపారు.

రూ.68 కోట్లు దాటిన చెల్లింపులు: ఈ వారానికి సంబంధించి ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు రూ.14.44 కోట్ల మొత్తాన్ని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా విడుదల చేశారు. పైలట్ ప్రాజెక్ట్ కింద 47,335 ఇళ్లు మంజూరు చేయగా 7,824 ఇళ్లు బేస్‌మెంట్, 895 ఇళ్లు గోడల వరకు, మరో 64 ఇళ్లు పైకప్పు వరకు పూర్తయ్యాయని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటి వరకు వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు మొత్తం రూ.68.08 కోట్లు అందజేశామని తెలిపారు.

కుదరని ఏకాభిప్రాయం!

▶ మొదటి పేజీ తరువాయి

సీఎంతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు అధిష్టానం సూచించింది.

ముఖ్యమంత్రి వేచి చూసినా..

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గ కూర్పుపై ఆదివారం రాత్రి ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌లు జరిపిన చర్చలకు కొనసాగింపుగా.. సోమవారం కూడా చర్చలు ఉంటాయని భావించారు. ఈ చర్చల్లో పాల్గొనేందుకే ముఖ్యమంత్రి సోమవారమంతా ఢిల్లీలో ఎవరినీ కలవకుండా వేచిచూశారు. అయితే సోమవారం సాయంత్రం 5 గంటలకు రాహుల్‌గాంధీతో సమావేశమైన కేసీ వేణుగోపాల్.. ఆదివారం రాత్రి సీఎం, పీసీసీ అధ్యక్షుడితో జరిపిన చర్చల సారాంశాన్ని వివరించారు. ముఖ్యమంత్రి అభిప్రాయాలను సైతం వెల్లడించారు. ఈ భేటీ కొనసాగుతున్న సమయంలోనే రాహుల్ కార్యాలయం నుంచి మహేశ్‌గౌడ్‌కు పిలుపు రావడంతో ఆయన వెంటనే తన కుటుంబ సభ్యులతో కలిసి రాహుల్‌ని కలిశారు. ఈ సందర్భంగానే మహేశ్‌గౌడ్ మంత్రి పదవులు ఆశిస్తున్న వారి వివరాలను, పార్టీతో వారికి ఉన్న అనుబంధం, సీనియారిటీ, సామాజిక సమీకరణాలతో కూడిన ఒక నివేదికను రాహుల్ గాంధీకి అందజేశారు. పీసీసీ కార్యవర్గ కూర్పులో ప్రాధాన్యత ఇస్తున్న వారికి సంబంధించిన వివరాలతో మరో నివేదిక ఇచ్చారు. ఈ అన్ని అంశాలపై కేసీ వేణుగోపాల్, మహేశ్‌గౌడ్‌లతో సుమారు గంటపాటు రాహుల్ చర్చలు జరిపారు. ఆ సమయంలోనే ముఖ్యమంత్రికి కూడా పిలుపు వస్తుందని అందరూ భావించినప్పటికీ, ఈ మేరకు రేవంత్‌రెడ్డికి ఎలాంటి సమాచారం రాలేదు. అయితే రాహుల్‌తో భేటీ అనంతరం మహేశ్‌గౌడ్ ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి ఆయన్ను కలిశారు. రాహుల్‌తో చర్చల సారాంశాన్ని వివరించారు. ఆ తర్వాత రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి 15న చివరిసారిగా రాహుల్‌గాంధీతో వ్యక్తిగతంగా సమావేశమైన రేవంత్‌రెడ్డి రాజకీయ అంశాలపై చర్చించారు. ఆ తర్వాత ఇప్పటివరకు వారి మధ్య భేటీ జరగలేదు.



ఢిల్లీలో రాహుల్‌తో మహేశ్ గౌడ్

> **ఆ పేర్లపైనే మరోసారి చర్చ**
>
> సోమవారం రాహుల్‌తో జరిగిన సమావేశంలో మంత్రివర్గంలోకి తీసుకునేందుకు ఇదివరకే గుర్తించిన పేర్లపైనే మరోమారు చర్చ జరిగినట్లు తెలిసింది. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వాకిటి శ్రీహరి, నిజామాబాద్ జిల్లా నుంచి పి.సుదర్శన్‌రెడ్డి, నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బాలూనాయక్, రంగారెడ్డి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వివేక్, కరీంనగర్ జిల్లా నుంచి ఆది శ్రీనివాస్, మైనార్టీ కోటాలో షబ్బీర్ అలీ, అమేర్ అలీఖాన్, ఫహీమ్ ఖురేషీల పేర్లు తుది జాబితాలో ఉన్నాయి. వీరితో పాటు మహిళా కోటాలో ఎమ్మెల్సీ విజయశాంతి పేరును పరిశీలించినట్టు సమాచారం. కాగా వీరి విషయంలో ఏఐసీసీ ఆలోచనలకు, పీసీసీ ప్రతిపాదనలకు, ముఖ్యమంత్రి ఉద్దేశాలకు మధ్య వైరుధ్యం ఉందని అంటున్నారు. సామాజికవర్గాల వారీగా, జిల్లాల వారీగా ఆశావహుల ఎంపిక విషయంలో ఏకాభిప్రాయం కుదరని నేపథ్యంలోనే చర్చలు అసంపూర్తిగా ముగిసినట్లు తెలుస్తోంది. అయితే ఒకరిద్దరు ఆశావహులకు మంత్రి పదవులు కచ్చితంగా ఇవ్వాలని సీఎం పట్టుదలతో ఉండటం చర్చలు అసంపూర్తిగా ముగియడానికి ఒక కారణమనే వాదన కూడా వినిపిస్తోంది. ఒకరిద్దరి విషయంలో ఏఐసీసీ కూడా తీవ్ర పట్టుదలతో ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు బీసీలకు మంత్రివర్గంలో ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని మహేశ్‌గౌడ్ కోరుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే కేబినెట్ విస్తరణ, పీసీసీ కార్యవర్గం అంశాలపై చర్చించేందుకు 30న మళ్లీ భేటీ కావాలని నిర్ణయించారు.

పూర్తి పారదర్శకతతో కులగణన

- ఢిల్లీ ఐఐసీలో ఓబీసీ సాధికారతపై సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్
- రాష్ట్రంలో కులగణన విధానంపై వివరణ.. మంత్రి పొన్నం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

సాక్షి, న్యూఢిల్లీ: పూర్తి పారదర్శకతతోనే తెలంగాణలో కులగణన నిర్వహించామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. దేశానికి దిక్సూచిగా నిలిచిన కులగణనను పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రోత్సాహంతోనే చేపట్టామని వెల్లడించారు. అధిష్టానం ఆదేశాల మేరకు బీసీల సాధికారతపై కాంగ్రెస్ పార్టీ సోమవారం కీలక సమావేశం నిర్వహించింది. ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో దేశవ్యాప్తంగా ఉన్న తాజా, మాజీ పీసీసీ అధ్యక్షులు, బీసీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా బీసీ మేధావులు తదితరులు హాజరయ్యారు. రాష్ట్రం నుంచి మహేశ్‌కుమార్‌గౌడ్‌తోపాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీసీ నేతలు వి.హనుమంతరావు, మధు యాష్కీ గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మొత్తం మూడు సెషన్లుగా ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ఇచ్చిన హామీ మేరకే తెలంగాణలో కులగణన సర్వే జరిగిందన్నారు. కాంగ్రెస్ ఒత్తిడి వల్లే కేంద్రం కులగణన ప్రకటన చేసిందని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా కులగణన ద్వారా ఓబీసీలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. అనంతరం కులగణన, తదితర అంశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కులగణన తర్వాత విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం తీర్మానం చేసిందన్నారు. దీనికి అన్ని పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. ఈ సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ హాజరవ్వాల్సి ఉన్నా ఎవరూ హాజరుకాకపోవడం గమనార్హం. కాగా, రాహుల్ గాంధీకి అభినందనలు తెలుపుతూ ఢిల్లీలో సభ నిర్వహించాలని ఈ భేటీలో నిర్ణయించగా అభినందన సభ పెట్టాలా లేక అన్ని రాష్ట్రాల్లో ర్యాలీలు నిర్వహించాలా అనే అంశంపై అధిష్టానం త్వరలో నిర్ణయం తీసుకోనుంది.



సోమవారం ఢిల్లీలో జరిగిన ఓబీసీ సాధికారత సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు

రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఆధార్ ఈ-సంతకం

10 నుంచి 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి: మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఆధార్ ఈ-సంతకం విధానాన్ని తీసుకురానున్నట్టు రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ విధానంతో 10 నుంచి 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుందని వెల్లడించారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాశ్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్లాట్ బుకింగ్ విధానం, పనిభారం అధికంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అదనపు రిజిస్ట్రార్‌ల పోస్టింగ్, పదోన్నతి పొందిన ఉద్యోగులకు పోస్టింగ్‌పై చర్చించారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ అవినీతి రహితంగా, పారదర్శకంగా, సమయాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే నెల 2 నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకొస్తున్నామని వెల్లడించారు. స్లాట్ బుకింగ్‌తో పాటు ఆధార్ ఈ-సంతకం ప్రవేశపెడుతున్నామన్నారు. ముందుగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, కూసుమంచి ఎస్ఆర్వో కార్యాలయాల్లో వెంటనే అమల్లోకి తీసుకువస్తున్నట్టు చెప్పారు.

క్లుప్తంగా...

అందాల పోటీలకు డబ్బులున్నాయి.. చేప పిల్లలకు లేవా?

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



నంగునూరు (సిద్దిపేట): చెరువులో చేప పిల్లలను వదిలేందుకు టెండర్లు పిలవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అందాల పోటీలకు రూ.200 కోట్లు ఎలా ఖర్చుపెట్టారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకులలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న, కొరివి కృష్ణస్వామి విగ్రహాలను శాసనమండలి వైస్‌చైర్మన్ బండా ప్రకాశ్‌తో కలసి హరీశ్‌రావు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ హెచ్‌ఎండబ్ల్యూఎస్‌కు రూ.10 వేల కోట్లు, జీహెచ్‌ఎంసీకి రూ.7 వేల కోట్లు, హెచ్‌ఎండీఏలో రూ.20 వేల కోట్లు, ఫ్యూచర్ సిటీలో ఆరు లేన్ల రోడ్డు కోసం రూ.4 వేల కోట్లు టెండర్ పిలిచిన రేవంత్‌రెడ్డి వీటికి డబ్బులు ఎలా వస్తున్నాయో చెప్పాలన్నారు. గతేడాది కొన్ని జిల్లాల్లోనే చేప పిల్లలు వదిలారని, ఈ యేట జూన్ సమీపిస్తున్నా నేటికీ టెండర్లు పిలవలేదన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి వెంటనే టెండర్లు పిలవకుంటే బీఆర్‌ఎస్ పక్షాన ముదిరాజ్ సోదరులకు అండగా నిలిచి పోరాటం చేస్తామని హరీశ్ హెచ్చరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేనేత రంగాన్ని ఆదుకోవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ రంగం తర్వాత అత్యంత ప్రాధాన్యంగల చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ రంగానికి ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు ఆధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసురావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ చేనేత కార్మికులు దీర్ఘ కాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు చేనేత సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. సీపీఎం నేత చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పలకరించిన తొలకరి

రాష్ట్రంలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు

- తెలంగాణవ్యాప్తంగా సగటున 1.1 సెం.మీ. వర్షపాతం నమోదు
- రంగారెడ్డి జిల్లా కేతిరెడ్డిపల్లిలో అత్యధికంగా 6 సెం.మీ. వర్షం
- నేడు బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం
- 3 రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం



సాక్షి, హైదరాబాద్: వానాకాలం ప్రారంభాన్ని సూచిస్తూ రాష్ట్రంలోకి సోమవారం నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి వారం ముందే పలకరించాయి. దీని ప్రభావంతో వివిధ జిల్లాల్లో తొలకరి జల్లులు కురిశాయి. రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, నిర్మల్, సంగారెడ్డి, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 1.1 సెం.మీ. మేర సగటు వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో అత్యధికంగా 5.98 సెం.మీ. వర్షం కురిసింది. అదే జిల్లాలోని షాబాద్ మండలం చందన్వెల్లిలో 5.68 సెం.మీ., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అల్లాపల్లిలో 5.4 సెం.మీ., మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌లో 3.78 సెం.మీ., వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో 3.10 సెం.మీ. మేర వర్షపాతం నమోదైంది. ఇప్పటికే అడపాదడపా వర్షాలతో రైతులు సాగు పనులకు సిద్ధమవుతున్న వేళ రుతుపవనాలు ముందుగానే పలకరించడంతో వ్యవసాయ పనులను కూడా ముందస్తుగానే ప్రారంభించొచ్చని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈసారి సాధారణం కంటే 10 శాతం అధిక వర్షాలు

నైరుతి సీజన్‌లో నాలుగు నెలలపాటు రాష్ట్రంలో కురవాల్సిన సాధారణ వర్షపాతం 73.86 సెంటీమీటర్లు. గతేడాది సీజన్‌లో 96.26 సెం.మీ. వర్షం (సాధారణ కంటే 30 శాతం అధికం) కురవగా ఈసారి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. కనీసం 10 శాతం అధికంగా వర్షాలు కురవొచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

సోమవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షపాతం (సెం.మీ.)లలో..

జిల్లా	ప్రాంతం	వర్షపాతం
రంగారెడ్డి	కేతిరెడ్డిపల్లి	5.98
రంగారెడ్డి	చందన్వెల్లి	5.68
భద్రాద్రి కొత్తగూడెం	అల్లాపల్లి	5.40
మహబూబ్‌నగర్	గండీడ్	3.78
వికారాబాద్	కొడంగల్	3.10

అల్పపీడనం.. ఆపై వానలు..

దక్షిణమధ్య బంగాళాఖాతం, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. నైరుతి సీజన్‌లో బంగాళాఖాతంలో ఏర్పడే ఉపరితల ఆవర్తనం, అల్పపీడనాలు, వాయుగుండాలు, తుపానుల ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈసారి రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించిన మర్నాడే అల్పపీడనం ఏర్పడటంతో భారీ వర్షాలు కురవొచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడు రోజులు తెలంగాణవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల భారీ, ఇంకొన్ని చోట్ల అతిభారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.

ముగిసిన ‘సరస్వతీ’ పుష్కరాలు

- చివరిరోజు లక్షకుపైగా భక్తుల రాక
- 12 రోజులపాటు ఆలయంలో ప్రత్యేక హోమాలు



పూర్ణాహుతిలో పాల్గొన్న దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు

భూపాలపల్లి/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈనెల 15న ప్రారంభమైన సరస్వతీ నది పుష్కరాలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజు తెల్లవారుజామునుంచి రాత్రి వరకు భక్తులు వివిధ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. లక్ష మందికి పైగా భక్తులు పుష్కర స్నానాలు చేసినట్లు అధికారులు అంచనా వేశారు. నదిలో భక్తులు స్నానాలు ఆచరించి, పిండప్రదానాలు, తర్పణ పూజలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడికి, శ్రీశుభానందేవి, మహాసరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు భక్తుల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పుష్కరాల సందర్భంగా 12 రోజులపాటు ప్రత్యేకంగా ఆలయంలో హోమాలు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంతో పుష్కరాలు ముగిశాయి.

వైభవంగా నవరత్న మాల హారతి..

ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సరస్వతీ మాత విగ్రహం వద్ద సోమవారం రాత్రి ఏడుగురు కాశీపండితులు నవరత్నమాల హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 30 వేల మంది భక్తులతోపాటు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అధికారులు తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 12 రోజులపాటు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని, రూ.40 కోట్లు వ్యయం చేశామన్నారు. గోదావరి పుష్కరాలను కూడా అత్యంత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, స్పెషల్ సెక్రటరీ వికాస్‌రాజ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పద్మశ్రీ నాగఫణిశర్మ, దేవాదాయశాఖ కమిషనర్ వెంకట్‌రావు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, ఈవో మహేశ్ పాల్గొన్నారు.

రేపు బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్

భైంసా: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ)లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్సులో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 28న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. వివరాలకు విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ www.rgukt. ac.inను సందర్శించాలని సూచించారు.

కేటీఆర్‌కు మళ్లీ ఏసీబీ నోటీసులు

- ఫార్ములా–ఈ రేసు కేసులో మరోసారి పిలుపు
- ఈనెల 28న హాజరుకావాలని నోటీసు
- కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తున్నందుకే నోటీసులు: కేటీఆర్
- తనపై ప్రతీకారంతో సీఎం రేవంత్ ఎంతకైనా దిగజారతారని ధ్వజం

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ రేసులో మళ్లీ కదలిక. ఈనెల 28న విచారణకు హాజరుకావాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీసులు జారీ చేసింది. మంత్రివర్గ ఆమోదం కానీ, హెచ్‌ఎండీఏ బోర్డు అనుమతి లేకుండా ఆర్‌బీఐకి సమాచారం ఇవ్వకుండా రూ.55 కోట్లను ఫార్ములా–ఈ రేసు సంస్థకు బదిలీ చేయడంపై పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైన విషయం విదితమే. కేటీఆర్ గతంలో రెండుసార్లు ఏసీబీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఆ తరువాత ఈ విషయంలో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది. ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాలేదని, హెచ్‌ఎండీఏ నుంచి నిధులు తమకు అందాయని ఫార్ములా–ఈ రేసు సంస్థ కూడా ప్రకటించిందని అలాంటప్పుడు నిధుల దుర్వినియోగం అంశం ఎక్కడిదని కేటీఆర్ వాదిస్తున్న సంగతి తెలిసిందే.

నోటీసులు అందాయి: కేటీఆర్

‘ఫార్ములా–ఈ కేసులో ఈనెల 28న విచారణకు హాజరుకావాలని ఏసీబీ నాకు నోటీసులు పంపింది. రాజకీయ వేధింపుల్లో భాగంగానే ఈ కేసు పెట్టినా.. చట్టబద్ధమైన పౌరుడిగా విచారణ సంస్థలకు సహకరిస్తాను. నేను యూకే, అమెరికా పర్యటనకు గతంలోనే ప్లాన్ చేసుకున్నందున ఈ నెల 28న విచారణకు హాజరుకాలేకపోతున్నట్లు ఏసీబీకి లేఖ రాశా’ అని కేటీఆర్ ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు. తాను విదేశీ పర్యటన నుంచి తిరిగొచ్చాక విచారణకు హాజరవుతానని లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. ‘రాజకీయ ప్రతీకారం కోసం రేవంత్‌రెడ్డి ఏ స్థాయికైనా దిగజారుతాడు. 48 గంటల క్రితం నేషనల్ హెరాల్డ్ కేసులో డబ్బు సరఫరా చేసినట్లు ఈడీ చార్జిషీట్‌లో అతని పేరు బయటపడింది. 24 గంటల తర్వాత రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి మోదీతో సహా బీజేపీ అగ్ర నాయకులతో సన్నిహితంగా కనిపించాడు. మనీలాండరింగ్ కేసులో రేవంత్ ప్రమేయంపై ఏ ఒక్క బీజేపీ నాయకుడు కూడా మాట్లాడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదాలు, అరాచకాలను ప్రశ్నిస్తున్నందుకు రగిలిపోతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. తనపై ప్రతీకారంతో ఎంతకైనా దిగజారతారన్న సంగతి ఈ నోటీసులతో అర్థమైందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

రేవంత్ అభద్రతకు నిదర్శనం: ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఫార్ములా–ఈ కేసులో కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వడం రేవంత్‌లో నెలకొన్న అభద్రతను సూచిస్తున్నాయి. అందుకే ఆయన ఈ ప్రతీకార రాజకీయ చర్యలను ఎంచుకున్నాడు. తప్పుడు కేసులు కోర్టులో నిలబడవు.. ప్రజల మనసును గెలుచుకోలేవు. మేము కేటీఆర్‌కు అండగా ఉంటాం. ఎప్పటికైనా నిజమే గెలిచి తీరుతుంది.

వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే: ఎమ్మెల్సీ కవిత

తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కుట్రపూరితంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. మా పార్టీ నాయకులకు వరుస నోటీసులు జారీ చేయడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉన్నట్లు తేటతెల్లమైంది. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టాలని యత్నించినా తట్టుకొని నిలబడ్డ చరిత్ర కేసీఆర్ సైనికులది.

కర్రు కాల్చి వాత పెట్టాలి

▶ మొదటి పేజీ తరువాయి

పిలుపునిచ్చారు. జూన్ నెలాఖరులో పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తామని, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నూతన కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గద్వాల నియోజకవర్గంలో సామాన్యుడికి టికెట్ ఇస్తామని, జెట్ స్పీడ్‌తో పార్టీ గెలుపు ఖాయమన్నారు.

అపరిచితుడిలా సీఎం వైఖరి

కాంగ్రెస్ ఇచ్చిన అభయహస్తం శతాబ్దపు అతి పెద్ద మోసమని, ఆ పార్టీకి 55 ఏళ్ల అధికారం ఇచ్చినా ప్రజలకు కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదని కేటీఆర్ మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటల మనిషి కాదని, మూటల మనిషి అని ఎద్దేవా చేశారు. రుణమాఫీపై అనేకమార్లు మాట మార్చాడన్నారు. సీఎం మానసిక పరిస్థితిపై తనకు అనుమానాలు ఉన్నాయని, ఆయన వైఖరి అపరిచితుడిలా ఉందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లినా ఆ పార్టీ అగ్రనేతలు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో డిప్యూటీ సీఎం భట్టికి 20 నుంచి 30 శాతం కమీషన్లు నడుస్తున్నాయని, భట్టికి మినహా రాష్ట్రంలో అందరికీ అప్పులు ఉన్నాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రానికి పదేళ్లలో తాము బలమైన పునాదులు వేస్తే కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు బొక్కబోర్లా పడ్డారన్నారు.

టీజేఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ

తెలంగాణ జర్నలిస్టు ఫోరం రజతోత్సవ సంబురాల పోస్టర్‌ను ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణతో కలిసి కేటీఆర్ విడుదల చేశారు. తెలంగాణ విముక్తి కోసం కేసీఆర్ ఆధ్వర్యంలో సాగిన ఉద్యమంలో ప్రజలను చైతన్యపరచడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారన్నారు.



సాక్షి ఉద్యోగ అవకాశాలు



కాంగ్రెస్, బీఆర్‌ఎస్ బాహాబాహీ

- కేటీఆర్ క్యాంపు ఆఫీస్‌లో సీఎం ఫొటో పెట్టేందుకు కాంగ్రెస్ యత్నం
- ఇరువర్గాల ఘర్షణ.. చెదరగొట్టిన పోలీసులు



కేటీఆర్ క్యాంపు ఆఫీస్ ఎదుట బీఆర్‌ఎస్ కార్యకర్తలపై పోలీసుల లాఠీచార్జీ

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ క్యాంపు ఆఫీస్ ఎదుట కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వర్గాలు తోపులాటకు దిగాయి. దీంతో పోలీసులు లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. కేటీఆర్ క్యాంపు ఆఫీస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణతల్లి చిత్రపటాలను పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రయత్నించాయి. కాంగ్రెస్ శ్రేణుల ప్రయత్నాలను బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇరువర్గాలను పోలీసులు వారిస్తున్నా పట్టించుకోకుండా దూసుకెళ్లడంతో క్యాంపు ఆఫీస్ గేటు ఎదుట తోపులాట జరిగింది. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ, పోలీసు బలగాలు లాఠీచార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఘటనలో బీఆర్‌ఎస్ నేతలకు గాయాలయ్యాయి. కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని వ్యాన్‌లో తరలించారు. బీఆర్‌ఎస్ నాయకులను తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘర్షణలో ఓ కారు అద్దాలు ధ్వంసమయ్యాయి.

ఇదీ ప్రొటోకాల్ వివాదం..

సిరిసిల్ల ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరుపత్రాల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటోలు పెట్టడం లేదు. దీనిపై బీఆర్‌ఎస్ నాయకులు జిల్లా ఎస్పీ మహేశ్ గీతేకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రొటోకాల్ పాటించకుండా.. ఏ పదవీ లేని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని వేదికపై కూర్చోబెడుతున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సిరిసిల్లలో ఎమ్మెల్యే అధికారిక నివాసం (క్యాంపు ఆఫీస్)లో సీఎం ఫొటో పెట్టాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సీఎం ఫొటో కేటీఆర్ క్యాంపు ఆఫీస్‌లో పెట్టే క్రమంలోనే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పరస్పరం తోపులాటకు దిగాయి.

‘నైపుణ్యం’గా నయా మోసం

▶ మొదటి పేజీ తరువాయి

గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వానికి ఫిర్యాదులొచ్చాయి. హైదరాబాద్‌లో ఉన్న రెండు డీమ్డ్ వర్సిటీలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న డీమ్డ్ వర్సిటీల ఆఫ్–క్యాంపస్‌పైనా ఇలాంటి ఫిర్యాదులొచ్చినట్టు అధికారులు చెబుతున్నారు.

ఉద్యోగం వచ్చినా తిప్పలే..

ఇంజనీరింగ్ కాలేజీలు ఎమర్జింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు పారిశ్రామిక భాగస్వామ్యంతో శిక్షణ ఇవ్వాలి. అప్పుడే విద్యార్థి కోడింగ్‌పై పట్టు సాధిస్తాడు. చాట్ జీపీటీ, ఏఐని తేలికగా ఉపయోగిస్తాడు. ఏఐ చేసే కోడింగ్, డీ–కోడింగ్ కచ్చితమైనదేనా? కాదా? అనేది సబ్జెక్టులపై అవగాహన ఉన్నప్పుడే తెలుస్తుంది. ఉదాహరణకు పైథాన్ నేర్చుకునే విద్యార్థికి ముందుగా సీ, సీ ప్లస్ ప్లస్‌పై కనీస పరిజ్ఞానం ఉండాలి. అప్పుడు ఏఐలోని లాంగ్వేజ్ అర్థమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రైవేటు కాలేజీలు దీన్ని విస్మరించడంతో కేవలం ఉద్యోగం పొందడానికి అవసరమైన స్కిల్‌ను మాత్రమే నేర్పడంతో ఉద్యోగం వచ్చినా, పనిలో పురోగతి సాధించలేకపోతున్నారు. గత ఐదేళ్లలో ఐటీ కంపెనీల్లో 560 మంది కోడింగ్‌పై పట్టు లేకపోవడం వల్లే ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. ఏఐకి ఫీడ్ చేసే డేటా ఆధారంగా వచ్చే కోడింగ్‌ను అర్థం చేసుకోకపోవడం వల్ల ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పెద్ద ఎత్తున డేటా గందరగోళం ఏర్పడినట్టు ఆ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ తెలిపారు.

ఏఐసీటీఈకి ప్రభుత్వం ఫిర్యాదు

డీమ్డ్ వర్సిటీలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం నియంత్రణ అధికారం ఉండదు. అవి ఇచ్చే డిగ్రీల్లో నాణ్యతపైనా ప్రశ్నించే అధికారం అనుమతి ఇచ్చిన అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ)కి కూడా ఉండదు. ఒక్కో విద్యార్థి నుంచి నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సుకు రూ. 16 లక్షల నుంచి రూ.24 లక్షల వరకూ ఫీజులు వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ బేసిక్స్ విస్మరించడం, సబ్జెక్టు అధ్యాపకులను తగ్గించడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ప్రభుత్వం ఏఐసీటీఈ దృష్టికి తేవాలని నిర్ణయించింది. ఇదే క్రమంలో కొన్నేళ్లుగా ఎమర్జింగ్ కోర్సుల్లో తగ్గించిన ఫ్యాకల్టీ, స్కిల్‌పై శిక్షణ ఇచ్చే ప్రైవేటు సంస్థలకు ఉన్న అర్హతలపై విచారణ చేపట్టాలని ప్రభుత్వం కోరనుంది.

కోడింగూ కీలకమే: హరీశ్ చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్, గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీ

భవిష్యత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే. చాట్ జీపీటీ, జనరేటివ్ స్కిల్స్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉండాలి. అయితే, బేసిక్స్ నేర్పకుండా కేవలం స్కిల్‌పైనే దృష్టి పెడితే, భవిష్యత్‌లో వచ్చే సవాళ్లను ఎదుర్కోవడం కష్టం. సెల్‌ఫోన్ వాడే వ్యక్తికి దాని తయారీ తెలియనవసరంలేదు. వాడకం తెలిస్తే చాలు. కానీ దాన్ని తయారు చేసే ఇంజనీర్‌కు అన్నీ తెలిసి ఉండాలి. కోడింగ్, డీకోడింగ్‌లో ఏఐ తప్పు చేస్తే సరిదిద్దే బాధ్యత ఇంజనీర్‌దే. కాబట్టి ఇంజనీరింగ్‌లో బేసిక్ కోడింగ్‌పై శిక్షణ తప్పించడం సరికాదు.





మనుషులకు ఏదో ఒక బయటి పని కావాలి.
ఎందుకంటే వాళ్లు తమ తమ లోలోపల చురుకుగా ఉండరు.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
మంగళవారం, 27 మే 2025

'ముంబై' చెప్తున్నదేమిటి?!

'కుండపోతలతో వస్తున్నాం... కాచుకోండ'న్నట్టు హెచ్చరిస్తూ ప్రవేశించాయి నైరుతి రుతుపవనాలు. సోమవారం వేకువజామునే కళ్లు తెరిచిన ముంబై మహానగరవాసులు... వస్తూనే తడాఖా చూపించిన భారీ వర్షాన్ని చూసి బిత్తరపోయారు. సాధారణ సమయాల్లో గంభీరంగా, కళ్లు చెదిరేలా కనబడే మన నగరాలు చినుకు రాలితే ఎంత అల్లకల్లోలమవుతాయో మొన్నీ మధ్యే బెంగళూరు నగరం కూడా నిరూపించింది. మన్నూ మిన్నూ ఏకమైనట్టు ధారాపాతంగా రాత్రంతా కురియటం వల్ల 200 మిల్లీ మీటర్ల(ఎంఎం) మించిన వర్షపాతంతో ముంబై నగరం తాజాగా తడిసిముద్దయింది. ఆ నగరానికి ముందుగా జారీచేసిన 'యెల్లో అలెర్ట్'ను కాస్తా 'రెడ్ అలెర్ట్'గా సవరిస్తూ, ముంబైతోపాటు దాని ఇరుగుపొరుగునున్న జిల్లాల్లో సైతం పిడుగులతో, పెనుగాలులతో అత్యంత భారీ వర్షం ముంచుకు రాబోతున్నదని భారత వాతావరణ విభాగం హెచ్చరించింది. ముంబై పొరుగునున్న కొలాబాలో సోమవారం 295 ఎంఎం వర్షపాతం నమోదై, 107 ఏళ్లనాటి... అంటే 1918 నాటి రికార్డు 279.4 ఎంఎంను అధిగమించింది. ఇంకా కర్ణాటకలోని మంగళూరు నగరం, దక్షిణ కన్నడ జిల్లాలు సైతం భారీవర్షాలతో ఇక్కట్లుపడ్డాయి. కేరళలో ప్రవేశించిన రుతుపవనాలు పది రోజులకు మహారాష్ట్ర రావాల్సివుండగా కేవలం 24 గంటల్లో అక్కడికి లంఘించాయి. ముంబైకి ఆ మర్నాడే చెప్పాపెట్టకుండా వచ్చాయి.

సరిగ్గా అయిదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వ ఎర్త్ సైన్స్ విభాగం ఒక ఆసక్తికర ప్రకటన చేసింది. ప్రతియేటా అంతక్రితంతో పోలిస్తే భారీ వర్షాలు నమోదవుతున్నాయన్నదే దాని సారాంశం. ఇలాంటి ప్రకటనలు మన పాలకుల్ని అప్రమత్తుల్ని చేయాలి. ఏటా నగరాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలి. వాటి వికేంద్రీకరణకు ప్రణాళికలు రూపొందించాలి. కానీ తరచు నడుంలోతు నీళ్లల్లో మునకలేస్తున్న నగరాలను చూస్తుంటే వారికంత శ్రద్ధ, తీరిక లేవన్న సంగతి తెలుస్తుంది. శతాబ్దం కిందట లేదా అంతకు చాలాముందు నుంచీ ప్రధాన నగరాలుగా వున్నవాటిపై ఎటూ శ్రద్ధ లేదు. కనీసం కొత్తగా నిర్మిస్తున్న నగరాలపైన అయినా ముందుచూపుతో వ్యవహరిద్దామన్న జ్ఞానం లేదు. నిరుడు ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 9 వరకూ దశాబ్దకాలంలో ఎన్నడూ లేని విధంగా కుండపోత వర్షాలు విజయవాడ నగరంలో కొంత భాగాన్ని ముంచెత్తడంతోపాటు అమరావతిని కూడా వరదలు అస్తవ్యస్తం చేశాయి. దాని పరిధిలోని 29 గ్రామాల్లో 25 నిండా నీళ్లల్లో మునిగాయి. సాక్షాత్తూ సీఎం చంద్రబాబే అక్రమంగా వుంటున్న తన కరకట్ట నివాసాన్ని ఖాళీ చేయాల్సి వచ్చింది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ తదితర సంస్థలు మూతపడాల్సి వచ్చింది. లక్షలాదిమంది ప్రజలు సకాలంలో సాయం అందక ఇబ్బందులు పడ్డారు. విజయవాడలో 35 మంది మరణించారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ చెప్పినా మొండి వైఖరితో అమరావతికి పూనుకోవటమే తప్పనుకుంటే ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీని మళ్లీ పిలిచి అట్టహాసంగా సభ చేసి పనులు మొదలుపెట్టారు. అమరావతి ప్రాంత నేల స్వభావం తెలియకపోతే పోయింది... కనీసం కేంద్రీకృత నగరాల వల్ల కలిగే ముప్పును చూస్తూ కూడా వేలకోట్లు కుమ్మరిస్తున్నారంటే ఏమనుకోవాలి?

'ప్రకృతి వైపరీత్యాలు నిజమైన అర్థంలో ప్రకృతి కల్పిస్తున్న వైపరీత్యాలు కాదు. అవి మనిషి రూపొందించే విధానాల వైఫల్యం' అంటాడు అమెరికన్ దౌత్య నిపుణుడు జాన్ బోల్టన్. కుంభవృష్టి కురిసినా దాన్నంతటినీ ఇముడ్చుకోగల చెరువులూ, వాగులూ, వంకలూ దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ వున్నాయి. వాటిల్లో కొన్ని సహజసిద్ధమైనవీ, కొన్ని మన పూర్వీకులు ఎంతో ముందు చూపుతో నిర్మించినవీ. కానీ చేజేతులా మనమే వాటి పీకనొక్కుతున్నాం. ఇష్టానుసారం ఆక్రమించి అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నా కళ్లుమూసుకుంటున్నాం. హైదరాబాద్‌లోని కంచె గచ్చిబౌలి భూముల్లో బుల్‌డోజర్లు దింపి ప్రకృతి సంపద నాశనం చేస్తున్నారని ఆవేదన చెందిన ప్రధానే, ఆ తర్వాత కొద్దిరోజులకే వేలాది ఎకరాల పంట భూముల్ని మాయం చేసే అమరావతికి రెండోసారి శంకుస్థాపన చేశారు. తమ కూటమి ప్రభుత్వమైతే ఒక లెక్క... వేరే పార్టీ ప్రభుత్వమైతే ఒక లెక్క! నిర్దిష్టమైన విధానాల్లేకుండా 'ఏ రోటి కాడ ఆ పాట'న్నట్టు ప్రవర్తించే పాలకుల వల్లే వైపరీత్యాలు ముంచుకొస్తున్నాయి. వీటిని నివారించటం మానవ మాత్రులకు సాధ్యం కాకపోవచ్చు. కానీ కాస్త తెలివితో వ్యవహరిస్తే వాటివల్ల కలిగే నష్టాలను కనిష్ఠ స్థాయికి తీసుకురావొచ్చు.

కారణాలేమైనా వాతావరణం గతంలో మాదిరి లేదు. మన విధ్వంసకర ఆచరణతో దాన్ని మరింత క్షీణింపజేస్తున్నాం. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణగానీ, వికేంద్రీకరణగానీ లేకపోవటంతో నగరాలు కిటకిటలాడుతున్నాయి. నగరాల్లోనే ఉపాధి అవకాశాలుండటంతో గ్రామీణ ప్రాంత ప్రజలు అక్కడికే క్యూ కడుతున్నారు. పెరిగిన జనాభాకు తగినట్టు డ్రయినేజీ వ్యవస్థ లేకపోవటంతో చిన్నపాటి వర్షానికే నగరాలు నరకాలుగా మారుతున్నాయి. ఈసారి వర్షరుతువు ఎలా వుండబోతున్నదో ముంబై నగరాన్ని ముంచెత్తిన వాన నిరూపించింది. సహాయ సిబ్బందిని అందుబాటులో వుంచటంతో సహా పలు ముందస్తు చర్యలు తీసుకోవటం మినహా ఈ ఏడాది ఎటూ ఇప్పటికిప్పుడు చేసేదేమీ లేదు. కనీసం రాబోయేకాలంలోనైనా అమల్లోవున్న విధానాలను సమీక్షించుకుని మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం ప్రణాళికాబద్ధమైన పథకాలు రూపొందించి అమలుచేసి, వికేంద్రీకరణపై దృష్టిసారిస్తే చాలావరకూ సమస్యలు పరిష్కారమవుతాయి.

పేదల నోరుకొట్టే ట్రంప్ ప్రతిపాదన

విశ్లేషణ



రెజిమన్ కుట్టప్పన్

సగటు భారతీయులు అమెరికా వెళ్ళాలని ఎందుకు కోరుకుంటారు? అక్కడ సంపాదించే డాలర్లలో కొద్ది మొత్తం ఇక్కడకు పంపించినా అది వారి కుటుంబ సభ్యులకు రూపాయలలో గణనీయమైన మొత్తాలుగా మారుతాయి కనుక. అమెరికా నుంచి జమ చేసే మొత్తాలు, స్వదేశంలోని బంధు జనాన్ని నిజంగానే ఎంతగానో ఆదుకుంటున్నాయి. ప్రవాస భారతీయులు అలా చేసే జమలపైన 5% పన్ను విధించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించారు. దానిని ఆయన తమ ఖజానాకు పెద్ద మొత్తం గడించి పెట్టగల సొగసైన బిల్లుగా భావిస్తున్నారు. మనకు మాత్రం అది పీడకల లాంటి ప్రతిపాదనే. ఇది భారతదేశంలోని అనేక కుటుంబాల జీవనాధారాన్ని నీరుగార్చవచ్చు. జమ చేసే మొత్తాలపై ఇక మీదట అమెరికా ప్రభుత్వానికి పన్ను కట్టవలసి ఉంటుంది కనుక వారు పంపే మొత్తాలు కొంతమేరకైనా తగ్గవచ్చు. ఆ విధంగా అది మనకు తిరోగమన చర్య కిందే లెక్క.



◆ మన దేశానికి 120 బిలియన్ల డాలర్లు జమ అయితే, దానిలో అమెరికా వాటా 27%. ఒక్క అమెరికా నుంచే 33 బిలియన్ల డాలర్లు చేకూరినట్లు లెక్క. దీనిపై ఇపుడు 5% పన్ను విధిస్తే, అది సుమారుగా 1.6 బిలియన్ డాలర్లు (రూ. 13,000 కోట్లు)గా లెక్కకు వస్తుంది. మరో విధంగా చెప్పాలంటే, ఇండియాకు రావలసిన ఆ మొత్తానికి, ట్రంప్ నూతన పన్ను విధానం వల్ల గండిపడుతుంది. దీన్ని కేవలం సంఖ్యల రూపంలో చూడవద్దు. ఇది అనేక భారతీయ కుటుంబాల దైనందిన జీవితంపై ప్రభావం చూపుతుంది.

అమెరికా నుంచే ఎక్కువ...

భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం, అమెరికాలో 12 లక్షల 80 వేల మంది ప్రవాస భారతీయు(ఎన్.ఆర్.ఐ)లుగా ఉన్నారు. మరో 31 లక్షల 80 వేల మంది భారతీయ సంతతికి చెందిన వ్యక్తు (పి.ఐ.ఓ.)లుగా ఉన్నారు. విదేశాల నుంచి నగదు జమల విషయంలో భారతదేశం అగ్ర స్థానంలో ఉందని ప్రపంచ బ్యాంకు 2024 రెమిటెన్స్ రిపోర్ట్ తెలుపుతోంది. 2024లో అలా 129 బిలియన్ల డాలర్లు వచ్చిపడ్డాయని అది వెల్లడించింది. ఇలా జమ అయ్యేదానిలో అమెరికా నుంచి వచ్చేదే పెద్ద మొత్తంగా ఉంటోందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ.) నివేదిక పేర్కొంటోంది. అమెరికా నుంచి జమయ్యే మొత్తం 2016–17లో 22.9 శాతంగా ఉన్నది 2023–24 నాటికి 27.7 శాతానికి పెరిగిందని ఆర్బీఐ వెల్లడించింది.

మన దేశానికి 120 బిలియన్ల డాలర్లు జమ అయ్యాయనుకుందాం. దానిలో అమెరికా వాటా 27% అంటే, ఒక్క అమెరికా నుంచే 33 బిలియన్ల డాలర్లు చేకూరినట్లు లెక్క. దీనిపై ఇపుడు 5% పన్ను విధిస్తే, అది సుమారుగా 1.6 బిలియన్ డాలర్లు (రూ. 13,000 కోట్లు)గా లెక్కకు వస్తుంది. మరో విధంగా చెప్పాలంటే, ఇండియాకు రావలసిన ఆ మొత్తానికి, ట్రంప్ నూతన పన్ను విధానం వల్ల గండి పడుతుంది. దీన్ని కేవలం సంఖ్యల రూపంలో చూడవద్దు. ఇది అనేక భారతీయ కుటుంబాల దైనందిన జీవితంపై ప్రభావం చూపుతుంది. బతుకు బండి లాగించడానికి, ఇతర కుటుంబ సభ్యుల చదువు సంధ్యలకు, ఆరోగ్య రక్షణకు ఆ మొత్తాలు ఉపయోగపడుతున్నాయి. ఆ ముఖ్య ఆదాయానికి కత్తెర పడితే భారతదేశంలోని ఆ యా కుటుంబాల భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. ఈ జమలు ఎవరి దయాధర్మాలూ కావు. వలస వెళ్ళినవారు చెమటోడ్చి సంపాదించిన ఆదాయంలో కుటుంబ పోషణకు పంపుతున్న కొంత మొత్తాలు.

అల్ప, మధ్యాదాయ దేశాలు 2023లో 650 బిలియన్ల డాలర్లను విదేశీ జమల కింద అందుకున్నాయి. ఇది ఆ యా దేశాల అభివృద్ధికి అధికారికంగా అందిన సహాయం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కన్నా ఎక్కువ. ఇది భారతదేశానికి విదేశీ మారక ద్రవ్యమే కాదు, లక్షలాది మందికి సామాజిక భద్రతా కవచంలా పనిచేస్తోంది. ఎంతో ముఖ్యమైన ఈ మొత్తాలు అధిక లావాదేవీ రుసుములతో ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ ఫీజు 2023లో సగటున 6.18 శాతంగా ఉంది. కొన్ని దేశాల్లోనైతే ఆ ఫీజు 8 శాతం పైచిలుకుగా ఉంది. అసమంజసంగా ఉన్న ఈ ఫీజుల భారాన్ని తగ్గించాలనీ, ప్రపంచంలోని పేదలకు ఊరట కల్పించాలనీ ఐక్యరాజ్య సమితి భావించింది. విదేశాల నుంచి నగదు జమ చేసేవారిపై పడే ఫీజుల భారాన్ని 3% కన్నా తక్కువకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. లావాదేవీల రుసుము 5%కన్నా మించి ఉన్నవి 2030 నాటికి ఒక్కటి కూడా లేకుండా చేయాలని సంకల్పించింది.

సుస్థిర అభివృద్ధి లక్ష్య స్ఫూర్తికి తూట్లు

ట్రంప్ ప్రతిపాదిత పన్ను ఈ అంతర్జాతీయ నిబద్ధతపై ప్రత్యక్ష దాడి కిందకే వస్తుంది. ఇది లావాదేవీ జరిపినందుకు మోస్తున్న భారాన్ని మరింత పెంచడమే కాదు, ఆర్థిక అన్యాయానికి చట్టబద్ధత కల్పించినట్లు అవుతుంది. విదేశాల్లో రకరకాల ఉద్యోగాలు చేస్తూ బతుకుతున్నవారు తమ వ్యక్తిగత కోరికలను పక్కనబెట్టి, తమకున్న పరిమిత ఆదాయంలో గణనీయమైన మొత్తాన్ని కుటుంబాల సంక్షేమానికి పంపుతున్నారు. లావాదేవీ ఫీజుకు తోడు మరో 5% పన్ను విధించడం వారిని శిక్షించడం, దోచుకోవడమే అవుతుంది. ఐక్యరాజ్య సమితి నిర్దేశించుకున్న పేదరికం లేకుండా చేయడమనే సుస్థిర అభివృద్ధి లక్ష్యం (ఎస్.డి.జి.) స్ఫూర్తికి తూట్లు పొడిచినట్లవుతుంది.

నగదు జమ చేసేందుకు రుసుములు మితిమీరితే జనం బ్యాంకులు, డిజిటల్ వ్యాలెట్ల వినియోగాన్ని తగ్గించుకోవచ్చు. అనియత, క్రమరహిత మార్గాల వైపు మొగ్గు చూపవచ్చు. అటువంటి పద్ధతుల్లో మోసపోయే, దోపిడీకి గురయ్యే అవకాశాలు ఎక్కువగానే ఉంటాయి.

మహిళలకు ఆసరా కల్పించడమనే దృక్కోణం నుంచి చూసినా ట్రంప్ ప్రతిపాదన కల్లోలపరచేదిగానే ఉంది. ఎందుకంటే, విదేశాల నుంచి నగదు అందుకుంటున్నవారిలో మహిళలే ఎక్కువ. కుటుంబ పోషణకు, పిల్లల ఆలనాపాలనకు వారు ఆ మొత్తాలపైనే ఆధారపడుతున్నారు. నగదు జమలపై పన్ను విధిస్తే, వారి ఆర్థిక స్థితిగతులు, ప్రగతి బలహీనపడతాయి. ఇది ఐక్యరాజ్యసమితి పెట్టుకున్న (స్త్రీ పురుష సమానత్వ) ఐదవ ఎస్.డి.డి. లక్ష్యాన్ని నీరుగారుస్తుంది. మహిళా సాధికారత వారి ఆర్థిక సౌలభ్యంపైన కూడా ఆధారపడి ఉంది. ఈ పన్ను దానికి కోత పెట్టేదిగా ఉంది.

తక్కువ ఖర్చుతో, తక్షణం నగదు వేయడం, తీసుకోవడం వీలయ్యే సమీకృత చెల్లింపుల వ్యవస్థ (యు.పి.ఐ.) వంటివాటి ద్వారా భారతదేశంలో ఫైనాన్షియల్ సౌలభ్యం ఒక రకంగా ప్రజాస్వామికీకరణ చెందింది. ట్రంప్ వేయదలచిన పన్ను ఆ విజయాన్ని కూడా నీరుగారుస్తుంది.

మరింత సమ్మిళిత, పరస్పరాశ్రిత ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నిర్మించడానికి అవసరమైన సిసలైన నవీకరణలను... డిజిటల్ జమలపై ఫెడరల్ పన్నును జోడించదలచిన ట్రంప్ చర్య నిర్వీర్యపరుస్తుంది. పేదరికం, అసమానత, వాతావరణ మార్పుపై పోరాటానికి బహుముఖ సహకారం ఎంతో అవసరమైన సమయంలో అటువంటి ఏకపక్ష చర్యలు, సొంత బాగు మాత్రమే చూసుకునే విధానాలు అంతర్జాతీయ సంఘీభావాన్ని సడలింపజేస్తాయి.

జమలకు రుసుము వసూలు చేయకుండా చూడాలనే ప్రయత్నాలను లాభాపేక్షతో నడిచే ఫైనాన్షియల్ సంస్థలు ప్రతిఘటిస్తున్నాయి. పెద్ద మొత్తంలో జమలు చేసే దేశం శాసనపరమైన విద్రోహానికి కూడా పాల్పడడం వలస కార్మికులకేకాక, అంతర్జాతీయ అభివృద్ధికే నమ్మకద్రోహం చేసినట్లవుతుంది.

ఎస్.డి.జి.ల సాధనకు పెట్టుకున్న 2030 సంవత్సరపు గడువు సహాయానికో లేదా విధానానికో సంబంధించినది మాత్రమే కాదు. న్యాయం చేయాలనే ఉద్దేశంతో పెట్టుకున్నది. జమలపై పన్ను వేసే ఎటువంటి ప్రయత్నమైనా పేదలను దోచుకోవడమే అవుతుంది. భారతదేశంతోపాటు ప్రపంచంలోని పేద దేశాలన్నీ రాజకీయ దృఢ సంకల్పంతో దీన్ని ప్రతిఘటించాలి. జమలపై పన్ను వేయాలనే ట్రంప్ నిర్ణయం అనుచిత విధానమే కాదు, వలసవెళ్ళేవారి హక్కులకు, మరింత సమానత, స్వావలంబన ఏర్పడాలనే ప్రపంచ దార్శనికతకు ప్రత్యక్ష ముప్పు.

వ్యాసకర్త కార్మిక వలసల పరిశోధకుడు, 'అన్ డాక్యుమెంటెడ్; స్టోరీస్ ఆఫ్ ఇండియన్ మైగ్రెంట్స్ ఇన్ ది అరబ్ గల్ఫ్' పుస్తక రచయిత । ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

అదే సంబంధం!




ప్యాన్–ఇస్లామిక్ సౌభ్రాతృత్వాన్ని నొక్కిచెప్పే ఎర్డోగాన్ 'నయా అట్టోమాన్' విదేశాంగ విధానంలో భాగంగా పాకిస్తాన్‌తో వ్యూహాత్మక. సైనిక సంబంధాలను టర్కీ బలపరుచుకుంది. తనను తాను ఇస్లామిక్ దేశ నాయకురాలిగా చెప్పుకొనే పాక్ ఈ కథనంలో ఉమ్మడి భూమిక కలిగివుంది. – బ్రహ్మా చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

మూడులోకి వచ్చినా!



జపాన్ ఒక దశలో తూర్పున పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలా ఉండేది. యూఎస్ ఒక్కటే దాని కంటే ముందుండేది. అలాంటిది ముందు దాన్ని చైనా నెట్టేసింది. తర్వాత జర్మనీ, ఇప్పుడు ఇండియా. ట్రంప్ పదవీ కాలం ముగిసేసరికి, ఇండియా! మూడో ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుంది. అయినప్పటికీ ఇండియా నగరాల ఆధునికీకరణలో, మౌలిక వసతుల కల్పనలో, జీవన ప్రమాణాలను పెంచడంలో చాలా చేయాల్సి ఉంది. – స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

వానాకాలం పథకాలు...



అకాల, సకాల వర్షాలు ఏవైనా మన నగర ప్రణాళికలు ఎంత అస్తవ్యస్తంగా ఉన్నాయో ఎత్తి చూపుతూనే ఉంటాయి. చాలా నగరాలు విశృంఖలంగా ఉన్నాయి. అక్కడ పాలనా లేదు. ఉన్నవల్లా కాగితం మీది పథకాలు. అన్నీ ఈవెంట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులే! – సుహాస్ పల్శీకర్, ప్రొఫెసర్

వచ్చే శతాబ్దం



1900ల్లో అందరి ఉమ్మడి కల 21వ శతాబ్దం గురించి ఉండేది. 22వ శతాబ్దం గురించి మీరు ఎప్పుడు మాట్లాడుకున్నారు? అప్పటిదాకా ఎవరు ఉండబోతారులే అన్నట్టుగా వ్యవహరిస్తాం. కానీ కచ్చితంగా అలాంటి భవిష్యత్తు కోసం కలగనాలి. – డేవిడ్ హోల్జ్, ఆంత్రప్రెన్యూర్

పేరుకు తగ్గట్టు...



వాగ్దానాలు నెరవేరాయి. ముంబయి మెట్రో 'ఆక్వా లైన్' నిజంగానే అదే లైన్ అయింది (నీట మునగడం ద్వారా). అవును... జపాన్ మనల్ని వేగంగా అందుకోవాల్సి ఉంది. (వ్యంగ్యంగా) – మనోజ్ అరోరా, వ్యాఖ్యాత

'నాలుగు'లోకి వస్తున్నా...

ప్రపంచ ఆర్థిక రంగంలో భారత్ మరొక మైలురాయిని చేరుకోబోతోంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐ.ఎం.ఎఫ్.) 'వరల్డ్ ఎకనామిక్ అవుట్ లుక్ – 2025' నివేదిక ప్రకారం 2025లో 4.187 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో భారత్, 4.186 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అయిన జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోంది. 2027 నాటికి ఐదు ట్రిలియన్ డాలర్లకి చేరుకుంటుందనీ, 2028 నాటికి 5.58 ట్రిలియన్ డాలర్లతో జర్మనీని కూడా అధిగమించి అమెరికా, చైనాల తర్వాత మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందనీ ఐఎంఎఫ్ అంచనా వేస్తోంది.

భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగినా మొదటి రెండు స్థానాలలో ఉన్న అమెరికా (30.5 ట్రిలియన్ డాలర్ల జీడీపీ), చైనా (19.2 ట్రిలియన్ డాలర్ల జీడీపీ)లకూ భారత్‌కూ మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉండటం గమనార్హం. అనేక అంశాలలో భారత్ దయనీయమైన స్థానాల్లో ఉంది. ఉదాహరణకు తలసరి ఆదాయంలో ప్రపంచంలో 141వ ర్యాంకు, మానవాభివృద్ధి సూచికలో (హెచ్‌డీఐ) 134వ ర్యాంకు, ప్రపంచ ఆకలి సూచీలో 105వ ర్యాంకు, స్థూల సంతోష సూచీలో 118వ ర్యాంకుల్లో నిలిచింది.

ప్రపంచంలో మొదటి పది పెద్ద ఆర్థిక వ్యవస్థలలో పదివేల డాలర్లతో భారత్ మాత్రమే అతి తక్కువ తలసరి ఆదాయాన్ని కలిగి ఉంది. చైనా తలసరి ఆదాయం దరిదాపు 25 వేల డాలర్లు. భారత్ కంటే తక్కువ జీడీపీ గల జపాన్, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా, బ్రెజిల్ లాంటి ఆరు దేశాలలో మొత్తం జనాభా కేవలం 57 కోట్లుగా ఉంటే... ఆ దేశాల సంపద 18 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఈ ఆరు దేశాల జనాభా కంటే భారత్ జనాభా రెండు రెట్లు ఎక్కువ.

'ఆక్స్‌ఫామ్ ఇండియా రిపోర్టు–2024' ప్రకారం భారతదేశంలో సంపద అసమానతలు పెరిగిపోతున్నాయి. 40 శాతం జాతీయ సంపద ఒక్క శాతం ధనికుల చేతిలో కేంద్రీకృతమై ఉంటే, 77 శాతం జాతీయ సంపద 10 శాతం ధనికుల చేతులలో ఉంది. 'హురూన్ ఇండియా రిచ్ లిస్ట్– 2025' ప్రకారం, భారత్‌లో 284 మంది బిలియనీర్లు ఉంటే వారి సంపద మొత్తం 98 లక్షల కోట్లు. ఇది దేశ జీడీపీలో మూడవ వంతు.

కోవిడ్ లాంటి విపత్కర పరిణామాల అనంతరం ప్రపంచ వ్యాప్తంగా మాంద్య పరిస్థితులు నెలకొనే ఛాయలు కనిపించినప్పటికీ, స్థిరమైన వృద్ధిరేటు సాధిస్తున్న దేశంగా భారత్ నిలదొక్కుకోవటానికి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉండటమే కారణమని ఐఎంఎఫ్ భావిస్తోంది. కాబట్టి రాబోయే దశాబ్దంలో భారత్ మరిన్ని అద్భుత ఆర్థిక విజయాలు సాధిస్తుందని ఐఎంఎఫ్ అంచనా వేస్తోంది.

– డా॥ తిరునహరి శేషు
అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ విశ్వవిద్యాలయం

నవ రాయ్‌పూర్ దారిలో అమరావతి?

అభిప్రాయం



వి.వి.ఆర్. కృష్ణంరాజు

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి మే 22న నిర్వహించిన ప్రెస్ మీట్‌లో అమరావతి పేరుతో జరుగుతున్న ఆర్థిక దోపిడీని ఆధారాలతో సహా వివరించారు. ఇప్పటి వరకూ రాజధానిగా ఎటువంటి చట్టబద్ధత లేని అమరావతి పేరుతో చంద్రబాబు సుమారు రూ. ఐదు వేల కోట్లు ఖర్చు చేశారు. దీని నిర్మాణానికి ఒక్క పైసా కూడా అవసరం లేదనీ, ఇదో సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అంటూ ఒకవైపు ప్రచారం చేస్తూనే మరో వైపు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నుంచి రూ. 15 వేల కోట్లు, హడ్కో నుంచి రూ. 11 వేల కోట్లు, జర్మన్ బ్యాంకు నుంచి రూ. 5 వేల కోట్లు, సీఆర్‌డీఏ బాండ్ల జారీ ద్వారా 21 వేల కోట్లు అప్పులు చేసి అమరావతికి ఖర్చు చేస్తున్నారు. ఏడాది బడ్జెట్‌లో అమరావతి కోసం రూ. 6 వేల కోట్లు కేటాయించారు. దీనికి తోడు అమరావతి కోసం మరో 50 వేల ఎకరాలు సమీకరించబోతున్నామనీ, దానికి మరో రూ. 77 వేల కోట్లు అవసరమవుతాయనీ ఆర్థిక సంఘానికి తెలియజేశారు. ఇప్పటికే రాష్ట్రం ఆర్థికంగా దెబ్బతింది, పన్నుల రాబడులు తగ్గాయి. ఏడాది కాలంలోనే లక్షా 50 వేల కోట్ల రూపాయల రుణాలు చేసి దేశంలోనే అప్పుల్లో అగ్రస్థానంలో ఏపీని నిలిపారు బాబు. అమరావతిలో ఇప్పటికీ భూ సమీకరణ పూర్తి చేయలేకపోయారు. రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారంటూ ఇప్పటికీ తప్పుడు ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. నిజానికి ఇంకా 20 శాతం మంది రైతులు తమ భూములను సీఆర్‌డీఏకు అప్పగించి రిటర్నబుల్ ప్లాట్స్ పొందలేదు. రాష్ట్రం ఏమైపోయినా సరే తాము మాత్రం అమరావతిపై లక్షల కోట్లు కుమ్మరిస్తామంటున్నారు.

ఒక రాజధాని నగరాన్ని నిర్మించడం ఎంత కష్టమో 'అటల్ నగర్– నవ రాయ్‌పూర్'ను చూస్తే అర్థమవుతుంది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 2006 నుంచి 20 వేల ఎకరాల్లో ఈ నగరాన్ని నిర్మించడానికి ఆపసోపాలు పడుతోంది. 41 గ్రామాల నుంచి సేకరించిన ఈ భూమిలో నిర్మాణాలు ప్రారంభించి 19 ఏళ్లయినా ఇప్పటికీ నగర నిర్మాణం పూర్తి కాలేదు. చంద్రబాబు మాత్రం లక్ష ఎకరాల్లో మహా నగరం నిర్మిస్తానంటూ ఆకాశానికి నిచ్చెనలు వేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కూడా అటల్ నగర్ నిర్మాణ విషయంలో ఎంతో ఆర్భాటం చేసింది. ఇది ప్రపంచంలో మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ స్మార్ట్ గ్రీన్‌ఫీల్డ్ సిటీ అనీ, దేశంలో ప్రణాళికాబద్ధంగా నిర్మించిన ఆరో నగరమనీ, దేశంలో మొదటి జీరో వాటర్ డిశ్చార్జ్ సిటీ అనీ, 24 గంటల నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తామనీ ప్రచారం చేశారు. చిన్న పిల్లలకు ఉచితంగా చికిత్స అందించే దేశంలోని అతిపెద్ద శ్రీసత్యసాయి సంజీవిని ఆస్పత్రి, ప్రపంచంలో నాల్గో అతి పెద్ద క్రికెట్ స్టేడియం, నాలుగు జాతీయ విద్యా సంస్థలు, పది కిలోమీటర్ల దూరంలోనే ఎయిర్ పోర్ట్, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్, జెమ్స్ అండ్ జ్యూయలరీ సెంటర్, జూ, సఫారీ, గోల్ఫ్ విలేజ్, మ్యూజియం, బొటానికల్ గార్డెన్, ఫిల్మ్ సిటీ, 5 స్టార్ హోటల్స్ ఏర్పాటు చేశారు. ఇన్ని ఏర్పాటు చేశామని చెబుతున్నప్పటికీ ఇది ఒక ఘోస్ట్ సిటీగా మారింది. 5.36 లక్షల జనాభా అవసరాల కోసం నిర్మించిన ఈ నగరంలో ప్రస్తుతం రెండు లక్షల 50 వేల మంది మాత్రమే నివసిస్తున్నారు. నగర జనాభా 5.36 లక్షలకు చేరాలంటే 2031 వరకూ వేచి చూడాల్సిందే అంటున్నారు నయా రాయ్‌పూర్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు.




◆ నగర నిర్మాణాల ద్వారా సంపదను సృష్టించవచ్చని చంద్రబాబు అంటున్నారు. ఎంత ప్రచారం చేసినా, ఎన్ని పెట్టుబడులు పెట్టినా 'ఘోస్ట్ సిటీ'గా మారిన నవ రాయ్‌పూర్ ఇది నిజం కాదని రుజువు చేస్తోంది.

ఎంత ప్రచారం చేసినా, ఎన్ని సదుపాయాలు కల్పించినా, అనేక రాయితీలు ప్రకటించినా నవ రాయ్‌పూర్‌కు పెట్టుబడులు రావడం లేదు, ఉపాధి కల్పన లేదు. ప్రజలు కూడా ఇక్కడ స్థిరపడటానికి ఆసక్తి చూపడం లేదు. రియల్ ఎస్టేట్ రంగం పుంజుకోవడం లేదు. 2022–23 లెక్కల ప్రకారం విజయవాడ, గుంటూరు నగరాల జీడీపీ విలువ రూ. 1,467 కోట్లు కాగా, విశాఖపట్నం జీడీపీ విలువ రూ.1,867 కోట్లు. వేలాది కోట్ల వ్యయంతో నిర్మించిన నవరాయ్‌పూర్ జీడీపీ కేవలం రూ. 270 కోట్లు. పక్కనే ఉన్న రాయ్‌పూర్ జీడీపీ రూ. 750 కోట్లు. నగర నిర్మాణం పేరుతో చేసిన అప్పులు తీర్చడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం తంటాలు పడుతోంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల 16వ ఫైనాన్స్ కమిషన్ సభ్యులను కలిసి రూ.4,131 కోట్లు ప్రత్యేక గ్రాంట్‌గా ఇవ్వాలని కోరారు. నూతన నగరాలను నిర్మించాలనుకునే వారికి ఇది ఒక హెచ్చరిక. నగర నిర్మాణాల ద్వారా సంపదను సృష్టించవచ్చని చంద్రబాబు అంటున్నారు. ఇది నిజం కాదని నవ రాయ్‌పూర్ రుజువు చేస్తోంది.

అంతే కాదు, చైనాలో కొత్తగా నిర్మించిన అనేక నగరాలు, మలేషియా నిర్మించిన ఫారెస్ట్ సిటీ, పరిపాలనా నగరం 'పుత్రజయ' కూడా నిర్మానుష్య నగరాలుగా మారాయి. ఈ నగరాలు సంపద సృష్టించకపోగా అప్పులు, నిరర్థక ఆస్తులు మిగిల్చాయి. ఇదే పరిస్థితి అమరావతికి ఏర్పడినా ఆశ్చర్యపోనక్కర లేదు!

వ్యాసకర్త ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ । 89859 41411

తృణం



జ్యోతిర్మయం

గురుకులంలో గురువుగారు శిష్యులకు 'చాణక్య నీతి' పాఠం చెప్తున్నారు. 'తృణం బ్రహ్మవిదః స్వర్గం,/ తృణం శూరస్య జీవితం,/ జితాక్షస్య తృణం నారీ,/ నిరీహస్య తృణం జగత్' – అన్న శ్లోకం చదివారు. 'బ్రహ్మవేత్తకు స్వర్గ సుఖాదులు తృణప్రాయం. శూరుడికి ప్రాణాలు లెక్కలోనివి కావు. జితేంద్రియుడికి అందాల అప్సరసయినా గడ్డిపరక పాటిగా కనిపిస్తుంది. కోరికలు లేని విరాగికి ఈ జగత్తే ఒక గడ్డిపోచతో సమానం' అని అర్థం చెప్పారు.

'గురుదేవా! ఈ ప్రపంచంలో అన్నిటికంటే నిరర్థకమైనది గడ్డిపోచ అన్న అర్థం ఈ శ్లోకంలో కనిపిస్తున్నది కదా?' అని అడిగాడొక కొంటె శిష్యుడు.

'పిచ్చితండ్రీ! అలాంటి అర్థాలనే పెడర్థాలు అంటారు. తృణం నిరర్థకం కాదు. బ్రహ్మవేత్తకూ, విరాగికీ దాని వలన ఎలాంటి ప్రయోజనమూ లేదు. అంతవరకే! ఆ మాటకొస్తే గడ్డిపోచకు యతీంద్రుడి వల్ల ప్రయోజనం లేదు. అంతమాత్రాన ఆయన నిరర్థకుడవుతాడా? మాట వరసకు చెప్పిన మాటకు పెడర్థాలు తీయకూడదు.

తృణం వల్ల చాలా ప్రయోజనం ఉంది. దాని ఆయుష్షు స్వల్ప కాలం. ఆ స్వల్పకాలం పొడుగునా అది తన ముగ్ధమైన అందాన్ని ప్రదర్శిస్తూ చూపరులకు కనువిందు చేస్తుంది. అవకాశముంటే, ఒక బుజ్జి పువ్వు కూడా పూసి, లోకాన్ని మురిపిస్తుంది. ఆఖరికి, ఏ గోమాతకో ఆహారంగా తనను తాను సమర్పించుకొని, ధన్యమౌతుంది. గడ్డిపరక తేలికయిన పదార్థమే కానీ, తేలిక చేయవలసిన పదార్థం కాదు. సృష్టిలో ఏ పదార్థమూ నిష్ప్రయోజనం కాదు. ప్రయోజనం అనేది వాడుకొనే వారిని బట్టి కూడా ఉంటుంది.

మరొక విశేషం గమనించు. గడ్డిపోచను ఆవు ఆహారంగా తీసుకొంటే, ఆ ఆహారం ఆవు శరీరంలో పవిత్రమైన గోక్షీరంగా పరిణమించగలదు. అవునా? గోక్షీరాన్ని పాముకు ఆహారంగా పోస్తే, ఆ ఆహారం పాము శరీరంలో భయంకరమైన విషంగా మారుతున్నది. అలాంటప్పుడు, గంగి గోవు పాలు ఘనమైనవనీ, పచ్చగడ్డి పనికిమాలినదనీ భావించటం భావ్యంగా ఉంటుందా?

ఈ సృష్టిలో ప్రతి పదార్థమూ ప్రత్యేకమే, విశేషమే! ప్రతి ప్రక్రియా ఈశ్వర విలాసమే. ఈశ్వర విలాసం మనకు పూర్తిగా ఎప్పటికీ అర్థం కాదు. కారణం, అందుకు మనకున్న గ్రహణశక్తి సరిపోదు. తన మేధ పరిమితి ఏమిటో తెలియని అమాయకుడు మాత్రమే తనకు అన్నీ తెలుసుననీ, తను సర్వమూ తెలుసుకోగలననీ మిడిసి పడుతుంటాడు. అందుకే అలాంటి వారి జ్ఞానాన్ని మిడిమిడి జ్ఞానం అంటారు. అది సంపూర్ణ జ్ఞానం కాదు. సర్వజ్ఞత్వ లక్షణం కలవాడు సాంబమూర్తి ఒక్కడే!' అని గురువు సమాధానం చెప్పారు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** అమావాస్య ఉ.8.55 వరకు, తదుపరి జ్యేష్ఠ శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** కృత్తిక ఉ.6.03 వరకు, తదుపరి రోహిణి తె.4.31 వరకు (తెల్లవారితే బుధవారం), **వర్జ్యం:** రా.9.01 నుండి 10.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.04 నుండి 8.56 వరకు, తదుపరి రా.10.49 నుండి 11.33 వరకు, **అమృతఘడియలు:** రా.1.36 నుండి 3.04 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.29, **సూర్యాస్తమయం:** 6.24.

ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు రూ.50 వేల లంచం డిమాండ్



ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్ అరుణ, డాక్యుమెంట్ రైటర్ వెంకటేశ్

ఖమ్మం రూరల్: ఖమ్మం రూరల్ మండల సబ్ రిజిస్ట్రార్ జె.అరుణ లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ కథనం ప్రకారం .. ఖమ్మంకు చెందిన ఓ వ్యక్తి తనకు తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన రెండెకరాల భూమిని గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయాలని సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించాడు. తొలుత ఆయన నిబంధనల మేరకు రూ.51 వేల డీడీని కార్యాలయంలో సమర్పించాడు. అయితే, రిజిస్ట్రేషన్ చేయాలంటే తనకు రూ. 50 వేలు ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్ అరుణ డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఆమెను ఫోన్‌లో సంప్రదించి కొంత తగ్గించాలని కోరగా రూ.30 వేలు అయినా ఇవ్వాలని పట్టుబట్టారు. ఆమెతో సంప్రదింపులన్నీ ఫోన్‌లో రికార్డు చేసిన ఆ వ్యక్తి, ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు సోమవారం కార్యాలయానికి చేరుకుని సబ్ రిజిస్ట్రార్‌కు రూ.30 వేలు పంపించాడు. కానీ సబ్ రిజిస్ట్రార్ అరుణ నేరుగా డబ్బు తీసుకోకుండా కార్యాలయ ఆవరణలోనే ఉన్న డాక్యుమెంట్ రైటర్ పుచ్చకాయల వెంకటేశ్‌కు ఇవ్వాలని సూచించారు. దీంతో ఏసీబీ అధికారులు.. బాధితుడు డబ్బు ఇస్తున్న సమయంలో వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ ఫోన్‌లో డబ్బు డిమాండ్ చేయడం, ఇతరత్రా ఆధారాలు ఉన్నందున ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నామని, ఏసీబీ కోర్టులో వారిని హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రైతుల నిరసన



తాడిచర్లలో వంటా వార్పు చేసి నిరసన తెలుపుతున్న రైతులు

మల్హర్: యాసంగిలో పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి నెలరోజులకు పైగా గడుస్తున్నా, కాంటాలు కాక విసిగి వేసారి పోయిన రైతన్నలు రోడ్డెక్కి వంటా వార్పు, ధర్నాలకు దిగిన ఘటనలు సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని తాడిచర్ల, కొయ్యూరు గ్రామాల్లో చోటుచేసుకున్నాయి. తాడిచర్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు విక్రయించడానికి వచ్చిన రైతులు ఎంపీడీఓ కార్యాలయం క్రాస్ వద్ద ధర్నాకు దిగారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రోడ్డుపై బైఠాయించారు. వంటా వార్పు చేసి అక్కడే భోజనాలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు పోసి నెల దాటుతున్నా నిర్వాహకులు కాంటాలు పెట్టకుండా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. మిల్లులకు ధాన్యం తరలించేందుకు లారీలు కేటాయించకపోవడంతోపాటు హమాలీలు లేక జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నామని, గత్యంతరం లేక దళారులకు ధాన్యం అమ్ముకోవాల్సి వస్తోందని తెలిపారు. తహసీల్దార్ రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య అక్కడికి చేరుకుని మంగళవారం నుంచి కాంటాలు పెట్టి తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

కొయ్యూరులో..

కొయ్యూరు రైతులు ప్రధాన రహదారిపై తడిసిన వడ్లతో బైఠాయించి ధర్నా చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం జరుగుతోందని, వర్షాల కారణంగా వడ్లు తడిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

సజీవంగా పట్టుకుని కాల్చి చంపారు..

▶ మొదటి పేజీ తరువాయి

మావోయిస్టు పార్టీ నివాళులు అర్పిస్తోందని పేర్కొంది. ఈ మేరకు మావోయిస్ట్ పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి అభయ్ పేరిట మూడు పేజీల సుదీర్ఘ లేఖను విడుదల చేశారు. ఎన్‌కౌంటర్ జరగడానికి దారితీసిన పరిస్థితులు, ఎన్‌కౌంటర్ ముందు నంబాల పార్టీ కేడర్‌కు ఇచ్చిన సందేశం తదితర అంశాలను కూలంకషంగా అందులో పేర్కొన్నారు. ఈ లేఖలో పేర్కొన్న ప్రకారం...



నంబాల (ఫైల్)

ద్రోహుల సమాచారంతోనే...

కామ్రేడ్ బీఆర్ దాదా మాడ్ ప్రాంతంలో ఉన్నారనే సమాచారం పోలీసు నిఘా విభాగానికి ఉంది. గత ఆరునెలల్లో ఈ ప్రాంతంలోని వివిధ యూనిట్ల నుంచి కొంతమంది బలహీనపడి పోలీసు అధికారుల ముందు లొంగిపోయి దేశద్రోహులుగా మారారు. మా రహస్య వార్తలు ఈ ద్రోహులే పోలీసులకు నిరంతరం చేరవేశారు. దాదాను లక్ష్యంగా చేసుకుని జనవరి, మార్చి నెలల్లో రెండుసార్లు దాడికి ప్రయత్నించినా అవి విజయవంతం కాలేదు. గత ఒకటిన్నర నెలల్లో దాదా భద్రతలో ప్రధాన బాధ్యత పోషించిన సీపీవైపీసీ సభ్యుడు కూడా పోలీసులకు లొంగిపోయాడు. మాడ్ ఉద్యమానికి నాయకత్వం వహించిన యూనిఫైడ్ కమాండ్ సభ్యుడు కూడా ఉద్యమద్రోహిగా మారాడు. ఈ వ్యక్తుల కారణంగానే పెద్ద నష్టాన్ని భరించాల్సి వచ్చింది.

60 గంటలు తిండిలేకుండానే పోరాటం

మే 17, 18 తేదీల్లో నారాయణపూర్, కోండ్గావ్‌లో డీఆర్‌జీ బలగాల మోహరింపు ఓర్చా వైపు నుంచి ప్రారంభమైంది. మే 19 ఉదయం 9 గంటలకు వారు మా యూనిట్ దగ్గరకు చేరుకున్నారు. పోలీసులకు సమాచారం అందిన విషయం తెలిసిన వెంటనే మేం అక్కడి నుంచి బయలుదేరుతుండగా ఎన్‌కౌంటర్ జరిగింది. 35 మంది విప్లవకారులకు 60 గంటలుగా తినడానికి, తాగడానికి ఏమీ దొరకలేదు. అయినా, మా సహచరులు దాదాను తమ మధ్యే సురక్షిత ప్రదేశంలో ఉంచుకుని ప్రతిఘటించారు. మొదట రావూరులో డీఆర్‌జీకి చెందిన కోట్లూ రామ్‌ను చంపారు. తరువాత, భద్రత బలగాలు ముందుకు రావడానికి ధైర్యం చేయలేదు. తర్వాత మళ్లీ కాల్పులు ప్రారంభమయ్యాయి. ప్రతిఘటనను చురుకుగా నడిపిస్తూ మా వైపు నుంచి కమాండర్ చందన్ మొదట అమరుడయ్యాడు. అందరూ చివరి వరకు ప్రతిఘటించారు. దాదాకు చిన్న గీత కూడా తగలనివ్వలేదు. అందరూ అమరులైన తర్వాత దాదాను సజీవంగా పట్టుకుని చంపారు. ఈ ఎన్‌కౌంటర్ నుంచి ఏడుగురు సురక్షితంగా బయటపడ్డారు. శాంతి చర్చల కోసం 40 రోజుల కాల్పుల విరమణ ప్రకటించాం. 40 రోజుల్లో ఒక్క దాడికి కూడా పాల్పడలేదు. ఈ సమయంలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కుట్ర పన్ని పెద్ద దాడి చేశాయి.

భద్రతలో విఫలమయ్యాం

ప్రధాన నాయకత్వం (నంబాల కేశవరావును ఉద్దేశించి) భద్రత విషయంలో మేము విఫలమయ్యాం. జనవరి వరకు ఈ యూనిట్‌లో భద్రత కోసం 60 మంది కంటే ఎక్కువ ఉండేవాళ్లు. దాన్ని 35కు కుదించాం. ఈలోగా ఆ కంపెనీకి చెందిన కొంతమంది సీనియర్ వ్యక్తులు లొంగిపోయారు. ఈ దాడులను మేం ముందే ఊహించాం. కానీ సురక్షితమైన ప్రదేశానికి వెళ్లడానికి దాదా ఒప్పుకోలేదు. ప్రతికూల పరిస్థితుల్లో కేడర్‌తో కలిసి ఉంటూ దగ్గరి నుంచి మార్గదర్శకత్వం ఇవ్వాలని దాదా నిర్ణయించుకున్నాడు. తమ బాధ్యతలను విడిచిపెట్టి, నాయకత్వం పారిపోయిందని తప్పుడు ప్రచారం చేస్తున్న వారంతా సిగ్గుపడాలి. మే 21 చరిత్రలో చీకటి రోజుగా మిగిలిపోతుంది. కగార్ పేరుతో ఊచకోత వెనుక ప్రభుత్వ నిజమైన ఉద్దేశాన్ని అర్థం చేసుకోవాలని, దేశాన్ని అమ్మేవారికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిస్తున్నాం. పాకిస్తాన్‌తో కాల్పుల విరమణకు ముందుకొచ్చిన కేంద్రం మాతో మాత్రం చర్చలకు ఎందుకు రావడం లేదు.

నా గురించి ఆందోళన వద్దు

ఎన్‌కౌంటర్‌కు ముందు సురక్షిత ప్రాంతానికి తరలి వెళ్లినప్పుడు నంబాల కేశవరావు తన సహచరులకు ఇచ్చిన సమాధానం ఇది. 'మీరు నా గురించి చింతించకండి, నేను ఈ బాధ్యతను రెండు లేదా మూడేళ్లు మాత్రమే నిర్వర్తించగలను. మీరు యువ నాయకత్వం భద్రతపై శ్రద్ధ వహించాలి. బలిదానం కారణంగా ఉద్యమాలు బలహీనపడవు. చరిత్రలో బలిదానాలు ఉద్యమానికి బలాన్నిచ్చాయని నేను ఇప్పటికీ నమ్ముతున్నాను. ఈ ఫాసిస్ట్ ప్రభుత్వ దుష్ట ప్రణాళికలు నిజం కావు. తుది విజయం ప్రజలదే అవుతుంది' అని నంబాల పేర్కొన్నారు.

మృతదేహాల అప్పగింతలో హైడ్రామా

- ఆరురోజులుగా మావోయిస్టుల కుటుంబీకుల పడిగాపులు
- కొన్ని మృతదేహాలకు పోలీసులు అంత్యక్రియలు నిర్వహించినట్లు ఆరోపణలు



మావోయిస్టుల మృతదేహాలను దహనం చేయిస్తున్న ఛత్తీస్‌గఢ్ పోలీసులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు మృతదేహంతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన మరో నలుగురు మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు ఇచ్చే విషయంలో హైడ్రామా కొనసాగుతోంది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌లో ఆరురోజులుగా సాగుతున్న హైడ్రామా పతాకస్థాయికి చేరింది. పోలీసుల వైఖరిని నిరసిస్తూ నారాయణపూర్‌లో మృతుల కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముసుగులు ధరించిన పోలీసులు మార్చురీ వద్దకు వచ్చి అన్ని మృతదేహాలకు తామే అంత్యక్రియలు చేస్తామని, ఎవరికీ శవాలను ఇవ్వబోమని.. ట్రక్‌లో మృతదేహాలను తీసుకెళ్తున్నామంటూ హడావుడి చేశారు. అయితే, తమవారి ఎముకలు ఇచ్చినా తీసుకుపోయేందుకు సిద్ధంగా ఉన్నామని మృతుల బంధువులు బదులిచ్చారు. ఆ తర్వాత కాసేపటికి కొన్ని శవాలను దహనం చేస్తున్న వీడియోలు బయటకు వచ్చాయి. కొన్ని మృతదేహాలకు పోలీసులే అంత్యక్రియలు నిర్వహించారని ఆరోపణలొచ్చాయి. మృతదేహాలను తీసుకోవడానికి కుటుంబసభ్యులు ముందుకు రాకపోవడంతో ఎనిమిది మృతదేహాలకు పోలీసులు అంత్యక్రియలు నిర్వహించినట్లు, అందులో నంబాల మృతదేహం కూడా ఉందని ఓ ప్రెస్‌నోట్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. కాగా మృతదేహాలు ఇచ్చేది లేదని ఛత్తీస్‌గఢ్ పోలీసులు తేల్చి చెప్పారని అంటున్నారు.

ఈనెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐదుగురు మరణించారు. వారి మృతదేహాలను స్వాధీనం చేసుకుని అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతుల కుటుంబీకులు ఆరు రోజులుగా నారాయణపూర్‌లో ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి న్యాయవాది, హక్కుల కార్యకర్త బేలాభాటియా చట్టపరమైన ప్రయత్నాలు చేస్తున్నారు. రీపోస్టుమార్టం కోసం డిమాండ్ చేయకూడదనే ఉద్దేశంతో పోలీసులు ఇలా చేస్తున్నారనే అనుమానాలున్నాయన్నారు.

నంబాల అంత్యక్రియలు పూర్తి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అంత్యక్రియలు సోమవారం సాయంత్రం జరిగాయి. ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేశవరావు మరణించిన విషయం తెలిసిందే. ఆయన మృతదేహాన్ని అప్పగించాలంటూ ఆయన కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు. అయితే, దానిని కుటుంబ సభ్యులకు అప్పగించకుండా భద్రతా దళాలు ఛత్తీస్‌గఢ్‌లోనే అంత్యక్రియలు పూర్తిచేశాయి.

అచ్చెన్నాయుడు బెదిరింపులు!

ఈ వ్యవహారంలో ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీరు చర్చనీయాంశంగా మారింది. కేశవరావు సోదరుడు రామ్‌ప్రసాద్‌తో కలిసి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లిన జియ్యన్నపేట గ్రామస్తుడు, ప్రస్తుత టీడీపీ నాయకుడు నంబాళ్ల రాజశేఖర్‌కు అచ్చెన్నాయుడు ఫోన్‌చేసి 'నా అనుమతి లేకుండా ఛత్తీస్‌గఢ్ ఎవరు వెళ్లమన్నారు.. వెంటనే వచ్చేయండి.. లేకపోతే మీరే సమస్యల్లో చిక్కుకుంటారు' అని హెచ్చరించారని కేశవరావు సోదరులు రామ్‌ప్రసాద్, ఢిల్లీశ్వరరావు మీడియాకు తెలిపారు.

ఎవరితోనూ విభేదాలు లేవు!

- బీఆర్‌ఎస్ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొనే లేఖ రాశా
- ఎంపీ దామోదర్‌రావు, గండ్ర మోహన్‌రావుతో కీలక భేటీలో కల్వకుంట్ల కవిత!
- కేసీఆర్ ఆదేశంతోనే ఆమె నివాసానికి? సుమారు 3 గంటలపాటు చర్చ



సాక్షి, హైదరాబాద్: ఎల్కతుర్తి రజతోత్సవ సభపై బీఆర్‌ఆర్ అధినేత కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ రాజకీయ దుమారానికి తెరలేపిన నేపథ్యంలో సోమవారం ఆమె నివాసంలో కీలక భేటీ జరిగింది. కేసీఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉండే రాజ్యసభ ఎంపీ దామోదర్‌రావు తన న్యాయవాది గండ్ర మోహన్‌రావుతో కలిసి సోమవారం కవిత నివాసానికి వెళ్లారు. సుమారు 3 గంటలపాటు వారి మధ్య అనేక అంశాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. కేసీఆర్‌కు రాసిన లేఖలో ప్రస్తావించిన అంశాలతోపాటు పార్టీకి సంబంధించిన ఇతర అంశాలూ ఈ భేటీలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. తాను లేఖలో ప్రస్తావించిన అంశాలు పార్టీ కేడర్ నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ మాత్రమేనని.. దాన్ని అధినేత దృష్టికి తీసుకెళ్లేందుకు మాత్రమే ఒక నోట్ రూపొందించినట్లు కవిత వారికి చెప్పారని సమాచారం. అయితే లేఖ బయటకు రావడం తనను తీవ్ర మనస్తాపానికి గురిచేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలియవచ్చింది. పార్టీ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని తాను లేఖ రాసినట్లు కవిత వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఆ లేఖలో వివాదాస్పద అంశాలేవీ లేకపోయినా దాన్ని అడ్డు పెట్టుకొని కాంగ్రెస్, బీజేపీ ప్రచారాస్త్రంగా వాడుకున్న వైనంపైనా చర్చించారు. తనకు పార్టీలో ఎవరితోనూ విభేదాలు లేవని.. కానీ కొన్ని దిద్దుబాట్లు చేస్తే మరింత బలంగా ప్రజల్లోకి పార్టీ వెళ్లవచ్చనే అభిప్రాయాన్ని కవిత వ్యక్తం చేసినట్లు తెలిసింది. త్వరలో పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసి అన్ని విషయాలు వివరిస్తానని కవిత చెప్పినట్లు సమాచారం. కేసీఆర్ ఆదేశాల మేరకే దామోదర్‌రావు కవిత నివాసానికి వెళ్లినట్లు బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి.

విత్తన చట్టం రూపకల్పనలో రైతుల అభిప్రాయాలే కీలకం

వ్యవసాయశాఖ సంచాలకుడు బి.గోపి

సాక్షి, హైదరాబాద్: విత్తన చట్టం రూపకల్పనలో రైతుల అభిప్రాయాలే కీలకమని వ్యవసాయ సంచాలకుడు, విత్తన చట్టం కమిటీ కన్వీనర్ బి.గోపి అన్నారు. రైతు కమిషన్ కార్యాలయంలో విత్తన చట్టం రూపకల్పనకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొత్తగా తీసుకురాబోతున్న విత్తన చట్టంలో ఎలాంటి అంశాలు చేర్చాలనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విత్తన చట్టాలపై అధ్యయనం చేయడంతోపాటు తెలంగాణలోని రైతుల నుంచి సూచనలు, సలహాలు తీసుకొని సమగ్ర విత్తనచట్టం రూపొందించాలని గోపి తెలిపారు. సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ విత్తనంపై రైతుకు ఉన్న హక్కును కార్పొరేట్ కంపెనీలు హరించాయని, ఈ చట్టం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. నకిలీ విత్తనాలు అరికట్టడం, నష్టపోయిన రైతులకు ఎలా పరిహారం చెల్లించాలనే అంశాలను చర్చించారు.

మావోయిస్టుల మృతదేహాలు అప్పగించండి

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని కోరిన పీస్ కమిటీ సభ్యులు



ఆందోళన చేస్తున్న పౌర హక్కులు, ప్రజాసంఘాల నాయకులు

సాక్షి, హైదరాబాద్/హసన్‌పర్తి: ఈనెల 21న అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని కోఆర్డినేషన్ కమిటీ ఫర్ పీస్.. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని కోరింది. కమిటీ తరఫున సభ్యులు ప్రొ.హరగోపాల్, ప్రొ.జి.లక్ష్మణ్, డా.ఎంఎఫ్ గోపీనాథ్, కవితా శ్రీవాత్సవ, క్రాంతి చైతన్య, మీనా కందసామి సోమవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువకుల మృతదేహాలను అప్పగించడంలో ఛత్తీస్‌గఢ్ అధికారులు ఆలస్యం చేస్తూ, మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. అన్ని పత్రాలను అధికారులకు సమర్పించినప్పటికీ పోలీసులు మృతదేహాలను ఇంకా అప్పగించలేదని మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు ఎస్.జీవన్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శి డా.ఎస్.తిరుపతయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మృతదేహాలను కోల్డ్ స్టోరేజీలో కాకుండా మార్చురీలో బయటపడేసినట్టు తెలుస్తోందని ఆరోపించారు. తన కుమారుడు బూర రాకేశ్ మృతదేహాన్ని అప్పగించకుంటే కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుంటామని అతడి తల్లి సరోజన హెచ్చరించారు. ఎన్‌కౌంటర్ జరిగి ఆరు రోజులైనా రాకేశ్ మృతదేహం అప్పగించకుండా ఛత్తీస్‌గఢ్ సర్కార్ జాప్యం చేయడాన్ని నిరసిస్తూ పౌర హక్కుల సంఘం, ప్రజాసంఘాలు హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టులోని మృతుడి ఇంటి వద్ద ఆందోళన చేపట్టాయి.

● కలెక్టర్ వరమిచ్చినా..



ఖమ్మం జిల్లాలోని దివ్యాంగులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఇటీవల సమావేశమై స్వయం ఉపాధి కల్పించేందుకు వ్యక్తిగత రుణాలు ఇప్పించేలా పరిశీలిస్తామని తెలిపారు. వారు ఇచ్చిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ పరిశీలించి రుణాలు ఇవ్వాలని డీఆర్‌డీఏకు సిఫారసు చేశారు. కానీ అధికారులు మాత్రం వ్యక్తిగత రుణాలు ఇచ్చేందుకు నిబంధనలు అడ్డుగా ఉన్నందున గ్రూప్‌గా ఏర్పడి పొదుపు చేసుకోవాలని సూచించారు. గ్రూపుగా ఏర్పడితే ఒక్కొక్కరికి రూ.10 వేలకు మించి రుణాలు రావని దివ్యాంగులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో రూ.లక్ష, రూ.2లక్షల చొప్పున మంజూరు చేయాలని.. రుణాలు కట్టలేమని అనుమానం ఉంటే తమ పెన్షన్ ఖాతాతో లింకేజీ పెట్టుకోవాలని కోరేందుకు ఇలా పెద్దసంఖ్యలో దివ్యాంగులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

ఉద్యోగాల పేరిట మోసం

కలెక్టర్ సంతకం ఫోర్జరీ

- 40 మంది నిరుద్యోగులకు టోకరా
- ఒకరి అరెస్ట్..పరారీలో ఇద్దరు
- హనుమకొండ ఏసీపీ నర్సింహారావు వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నర్సింహారావు

హసన్‌పర్తి: ఉద్యోగాల పేరిట నకిలీ నియామక పత్రాలు సృష్టించి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద సంతకం ఫోర్జరీ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో హనుమకొండ ఏసీపీ నర్సింహారావు దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. నగరంలోని రామన్నపేటకు చెందిన మంద శ్రీనివాస్, బల్దియా కార్యాలయంలో హెల్త్ జవాన్‌గా విధులు నిర్వహించేవాడు. శ్రీనివాస్ గుండెపోటుతో మృతి చెందడంతో అతడి కుమారుడు మంద కల్యాణ్‌కు ఉద్యోగం ఇచ్చారు. 2019 నుంచి 2024 వరకు కల్యాణ్ హెల్త్ జవాన్‌గా విధులు నిర్వహించాడు. అయితే జల్సాలకు అలవాటు పడి ఉద్యోగాన్ని వదిలివేసిన అతడికి ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో వరంగల్ కలెక్టరేట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, తెలిసిన వారి నుంచి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించాడు. అలా 40 మంది వద్ద నుంచి సుమారు రూ.16.14 లక్షలు వసూలు చేశాడు.

ఫోర్జరీతో నకిలీ నియామక పత్రాలు

ఈ క్రమంలో కల్యాణ్ నకిలీ నియామక పత్రాలతో పాటు సర్వీస్ బుక్స్ కూడా తయారు చేసి, వాటిపై వరంగల్ కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నిరుద్యోగులకు అందజేశాడు. ఈ పనిలో అతనికి కూరపాటి భవ్యకిరణ్, మంద వంశీ అనే వ్యక్తులు సహరించారు. అయితే కల్యాణ్ చేసిన మోసాన్ని తెలుసుకున్న బాధితులు సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి విచారణ చేపట్టారు. కాగా, సోమవారం నిందితుడు మంద కల్యాణ్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడి నుంచి 39 నకిలీ సర్వీస్ బుక్స్, 23 నకిలీ నియామక పత్రాలు, బైక్, కారు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. తర్వాత నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు.

రాజకీయ శరణార్థిగా గుర్తించలేం

- ప్రభాకర్‌రావు దరఖాస్తును తిరస్కరించిన యూఎన్ హెచ్‌సీఆర్
- అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగుస్తున్న ఉచ్చు
- జూన్ 20 వరకు లొంగిపోకుంటే ప్రకటిత నేరస్తుడిగా ఖరారు!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా జరిగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న టి.ప్రభాకర్‌రావు చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. రాజకీయ వేధింపుల కారణంగా తీవ్ర అనారోగ్యానికి గురై, అమెరికాలో వైద్యం చేయించుకుంటున్న తనకు రాజకీయ శరణార్థి హోదా కల్పించాలంటూ ప్రభాకర్‌రావు పెట్టుకున్న దరఖాస్తును యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్ (యూఎన్ హెచ్‌సీఆర్) తిరస్కరించింది. ఆయన తన న్యాయవాది ద్వారా గత ఏడాది నవంబర్‌లో ఈ దరఖాస్తు చేసుకున్నారు. కేసు పూర్వాపరాలు, పాస్‌పోర్టు రద్దు, రెడ్ కార్నర్ నోటీసు జారీ తదితర పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న యూఎన్ హెచ్‌సీఆర్ దరఖాస్తును తిరస్కరిస్తూ నిర్ణయం తీసుకుంది.

అప్పట్లో వస్తానంటూ ఏమార్చి...

అక్రమ ఫోన్ ట్యాపింగ్‌పై కేసు నమోదుకు ముందు ఎస్ఐబీ చీఫ్‌గా పని చేసిన ప్రభాకర్‌రావు తర్వాత అమెరికా వెళ్లిపోయారు. పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన అనంతరం ఫోన్ ద్వారా పోలీసులను సంప్రదించి తాను నిర్దోషినంటూ చెప్పుకొచ్చారు. కేసు దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటైన తర్వాత దానికి నేతృత్వం వహిస్తున్న దర్యాప్తు అధికారికి వాట్సాప్ కాల్ చేసినప్పుడు, తనపై అరెస్టు వారెంట్ జారీ చేయవద్దంటూ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన సమయంలో.. తాను వైద్యం కోసం అమెరికా వచ్చానని, షెడ్యూల్ ప్రకారం జూన్ 26న (గత ఏడాది) తిరిగి వస్తానంటూ వివరణ ఇచ్చారు. గత ఏడాది జూలై రెండో వారంలో దర్యాప్తు అధికారికి ఈ-మెయిల్ ద్వారా రాసిన లేఖలో దర్యాప్తు అధికారులు, పోలీసుల చర్యలను తప్పుపట్టే ప్రయత్నం చేశారు.

ఆ ప్రయత్నాలను అడ్డుకోవడానికి..

తన పాస్‌పోర్టును రద్దు చేయించడానికి, రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయించడానికి పోలీసులు చర్యలు తీసుకుంటుండటాన్ని గమనించిన ప్రభాకర్‌రావు మరో ఎత్తు వేశారు. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న కుమారుడి వద్ద ఉన్న ప్రభాకర్‌రావు న్యాయవాదుల ద్వారా చెన్నైలోని యూఎన్ హెచ్‌సీఆర్ ఫీల్డ్ ఆఫీస్‌లో దరఖాస్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం రాజకీయంగా కక్షకట్టి వేధిస్తున్న నేపథ్యంలో అమెరికాలో ఉన్న తనకు అక్కడే శరణార్థిగా ఆశ్రయం కల్పించాలని కోరారు. 2024 జూన్ నాటికే పూర్తిగా కోలుకుంటానని భావించానని అయితే తనపై నమోదైన తప్పుడు కేసు, నిరాధార ఆరోపణలు, ఉద్దేశపూర్వకంగా పోలీసులు మీడియాకు ఇస్తున్న లీకులు, తన ప్రతిష్టకు కలుగుతున్న భంగం తదితర కారణాల నేపథ్యంలో ఆరోగ్యం మరింత క్షీణించిందని తెలిపారు. డాక్టర్లు తన ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడే వరకు అమెరికా వదిలి వెళ్లవద్దన్నారని అందులో పేర్కొన్నారు.

యూఎస్ ఆర్‌ఏపీకి సిఫార్సు చేస్తేనే..

ప్రభాకర్‌రావు దరఖాస్తును అన్ని కోణాల్లో పరిశీలించిన యూఎన్ హెచ్‌సీఆర్ ఫీల్డ్ ఆఫీస్ తన నివేదికను ఢిల్లీలోని ప్రధాన కార్యాలయానికి పంపింది. ప్రభాకర్‌రావుకు శరణార్థిగా ఆశ్రయం కల్పించాలంటూ యూఎన్ హెచ్‌సీఆర్ అమెరికాకు చెందిన యునైటెడ్ స్టేట్ రెఫ్యూజీ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రామ్ (యూఎస్ఆర్ఏపీ) అధికారులకు సిఫార్సు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే రీసెటిల్‌మెంట్ సపోర్ట్ సెంటర్ ద్వారా శరణార్థి కార్డు జారీ అవుతుంది. ఇది జరగాలంటే వారి స్వదేశంలో జాతి, మత, జాతీయత, సామాజిక సమూహం, రాజకీయ వేధింపులు ఎదుర్కొంటూ ఉండాలి. అయితే ప్రభాకర్‌రావు రాజకీయ కక్ష, అనారోగ్య కారణాలు చూపించారు. అయినా కేసు తీవ్రత దృష్ట్యా ఆయన దరఖాస్తును యూఎన్ హెచ్‌సీఆర్ తిరస్కరించింది. ప్రభాకర్‌రావు కోర్టులో హాజరు కావడానికి వచ్చే నెల 20 వరకు గడువు ఉంది. ఆలోగా ఆయన రాకపోతే ప్రకటిత నేరస్తుడిగా ఖరారై తదుపరి చర్యలు ప్రారంభం కానున్నాయి.

ముందస్తు నైరుతి ఎందుకంటే..!

రుతుపవనాల రాక కోసం కర్షకుడు ఆకాశం కేసి కళ్ల కాయలు కాచేలా చూస్తాడు. హలధారితో దోబూచులాడే రుతుపవనాలు ఈసారి రైతన్నలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తూ ఆగమేఘాల మీద దూసుకొచ్చి వర్షాలను దంచికొడుతున్నాయి. అడవుల నరికివేత, యథేచ్ఛగా సాగుతున్న మానవ కార్యకలాపాలు, శిలాజ ఇంధనాల విచ్చలవిడి వినియోగం తదితరాలతో వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ సంభవించిన కారణంగానే రుతుపవనాలు ఇలా ముందుగా వచ్చేశాయని ఎన్నో విశ్లేషణలు వెలువడుతున్నాయి. అయితే ఇలా ముందస్తు వర్షాలు గతంలో సర్వసాధారణమని వాదించే వాళ్లూ ఉన్నారు. దీంతో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ముందస్తు రాకకు కారణాలేంటి అనే దానిపై ఇప్పుడు చర్చ మొదలైంది.



గతంలోనూ ముందొచ్చాయి

కేరళ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలో నైరుతి రుతుపవనాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఊరికే రాష్ట్రాలను చుట్టేయకుండా భారీ వర్షాలతో పలకరించి ఈసారి అధిక వర్షాలు ఖాయమని కబురును రుతుపవనాలు మోసుకొచ్చాయి. అయితే ఇలా ముందస్తు రాక కొత్తేమీ కాదని గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. ఈసారి పలు రాష్ట్రాల్లోకి రెండు వారాల ముందే రుతుపవనాలు ప్రవేశించడంతో పాటు కేరళ నుంచి మహారాష్ట్రదాకా అవి వేగంగా, విస్తారంగా మే 24న ఒక్కరోజులోనే విస్తరించడం విశేషం. ఇది అసాధారణమేమీ కాదని, కేవలం అరుదైన విషయమని గణాంకాలు చాటుతున్నాయి. 1971 ఏడాదిలోనూ రుతుపవనాలు కర్ణాటకలో అధిక భాగం, మహారాష్ట్రలో కొంత మేర ఒకేసారి విస్తరించి అప్పుడు అందర్నీ విస్మయానికి గురిచేశాయి. మళ్లీ దాదాపు యాభై ఏళ్ల తర్వాత ఇదే తరహాలో రుతుపవనాలు ఒకేసారి విస్తరించాయి.

ఆ తర్వాత కాస్తంత బ్రేక్

జూన్ రెండో తేదీదాకా రుతుపవనాలు ఇదే వేగంతో విస్తరిస్తాయని వాతావరణ శాఖ వర్గాలు అంచనావేస్తున్నాయి. మహారాష్ట్ర, తూర్పు భారతాన్ని త్వరగా చుట్టుముట్టాక వేగం తగ్గే వీలుంది. గతంలో మాదిరే వేగం నెమ్మదించి మెల్లిగా రుతుపవనాలు ముందుకు సాగనున్నాయి. మధ్య స్థాయి ఎత్తులో పొడి వాతావరణం ఏర్పడటంతో జూన్ మొదటి వారం తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. తరచూ వర్షాలు పడే అవకాశాలు సన్నగిల్లుతాయి. రుతుపవనాల గమన వేగం సైతం తగ్గనుంది.

ముందస్తుపై వాతావరణ మార్పుల ప్రభావం

సహజ వాతావరణ వ్యవస్థతోపాటు మానవ ప్రేరేపిత భూతాపోన్నతి, గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు వంటి అంశాలూ రుతుపవనాలపై ప్రభావం చూపిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతానికైతే భారత్‌లో రుతుపవనాల రాకపై వాతావరణ మార్పుల ప్రభావం పరిమిత స్థాయిలోనే ఉందని వారు అభిప్రాయపడ్డారు. భూతాపోన్నతి దెబ్బకు యురేసియా, హిమాలయ ప్రాంతాల్లో మంచు దుప్పటి కరిగిపోతోంది. 1990–2020 కాల సగటుతో పోలిస్తే ప్రస్తుతం యురేసియా, హిమాలయాల పరిధిలో మంచు 15 శాతం అంతరించిపోయింది. తక్కువ మంచు కారణంగా ఉపరితల ఉష్ణోగ్రత పెరుగుతుంది. దీంతో రుతుపవనాలు ప్రేరేపితమై త్వరగా వస్తాయి. ఒక్కోసారి మే నెల మధ్యలోనే ఇవి రావొచ్చు. గ్లోబల్ వార్మింగ్‌లో పెరిగే ప్రతి ఒక్క డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతకు సముద్రాలపై వాతావరణంలో తేమ 6–8 శాతం పెరుగుతుంది. పారిశ్రామిక విప్లవానికి ముందునాటితో పోలిస్తే 2025లో ఉష్ణోగ్రత 1.2 డిగ్రీ సెల్సియస్ పెరిగిందని ఇప్పటికే గణాంకాలు చాటుతున్నాయి. ఈ నేపథ్యంలో అరేబియన్ సముద్రం, బంగాళాఖాతం ఉపరితల వాతావరణంలో తేమ పెరిగి మే నెలలోనే మేఘాల అధిక ఆవిర్భావానికి దారితీసింది. కర్ణాటక-గోవా తీరం వెంట ద్రోణి కారణంగా తుపాను పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇవి ఈసారి రుతుపవనాలను మరింత ముందుకు లాగాయి. మారిషస్, మడగాస్కర్‌ల మధ్య తక్కువ ఎత్తులో వీచే పవనాల దృగ్విషయాన్ని సోమాలీ జెట్‌గా పిలుస్తారు. ఇది ఈనెలలోనే విజృంభించింది. ఈ గాలులు అరేబియా సముద్రం మీదుగా భారత పశ్చిమ తీరం వైపు వీస్తాయి. ఇవి కేరళ, కర్ణాటక, గోవా, మహారాష్ట్రలనూ తాకుతాయి. ఈసారి సోమాలీ జెట్ గాలుల ప్రభావం తోడవడంతో నైరుతి పవనాలు త్వరగా వచ్చేశాయి.

మరెన్నో కారణాలు..

భౌగోళిక, సముద్ర, వాతావరణ పరిస్థితుల మధ్య సమన్వయంలో తేడా సైతం ఈసారి రుతుపవనాల ఆగమనాన్ని ముందుకు తోసింది. భూమధ్యరేఖ జోన్‌లో ప్రతి 30 నుంచి 60 రోజులకు ఒకసారి సముద్ర జలాల మీదుగా మేఘాలు, వర్షాలు, పవనాలు ఒక క్రమపద్ధతిలో ముందుకు సాగుతాయి. దీనినే మేడెన్ జూలియన్ ఆసిలేషన్(ఎంజేఓ)గా పిలుస్తారు. ఎంజేఓ అనేది రుతుపవనాల్లో తేమ, పొడి దశలను నిర్దేశిస్తుంది. ఈనెలలో ఎంజేఓ మూడో దశలోఉంది. ఇది మేఘావృత స్థితిని అధికం చేసి దక్షిణభారతంలో వర్షాలను కురిపిస్తుంది. మే 25వ తేదీన ఇది నాలుగో దశకు మారడంతో హిందూ సముద్రం నుంచి మరింత తేమ పవనాల రూపంలో భారత్‌పై కురిసింది. ఈసారి ఎల్‌నినో సైతం తటస్థ వైఖరిని ప్రదర్శించడంతో రుతుపవనాలకు అనుకూల వాతావరణం ఏర్పడింది. అందుకే ఈసారి వర్షాలు ముందే పడ్డాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్



మాక్రాన్‌కు చెంపదెబ్బ?

- ముఖంపై చేతులేసి తోసేసిన భార్య
- వియత్నాం పర్యటనలో ఘటన
- ప్రపంచమంతా వైరలైన వీడియో
- అధ్యక్ష దంపతుల మధ్య విభేదాలు!
- సరదా సన్నివేశమేనన్న మాక్రాన్

పారిస్: వియత్నాం పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న ఓ ఉదంతం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌ను తీవ్ర ఇబ్బందులపాలు చేసింది. అధికారిక పర్యటన నిమిత్తం భార్య బ్రిగెట్‌తో కలిసి ఆయన ఆదివారం సాయంత్రం హనోయ్ చేరుకున్నారు. తలుపు తెరుచుకుని, విమానం దిగేందుకు సిద్ధమవుతున్న క్రమంలో బ్రిగెట్ ఒక్కసారిగా మాక్రాన్ ముఖంపై కొడుతున్నట్టుగా కన్పించారు. ఆమె చేతులు మాక్రాన్ ముఖంపై విసురుగా పడుతూ కన్పించాయి. ఆ ధాటికి మాక్రాన్ ఉన్నట్టుండి వెనక్కు ఒంగిపోయారు. దాంతో ఆయన ఒక్కసారిగా కంగుతిన్నా, కెమెరాలన్నీ తనపైనే ఉండటం గమనించి వెంటనే సర్దుకున్నారు. చిరునవ్వుల నడుమ అభివాదసూచకంగా చేతి ఊపుతూ విమానం నిచ్చెనపైకి చేరుకున్నారు. ఆ వెనకే బ్రిగెట్ కూడా వచ్చి మాక్రాన్ పక్కన నుంచున్నారు. కానీ ఆయన చెయ్యందివ్వబోగా పట్టించుకోలేదు. ఇద్దరూ కలి'విడి'గానే నిచ్చెన దిగి వచ్చారు. మీడియా కెమెరాలకు చిక్కిన ఈ ఉదంతం ప్రపంచవ్యాప్తంగా వైరల్ కావడమే గాక తీవ్ర దుమారం కూడా రేపింది. పైగా, ఆ వీడియో నకిలీది కావచ్చన్న ఫ్రెంచి ప్రభుత్వ వ్యాఖ్యలు మరిన్ని అనుమానాలకు తావిచ్చాయి. దాంతో ఇక లాభం లేదని అధ్యక్షుడే స్వయంగా రంగంలోకి దిగారు. అదో సరదా ఘటన తప్ప ఇంకేమీ కాదంటూ మీడియా సాక్షిగా వివరణ ఇచ్చుకున్నారు. ''నేను, మా ఆవిడ జోక్ చేసుకుంటున్న క్రమంలో జరిగిన ఉదంతమది. ఏమీ లేనిదాన్ని అనవసరంగా పెద్దది చేసి చూస్తున్నారు'' అని చెప్పుకొచ్చారు. దానిపై ఎవరికి తోచింది వాళ్ల ప్రచారం చేస్తూ అనవసరంగా కుట్ర సిద్ధాంతాలకు తెర తీస్తున్నారంటూ ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో వాపోయింది. మాక్రాన్ దంపతుల నడుమ విభేదాలు సాగుతున్నాయని, అవి తారస్థాయికి చేరాయనేందుకు ఈ ఉదంతమే తాజా నిదర్శనమని ఫ్రెంచి పత్రికలు ఎడాపెడా రాసేయడమే అందుకు కారణం.

ఏక్ చోటీ సీ ప్రేమ్ కహానీ!: మాక్రాన్, బ్రిగెట్ బంధం తొలినుంచీ వార్తల్లోనే నిలుస్తూ వచ్చింది. మాక్రాన్ కంటే ఆమె దాదాపు పాతికేళ్లు పెద్దది కావడం విశేషం! బ్రిగెట్ 1953 ఏప్రిల్ 13న పుట్టగా మాక్రాన్ జన్మదినం 1977 డిసెంబర్ 21. అంతే కాదు, హైస్కూలు రోజుల్లో మాక్రాన్‌కు బ్రిగెట్ టీచర్ కూడా! ఆయనకు ఫ్రెంచ్, లాటిన్ బోధించేవారు. అలా లైసీ లా ప్రావిన్స్‌లో మాక్రాన్ టీనేజీ బాలునిగా చదువుకునే రోజుల్లోనే, అంటే 1993లో వారి ప్రేమ కథకు బీజం పడింది. అప్పటికి ఆయనకు కేవలం 15 ఏళ్లు. కాగా, బ్రిగెట్‌కు 39 ఏళ్లు. ఆంద్రె లూయిస్ అనే బ్యాంకర్‌తో ఆమెకు పెళ్లై పిల్లలు కూడా ఉన్నారు. పైగా బ్రిగెట్ పెద్ద కూతురు లారెన్స్ మాక్రాన్‌కు స్వయానా క్లాస్‌మేట్ కూడా! అయినా ఇవేవీ వారి ప్రేమకు అడ్డంకి కాలేకపోయాయి. బ్రిగెట్ ఓ నాటక సంఘానికి పర్యవేక్షకురాలిగా కూడా వ్యవహరించేవారు. సాహితీ అభిమాని అయిన మాక్రాన్ అందులో సభ్యునిగా చేరారు. స్కూలు వేళలు అయిపోయాక ఇద్దరూ అక్కడ కలుసుకునేవారు. ఎంత గోప్యంగా ఉంచినా వారి వ్యవహారం మాక్రాన్ ఇంట్లో తెలిసిపోయింది. మాక్రాన్ ప్రేమలో పడ్డట్టు అప్పటికే వాళ్లకు అనుమానంగా ఉండేదట. అయితే, అది బ్రిగెట్ కూతురు కావచ్చని వాళ్లు భావించారట! మాక్రాన్ మహా మేధావి అంటూ ఆ అమ్మాయి వారితో నిత్యం ఎంతో గొప్పగా చెప్పడమే అందుకు కారణం. తీరా చూస్తే తమవాడు ప్రేమలో పడింది పిల్లతో కాదు, తల్లితోనని తెలిసి వారు కంగుతిన్నారు! ఈ అసాధారణ ప్రేమ వ్యవహారానికి ఎలాగైనా ఫుల్‌స్టాప్ పెట్టాలని పై చదువుల పేరిట మాక్రాన్‌ను ఉన్నపళంగా పారిస్ పంపించేశారు. అలా 17వ ఏట హైస్కూల్ ఫైనలియర్ కోసం ఆయన పారిస్ వెళ్లాల్సి వచ్చింది. ఆ దూరం కూడా వారి ప్రేమకు అడ్డం కాలేకపోయింది. పైగా మాక్రాన్ పారిస్ వెళ్లేముందు, 'నువ్వేం చెప్పినా, ఏం చేసినా నేను మాత్రం ఎప్పటికైనా నిన్నే పెళ్లాడతా' అని బ్రిగెట్‌కు కుండబద్దలు కొట్టి మరీ వీడ్కోలు తీసుకున్నారట. తర్వాత ఇద్దరూ తరచూ లేఖలు రాసుకుంటూ, వీలైనప్పుడల్లా కలుసుకుంటూ ఉండేవారు. కొంతకాలానికి ఆమె కూడా పారిస్ చేరుకున్నారు. అలా పుష్కర కాలం పాటు ప్రేమించుకున్నాక బ్రిగెట్ తన భర్తకు విడాకులిచ్చి 2007లో మాక్రాన్‌ను పెళ్లాడారు. తొలి వివాహం ద్వారా ఆమెకు అప్పటికే ముగ్గురు పిల్లలున్నారు.

పల్లెపల్లెకూ వాతావరణ అంచనా

ప్రపంచంలోనే అత్యాధునిక వాతావరణ అంచనా వ్యవస్థ ఆవిష్కరణ

- భారత్ ఫోర్‌క్యాస్టింగ్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ: కొన్ని గ్రామాలకు కలిపి ఉమ్మడి అంచనాను విడుదలచేయడానికి బదులు అత్యల్పంగా ఆరు కిలోమీటర్ల పరిధిలోనూ వాతావరణ స్థితిని తెలియజెప్పే అత్యాధునిక వ్యవస్థను భారత్ సోమవారం ఆవిష్కరించింది. భారత ఉష్ణమండల వాతావరణశాస్త్ర సంస్థ(ఐఐటీఎం) అభివృద్ధి చేసిన ఈ సాంకేతికతకు భారత్ ఫోర్‌క్యాస్టింగ్ సిస్టమ్(బీఎఫ్ఎస్) అని నామకరణం చేశారు. దీనిని భూవిజ్ఞాన శాఖ మంత్రి జితేంద్ర సింగ్ సోమవారం ఆవిష్కరించి జాతికి అంకితమిచ్చారు. యురోపియన్, బ్రిటిష్, అమెరికా వాతావరణ విభాగాలు సైతం 9 కిలోమీటర్ల నుంచి 14 కిలోమీటర్లను ఒక యూనిట్‌గా తీసుకుని వాతావరణ అంచనాలు వెలువరుస్తుండగా భారత్ ఆరు కిలోమీటర్ల స్థాయిలోనూ వాతారణ అంచనాను ఇకపై వెలువర్చనుండటం విశేషం. ఆరు కిలోమీటర్ల రెజల్యూషన్‌తో భారత వాతావరణ శాస్త్ర శక్తిసామర్థ్యాల పురోగతిని బీఎఫ్ఎస్ చాటుతోందని మంత్రి జితేంద్ర వ్యాఖ్యానించారు. ''వాతావరణానికి సంబంధించిన భూమధ్యరేఖ జోన్ అనేది అత్యంత అస్తవ్యస్తంగా ఉంటుంది. దీనిని అంచనా వేయడానికి అత్యధిక రెజల్యూషన్ వ్యవస్థ తప్పనిసరి''అని భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రన్ చెప్పారు.

ఏమిటీ బీఎఫ్ఎస్?

దేశవ్యాప్తంగా అమర్చిన 40 డాప్లర్ వాతావరణ రాడార్ల నుంచి సేకరించిన సమాచారాన్ని అత్యంత వేగంగా విశ్లేషించి చిన్నపాటి 'వాతావరణ అంచనా'నివేదికను రూపొందిస్తారు. గతంలో వాతావరణ యూనిట్ పెద్దగా ఉండేది. అంటే నాలుగైదు గ్రామాలకు కలిపి ఒకే అంచనాకు వచ్చేవారు. ఇప్పుడు ఎప్పటికప్పుడు డాప్లర్ రాడార్ల సంఖ్యను పెంచుకుంటూ అదనపు డేటాతో మరింత స్పష్టమైన 'వాతావరణ అంచనా'ను రూపొందిస్తారు. నాలుగు గ్రామాలకు కలిపికాకుండా విడివిడిగా ఒక్కో గ్రామానికి సైతం 'వాతావరణ అంచనా'ను ప్రకటిస్తారు. డాప్లర్ వెదర్ రాడార్ల సంఖ్యను 100కు పెంచనున్నారు. దీంతో వచ్చే రెండు గంటల్లో వాతావరణం ఎలా ఉండబోతోందో సులభంగా అంచనావేసి చెప్పేయనున్నారు. ఈ ఫోర్‌క్యాస్టింగ్ సిస్టమ్‌ను పరిశోధకులతోపాటు పార్థసారథి ముఖోపాధ్యాయ అభివృద్ధిచేశారు. పార్థసారథి గతంలో ఐఐటీఎం క్యాంపస్‌లో ఆర్కా సూపర్‌కంప్యూటర్‌ను ఏర్పాటుచేశారు. ఇది 11.77 పెటాఫ్లాప్ సామర్థ్యంతో 33 పెటాబైట్స్ స్టోరేజీ కెపాసిటీతో పనిచేస్తుంది. పాత సూపర్‌కంప్యూటర్ ప్రత్యూష్ పది గంటల్లో చేసే పనిని ఇది కేవలం నాలుగు గంటల్లో చేయగలదు.

పాక్‌కు గూఢచర్యం..

సీఆర్పీఎఫ్ జవాన్ అరెస్ట్

న్యూఢిల్లీ: పాకిస్తాన్ తరఫున గూఢచర్యం చేస్తున్న ఆరోపణలపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు సీఆర్పీఎఫ్ జవాన్‌ను అరెస్ట్ చేశారు. సీఆర్పీఎఫ్ ఢిల్లీ విభాగంలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మోతీ రాం జాట్ జాతి భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ అధికారుల (పీఐఓ)కు అందజేస్తున్నాడని ఎన్ఐఏ సోమవారం తెలిపింది. వివిధ మార్గాల ద్వారా పీఐవోల నుంచి ప్రతిఫలం అందుకుంటున్నట్లు గుర్తించామని వివరించింది. నిబంధనల ప్రకారం ఈ ఏడాది మే 21వ తేదీ నుంచి ఇతడిని విధుల నుంచి తొలగించినట్లు సీఆర్పీఎఫ్ తెలిపింది. ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం జాట్‌ను జూన్ 6వ తేదీ వరకు కస్టడీకి అనుమతించింది.



సోమవారం ముంబైలో చెరువులను తలపిస్తున్న రోడ్లపై జనం ఇక్కట్లు

ముంబైలో భీకర వాన

కుంభవృష్టితో మహానగరం కకావికలం

- ఎటుచూసినా నీటమునిగిన రహదారులు

ముంబై/మంగళూరు: భీకర వర్షాలకు ముంబై మహానగరం చివురుటాకులా వణికిపోయింది. 16 రోజుల ముందే ముంచుకొచ్చిన నైరుతి రుతుపవనాలు రావడం రావడంతోనే ముంబైపై కుండపోత వర్షాలను కురిపించాయి. సోమవారం ముంబైలో పడిన భారీ వర్షం దాటికి జనజీవనం స్తంభించిపోయింది. ఎటు చూసినా రహదారులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ముంబై నగరాన్ని నైరుతి రుతుపవనాలు 16 రోజుల ముందే తాకడం గత 69 సంవత్సరాల్లో ఇదే తొలిసారి. మండిపోయే మే నెలలో ముంబైలో ఇంతటి భారీ వర్షం కురవడం గత 107 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం విశేషం. దాదర్, మాహిమ్, పరేల్, బాంద్రా, కాలాచౌకీ ఇలా ఏ ప్రాంతంలో చూసిన వర్షపు నీరు నిలిచిన దృశ్యాలే కనిపించాయి. ఉరుములు, మెరుపులతో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఒక్క ముంబైలోనే కాదు మహారాష్ట్ర పశ్చిమ ప్రాంతం, కొంకణ్ తీర ప్రాంతాల్లోనూ అతి వర్షాలు కురిశాయి. బారామతి, ఇందాపూర్, దౌండా తహసీల్ పరిధిలో భారీవర్షాల కారణంగా అధికారులు రెడ్అలర్ట్ ప్రకటించారు. లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. రాయ్‌గఢ్ జిల్లాలో పిడుగుపాటుకు గురై ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. థానే, పాల్ఘర్ జిల్లాలోనూ భారీ వర్షపాతం నమోదైంది. వానల దెబ్బకు స్థానిక రైల్వే సేవలూ పాక్షికంగా నిలిచిపోయాయి.

కర్ణాటకలో వరసగా మూడోరోజూ..

కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లాలో వరసగా మూడోరోజూ భారీ వర్షాలు కురిశాయి. కర్ణాటక తీర ప్రాంతాల్లో మరో ఐదు రోజులపాటు రెడ్అలర్ట్ అమల్లోనే ఉంటుందని అధికారులు సోమవారం ప్రకటించారు. మంగళూరు సిటీలో చాలా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. దక్షిణ కన్నడ జిల్లాలో కొండప్రాంతాల్లో స్వల్పస్థాయిలో కొండచరియలు విరిగిపడిన ఘటనలు నమోదయ్యాయి.

వాళ్లకు టెర్రరిజమే టూరిజం

- పాకిస్తాన్ ఆలోచన అలాగే ఉంది
- మనం పర్యాటకాన్ని ప్రోత్సహిస్తే పాక్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోంది
- పాక్ ప్రజలు ఇకనైనా మేల్కొనాలి
- రోటీ కావాలో తూటా కావాలో తేల్చుకోండి
- పాకిస్తానీయులకు ప్రధాని మోదీ హితవు
- గుజరాత్‌లో పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన మోదీ



భుజ్/వడోదర: ఆపరేషన్ సిందూర్‌తో భారత ఆర్మీతో పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు, సైన్యం, పాలకులకు బుద్ధిచెప్పిన ప్రధాని మోదీ ఇప్పుడు ఆ దేశ ప్రజలకూ హితవు పలికారు. ఉగ్రవాదం మీ ప్రభుత్వం, సైన్యానికి ఆదాయ వనరుగా మారిందని, ఇకనైనా మీరు మేల్కొనాలని పాక్ ప్రజలకు మోదీ పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా సొంత రాష్ట్రం గుజరాత్‌లో సోమవారం పర్యటించిన ప్రధాని మోదీ దాహోద్, భుజ్, గాంధీనగర్‌లలో రూ.82,950 కోట్లకుపైగా విలువైన పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశాక భుజ్, దాహోద్‌లలో బహిరంగ సభల్లో ప్రసంగించారు. పాక్ సరిహద్దులోని కచ్ జిల్లాలోనూ మోదీ పర్యటించారు. ''భారత్ పర్యాటకాన్ని ప్రోత్సహిస్తుంటే పాకిస్తాన్ ఉగ్రవాదాన్నే పర్యాటకంలా ప్రోత్సహిస్తోంది. పాక్ ఈ తరహా పంథా కేవలం వాళ్లకే కాదు యావత్ ప్రపంచానికే పెను ముప్పుగా పరిణమించింది. పాకిస్తాన్ ప్రజలకు ఒక్కటే చెబుతున్నా. మీ ప్రభుత్వం, సైన్యం ఉగ్రవాదాన్ని ఒక ఆదాయ వనరుగా మార్చుకున్నాయి. ఇకనైనా ఉగ్రవాదానికి అంతం పలికేందుకు మీరంతా ముందుకు రావాలి. సంతోషంగా, ప్రశాంత జీవనం గడపండి. కడుపారా తినండి. రోటీ కావాలో మా తూటా కావాలో మీరే నిర్ణయించుకోండి. మిమ్మల్ని ఒక్కటే అడగదల్చుకున్నా. మేం 11 ఏళ్ల క్రితం అధికారం చేపట్టినప్పుడు భారత్ 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేది. నేడు జపాన్‌ను దాటేసి భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. మరి మీరేం సాధించారు?. మీ పరిస్థితేంటి? ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న మీ ప్రభుత్వాలు, సైన్యం మీ పిల్లలకు భవిష్యత్తు లేకుండా చేస్తున్నాయి. ప్రభుత్వ ధోరణి సరైందో కాదో యువతే నిలదీయాలి. మిమ్మల్ని ఆర్మీ, పాలకులు అంధకారంలోకి నెట్టేస్తున్నారు'' అని మోదీ పాక్ ప్రజలకు హితవు పలికారు.

పక్షం రోజులు వేచి చూశా

''పహల్గాంలో పాశవిక ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ కఠిన చర్యల కత్తి పట్టుకుంటుందేమోనని 15 రోజులపాటు వేచి చూశా. కానీ ఉగ్రవాదమే పాకిస్తాన్‌కు తిండిపెడుతోందని స్పష్టమైంది. అందుకే పాక్‌పై దాడులకు మా బలగాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చా. మే 9న భారత సరిహద్దు రాష్ట్రాలపై పాకిస్తాన్ దాడులకు తెగిస్తే అంతకు రెట్టింపు స్థాయిలో దాడి చేసి మేం పాక్ వైమానిక స్థావరాలను నేలమట్టంచేశాం ''అని మోదీ అన్నారు. తర్వాత మోదీ 1971లో పాక్ బాంబుదాడుల్లో ధ్వంసమైన ఎయిర్‌ఫీల్డ్‌ను 72 గంటల్లో పునర్‌నిర్మించిన మధాపార్ గ్రామంలోని 300 మంది మహిళలతో మోదీ మాట్లాడారు. వీళ్లు మోదీకి సిందూర్ మొక్కను బహూకరించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో దీనిని నాటుతానని మోదీ చెప్పారు.

మూడు రోడ్‌షోలు

తొలుత గుజరాత్ పర్యటనలో భాగంగా సోమవారం మోదీ ఏకంగా మూడు రోడ్‌షోల్లో పాల్గొన్నారు. ఉదయం వడోదరలో భారీ రోడ్‌షో చేశారు. ఆపరేషన్ సిందూర్ వివరాలను మీడియాకు వెల్లడించి దేశం దృష్టిని ఆకర్షించిన కల్నల్ సోఫియా ఖురేషి తల్లిదండ్రులు, సోదరుడు, కవల సోదరి షాయనా సున్‌సారా కూడా ఈ రోడ్‌షోలో పాల్గొనడం విశేషం. ఖురేషి స్వస్థలం వడోదరే. రోడ్ షో సందర్భంగా జనం జాతీయ జెండాలు చేతపట్టుకుని సైన్యాన్ని కీర్తిస్తూ నినాదాలు చేశారు. మోదీ కారు నుంచి బయటకొచ్చి వారికి అభివాదం చేశారు. అనంతరం భుజ్‌లో, అహ్మదాబాద్‌లో కూడా మోదీ రోడ్‌షోలు చేశారు. రాష్ట్రంలో మొత్తం రూ.82,950 కోట్ల ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

రోడ్ షోలో పాల్గొన్న కల్నల్ ఖురేషి కుటుంబ సభ్యులు





జస్టిస్ ఎన్.వి.అంజరియా | జస్టిస్ విజయ్ బిష్ణోయ్ | జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్

సుప్రీం జడ్జీలుగా ముగ్గురు

కేంద్రానికి కొలీజియం సిఫార్సు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ముగ్గురిని సీజేఐ సారథ్యంలోని కొలీజియం సిఫార్సు చేసింది. కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.అంజరియా, గువాహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విజయ్ బిష్ణోయ్, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ పేర్లను కేంద్రానికి పంపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల సోమవారం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల మొత్తం సంఖ్య 34. సీజేఐ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ హృషికేశ్ రాయ్ రిటైర్మెంట్‌తో ఏర్పడ్డ మూడు ఖాళీలను పూరించేందుకు కొలీజియం తాజా సిఫార్సులు చేసింది.

హైకోర్టు సీజేలుగా ఐదుగురు

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా ఐదుగురు న్యాయమూర్తుల పేర్లను సిఫార్సు చేస్తూ కొలీజియం మరో నిర్ణయం తీసుకుంది. జస్టిస్ సంజీవ్ సచ్‌దేవను మధ్యప్రదేశ్ హైకోర్టు సీజేగా, జస్టిస్ విభు బక్రూను కర్ణాటక హైకోర్టు సీజేగా, జస్టిస్ అశుతోష్ కుమార్‌ను గువాహటి హైకోర్టు సీజేగా, జస్టిస్ విపుల్ మనుబాయి పంచోలీని పట్నా హైకోర్టు సీజేగా, జస్టిస్ తార్లోక్‌సింగ్ చౌహాన్‌ను జార్ఖండ్ హైకోర్టు సీజేగా నియమించాల్సిందిగా కేంద్రానికి సిఫార్సు చేసింది.

పుతిన్‌కు పిచ్చెక్కింది: ట్రంప్

ఉక్రెయిన్ స్వాధీనమంటే రష్యా పతనమే • జెలెన్‌స్కీ నోర్మూసుకోవాలన్న అధ్యక్షుడు

వాషింగ్టన్/మాస్కో/కీవ్: ఉక్రెయిన్‌పై శనివారం రాత్రి నుంచి మొదలుకుని సోమవారం ఉదయం దాకా రష్యా భారీ వైమానిక దాడులకు పాల్పడింది. యుద్ధం మొదలైన ఈ మూడేళ్లలో అతి పెద్ద వైమానిక దాడులు ఇవే! ఈ పరిణామంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇష్టమొచ్చినట్టు మనుషులను చంపుకుంటూ పోతూ పిచ్చిగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఉక్రెయిన్ మొత్తాన్ని స్వాధీనం చేసుకోవాలని పుతిన్ చూస్తే అది అంతిమంగా రష్యా పతనానికి దారితీస్తుందని హెచ్చరించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పైనా ట్రంప్ విమర్శలు గుప్పించారు. ''ఆయన తన దేశానికి మేలు చేసేలా మాట్లాడటం లేదు. ఆయన నోటి నుంచి వచ్చే ప్రతి మాటా సమస్యలను సృష్టిస్తోంది. నాకది నచ్చడం లేదు.



జెలెన్‌స్కీ మాట్లాడకపోవడమే మంచిది''అని తన ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.

నా సహనం నశిస్తోంది

రష్యా విషయంలో ట్రంప్ సహనం నశిస్తోందనేందుకు ఆయన వ్యాఖ్యలు సూచన అని చెబుతున్నారు. ఓవైపు కాల్పుల విరమణకు తాను ప్రయత్నిస్తుండగా రష్యా ఇలా భారీ దాడులకు దిగడం ఆయనకు మింగుడు పడటం లేదు. తాజా వైమానిక దాడులపై ట్రంప్ ఘాటుగా స్పందించారు. ''పుతిన్ పట్ల నేను సంతోషంగా లేను. నా సహనం నశిస్తోంది. మా మధ్య మంచి సంబంధాలే ఉన్నాయి. కానీ పుతిన్‌కు ఏదో అయింది. ఇటీవలి కాలంలో పూర్తిగా పిచ్చివాడిలా ప్రవర్తిస్తున్నారు. అకారణంగా ఉక్రెయిన్ నగరాలపైకి క్షిపణులు, డ్రోన్లు పంపుతూ చాలామందిని చంపుతున్నారు. పుతిన్ ఉక్రెయిన్‌లో ఒక భాగమే కోరుకుంటున్నారని ఆశిస్తున్నా. అలాగాక ఉక్రెయిన్ మొత్తాన్నీ స్వాధీనం చేసుకోజూస్తే అది రష్యా పతనానికి దారితీస్తుంది!''అన్నారు. రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించే విషయాన్ని కచ్చితంగా పరిశీలిస్తామన్నారు. అంతేకాదు మూడేండ్ల కిందట తాను అధ్యక్షుడిగా ఉండి ఉంటే ఈ యుద్ధం మొదలయ్యేదే కాదని పునరుద్ఘాటించారు. పుతిన్, జెలెన్‌స్కీ, బైడెన్‌లు సృష్టించిన ఈ యుద్ధంలో సామాన్యులు ప్రాణాలు కోల్పోతున్నారని వ్యాఖ్యానించారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలను 'భావోద్వేగంతో కూడిన'వంటూ రష్యా తేలిగ్గా కొట్టిపారేసింది.

కరోనా కలకలం

- పెరుగుతున్న యాక్టివ్ కేసులు
- దేశవ్యాప్తంగా 1,000 దాటిన వైనం
- కొత్త వేరియంట్లే ప్రధాన కారణం
- ఆందోళన వద్దంటున్న వైద్యులు



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ కేసుల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,000కి పైగా క్రియాశీలక కేసులున్నాయి. గత వారం రోజుల్లోనే 750 మంది కరోనా బారిన పడ్డట్టు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీల్లో అత్యధికంగా కొత్త కేసులు పెరిగినట్టు తెలిపింది. కేంద్రం సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం కేరళలో 335 కొత్త ఇన్ఫెక్షన్లు నమోదయ్యాయి. అక్కడ యాక్టివ్ కేసుల సంఖ్య 430కి పెరిగింది. మహారాష్ట్రలో 153, ఢిల్లీలో 99 కొత్త కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలో యాక్టివ్ కేసుల సంఖ్య 209కు, ఢిల్లీలో 104కు పెరిగింది. గుజరాత్‌లో 83 కేసులు, కర్ణాటకలో 47, ఉత్తరప్రదేశ్‌లో 15, పశ్చిమ బెంగాల్‌లో 12 కేసులు నమోదయ్యాయి. అయితే కేసుల పెరుగుదలతో భయపడాల్సిన అవసరం లేదని కేంద్రం పేర్కొంది. చాలా కేసుల్లో బాధితులు ఇంట్లోనే చికిత్స తీసుకుంటున్నట్టు తెలిపింది. అధిక కేసుల నేపథ్యంలో కేరళ ప్రభుత్వం అప్రమత్తమైంది. కేసుల వ్యాప్తిని అరికట్టేందుకు రాపిడ్ రెస్పాన్స్ బృందంతో సమావేశం నిర్వహించింది. వ్యాధి తీవ్రత లేకున్నా అందరూ వ్యక్తిగత రక్షణ పాటించాలని ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ సూచించారు. ఎలాంటి పరిస్థితికైనా ఢిల్లీ ఆసుపత్రులు పూర్తిగా సిద్ధంగా ఉన్నట్టు ముఖ్య మంత్రి రేఖ గుప్తా తెలిపారు.

ఈయూపై 50% టారిఫ్‌లు జూలై వరకు వాయిదా: ట్రంప్

వాషింగ్టన్: యూరోపియన్ యూనియన్(ఈయూ) వస్తువులపై జూన్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి రావాల్సిన 50 శాతం టారిఫ్‌లకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాస్తంత విరామం ప్రకటించారు. ఈ గడువును దాదాపు నెలపాటు అంటే జూలై 9వ తేదీ దాకా వాయిదా వేస్తున్నట్లు తాజాగా ప్రకటించారు. యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వోన్ డెర్ లెయెన్ ఆదివారం ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడాక ఈమేరకు ఒప్పుకున్నట్లు తెలిపారు.

అమెరికాలో కాల్పులు.. 10 మందికి గాయాలు

లిటిల్ రివర్: అమెరికాలోని దక్షిణ కరోలినా రాష్ట్రం హార్రీ కౌంటీలో చోటుచేసుకున్న కాల్పుల్లో కనీసం 10 మంది గాయపడ్డారు. లిటిల్ రివర్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ బోట్‌లో ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో జరిగిన వీకెండ్ పార్టీలో ఘటన చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉందన్నారు.



కన్ను పడితే లే 'ఔట్'
వారి కన్ను పడిందంటే లే ఔటే. నగర శివారులోని గ్రామ పంచాయతీ లే ఔట్లను లక్ష్యంగా చేసుకున్న కొందరు కబ్జాలకు పాల్పడుతున్నారు.
-10లో



గ్రీన్ రిలేషన్..
నగరంలో టెర్రస్ గార్డెనింగ్ (మిద్దె పంట) ఒక ట్రెండ్‌గా, సరికొత్త జీవనశైలిగా మారింది. ఇందులో భాగంగానే నగరంలోని భవనాలు పచ్చదనం అల్లుకుంటున్నాయి.
- సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం 31.0/22.0

వాతావరణం
నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 31, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

ఎండలకో దండం!



బేగంపేట్‌లో వర్షంలో బైక్‌పై గొడుగు పెట్టుకుని వెళ్తూ..



రాయదుర్గం మెట్రో స్టేషన్ సమీపంలో ట్రాఫిక్ జాం



ట్యాంక్‌బండ్‌పై మొక్కజొన్న పొత్తుల రుచులు

నైరుతి అరుదెంచింది. వేసవి గుడ్‌బై చెప్పేసింది. నగరాన్ని తొలకరి పలకరించింది. చల్లటి కబురు సిటీజనులను పరవశింపజేసింది. సోమవారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చి గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సాయంత్రం పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు జల్లులు కురిశాయి. నగటున రెండు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొన్నిచోట్ల ట్రాఫిక్‌జాంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. వాతావరణం చల్లబడటంతో హుస్సేన్ సాగర్, ట్యాంక్‌బండ్ పరిసరాలు సందర్శకులతో నిండిపోయాయి. పర్యాటకులు వేడివేడి మొక్కపొత్తుల రుచులను ఆస్వాదించారు. మరో మూడ్రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.

– సాక్షి, సిటీబ్యూరో

రోబోటిక్.. సిల్ట్‌కు చెక్!

ఇక రోబోలతో నాలాల క్లీనింగ్
- ఘన, ద్రవ పూడికల తొలగింపు
- కార్యాచరణకు సిద్ధమైన జీహెచ్ఎంసీ
- ఆధునిక సాంకేతికత వినియోగంలో మరో అడుగు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో వానొస్తే రోడ్లు చెరువులవుతున్నాయి. కాలనీలు సరస్సులను తలపిస్తున్నాయి. నేలపై పడ్డ వరదనీరు సాఫీగా వెళ్లేందుకు మార్గం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. వాన నీరు పారేందుకు నాలాలు (వరద నీటి కాలువలు) ఉన్నప్పటికీ, వాటిలో సిల్ట్ (పూడిక) తొలగించేందుకు ఏటా రూ. 50 కోట్లకు పైగా వెచ్చిస్తున్నప్పటికీ, సమస్యలు పూర్తిగా పరిష్కారం కావడం లేదు. ప్రధాన రహదారుల మార్గాల్లోనే 144 ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. వర్షం పడిన ప్రతిసారీ అక్కడ వాహనాలు ముందుకు కదల్లేక తీవ్ర ట్రాఫిక్ జామ్‌లతో ప్రజలు అల్లాడుతున్నారు. ఏటా కోట్లు వెచ్చిస్తున్నప్పటికీ డీ సిల్టింగ్ చేయిస్తున్నప్పటికీ, నాలాలు పూర్తిగా క్లీన్ కాకపోవడానికి వాటిలోపేరుకుపోయిన వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోవడం ఒక కారణమని గుర్తించిన అధికారులు అలాంటి సమస్యాత్మక ప్రాంతాల్లో.. ముఖ్యంగా కార్మికులు పనులు చేయలేని నాలాల్లో, బాటిల్‌నెక్స్ ప్రాంతాల్లో ఆధునిక సాంకేతికతతో కూడిన రోబోలను వినియోగించుకోవాలని నిర్ణయించారు. రోబోటిక్ టెక్నాలజీతో జెట్టింగ్, సక్షన్ యంత్రాలను ఆయా ప్రాంతాల్లోని చాంబర్ల ద్వారా నాలాల్లోకి పంపిస్తారు. గట్టిపడిపోయిన సిల్ట్‌ను జెట్టింగ్ మెషీన్ ఎయిర్‌ప్రెషర్‌తో లూజ్ చేయడంతో పాటు సక్కింగ్ మెషీన్ బయట ఉండే రెండు చాంబర్ల (ట్యాంకర్ల)లోకి పంపిస్తుంది. ఘన, ద్రవరూపంలో ఉన్న సిల్ట్ మొత్తాన్ని బయటకు తోడి పోయడం ద్వారా వరదనీరు సాఫీగా ప్రవహించేందుకు అవకాశముంటుందని సంబంధిత ఇంజినీర్లు తెలిపారు.

సీసీ కెమెరాలు సైతం..

- ఈ మెషిన్లకు అమర్చే సీసీటీవీ ఫ్లాష్ కెమెరాలతో నాలాల లోపలి చిత్రాల్ని ఫొటోలు తీస్తాయి. దాంతో ఎక్కడైనా.. ఏవైనా పైపులు దెబ్బతిన్నా, కేబుళ్లు అడ్డుగా ఉన్నా తెలుస్తుంది. వాటిని సైతం జెట్టింగ్, సక్కింగ్‌తో బయటికి పంపిస్తాయి. మెషిన్లు చేయలేని పనులంటూ ఏవైనా ఉంటే పరిస్థితిని బట్టి సదరు ప్రాంతానికి ఆక్సిజన్‌తో కార్మికులను పంపించనున్నట్లు అధికారులు చెప్పారు.
- ఈ సాంకేతికతను వినియోగించడం ద్వారా రోడ్డు కటింగ్ చేయాల్సిన పని ఉండదు. ముఖ్యంగా వీఐపీల ప్రాంతాల్లో రోడ్ల కటింగ్‌లు జరిగితే తీవ్ర ట్రాఫిక్‌జామ్‌లు ఎదురవుతాయి. రోడ్ల కింద అడ్డంగానూ ఎన్నో ప్రాంతాల్లో వరదనీరు పారే మార్గాలున్నాయి. వరదనీటి కాలువల్లో ఎక్కడెక్కడ ఏమేం ఉన్నాయో అధికారులకు సైతం సరిగా తెలియదు. విమానాశ్రయానికి దారితీసే లక్డీకాపూల్, మాసాబ్‌ట్యాంక్, మెహిదీపట్నం తదితర రద్దీ ప్రాంతాల్లో రోడ్ల కటింగ్‌లు అధికారులకు తీవ్ర సమస్యగా మారుతున్నాయి. ఈ మెషిన్ల వినియోగంతో రోడ్ల కటింగ్ చేయకుండానే పనులు చేయవచ్చు.

ఇతర నగరాల్లో..

ముంబై, చెన్నై వంటి నగరాల్లో ఇప్పటికే రోబో మెషిన్లను వినియోగిస్తున్నారు. మన నగరంలోనూ వాటిని వినియోగించాలని గత కమిషనర్ ఇలంబర్తి ఆలోచించారు. ఆ దిశగా పనులకు ఇంజినీర్లు ఇప్పుడు సిద్ధమయ్యారు. నగరంలోని మెట్రో వాటర్ బోర్డు సివరేజి లైన్లను శుభ్రం చేసేందుకు వినియోగిస్తున్న రోబోల కంటే ఇవి భిన్నమైనవి. ఇవి ఘన, ద్రవ వ్యర్థాలను తొలగించడంతో నాలాలు పూర్తిస్థాయిలో క్లీన్ అవుతాయి.

ప్రయోగాత్మకంగా కొన్ని సర్కిళ్లలో..

తొలుత వీటిని ప్రయోగాత్మకంగా ఖైరతాబాద్ జోన్‌లోని జూబ్లీహిల్స్, మెహిదీపట్నం, ఖైరతాబాద్, కార్వాన్, గోషామహల్ సర్కిళ్లలో వినియోగించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ పనులు చేసేందుకు ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు ఆహ్వానించిన అధికారులు ముందుకొచ్చే ఏజెన్సీల పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలించి, అనువైన దానిని ఖరారు చేసి, పనులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సాంకేతికతతో వరద ముంపు తప్పుతుంది. తద్వారా ఎంతో ఆస్తినష్టం తగ్గనుందని అధికారులు చెబుతున్నారు.

జూన్ 6న ఖైరతాబాద్ మహాగణపతి కర్ర పూజ

ఖైరతాబాద్: ప్రతి యేటా వివిధ రూపాల్లో దర్శన మిచ్చే ఖైరతాబాద్ మహాగణపతి తయారీ పనులను జూన్ 6న నిర్జల ఏకాదశి రోజు కర్రపూజ నిర్వహించి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఖైరతాబాద్ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరుసగా 71వ సంవత్సరం మహాగణపతిని ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠించనున్నామని చెప్పారు. మూడు నెలల ముందే ప్రతి సంవత్సరం వినాయక విగ్రహ తయారీ పనులను ప్రారంభిస్తారు. ఈ సంవత్సరం ఆగస్టు 27న వినాయక చవితి ఉండటంతో జూన్ 6న సాయంత్రం 5 గంటలకు కర్ర పూజ నిర్వహించి పనులను ప్రారంభించనున్నారు.

థాంక్యూ సర్!

- రంగనాథ్‌ను కలిసిన పీర్జాదిగూడ వాసులు
- శ్మశాన స్థల సమస్య తీర్చినందుకు కృతజ్ఞతలు



సాక్షి, సిటీబ్యూరో: శ్మశాన స్థలాన్ని కబ్జా కోరల నుంచి విడిపించినందుకు పీర్జాదిగూడ వాసులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయానికి వచ్చిన పలువురు రంగనాథ్‌తో పాటు హైడ్రా అధికారులు హేమ మాలిని, సైదులు, బాచిరెడ్డిలను సత్కరించారు. ఎన్నో ధర్నాలు, ఆందోళనలు చేసినా తమకు న్యాయం జరగలేదని, హైడ్రాకు ఫిర్యాదు చేసిన 24 గంటల్లో పరిష్కారం లభించిందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

ఫిట్‌లెస్ బడి బస్సులు 7021

గ్రేటర్‌లో మొత్తం స్కూల్ బస్సులు 13,421

- సామర్థ్య పరీక్షల్లో ఇప్పటి వరకు 6,400 బస్సులు పాస్..
- జూన్ 12న తెరుచుకోనున్న విద్యాసంస్థలు
- త్వరలో పాఠశాల యాజమాన్యాలతో మంత్రి పొన్నం సమావేశం
- బడి పిల్లల భద్రతపై దిశానిర్దేశం

గ్రేటర్‌లో బడి బస్సుల సామర్థ్యం తీరు ఇలా

జిల్లా	మొత్తం బస్సులు	సామర్థ్యం ఉన్నవి	సామర్థ్యం లేనివి
హైదరాబాద్	1,257	646	611
మేడ్చల్	6,009	3,056	2,953
రంగారెడ్డి	6,155	2,698	3,457

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



స్కూల్ బస్సుల నిర్వహణలో యాజమాన్యాలు, డ్రైవర్, అటెండర్ తదితర సిబ్బందితో పాటు పిల్లల తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలి. బస్సుల సామర్థ్యంపై ఎలాంటి సందేహాలు ఉన్నా ఆర్టీఏ దృష్టికి తేవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడొద్దు.
– సి.రమేష్, జేటీసీ, హైదరాబాద్

సాక్షి, సిటీబ్యూరో: బడి బస్సుల సామర్థ్యం ప్రహసనంగా మారింది. కొద్ది రోజుల్లో విద్యాసంస్థలు తెరుచుకోనున్న నేపథ్యంలో.. ఇప్పటి వరకు సగానికి పైగా బస్సులకు ఫిట్‌నెస్ లేదు. ఏటా మే 15వ తేదీ నాటికి బస్సుల సామర్థ్య పరీక్షల గడువు ముగుస్తుంది. ఆ రోజు నుంచి జూన్ మొదటి వారం వరకు రవాణా అధికారులు పరీక్షలు నిర్వహించి వాటి సామర్థ్యాన్ని నిర్ధారించిన తర్వాతే పిల్లలకు రవాణా సదుపాయాన్ని అందజేసేందుకు ఆ బస్సులకు అనుమతి లభిస్తుంది. కానీ.. విద్యాసంస్థల నిర్లక్ష్యం కారణంగా సగానికి పైగా పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక తనిఖీలను నిర్వహించేందుకు రవాణాశాఖ సన్నద్ధమవుతోంది. గ్రేటర్‌లోని స్కూళ్లు, కాలేజీలు, తదితర విద్యాసంస్థల యాజమాన్యాలతో రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ త్వరలో సమావేశం కానున్నారు. బస్సుల భద్రతపైన ఆయన స్వయంగా దిశానిర్దేశం చేస్తారని హైదరాబాద్ సంయుక్త రవాణా కమిషనర్ సి.రమేష్ తెలిపారు. నిర్ణీత గడువులోగా ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరుకాని బస్సులపైన కఠిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఆర్టీఏ లెక్కల ప్రకారం గ్రేటర్‌లోని మూడు జిల్లాల పరిధిలో మొత్తం 13,421 బడి బస్సులు ఉండగా, ఇప్పటి వరకు 6400 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. మరో 7021 బస్సులు పెండింగ్‌లో ఉన్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే బస్సులు జప్తు..

పిల్లలను భద్రంగా స్కూళ్లకు తీసుకెళ్లి, తిరిగి ఇంటికి తీసుకురావడంలో స్కూల్ బస్సుల నిర్వహణ ఎంతో కీలకమైంది. కానీ అనుభవం లేని డ్రైవర్ల పనితీరు, రాష్‌డ్రైవింగ్, బస్సుల నిర్వహణ వైఫల్యాలు, తదితర కారణాలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు డ్రైవర్‌లు వాహనాలు నడిపే సమయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతో పిల్లలు బస్సు చక్రాలంకింద నలిగిపోతున్నారు. దీంతో స్కూల్ బస్సుల నిర్వహణను రవాణాశాఖ సున్నితమైన అంశంగా గుర్తించి నిబంధనలను, ప్రమాణాలను రూపొందించింది. ఈ ప్రమాణాలను ఉల్లంఘించే బస్సులను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, పర్మిట్‌లు రద్దు చేయడంతో పాటు బస్సులను జప్తు చేయనున్నట్లు జేటీసీ రమేష్ హెచ్చరించారు.



ఈ నిబంధనలు తప్పనిసరి....

- బస్సు కేవలం పసుపు రంగులో ఉండాలి. విద్యార్థులు బస్సులోకి ఎక్కడం, దిగడం డ్రైవర్‌కు స్పష్టంగా కనిపించే విధంగా కన్వెక్స్ క్రాస్ వ్యూ అద్దాలు అమర్చాలి. బస్సులోపలి భాగంలో ఒక పెద్ద పారదర్శకమైన అద్దం ఏర్పాటు చేయాలి.
- బస్సు ఇంజిన్ కంపార్ట్‌మెంట్‌లో అగ్నిమాపక యంత్రం (ఫైర్ ఎక్స్‌టింగ్విషర్), పొడి అందుబాటులో ఉండాలి. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరి.
- పాఠశాల/కళాశాల పేరు, టెలిఫోన్ నంబర్, మొబైల్ నంబర్, పూర్తి చిరునామా బస్సుకు ఎడమ వైపున ముందుభాగంలో స్పష్టంగా రాయాలి.
- వాహనానికి నాలుగు వైపులా గాఢమైన పసుపు పచ్చని ఫ్లాషింగ్ లైట్లు పిల్లలు దిగేటప్పుడు, ఎక్కేటప్పుడు వెలుగుతూ ఉండాలి.
- వాహనానికి 'స్కూల్ బస్సు' లేదా 'కళాశాల బస్సు' అని నల్ల రంగులో కనీసం 100 ఎంఎం సైజు అక్షరాల్లో రాయాలి.
- బస్సు తలుపులు సురక్షితమైన లాకింగ్ సిస్టమ్‌తో ఉండాలి. సీటింగ్ సామర్థ్యం కంటే ఎక్కువ మందిని తీసుకెళ్లకూడదు.
- ఫుట్‌బోర్డుపై మొదటి మెట్టు 325 ఎం.ఎం. ఎత్తుకు మించకుండా ఉండాలి. అన్ని మెట్లు జారకుండా ఉండే లోహంతో అమర్చాలి.
- లోపలికి ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకొనేందుకు వీలుగా ముందరి తలుపు మెట్లకు సమాంతరంగా రెయిలింగ్ ఉండాలి.
- బస్సులో ప్రయాణించే విద్యార్థుల పేర్లు, తరగతులు,ఇళ్ల చిరునామాలు, ఎక్కాల్సిన, దిగాల్సిన వివరాలు విధిగా బస్సులో ఏర్పాటు చేయాలి.

ఏం చేద్దాం..?

సాగర్ అత్యవసర పంపింగ్‌పై సందిగ్ధం!

- 2.60 అడుగుల దూరంలో డెడ్‌స్టోరేజీ
- వరుస వర్షాలతో నీటిమట్టంపై ఆశలు
- పునరాలోచనలో పడిన జలమండలి

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి తాగునీరు సరఫరా చేసే నాగార్జున సాగర్ జలాశయం నుంచి అత్యవసర పంపింగ్‌పై జలమండలి సందిగ్ధంలో పడింది. ఒకవైపు ఎగువ భాగంలో వర్షాలు కురుస్తుండటం.. మరోవైపు సాగర్ నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరుతుండటంతో అత్యవసర పంపింగ్ ప్రారంభించాలా? వద్దా? అనే దానిపై పునరాలోచనలో పడింది. ముందస్తుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో ఈ సారి వర్షాభావ పరిస్థితులు ఉండబోవని పరిస్థితులు కనిపిస్తున్నాయి.


- నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, సోమవారం నాటికి 512.60 అడుగులకు చేరింది. డెడ్‌స్టోరేజీకి 2.60 అడుగుల దూరంలో ఉంది. జలాశయం నీటి మట్టం 510 అడుగులకు పడిపోతే అక్కంపల్లి రిజర్వాయర్‌లోకి గ్రావిటీ ద్వారా రావాల్సిన నీళ్లు తరలించే పరిస్థితి ఉండదు. ప్రస్తుతం సాగర్ జలాశయం అధిక భాగంలో నీరు తక్కువగా ఉండటంతో ఎగువ భాగం నుంచి వరద వచ్చినా నీటిమట్టం పెద్దగా పెరగదన్న వాదన ఇంజినీరింగ్ అధికారుల్లో ఉంది. జూన్, జూలై నెలల్లో వానలు సమృద్ధిగా కురిసినా ఎగువ భాగం నుంచి వరద నీరు సాగర్‌లో చేరి నీటి మట్టం పెరగడానికిదానికి ఆలస్యం కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.
- మరోవైపు కేఆర్ఎంబీ ఉత్తర్వుల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాల్వ ద్వారా రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున నాలుగు టీఎంసీల వరకు నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఇప్పటికే నాలుగు రోజులు నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌లో 510 అడుగులకు ఎగువన కేవలం 4.5 టీఎంసీలు మాత్రమే నీటి లభ్యత ఉంది. సాగర్‌లోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి పుట్టంగండి పంప్ హౌస్, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారానే నీటిని సేకరిస్తున్నారు. నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరుకుంటే మాత్రం కృష్ణాజలాల పంపింగ్ నిలిచిపోయి అత్యవసర పంపింగ్ ద్వారా నీటిని తోడాల్సిన పరిస్థితి ఉంటుంది.

రోజువారీగా ఇలా..

నాగార్జున సాగర్ నుంచి గ్రావిటీ ద్వారా మహానగర తాగునీటి అవసరాల కోసం రోజువారీగా 0.179 టీఎంసీల నీటిని తరలించి శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 132.50 టీఎంసీలు అందుబాటులో ఉంది. 131.66 టీఎంసీ వరకు నీటి లభ్యత ఉంటుంది. డెడ్‌స్టోరేజీ ఉన్నా.. 2.05 టీఎంసీలను నీటి వాడుకోవచ్చు.

అత్యవసర ఏర్పాట్లు పూర్తి..

నాగార్జున్ సాగర్ నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరితే అత్యవస పంపింగ్ కోసం జలమండలి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. మూడు ప్యాకేజీలో రూ.5.95 కోట్ల అంచనా వ్యయంతో భారీ మోటార్లు, పంపింగ్ కోసం ఏర్పాట్లు పూర్తి చేసింది. వాస్తవంగా ఇప్పటికే రెండు పర్యాయాలు అత్యవసర పంపింగ్ రన్ చేసింది. తొలిసారిగా 2017లో సాగర్ జలాశయంలో నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరడంతో అత్యవసర మోటార్లు ఏర్పాటు చేసి ఆ ఏడాది సెప్టెంబర్ వరకు నీటిని పంపింగ్ చేశారు. గతేడాది కూడా నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరడంతో అత్యవసర పంపింగ్ ఏర్పాటు చేసి ఆగస్టు చివరి నాటికి నీటిని తరలించారు. తాజాగా సాగర్ జలాశయం డెడ్‌స్టోరేజీకి చేరుతుండటంతో పంపింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధమైంది.



నాగార్జున సాగర్ (ఫైల్)

పేరుకే పార్కు!

ఎక్కడికక్కడ పేరుకుపోయిన సమస్యలు

ఆహ్లాదం పంచని అర్బన్ ఫారెస్టులు
- కరువైన కనీస మౌలిక సదుపాయాలు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని అభివృద్ధి పనులు
- సందర్శకుల ఆదరణకు నోచుకోని ఉద్యానాలు

అభివృద్ధికి నోచుకోని కందుకూరు మన్యం కంచె పార్కు



గేట్లు తెరుచుకోని షాద్‌నగర్ కమ్మదనం పార్కు



పట్టణ ఉద్యానాలు ఇలా..

ప్రాంతం	ఉద్యానం పేరు	విస్తీర్ణం (ఎకరాల్లో)
గుర్రంగూడ	సంజీవని పార్కు	464.99
శంషాబాద్	గొల్లూరు	867.00
మహేశ్వరం	మసీదుగడ్డ	445.00
చిల్కూరు	మృగవని పార్కు	1210.96
శంషాబాద్	పంచవటి	166.00
శంషాబాద్	గండిగూడ	108.03
మహేశ్వరం	తుమ్మలూరు	350.16
పెద్ద అంబర్‌పేట్	పెద్ద అంబర్‌పేట్ కలాన్	1080.45

అసంపూర్తి దశలో అంబర్‌పేట్ కలాన్ పార్కు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎటూ చూసినా ఎత్తయిన భవనాలు.. ఇరుకైన రోడ్లు.. అంతా కాంక్రీట్ మయం. వర్షపు నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేదు. వాహనాల రద్దీకి తోడు విపరీతమైన కాలుష్యం.. వెరసీ.. జనం స్వచ్ఛమైన గాలికి దూరమైన పరిస్థితి. ఈ విపత్కర స్థితి నుంచి విముక్తి కల్పించాలనే ఉద్దేశంతో హరితహారం కార్యక్రమంలో భాగంగా ఏటా కోటి మొక్కల చొప్పున నాటుతూ వస్తున్నారు. నగర వాసులకు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని పంచేందుకు ఔటర్ చుట్టూ ఉన్న ఫారెస్టులను అర్బన్ ఫారెస్టులుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. 21 వేల ఎకరాల విస్తీర్ణంలో 26 పట్టణ ఉద్యానాలను నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించి, ఆ మేరకు అటవీశాఖ, హెచ్ఎండీఏలకు బాధ్యతలను అప్పగించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటి వరకు చేపట్టిన పనులు పూర్తి కాకపోవడంతో సందర్శకుల ఆదరణకు నోచుకోలేకపోతున్నాయి. ఎటుచూసినా అర్బన్ ఫారెస్టులు ఎవరూ లేక వెలవెలబోతున్నాయి. గుర్రంగూడలోని సంజీవని, గండిపేట లేక్‌వ్యూ, కొత్వాల్‌గూడ ఎకో పార్కు మినహా మిగిలిన చోట్ల ఇప్పటికీ గేట్లు కూడా తెరుచుకోవడంలేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పనులు అసంపూర్తిగానే..

- కందుకూరు మండలం లేమూరులో 58.78 హెక్టార్లలో మన్యం కంచె పార్కు అభివృద్ధి కోసం రూ.24.9 కోట్ల అంచనాలు రూపొందించారు. ఇప్పటికీ లెవలింగ్ సహా ప్రహరీ, ప్రధాన గేటు పనులు పూర్తికాలేదు. బెంగళూరు జాతీయ రహదారిపై ఓఆర్ఆర్‌కు 30 కిలోమీటర్ల దూరంలోని షాద్‌నగర్ మండలం కమ్మదనంలో 32.82 హెక్టార్ల విస్తీర్ణంలో రూ.65.61 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన అర్బన్ ఫారెస్ట్ పార్కు అభివృద్ధి పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. తుక్కుగూడ సమీపంలోని సిరిగిరిపురంలో 102.39 హెక్టార్ల విస్తీర్ణంలో రూ.20.26 కోట్లతో అంచనాలతో చేపట్టిన అర్బన్ ఫారెస్ట్ పార్కు అభివృద్ధి పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి.
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడెం రెవెన్యూ పరిధిలో 437.25 హెక్టార్ల విస్తీర్ణంలో రూ.55.80 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన అంబర్‌పేట్ అర్బన్ కలాన్ పార్కు అభివృద్ధి పనులది ఇదే పరిస్థితి. మహేశ్వరం మండలం హర్షగూడ సమీపంలో 87.41 హెక్టార్ల విస్తీర్ణంలో రూ.25.24 కోట్ల అంచనా వ్యయంతో హెచ్ఎండీఏ ఈ పార్కును అభివృద్ధి చేసింది. ఓఆర్ఆర్ ఎగ్జిట్-14 (తుక్కుగూడ) నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పార్కుకు చేరుకోవచ్చు. కానీ ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. మహేశ్వరం మండలం నాగారం వద్ద 556.69 హెక్టార్లలోని అర్బన్ ఫారెస్ట్ పార్కు సహా 526 హెక్టార్ల విస్తీర్ణంలో రూ.8 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన శ్రీనగర్ పార్కు అసంపూర్తిగానే మిగిలిపోయింది.

పారదర్శకంగా దివ్యాంగుల ఎంపిక

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ ఉద్యోగాలకు దివ్యాంగ అభ్యర్థుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. హైదరాబాద్ జిల్లాలో దివ్యాంగులకు కేటాయించిన బ్యాక్‌లాగ్ పోస్టుల్లో 37 పోస్టులకు గాను 18 మందికి సోమవారం వివిధ కేటగిరీల్లో ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. 2018- 19 లో నోటిఫికేషన్ విడుదల చేయగా వివిధ కారణాలతో నియామక ప్రక్రియ పూర్తి కాలేదని కలెక్టర్ తెలిపారు. 37 ఉద్యోగాలకు గాను 18 మాత్రమే ప్రస్తుతం ఖాళీలుగా గుర్తించి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్‌లు ముకుంద రెడ్డి, కదిరవన్ పలని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల క్యాబ్‌పై ఆగంతకుల దాడి

బంజారాహిల్స్: మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను తీసుకెళుతున్న క్యాబ్‌ను ముగ్గురు ఆగంతకులు మద్యం మత్తులో దారికాసి అడ్డగించి బెదిరించిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లో ఉంటున్న నలుగురు యువతులు కోకాపేటలోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున వీరు విధులు ముగించుకుని సంస్థ కేటాయించిన క్యాబ్‌లో ఇంటికి బయలుదేరారు. రోడ్డు నెంబర్-12 మీదుగా వీరు వెళ్తున్న కారును మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులు అడ్డగించి కారు అద్దాలను పగులగొట్టారు. కారు తాళాలు లాక్కున్నారు. తాము క్రిమినల్స్‌మని, అటాక్ చేస్తామని బెదిరించారు. ఈ విషయం పోలీసులకు చెబితే అంతుచూస్తామని హెచ్చరించారు. వీరి బారి నుంచి తప్పించుకున్న బాధితులు నేరుగా బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఇక్కడి సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

ఆశ్రయం ఇచ్చిన వ్యక్తిపై దాడి...

బంజారాహిల్స్: తనతో పాటు పనిచేస్తున్న వివాహిత ఇంటికి వెళ్లిన ఓ వ్యక్తిని సదరు మహిళ భర్త కుటుంబ సభ్యులు చితకబాది గొలుసు లాక్కున్న సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఉప్పల్ శ్రీనివాసాకాలనీకి చెందిన ఆర్య జయచంద్రకు ఐదేళ్ల క్రితం బంజారాహిల్స్ రోడ్డునెంబర్-7లోని ఓ వివాహితతో పరిచయం ఏర్పడింది. భర్తతో విబేధాల నేపథ్యంలో కుమార్తె, తల్లితో కలిసి వేరుగా ఉంటోంది. వారి ఆలనా పాలనా ఆర్య జయచంద్ర చూసేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం సదరు మహిళ కుమార్తె జయచంద్రకు ఫోన్ చేసి ఇంటికి రావాలని చెప్పింది. జయచంద్ర అక్కడికి వెళ్లిన కొద్ది సేపటికే సదరు మహిళ తరపు బంధువులు ఏడుగురు వచ్చి అతడిని చితకబాదారు. అడ్డువచ్చిన మహిళతో పాటు, ఆమె తల్లి, కుమార్తెపై కూడా దాడి చేశారు. జయచంద్ర సెల్‌ఫోన్, బైక్ ధ్వంసం చేశారు. మెడలో ఉన్న గొలుసు లాక్కున్నారు. ఘటనకు కారకులపైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు ఫిర్యాదు చేయడంతో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గత కొంతకాలంగా అతను దూద్‌ఖానాబస్తీలోని మహిళ ఇంటికి వస్తూ ఇక్కడే ఎక్కువ కాలం గడుపుతుండటంతో ఆగ్రహించిన ఆమె భర్త తరపు కుటుంబ సభ్యులు ఈ గుట్టు రట్టు చేసేందుకే ఈ దాడికి పాల్పడినట్లుగా తేలింది.

లైక్‌లు కొట్టిస్తారు.. జేబులు ఖాళీ చేస్తారు!

సినిమా రేటింగ్స్ పేరిట యువతకు వల

- సోషల్ మీడియాలో కేటుగాళ్ల ప్రచారం
- వ్యక్తిగత వివరాలతో నిండా ముంచేస్తున్న నేరస్తులు
- గుర్తుతెలియని సామాజిక మాధ్యమాల్లో చేరొద్దని పోలీసుల సూచన



సాక్షి, సిటీబ్యూరో: 'కల్కి' సినిమాకు రేటింగ్ ఇవ్వండి. రోజుకు రూ.500 సంపాదించుకోండి' అంటూ నగేష్ అనే వ్యక్తికి సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్టు కనిపించింది. దీంతో ఆశపడిన నగేష్ అందులోని నంబర్‌కు ఫోన్ చేశాడు. అటువైపు కేటుగాళ్లు రేటింగ్ సొమ్మును జమ చేసేందుకు బ్యాంక్ ఖాతా నంబరు, సీవీవీ ఇతరత్రా వ్యక్తిగత వివరాలు అడిగే సరికి ఇచ్చేశాడు. అంతే చూస్తుండగానే క్షణాల్లోనే నగేష్ ఖాతాలో నుంచి నగదు గల్లంతైంది.

◆ ఇలా సినిమా రేటింగ్స్ పేరుతో సైబర్ నేరస్తులు యువతీ యువకులకు వల వేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే సందేశాలకు స్పందిస్తే నిండా మునిగినట్టే అంటున్నారు పోలీసులు. సినిమా రేటింగ్ ఇస్తూ ఇంట్లోనే ఉంటూ డబ్బు సంపాదించవచ్చంటూ నమ్మిస్తారు. ఆపై మీ బ్యాంకు ఖాతా వివరాలతో మిమ్మల్నే నిండా ముంచేస్తారని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ముందు నమ్మించి..

ముందుగా కొన్ని సినిమాల పేర్లు పంపించి వాటికి రివ్యూ ఇవ్వగానే ప్రత్యేక వ్యాలెట్‌లో కొంత డబ్బు జమ చేస్తారు. కొంత నమ్మకం కుదిరేవరకూ మనం డబ్బు డ్రా చేసే అవకాశం ఇస్తారు. ఆ తర్వాత ఎక్కు వ సినిమాలకు రేటింగ్ ఇవ్వాలంటే కొంత డబ్బు చెల్లించాలని సొమ్ము వసూలు చేస్తారు. ఇంట్లో ఉంటూనే సంపాదన అంటూ సామాజిక మాధ్యమాల్లో క్రెడిట్, డెబిట్ కార్డు ఓటీపీ పేరుతో వచ్చే అప్రమత్తంగా ఉండాలి. మన ప్రమేయం లేకుండా ఏవైనా టెలి గ్రామ్ గ్రూపుల్లో చేరిస్తే వైదొలగాలి.

సోషల్ గ్రూప్‌లో చేరొద్దు..

సైబర్ నేరస్తులు సూచించిన సినిమాలకు రేటింగ్ ఇవ్వాలంటూ వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలలో సందేశాలు పంపిస్తారు. ఆయా మెసేజ్‌లో రేటింగ్‌ను బట్టి కమీషన్, ఎన్ని రోజుల్లో ఎంత సంపాదన వస్తుందో వివరంగా ఉంటుంది. ఈ లింకును క్లిక్ చేయగానే ఆటోమేటిక్‌గా సైబర్ నేరగాళ్లు ఏర్పాటు చేసిన గ్రూపులో చేరుతారు.

రూ. 1.26 కోట్ల విలువైన గంజాయి దహనం

సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్‌శాఖ హైదరాబాద్ డివిజన్ పరిధిలోని తొమ్మిది స్టేషన్ల పరిధిలో స్వాధీనం చేసుకున్న గంజాయి, డ్రగ్స్‌ను అధికారులు సోమవారం దహనం చేశారు. మొత్తం 102 కేసుల్లో సుమారు రూ.1.26 కోట్ల విలువైన గంజాయి, డ్రగ్స్‌ను అధికారులు పట్టుకున్నారు.171.34 కేజీల గంజాయి, 21.03 కేజీల గంజాయి చాక్లెట్లు, 20 కేజీల కుల్ఫీ, 320.6 గ్రాముల హషీష్ అయిల్, 51 గ్రాముల ఓజీ కుష్, 17.66 గ్రాముల ఎండీఎంఏ,12. గ్రాముల కొకైన్‌లను దహనం చేసినట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ కే.ఎ.బీ శాస్త్రీ అదేశాల మేరకు అమీర్‌పేట్, ధూల్‌పేట్, గొల్కొండ, జూబ్లీహిల్స్, కాచిగూడ, మలక్‌పేట్, ముషీరాబాద్, నారాయణగూడ, సికింద్రాబాద్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను దహనం చేసినట్లు వారు వివరించారు.

గంజాయి పట్టివేత...

ధూల్‌పేట్, అమీర్‌పేట్‌లలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి గంజాయి, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ధూల్‌పేట్‌లోని సోనియాబాయి ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 1.16 కిలోల గంజాయి లభించింది. ఆమెతో పాటు, సతీష్‌పాల్‌సింగ్ ఆలియాస్ సతీష్ పై కేసు నమోదు చేశారు.అమీర్‌పేట్‌లో 6 ఎల్ఎస్‌డీ బాస్ట్స్, 2 ఎల్ట్స్‌టీపీల్స్‌ను పట్టుకున్నారు. ఈ కేసులో శోభన్, ప్రజ్ఞ అనే వ్యక్తులను అరెస్టు చేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

రూ.9.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితుడు

అబిడ్స్: బంగారు ఆభరణాల చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన గోషామహల్ పోలీసులు అతడి నుంచి రూ.9.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. గోషామహల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకట్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 21న చుడిబజార్‌కు చెందిన శశిధర్ తమ ఇంటికి తాళం వేసి తాళం చెవి అక్కడే మరిచిపోయాడు. మర్నాడు ఇంటికి వచ్చి చూడగా అల్మారాలో ఉన్న బంగారు నగలు కనిపించకపోవడంతో గోషామహల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. అతడి ఇంటి కిందే ఉంటున్న నాగేష్ గౌడ్ ఇంట్లోకి వెళ్లి బంగారు ఆభరణాలు తస్కరించినట్లు గుర్తించారు. ఆదివారం నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతడి నుంచి రెండు నెక్లెస్‌లు, మంగళసూత్రం, ఇతర బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించడంలో చొరవ చూపిన ఈఎస్ఐ జగదీశ్వర్‌రావు, పోలీసు సిబ్బంది ప్రశాంత్‌కుమార్, కిరణ్‌కుమార్, మనీష్ యాదవ్‌లను గోషామహల్ డివిజన్ ఏసీపీ సుదర్శన్, సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ చంద్రమోహన్ అభినందించారు.

తల్లి మందలించిందని...

బాలుడి ఆత్మహత్య



రిషి (ఫైల్)

సైదాబాద్: చదువుకోకుండా టీవీ, మొబైల్ ఫోన్ చూస్తుండటంతో తల్లి మందలించినందుకు మనస్తాపానికి లోనైన ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఐఎస్‌సదన్ డివిజన్, రాధే రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వెంకటయ్య, సుజాత దంపతులు అదే అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ముగ్గురు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నారు. వారి పెద్ద కుమారుడు రిషి (16) ఇటీవల 10 తరగతి ఫెయిల్ అయ్యాడు. తల్లిదండ్రులు అతనికి ధైర్యం చెప్పి సప్లిమెంటరీకి సిద్ధం కావాలని ట్యూషన్‌లో చేర్పించారు. అయితే గత మూడు రోజులుగా అతను టీవీ చూడటం , మొబైల్ ఫోన్‌లో ఆటలాడుతుండటంతో తల్లి అతడిని మందలించింది. పరీక్షల కోసం చదువుకోవాలని చెప్పింది. దీంతో మనస్తాపానికి లోనైన రిషి సోమవారం మధ్యాహ్నం అపార్ట్‌మెంట్ టెర్రస్‌కు ఉన్న ఇనుప మెట్లకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాలుడి తల్లి సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సైదాబాద్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డుకునేందుకు వెళితే హత్య చేశాడు..

- బార్‌లో యువకుల వీరంగం
- బీరు సీసాలతో దాడి
- అడ్డుకునేందుకు వెళ్లిన యువకుడి మృతి



పవన్ కుమార్ (ఫైల్)

ఉప్పల్: బార్‌లో మద్యం సేవిస్తున్న యువకుల మధ్య జరిగిన గొడవ ఓ అమాయకుడి ప్రాణాలు తీసింది. పక్క పక్క టేబుళ్లలో మద్యం సేవిస్తున్న యువకుల మధ్య వివాదం చెలరేగడంతో అడ్డుకోబోయిన యువకుడి తలపై బీరు సీసాతో దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్ కర్నూల్ జిల్లా, తిమ్మాజి పేట గ్రామానికి చెందిన భాస్కర్ నగరానికి వలసవచ్చి అంబర్‌పేట్, బాపూజీ నగర్‌లో నివాసం ఉంటూ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడి కుమారుడు పవన్(26) డిగ్రీ పూర్తి చేసి ఖాళీగా ఉంటున్నాడు. ఆదివారం రాత్రి అతను తన స్నేహితుడు రిషికేష్‌తో కలిసి రామంతాపూర్‌లోని గుడ్ డే బార్‌కు వెళ్లాడు. మద్యం సేవిస్తుండగా పక్క టేబుల్‌లో కూర్చున్న అంబర్‌పేట, పటేల్ నగర్ ప్రాంతానికి చెందిన శ్రావణ్ కుమార్ గౌడ్ హరికృష్ణ అనే వ్యక్తితో గొడవ పడి అతడిపై బీరు సీసాతో దాడి చేయడంతో అతడికి గాయాలయ్యాయి. పక్కనే ఉన్న పవన్ కుమార్ దీనిని అడ్డుకునేందుకు యత్నించడంతో శ్రావణ్ కుమార్ బీరు సీసాతో పవన్ తలపై బలంగా మోదాడు. దీంతో తీవ్రంగా గాయపడిన పవన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందడంతో ఉప్పల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. పవన్ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ అసుపత్రికి తరలించారు. దాదాపు అరగంట పాటు బార్‌లో గొడవ జరుగుతున్నా నిర్వాహకులు అడ్డుకోకపోవడమేగాక, పోలీసులకు సమాచారం అందించనందునే తన కుమారుడు మృతి చెందాడని మృతుడి తండ్రి భాస్కర్ ఆరోపిస్తున్నాడు. బార్ నిర్వాహకులతో పాటు తన కుమారుడిని హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

సీసీ కెమెరాలు పట్టించాయి

- రోడ్డు ప్రమాదానికి కారకుడైన వ్యక్తి అరెస్ట్
- తానే కారు నడిపినట్లు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మరో వ్యక్తి
- సీసీ ఫుటేజీతో నిజం వెలుగులోకి..



ప్రమాదానికి కారణమైన కారు

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు నడుపుతూ ప్రమాదానికి కారకుడైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... అంబర్‌పేట డీడీ కాలనీకి చెందిన శిరీష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి కోకాపేటలోని స్నేహితుడితో కలిసి విందుకు హాజరైన అతను మద్యం సేవించాడు. ఆదివారం తెల్లవారుజామున కోకాపేట నుంచి ఇంటికి వెళుతుండగా జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-45లోని సినీ హీరో బాలకృష్ణ ఇంటి వద్ద మలుపు తిప్పే క్రమంలో మద్యం మత్తులో డివైడర్‌ను ఢీకొట్టాడు. బెలూన్లు ఓపెన్ కావడంతో కారు నడుపుతున్న శిరీష్ క్షేమంగా బయటపడ్డాడు. అయితే పోలీసులు కేసు పెడతారనే భయంతో కారును అక్కడే వదిలేసి పరారయ్యాడు. నెంబర్ ప్లేట్ ఆధారంగా జూబ్లీహిల్స్ పోలీసులు కారు వివరాలను ఆరా తీయగా డి.కృష్ణశాస్త్రి అనే పేరుతో ఉన్నట్లు గుర్తించారు. దీని ఆధారంగా పరారీలో ఉన్న కారు నడిపిన వ్యక్తి కోసం గాలిస్తుండగా సోమవారం ఉదయం ఓ వ్యక్తి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కారు తానే నడిపినట్లు చెప్పాడు. అయితే అప్పటికే సీసీ కెమెరాలను పరిశీలించిన జూబ్లీహిల్స్ పోలీసులు ప్రమాదానికి కారకుడైన కారు నడుపుతున్న వ్యక్తికి, పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయిన వ్యక్తికి తేడా ఉండటంతో లోతుగా దర్యాప్తు చేపట్టారు. దీంతో అసలు నిందితుడు బయటపడ్డాడు. కారు నడుపుతున్న వ్యక్తిని గాలించి అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకువచ్చారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా ఒక రోజు గడిచిన తర్వాత కూడా మద్యం సేవించిన ఆనవాళ్లు బయటపడ్డాయి. ఈ మేరకు శిరీష్‌తో పాటు కారు తానే నడిపానంటూ అబద్ధం ఆడిన వ్యక్తిపై కూడా పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరినీ అరెస్టు చేశారు. తాను మద్యం సేవించి తెల్లవారుజామున ఇంటికి బయలుదేరానని అంగీకరించిన శిరీష్ అరెస్టు చేస్తారనే భయంతో తన స్థానంలో మరొకరిని పోలీస్‌స్టేషన్‌కు పంపినట్లు తెలిపాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు అసలు నిందితుడిని గుర్తించి అరెస్టు చేయగలిగారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కన్నప్ప చిత్రం హార్డ్‌డ్రైవ్‌తో యువతి పరార్

- పోలీసులకు ఫిర్యాదు
- కేసు నమోదు

ఫిలింనగర్: మంచు విష్ణు హీరోగా నటిస్తున్న కన్నప్ప మూవీకి సంబంధించిన విలువైన సమాచారంతో కూడిన హార్డ్ డ్రైవ్ మాయమైన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముంబైకి చెందిన వీఎఫ్ఎక్స్ విక్రేతల్లో ఒకరు (హైవ్ స్టూడియోస్) కన్నప్ప సినిమాకు సంబంధించిన కీలకమైన డేటాతో కూడిన హార్డ్ డ్రైవ్‌ను డీటీడీసీ కొరియర్ ద్వారా ఫిలింనగర్‌లోని ట్వంటీ ఫోర్ ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయానికి పంపించారు. డీటీడీసీ డెలివెరీ రికార్డుల ప్రకారం పార్శిల్ ఈ నెల 25న కార్యాలయానికి చేరుకుంది. పార్శిల్ అందుకున్న ఆఫీస్‌బాయ్ రఘు దానిని చరిత అనే యువతికి అప్పగించాడు. కార్యాలయ సిబ్బంది క్రాంతి హార్డ్‌డ్రైవ్ విషయమై రఘును ప్రశ్నించగా తాను చరితకు ఇచ్చినట్లు చెప్పాడు. అయితే చరిత హార్డ్‌డ్రైవ్ తీసుకున్నప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతోంది. కొందరు వ్యక్తుల మార్గదర్శకత్వంలో పని చేస్తున్న చరిత సినిమా ప్రాజెక్టుకు నష్టం కలిగించాలనే ఉద్దేశంతోనే కనిపించకుండా పోయిందంటూ ట్వంటీ ఫోర్ ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన రెడ్డి విజయ్ కుమార్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కారణంగా తమ సినిమా ప్రాజెక్టుకు తీవ్ర అంతరాయం కలిగించిందన్నారు. సదరు హార్డ్‌డ్రైవ్‌లో కన్నప్ప చిత్రానికి సంబంధించి విడుదల చేయని, గోప్యమైన, అత్యంత సున్నితమైన డేటా ఉందన్నారు. ఈ కంటెంట్‌ను లీక్ చేయడం లేదా, డిలీట్ చేయడం ద్వారా తమ సంస్థ ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతింటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే హార్డ్‌డ్రైవ్‌ను రికవరీ చేసి తమకు అప్పగించాలని కోరారు.

అసలైన ఐఎన్‌టీయూసీ మాదే: కృష్ణమూర్తి



హిమాయత్‌నగర్: అసలైన ఐఎన్‌టీయూసీ తమదేనని ఐఎన్‌టీయూసీ(ఆర్) జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి అన్నారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఐఎన్‌టీయూసీ(ఆర్) రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఆ యూనియన్ రాష్ట్ర మహాసభలో ఆయన మాట్లాడారు. కార్మికవర్గ ప్రయోజనాలను విస్మరిస్తూ భౌతికదాడులు చేస్తూ యూనియన్‌పై పెత్తనం చేసేందుకు ఎవరు ప్రయత్నించినా సహించబోమన్నారు. ఐఎన్‌టీయూసీ(ఆర్) నాయకులపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని, కార్మికుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ ఐఎన్‌టీయూసీ(ఆర్)ని బలమైన శక్తిగా తయారు చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని విమర్శించిన కనీస వేతనాల కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్ ముఠాకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు జి.సంజీవ్‌రెడ్డి ఎప్పుడూ తమ విషయంలో జోక్యం చేసుకోలేదని, కానీ, జనక్ ప్రసాద్ ముఠా ఇతర సంఘాలతో కలిసి బద్నామ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోళ్ల వ్యాపారం చేసుకుంటూ కోట్లకు పడగలెత్తడమే కాకుండా పౌల్ట్రీ ఫారంలోని కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వని జనక్‌ప్రసాద్‌కు కనీస వేతనాల బోర్డ్ చైర్మన్‌గా పనిచేసే అర్హత లేదన్నారు. మహాసభలో ఐఎన్‌టీయూసీ(ఆర్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ అయిలయ్య, జాతీయ కార్యదర్శి బి.అమర్ బాబు, జాతీయ ఉపాధ్యక్షులు సత్యదేవ్, మనోజ్ భట్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, ట్రేడ్ యూనియన్ నాయకులు గొల్లపల్లి దయానంద్, నడిమింటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మణికొండ: గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేట ఎగ్జిట్ వద్ద సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కోకాపేట సెక్టార్ ఎస్ఐ మురళీధర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కోకాపేట ఎగ్జిట్ వద్ద ఓ వ్యక్తి రోడ్డుపై గాయాలతో పడి ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అతడిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టినట్లు గుర్తించారు. అతని వివరాలు తెలియకపోవటంతో మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

చెట్టు పైనుంచి పడి యువకుడి మృతి



యువకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అల్వాల్: చెట్టు పైనుంచి పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్ఐ కిషన్‌నాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రీన్‌ఫీల్డ్ కాలనీకి చెందిన జగన్మోహన్‌రావు ఇంటి వద్ద ఉన్న అల్లనేరేడు చెట్టు కింద సోమవారం గుర్తు తెలియని యువకుడు పడి ఉన్నాడు. దీనిని గుర్తించిన జగన్మోహన్‌రావు అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు ఉన్నాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. నేరేడు పండ్ల కోసం చెట్టు ఎక్కి ఉండవచ్చునని ప్రమాదవశాత్తు కొమ్మ విరగడంతో కిందపడి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి అనుమానాస్పద మృతి

కుత్బుల్లాపూర్: ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం దూలపల్లి వీకర్ సెక్షన్ కాలనీలో చింతల అశోక్ అనే వ్యక్తి కుమారుడి పెళ్లి వేడుక జరుగుతోంది. అదే సమయంలో వారి పక్కింట్లో ఉంటున్న రామ్ ఉత్తం రాథోడ్ కుమారుడు అరుష్ రాథోడ్ (09) ఇంటి ముందు ఆడుకుంటూ ఒక్కసారిగా కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు అతడిని సూరారం మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా సదరు బాలుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెంది ఉండవచ్చునని స్థానికులు ఆరోపిస్తున్నారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్యాన్స్ మాస్టర్ ఆత్మహత్య



సాగర్ (ఫైల్)

మియాపూర్: కుటుంబ సమస్యలతో పాటు ప్రేమ విఫలమై ఓ డ్యాన్స్ మాస్టర్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఉత్తర్ ప్రదేశ్ కైలాసపూరికి చెందిన సాగర్ కుమార్ (17) ఇంటర్ వరకు చదువుకున్నాడు. కొన్నాళ్ల క్రితం నగరానికి వలస వచ్చిన అతను మియాపూర్‌లోని గ్లోకుల్ ప్లాట్స్‌ని డెలయిట్ డాన్స్ స్టూడియోలో డ్యాన్స్ మాస్టర్‌గా పని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఈ నెల 25న రాత్రి స్టూడియో మూసివేసిన తర్వాత స్టూడియో యజమాని పరమేష్ అతడికి ఫోన్ చేసి స్టూడియో డోర్లను లాక్ చేయాలని సూచించాడు. సోమవారం మధ్యాహ్నం యజమాని పరమేష్ స్టూడియోకు వెళ్లి చూడగా సాగర్ కుమార్ ఓ గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సాగర్ కుమార్ స్టూడియోకు వచ్చినప్పటి నుంచి బాధపడుతూ ఉండేవాడని పది రోజుల క్రితం స్టూడియో యజమాని వంగాల పరమేష్ ఈ విషయమై అతడిని ప్రశ్నించగా కుటుంబ సమస్యలు ఉన్నాయని, ఓ అమ్మాయిని ప్రేమించి విఫలమైనట్లు తెలిపాడన్నారు. స్టూడియో యజమాని పరమేష్ ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని మోసం చేసి విదేశాలకు..

ఎయిర్ పోర్టులో నిందితుడి అరెస్టు

అమీర్‌పేట: ఓ యువతిని ప్రేమించానని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి విదేశాలకు పారిపోయిన యువకుడిని సోమవారం పోలీసులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేశారు. ఎస్ఆర్‌నగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అమీర్‌పేటకు చెందిన యువతికి బెంగళూరులో ఓ శశాంక్ వేలూరి అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో ఇద్దరూ కలిసి డేటింగ్ చేశారు. ఆ తర్వాత ఉన్నత చదువుల నిమిత్తం యూకే వెళ్తున్నానని, కొన్నాళ్ల తర్వాత నిన్ను కూడా తీసుకెళ్తానని ప్రియురాలికి మాటిచ్చాడు. విదేశాలకు వెళ్లిన తార్వత ఆమె సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేసి ఆమెను దూరం పెడుతున్నాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు 2023 డిసెంబర్ 30న ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. సోమవారం అతను యూకే నుంచి వస్తున్నట్లు సమాచారం అందడంతో శంషాబాద్ ఎయిర్ పోర్టులో నిందితుడు శశాంక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 17, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీ మిర్చి 35, క్యాప్సికం 45, పచ్చికాకరకాయ 45, పందిరిబీర 40, క్యాబేజీ 13, క్యారెట్‌ 35, దొండకాయ 16, గుండు బీన్స్‌ 105, గింజచిక్కుడు 65, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్‌ 17, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 19, కందగడ్డ 65, క్యాలీఫ్లవర్‌ 23, సొరకాయ 9, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 4, మామిడికాయ 40, ముల్లంగి 4–5, ఉల్లిపొరక రూ. 45 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సీసీ కెమెరాల అందజేత



సీసీ కెమెరాలు అందజేస్తున్న మేయర్‌

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–12లోని ఎన్‌బీటీనగర్‌ బస్తీలో బడులు, గుడులు, దవాఖానాలకు గ్రేటర్‌ మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి సీసీ కెమెరాలను పంపిణీ చేశారు. బస్తీలోని ప్రభుత్వ పాఠశాల, పోచమ్మ గుడి, బస్తీ దవాఖానాలకు సోమవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కెమెరాలను అందజేశారు.

మహిళలకు అండగా కాంగ్రెస్‌ ప్రభుత్వం



చెక్కులను అందజేస్తున్న కార్పొరేటర్‌ సీఎన్‌ రెడ్డి

రహమత్‌నగర్‌: పేద మహిళల జీవితాల్లో షాదీ ముబారక్‌, కల్యాణలక్ష్మి పథకాలు వెలుగులు నింపుతున్నాయని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌ కమిటీ సభ్యుడు, రహమత్‌నగర్‌ కార్పొరేటర్‌ సి.ఎన్‌. రెడ్డి, నగర కాంగ్రెస్‌ నాయకురాలు హబీబా సుల్తానా అన్నారు. రహమత్‌నగర్‌, బోరబండ డివిజన్‌లకు చెందిన 280 మంది లబ్ధిదారులకు సోమవారం వారు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖైరతాబాద్‌ తహసీల్దార్‌ నయిముద్దీన్‌ పాల్గొన్నారు.

కారును ఢీకొన్న బైక్‌: యువకుడికి గాయాలు

వెంగళరావునగర్‌: పార్కింగ్‌ చేసిన కారును ఓ ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కారు డ్యామేజ్‌ అయిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... మల్కాజ్‌గిరికి చెందిన డి.సంతోష్‌ ఆదివారం మధ్యాహ్నం 12.30కు కృష్ణకాంత్‌పార్క్‌ వద్ద కారు పార్క్‌ చేసి, సాయంత్రం తిరిగి తన వాహనం వద్దకు వచ్చాడు. ఈ సమయంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం వెనుక నుంచి వచ్చి కారును ఢీ కొంది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనదారునికి దెబ్బలు తగిలాయి. స్థానికులు 108 పిలిపించి యువకుడిని ఆస్పత్రికి తరలించారు. తన కారును డ్యామేజ్‌ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సంతోష్‌ మధురానగర్‌ పీఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రుణం ఇప్పిస్తామంటూ రూ.50 వేలు టోకరా

అమీర్‌పేట: ఆన్‌లైన్‌లో పరిచయమైన ఇద్దరు వ్యక్తులు రుణం ఇప్పిస్తామని చెప్పి ఓ మహిళ వద్ద రూ.50వేలకు టోకరా వేశారు. ఎస్‌ఆర్‌నగర్‌ పోలీసులు తెలిపిన మేరకు.. బేగంపేట పోలీస్‌లైన్‌గస్‌ బజార్‌కు చెందిన శ్రీ థెరిస్సా డిక్రుజ్‌ రూ.50 లక్షల రుణం అవసరం పడటంతో రుణం కోసం ఆన్‌లైన్‌లో సర్చ్‌ చేసింది. జడ్డారెడ్డి అనే వ్యక్తి పరిచయమై రుణం ఇప్పిస్తానని చెప్పాడు. రుణం పొందాలంటే కొన్ని పత్రాలు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పి దాస్‌ అనే వ్యక్తితో కలిసి మహిళ ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఉన్న పత్రాలతో పాటు ఆమెను వెంట తీసుకుని అమీర్‌పేటకు వచ్చారు. హరి దోశ హోటల్‌ వద్ద ప్రాసెసింగ్‌ కోసం రూ.50 వేలు కావాలని అడుగడంతో డబ్బులు ఇచ్చింది. తర్వాత ఎన్ని సార్లు ఫోన్‌ చేసినా స్విఛాఫ్‌ చేసి ఉండటంతో మోస పోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తింపు లేని జూనియర్‌ కాలేజీల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: గుర్తింపు లేని జూనియర్‌ కాలేజీల్లో ప్రవేశాలపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ప్రైవేటు, కార్పొరేట్‌ కాలేజీలకు గుర్తింపు లేకున్నా ఇష్టారాజ్యాంగా వ్యవరిస్తూ ఇంటర్‌ బోర్డు అనుమతి రాక ముందు మోసపూరిత ప్రకటనలతో విద్యార్థులను చేర్చుకుంటున్నారని ధ్వజమెత్తారు.

మూడు రోజుల్లో శుభ్రంగా..!

- పరిశుభ్ర వాతావరణం సాధనే లక్ష్యం
- దోమలు, ఈగలు లేని ప్రాంతాలుగా తీర్చిదిద్దే చర్యలు
- రోగాలు ప్రబలకుండా పటిష్ట చర్యలు

ప్రీమాన్సూన్‌ స్పెషల్‌ శానిటేషన్‌ డ్రైవ్‌ ప్రారంభం



ఎన్బీటీ నగర్‌లో నిర్మాణ వ్యర్థాలు తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్‌: నెలల తరబడి పేరుకుపోయిన వ్యర్థాలు... జీహెచ్‌ఎంసీ, విద్యుత్‌, జలమండలి, కేబుల్‌ కనెక్షన్ల కోసం తవ్వకాల్లో వెల్లడైన నిర్మాణ వ్యర్థాలు అన్నీ కూడా మూడే.. మూడు రోజుల్లో తరలించేలా అధికారులు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. ప్రీ మాన్సూన్‌ స్పెషల్‌ శానిటేషన్‌ డ్రైవ్‌ పేరుతో అధికారులు సోమవారం బంజారాహిల్స్‌ డివిజన్‌లో కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. ఈ కార్యక్రమాన్ని నగర మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన డివిజన్‌లో ఆ సర్కిల్‌ పరిధిలోని జలమండలి, జీహెచ్‌ఎంసీ, ఎలక్ట్రిసిటీ, శానిటేషన్‌, యూబీడీ, యూసీడీ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు డివిజన్‌లోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో చెత్తను తరలించడంతో పాటు పేరుకుపోయిన మట్టి కుప్పలు, పరిష్కారం కాని సమస్యలకు పరిష్కార మార్గాలను చూపిస్తారు. వెలగని వీధి లైట్లను కూడా ఈ స్పెషల్‌ డ్రైవ్‌లో గుర్తించి బాగు చేస్తారు లేదంటూ వాటి స్థానంలో కొత్తవి మారుస్తారు. ఓపెన్‌ గార్బేజీ పాయింట్ల వద్ద గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను తరలిస్తూనే మరో వైపు ఇంటింటికి తిరుగుతూ చెత్తను చెత్త సేకరించే వాహనాలకు మాత్రమే ఇవ్వాలని ప్రచారం చేస్తారు. గుంతలు తేలిన రహదారులకు ఇంజనీరింగ్‌ అధికారులు మరమ్మతులు చేస్తారు. ఎంటమాలజీ విభాగం అధికారులు దోమల మందును పిచికారీ చేస్తారు. మొత్తంగా మూడు రోజుల్లోనే ప్రభుత్వం యంత్రాంగం మొత్తం డివిజన్‌లో పర్యటనూ మెజార్టీ సమస్యలకు పరిష్కారం చూపుతారు.

ఒకేసారి వంద మంది స్వీపర్లు

ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటల వరకు స్వీపర్లు వారి వారి స్థానాల్లో విధులు ముగించుకొని అధికారులు సూచించిన ప్రాంతాలకు రావాల్సి ఉంటుంది. ఒకేసారి సర్కిల్‌ పరిధిలోని 100 మందికి పైగా స్వీపర్లు నిర్ధేశించిన ప్రాంతాల్లో స్వీపింగ్‌ చేసి చెత్తను తరలిస్తారు. చెత్తను తరలించేందుకు రాంకీ సంస్థకు చెందిన ఆరు వాహనాలు, నిర్మాణ వ్యర్థాలు తరలించేందుకు మూడు ప్రత్యేక వాహనాలతో పాటు ఒక జేసీబీ, ఒక జేసీబీని అధికారులు అందుబాటులో ఉంచుతున్నారు. మూడు రోజులు పాటు ఈ వాహనాలు ఇక్కడే అందుబాటులో ఉండి చెత్తను, నిర్మాణ వ్యర్థాలను తరలిస్తాయి.

అలసత్వం వహించొద్దు



చెత్తను తరలించే విషయంలో రాంకీ సంస్థ నిర్లక్ష్యం వహిస్తున్నది. చాలా సార్లు సమయానికి చెత్త తరలించేందుకు వాహనలను పంపించకపోవడంతో బస్తీల్లో, కాలనీల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. సంస్థ ప్రతినిధులు చెత్త తరలింపులో నిర్లక్ష్యం చేయొద్దు. ఈ మాన్‌సూన్‌ శానిటేషన్‌ డ్రైవ్‌ను ప్రజలు వినియోగించుకొని పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తరలించుకోవాలి.

– గద్వాల్‌ విజయలక్ష్మి, నగర మేయర్‌

ఒక్కో కిలోమీటర్‌కు 14 మంది



ఈ మాన్‌సూన్‌ శానిటేషన్‌ డ్రైవ్‌లో భాగంగా ఒక కిలోమీటర్‌కు 14 మంది సిబ్బంది పనులు చేస్తారు. వీరు ఇప్పటికే గుర్తించిను చెత్తా చెదారంతో పాటు నిర్మాణ వ్యర్థాలను కనిపించకుండా కేటాయించిన వాహనాల్లో తరలిస్తారు. బస్తీవాసులు, కాలనీవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని వారి వారి ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తరలించేలా అధికారులకు సమాచారం ఇవ్వాలి.

– రఘు ప్రసాద్‌, అసిస్టెంట్‌ కమిషనర్‌

పబ్లిక్‌ సేఫ్టీపై పని చేస్తాం



స్పెషల్‌ డ్రైవ్‌లో భాగంగా డివిజన్లలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్స్‌కు గ్రిల్స్‌ ఏర్పాటు చేయడంతో పాటు వర్షాలు వచ్చినప్పుడు పబ్లిక్‌ సేఫ్టీపై అవగాహన కల్పిస్తాం. మ్యాన్‌హోల్‌ చుట్టూ రెడ్‌కలర్‌ మార్క్‌ ఉందంటూ ఈ మ్యాన్‌హోళ్లను వర్షాలు వచ్చినప్పుడు ప్రజలు తెరవకుండా ఉండాలని వారికి అవగాహన కల్పిస్తాం. డ్రైవ్‌లో భాగంగా దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లను మారుస్తాం.

– హరి శంకర్‌, జలమండలి డివిజన్‌–6 జీఎం

ప్రజలు సహకరించాలి



బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలి. ఇప్పటికే మేము పైలెట్‌ ప్రాజెక్టుగా ఇప్పటికే మూడు బస్తీల్లో మహిళా సమాఖ్యలతో చెత్త వేయకుండా చెత్తను చెత్త సేకరించే వాహనాలకు మాత్రమే ఇచ్చేలా చేస్తున్న అవగాహన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. త్వరలోనే అన్ని డివిజన్లలో దాన్ని అమలు చేస్తాం. ఈ స్పెషల్‌ డ్రైవ్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను, నిర్మాణ వ్యర్థాలను తొలగిస్తాం.

– అనురాగ్‌ జయంతి, జోనల్‌ కమిషనర్‌, ఖైరతాబాద్‌

పూర్వ విద్యార్థులు ముందుకు రావాలి

హిమాయత్‌నగర్‌: హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నగరంలోని 125 ఏళ్ల చరిత్ర గల ముఫిదుల్‌ అనమ్‌ ఎయిడెడ్‌ ప్రాథమిక బాలికల పాఠశాల, ధర్మవంత్‌ హిందీ విద్యా సంస్థలైన ఎయిడెడ్‌ డిగ్రీ, పాఠశాలలతో పాటు ఇంటర్‌, పీజీ, కాలేజీలను కాపాడుకునేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని హిందీ ప్రచార సభ హైదరాబాద్‌ జనరల్‌ సెక్రటరీ, ధర్మవంత్‌ విద్యా సంస్థల ట్రస్టీ ఎస్‌.గైబుపల్లి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గతంలో ఈ విద్యా సంస్థలకు మేనేజింగ్‌ ట్రస్టీగా ఉన్న వ్యక్తి బయట వ్యక్తులతో కుమ్మక్కై ధర్మవంత్‌ హిందీ విద్యా సంస్థలైన ఎయిడెడ్‌ పాఠశాలలు, ఎయిడెడ్‌ డిగ్రీ కాలేజీతో పాటు ఇంటర్‌, పీజీ, కాలేజీల భవనాలను, గ్రౌండ్‌, గార్డెన్‌లను కబ్జా చేసి వాటిలో ఉన్న కొన్ని భవనాలను కూల్చడమే కాకుండా ఎయిడెడ్‌ కాలేజీలకు సంబంధించిన కంప్యూటర్లు, ల్యాబ్‌లు, లైబ్రరీలను, ప్రిన్సిపాల్‌ రూములు, స్టోర్స్‌, కోట్ల రూపాయలు విలుచేసే సామగ్రి ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో హిందీ ప్రచార సభ ప్రతినిధులు ప్రొఫెసర్‌ సురేష్‌ పురీ, గిరిధర్‌ రావు, శృతికాంత్‌ భారతి, కె.రామచందర్‌, రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్‌: ఆదర్శ్‌ బస్తీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు సోమవారం రూ. 33 లక్షలతో చేపట్టిన రీ మోడలింగ్‌ ఆఫ్‌ డ్రైన్‌ వాటర్‌ పైప్‌ లైన్‌, ప్రెషర్‌ పంప్‌ పనులను హిమాయత్‌నగర్‌ కార్పొరేటర్‌ మహాలక్ష్మి రామన్‌ గౌడ్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ... వర్షాకాలం రాగానే వర్షపు నీటితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను గుర్తించి దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే వచ్చే వర్షాకాలంలో ఆదర్శ్‌ బస్తీలో నీళ్లు నిలువకుండా ఉంటుందన్నారు. కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు జి.రామన్‌గౌడ్‌, డివిజన్‌ అధ్యక్షుడు నయీమ్‌, స్థానిక నేతలు ఓం ప్రకాష్‌, శ్రీహరి, అజార్‌, అయూబ్‌, ఫసి, ఫారుక్‌, బిందియా, అఖిల్‌, సాయి కిరణ్‌, మహేష్‌, ప్రియరాజ్‌, పూర్ణచందర్‌, ప్రభాకర్‌ గౌడ్‌ పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల ఆందోళన

సాక్షి, సిటీబ్యూరో: రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకునే తమను ట్రాఫిక్‌ పోలీసులు, మునిసిపల్‌ సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని దాదాపు 200 మంది సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసేందుకు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. వారిని లోనికి అనుమతించకపోవడంతో, పోలీసులు, మునిసిపల్‌ అధికారుల వేధింపులను నిరసిస్తూ ప్రదర్శన నిర్వహించారు. రోడ్లపక్కనున్న తమ బండ్లను తొలగించి, తమ పొట్ట కొడుతున్నారని వేదన వ్యక్తం చేశారు. వీధి వ్యాపారుల (జీవనోపాధి రక్షణ, వీధి వ్యాపారుల నియంత్రణ) చట్టం, 2014ను వెంటనే అమలు చేయాలని, వీధి వ్యాపారులకు చట్టపరమైన రక్షణ కల్పించాలని వారు డిమాండ్‌ చేశారు.నిబంధనలు అమలు చేయడంలో విఫలమైన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. నేషనల్‌ హాకర్‌ ఫెడరేషన్‌ (ఎన్‌హెచ్‌ఎఫ్‌) పేరిట వారు ప్రజావాణిలో తమ ఇబ్బందులు ఫిర్యాదు చేయడానికి వచ్చారు. ట్రాఫిక్‌ పోలీసులు తమను నిరంతరం వేధిస్తున్నారని, చలాన్లు జారీ చేస్తున్నారని, బండ్లను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా తాము వ్యాపారాలు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వీధి విక్రేతల చట్టాన్ని వెంటనే అమలు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు.

నాలా పూడిక తొలగింపు వేగవంతం చేయండి



నాలా డీసిల్టింగ్‌ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ టి.మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్‌: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో నాలా డీసిల్టింగ్‌ పనులను వేగవంతం చేయాలని బేగంపేట కార్పొరేటర్‌ టి.మహేశ్వరిశ్రీహరి జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. బేగంపేట వద్ద కూకట్‌పల్లి నాలా డీసిల్టింగ్‌ పనులను అధికారులతో కలిసి సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. శాస్త్రీయబద్ధంగా పూడికతీత పనులు చేపట్టాలన్నారు. తీసిన పూడికను అక్కడే పడేయడం వల్ల వర్షాలకు మళ్లీ నాలాలో కలుస్తుందని, ఎప్పటికప్పుడు పూడికను తరలించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీం ఇంజనీరింగ్‌ విభాగం అధికారులతో పాటు బీఆర్‌ఎస్‌ నేతలు రఘునాథ్‌, రామచంద్ర, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలి ఇంట్లో చోరీ

వెంగళరావునగర్‌: వైద్యురాలి ఇంట్లో దొంగలు పడి ప్రభుత్వం అందించిన సిల్వర్‌ కప్‌, నగదు తీసుకెళ్లిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్‌కాలనీలో నివసించే డాక్టర్‌ ప్రతిభ ఈ నెల 25వ తేదీ తన బంధువు ఇంటికి హఫీజ్‌పేటకు వెళ్లారు. ఈ సమయంలో పనిమనిషి నాగు ఫోన్‌ చేసి ఇంటి తలుపులు తెరిచే ఉన్నాయని, ఈ విషయాన్ని మీ బంధువు స్వరూప తనకు తెలియజేసిందని చెప్పాడు. దాంతో హుటాహుటిన ఆమె పోలీసులుకు ఫోన్‌ చేసింది. పోలీసుల రాగానే ఆమె కూడా ఇంటికి వచ్చి పరిశీలించగా మూడు తలుపులు విరిగిపడి ఉన్నాయని, అల్మారాలన్నీ తెరిచి ఉన్నాయని పేర్కొన్నారు. నాలుగు నెలల కిందట ఆమె రూ. 7 వేలు పెట్టి కొన్న మోటారు, 1984లో ఏపీ ప్రభుత్వం అందించిన వెండి కప్పు కనిపించలేదు. దాంతో బాధితురాలు మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నిరంగాల్లో కాంగ్రెస్‌ విఫలం

బీఆర్‌ఎస్‌ ఖైరతాబాద్‌ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి

బంజారాహిల్స్‌: కాంగ్రెస్‌ పార్టీ పని అయిపోయిందని, అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని బీఆర్‌ఎస్‌ పార్టీ ఖైరతాబాద్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌ రెడ్డి ఆరోపించారు. బంజారాహిల్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ముందు అడ్డగోలు మాటలు చెప్పి అలవికానీ హామీలు ఇచ్చి గద్దెనెక్కిన ప్రభుత్వం పాలనలో ఫెయిల్‌ అయ్యిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడం కోసం హామీలపై నిలదీస్తున్న ప్రజల దృష్టి మళ్లించేందుకు కాళేశ్వరం పేరిట కొత్త డ్రామాలు ఆడుతున్నదని ఆయన దుయ్యబట్టారు. డైవర్షన్‌ రాజకీయాలు చేసేందుకే బీఆర్‌ఎస్‌ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావులకు నోటీసులు ఇస్తున్నదని దుయ్యబట్టారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే ఈ డైవర్షన్‌ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌ ఎన్నికల హామీల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా సమస్యలు పరిష్కరించే దాకా ప్రజల పక్షాన బీఆర్‌ఎస్‌ నాయకులు, గులాబీ సైన్యం పోరాడుతూనే ఉంటుందన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



చెక్కును పంపిణీ చేస్తున్న కార్పొరేటర్‌

వెంగళరావునగర్‌: బీఆర్‌ఎస్‌ హయాంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికీ చెక్కులను అందజేయడమే కాకుండా ప్రజలకు నేటికీ తాము అండగా ఉంటున్నామని వెంగళరావునగర్‌ కార్పొరేటర్‌ దేదీప్య విజయ్‌ తెలిపారు. వెంగళరావునగర్‌ డివిజన్‌తోపాటు యూసుఫ్‌గూడ,, శ్రీనగర్‌కాలనీ డివిజన్‌కు చెందిన పలువురు గతంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ పథకాల కింద లబ్ధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. కార్పొరేటర్‌ ఆయా లబ్ధిదారులకు చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అప్పటి ప్రభుత్వం వాటిని విడుదల చేసిందని, వివిధ కారణాల వల్ల ఏడాదిన్నరగా తహసీల్దార్‌ కార్యాలయంలో నిలిచిపోయాయని అన్నారు. ప్రస్తుతం లబ్ధిదారులందరికీ చెక్కులను పంపిణీ చేస్తున్నామన్నారు. రూ. 400 మందికి ఒకొక్కరికి రూ.1,00,116 చొప్పున పంపిణీ చేశామన్నారు. యూసుఫ్‌గూడ కార్పొరేటర్‌ రాజ్‌కుమార్‌, ఖైరతాబాద్‌ తహసీల్దార్‌ నయీముద్దీన్‌, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నేతలు విజయ్‌ కుమార్‌, మాజీ కార్పొరేటర్‌ శ్యాంరావు, పూజారి బాలు, సత్యనారాయణ, బాలు రజక తదితరులు పాల్గొన్నారు.

రింగ్‌ఫైట్‌లో సత్తాచాటిన ఫిలింనగర్‌ విద్యార్థులు



మెడల్స్‌ సాధించిన విద్యార్థులు

ఫిలింనగర్‌: ఫస్ట్‌ ఇంటర్నేషనల్‌ రింగ్‌ ఫైట్‌ ఛాంపియన్‌షిప్‌లో ఫిలింనగర్‌ విద్యార్థులు సత్తా చాటారు. దోమలగూడలో నాలుగు రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఫిలింనగర్‌ డ్రాగన్‌ కుంగ్‌ఫు అకాడమికి చెందిన పది మంది విద్యార్థులు పతకాలు సాధించినట్లు గ్రాండ్‌ మాస్టర్‌ వెంకటేష్‌, మాస్టర్‌ హనీఫ్‌ తెలిపారు. నగర వ్యాప్తంగా 250 మందికి పైగా పాల్గొన్న ఈ రింగ్‌ ఫైట్‌ కాంపిటేషన్‌లో ఫిలింనగర్‌కు చెందిన టి.రాజేష్‌, ఎం.యశ్వంత్‌, పి.జ్ఞానేశ్వర్‌, కె.కపిల్‌దేవ్‌, సి.హెచ్‌.చందు, కె.రవి క్రీతన గోల్డ్‌మెడల్‌ సాధించగా, కె.యశ్వంత్‌, కె.అభిరందన్‌ సిల్వర్‌ మెడల్స్‌, జె.వీక్షిత్‌, వి.వరుణ్‌ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందని విద్యార్థులను ఘనంగా సత్కరించారు.

ప్రతి జర్నలిస్టూ నిస్వార్థంగా పనిచేయాలి



న్యాయపతి రమేష్‌బాబుకు పురస్కారం ప్రదానం చేస్తున్న ఆచార్య గౌరీశంకర్‌

చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని శ్రీకృష్ణ మందిరంలో మాదల వీరభద్రరావు స్మారక సమితి, సాధన సాహితీ స్రవంతిల ఆధ్వర్యంలో స్వాతంత్య్ర సమరయోధుడు మాదల వీరభద్రరావు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్‌ ఆచార్య గౌరీశంకర్‌ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వీరభద్రరావుకు దేశభక్తి, సంపాదక వృత్తిపట్ల ఉన్న నిబద్ధతే నేటి తరానికి కూడా ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికలది ప్రముఖ పాత్ర అని ప్రతి జర్నలిస్టు నిస్వార్థంగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ పాత్రికేయుడు న్యాయపతి రమేష్‌ బాబుకు గౌరీశంకర్‌ చేతుల మీదుగా మాదల వీరభద్రరావు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ హాస్యావధాని శంకరనారాయణ, సాధన నరసింహాచార్య, మాదల రాజేంద్రప్రసాద్‌, రఘుశ్రీ, రాయప్రోలు రమణ, ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

జూన్‌ 9 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన పొడిగింపు

కవాడిగూడ: దేశ వ్యాప్తంగా ఉన్న చేనేత, హస్తకళాకారులతో తయారు చేసిన వస్త్ర ప్రదర్శనను జూన్‌ నెల 9వ తేదీ వరకు పొడగించినట్లు చేనేత డ్వాక్రా మహిళా సంఘాల కార్యదర్శి కంభంపాటి పద్మజ తెలిపారు. సోమవారం ఎన్‌టీఆర్‌ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేనేత వస్త్ర హస్తకళాకారుల విజ్ఞప్తి మేరకు ఎగ్జిబిషన్‌ను మరో పదిరోజుల పాటు పొడగిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని జంటనగరాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏప్రిల్‌ 26వ తేదీన ప్రారంభమైన వస్త్ర ప్రదర్శనకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించిందని ఆమె తెలిపారు. ఆధునిక కాలంలో కూడా చేనేత వస్త్రాలకు ఆదరణ తగ్గడం లేదన్నారు.

రోడ్డంతా గుంతలు.. తప్పని వెతలు!

- గుంతలతో తరచూ ప్రమాదాలు
- మరమ్మతు చేసే విషయంలో నిర్లక్ష్యం
- అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం



అధ్వానంగా తయారైన రోడ్డు



నిత్యం ఇలా రద్దీగానే..

శ్రీనగర్‌కాలనీ: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అనే చందాన తయారైంది ఆ రోడ్డు పరిస్థితి. దశాబ్దాలుగా రోడ్డు విస్తరణ లేదు సరికదా... రోడ్డు బాగు చేసే నాథుడు లేక స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఎర్రగడ్డలోని భరత్‌నగర్‌ ఫ్లైఓవర్‌ పక్క నుంచి మోతీనగర్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయమై అధ్వానంగా మారింది. రోజూ వేలాదిగా వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించే ఈ రోడ్డును బాగు చేయాలని స్థానిక కమ్యూనిటీ వాసులు, స్థానికులు విన్నవించినా ఆచరణకు నోచుకోవడం లేదు. డ్రైనేజీ వ్యవస్థ కూడా అధ్వానంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గేటెడ్‌ కమ్యూనిటీలు.. అపార్ట్‌మెంట్స్‌, బస్తీలు...

ఫ్లైఓవర్‌ నుంచి మోతీనగర్‌ వెళ్లేటప్పుడు మొదట కల్పతరు గేటెడ్‌ కమ్యూనిటీ ఆ తర్వాత బ్రిగేడ్‌ గేటెడ్‌ కమ్యూనిటీ, వాసవి బృందావన్‌ కమ్యూనిటీలతో పాటు జనప్రియ అపార్ట్‌మెంట్స్‌, కాలనీలు, బస్తీలు ఉన్నాయి. బ్రిగేడ్‌, కల్పతరు, వాసవి బృందావన్‌లు కలిపి రెండు వేలకు పైగా ఉండగా జనప్రియలో దాదాపు వేయికి పైగా ఫ్లాట్స్‌, కాలనీలు, బస్తీలు చాలా ఉన్నాయి. ఈ రోడ్డు నుంచే మోతీనగర్‌, బోరబండ, అల్లాపూర్‌, హైటెక్‌ సిటీ వరకూ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. విపరీతమైన రద్దీ ఉన్న ఈ రోడ్డు విస్తరణ జరగలేదు. కనీసం మంచి రోడ్డు వేయాలని విన్నవించినా ఆచరణ జరుగలేదు.

కోట్లల్లో టాక్స్‌, రోడ్డు మరమ్మతులు శూన్యం..

రోడ్డు పక్కన ఉన్న గేటెడ్‌ కమ్యూనిటీవాసులు పర్మిషన్స్‌, డెవలెప్‌మెంట్‌కి రూ. కోట్లల్లో మున్సిపల్‌ శాఖకు పన్నుల రూపాణా చెల్లించారు. కేవలం మున్సిపల్‌ టాక్స్‌ మూడు గేటెడ్‌ కమ్యూనిటీవాసులే సంవత్సరానికి రూ. ఆరు కోట్లు కడుతున్నట్లు వెల్లడించడం విశేషం. అంతేకాకుండా పక్కన ఉన్న అపార్ట్‌మెంట్స్‌, కాలనీలు, బస్తీవాసుల టాక్స్‌లు అదనం. వాటర్‌తో పాటు పలు టాక్స్‌లను చెల్లిస్తున్న రోడ్డును బాగుచేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడినప్పుడు నరకప్రాయంగా ఈ రోడ్డు ప్రయాణం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

అధికారుల తీరు దారుణం



దశాబ్దాలుగా రోడ్డు పరిస్థితి మారలేదు. కాలాలు మారి చుట్టు పక్కల అభివృద్ధి జరుగుతున్నా రోడ్డు వేసేందుకు అధికారులను మనసురాలేదు. రోజూ వేలాది మంది ప్రయాణించే ఈ రోడ్డు విస్తరణతో పాటు రోడ్డు మరమ్మతులు చేయాలి. కోట్లల్లో టాక్స్‌లు కడుతున్నా రోడ్డు మరమ్మతులు చేయకపోవడం శోచనీయం. అధికారులు రోడ్డును బాగుపరిస్తే వేలాది మందికి ఉపయోగపడుతుంది.

– వెంకటేశ్వరరావు, బ్రిగేడ్‌ కమ్యూనిటీ అధ్యక్షుడు

ఐఎంఏ వైస్ చైర్మన్‌గా కృపాల్‌సింగ్ నియామకం



గాంధీఆస్పత్రి : ఇండియన్ మెడికల్ అసోషియేషన్(ఐఎంఏ) ఇన్ సర్వీస్ డాక్టర్స్ వింగ్ వైస్ చైర్మన్‌గా సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ కృపాల్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎంఏ హానరరీ సెక్రటరీ జనరల్ డాక్టర్ సర్బారీ దత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన ఐఎంఏ సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, తెలంగాణ నుంచి టి.కృపాల్‌సింగ్‌ను వైస్ చైర్మన్‌గా నామినేట్ చేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కృపాల్‌సింగ్‌కు పలువురు వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు.

రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశానికి తెలుగు విశ్వవిద్యాలయం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. శిల్పం, చిత్రలేఖనం, డిజైన్, సంగీతం, రంగస్థలం, శాస్త్రీయ నృత్యం(కూచిపూడి, ఆంధ్రనాట్యం), జానపదం, తెలుగు, చరిత్ర-పర్యాటకం, భాషాశాస్త్రం, జర్నలిజం, జ్యోతిషం, యోగా కోర్సులకుగాను ఎం.ఎ, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో అర్హత, ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను సాధారణ రుసుముతో జూన్ 24వ తేదీ లోగా, ఆలస్య రుసుముతో జూన్ 30వ తేదీలోగా స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం తెలుగు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

ఓయూ వీసీ విదేశీ పర్యటన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ వారం రోజుల పర్యటనకుగాను సోమవారం విదేశాలకు వెళ్లారు. అమెరికాలో జరిగే పలు కార్యక్రమాల్లో హాజరైందుకు వీసీ వెళ్లినట్లు అధికార వర్గాలు తెలిపాయి. జూన్ మొదటి వారంలో తిరిగి ఓయూకు రానున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వ్యాపారులకు ప్రభుత్వ రంగ కొనుగోళ్లలో భాగస్వామ్యం

– కేంద్ర మంత్రి జితిన్ రామ్ మాన్‌జీ



వెంగళరావునగర్: ప్రభుత్వ రంగ కొనుగోళ్లలో ఎస్సీ, ఎస్టీ వ్యాపారులకు భాగస్వాములయ్యే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించినట్టు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రి జితిన్ రామ్ మాన్‌జీ అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(నిమ్స్ మే) ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సి-బ్లాక్ హాస్టల్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మొక్కలను నాటారు. పునర్నిర్మించిన జూబ్లీ డైమండ్ హాల్‌ను కూడా ప్రారంభించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన 30 స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే టెండర్లలో పాల్గొనేందుకు ఇలాంటి వేదికలు చాలా ఉపయోగపడతాయని అన్నారు. దేశంలోని ఎస్సీ, ఎస్టీల ఆర్థిక పురోగతికి ప్రధాని నరేంద్ర మోదీ అన్ని రకాలుగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. వ్యాపారాల కోసం బ్యాంకర్ల నుంచి రుణాలను మంజూరు చేస్తున్నారని, చిన్న మధ్య తరహా, సూక్ష్మ వ్యాపారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ సంయుక్త కార్యదర్శి మెర్సీ ఎపావ్, నిమ్స్‌మే ఇన్‌చార్జి డైరెక్టర్ జనరల్ డాక్టర్ అశుతోష్ ఏ ముర్కుటే, ఎన్ఎస్‌హెచ్ జనరల్ మేనేజర్ ఉమేష్ దీక్షిత్, ఎస్ఎస్ఐసీ జోనల్ జనరల్ మేనేజర్ సురేష్‌బాబు, సురేష్, స్వప్న పాల్గొన్నారు.

నగరంలో నేడు

- మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది .
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవులు సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 7 విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- వనస్థలిపురం గణేష్ టెంపుల్ సమీపంలోని రైతుబజార్ రోడ్ ఉన్న వనస్థలిపురం కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

కన్ను పడితే లే ఔట్



- శివారుల్లో రెచ్చిపోతున్న కబ్జాదారులు
- హైడ్రాను ఆశ్రయిస్తున్న బాధితులు
- ప్రజావాణిలో 64 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: వారి కన్ను పడితే ఇక లే 'ఔట్'. నగర శివారులోని గ్రామ పంచాయతీ లే ఔట్లను లక్ష్యంగా చేసుకున్న కొందరు కబ్జాలకు పాల్పడుతున్నారు. నగర శివార్లలోని లేఔట్లకు భారీ డిమాండ్ ఏర్పడటంతో వాటికి రక్షణ లేకుండా పోయిందని పలువురు బాధితులు హైడ్రాను ఆశ్రయిస్తున్నారు. కబ్జారాయుళ్లు రహదారులు, పార్కుల హద్దులను చెరిపేసి వ్యవసాయ భూములుగా మార్చేశారంటూ వాపోతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే పాసు పుస్తకాలు చూపించి వెళ్లగొడుతున్నారని కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 64 ఫిర్యాదులు రాగా అందులో 60 శాతానికిపైగా పాత లే ఔట్ల కబ్జాలకు సంబంధించినవే.

- ఘట్‌కేసర్ మండలం కొర్రెములలోని సర్వే నెం.739 నుంచి 749 వరకూ 149 ఎకరాలు ఉన్నాయి. ఇందులో ప్రొఫెసర్ జయశంకర్ ఏకశిలా కాలనీ పేరుతో 1987లో 2080 ప్లాట్లతో లే ఔట్ వేశారు. ఇందులోని నాలుగు సర్వే నంబర్లలో ఉన్న 47 ఎకరాల భూమిని ఆలూరి వెంకటేష్‌తోపాటు మరికొందరు కబ్జా చేశారని బాధితులు ఫిర్యాదు చేశారు. హైకోర్టులో రిట్ పిటిషన్ ద్వారా లే ఔట్ ప్లాట్లను దక్కించుకున్నా.. మళ్లీ ఏడు ఎకరాలకు ధరణి ద్వారా పాస్ పుస్తకం తెచ్చుకుని తమను అడ్డుకుంటున్నారని వాపోయారు.
- అబ్దుల్లాపూర్ మెట్ మండలం పెద్దంబర్‌పేటలోని 264, 265, 266 సర్వే నంబర్లలో 500 ప్లాట్లతో శ్రీ బాలాజీ నగర్ కాలనీ పేరిట ఉన్న లే ఔట్ ఇప్పుడు శ్రీ సాయినగర్ కాలనీ లే ఔట్‌గా మారిపోయిందని పాత లేఔట్ ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైకోర్టు ఉత్తర్వులు తమకు అనుకూలంగా ఉన్నా 40 అడుగుల ప్రధాన దారిని మూసేయడంతో ఔటర్ రింగురోడ్డు, విజయవాడ హైవేలకు మార్గం లేకుండా పోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.
- అల్వాల్ మండలం రెడ్డి ఎన్‌క్లేవ్‌లో 2,460 గజాల పార్కు స్థలం ఉంటే.. అందులో 667 గజాల స్థలాన్ని కబ్జా చేశారని ఆ కాలనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. మొత్తం 10 ఎకరాల వరకూ ఉన్న లే ఔట్‌లో 200 ప్లాట్లుండగా పార్కు లేకుండా పోయిందన్నారు. పార్కు స్థలంపై కోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలున్నా కబ్జాదారుడిని ఖాళీ చేయించడం సాధ్యం కావట్లేదని వివరించారు.
- మెహిదీపట్నం-మల్లేపల్లి మార్గంలోని ఆసిఫ్ నగర్‌లో దర్గా భూమిని కూడా కబ్జాదారులు వదలడంలేదని, మొత్తం 3,800 గజాల స్థలం తనదంటూ అఫ్సర్ అహ్మద్ అనే వ్యక్తి కబ్జా చేశారని దర్గా ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. భవన అనుమతులు లేకుండానే నిర్మాణాలు జరిగిపోతున్నాయని అధికారుల దృష్టికి తెచ్చారు. అక్కడ నుంచి ఖాళీ చేయాలని జీహెచ్ఎంసీ నోటీసులు ఇచ్చినా ప్రయోజనం లేదని దర్గా భూమిని కాపాడాలని ప్రతినిధులు హైడ్రాను ఆశ్రయించారు.
- హయత్‌నగర్‌లోని 93, 94 సర్వే నంబర్లలో 3,620 గజాల పార్కు స్థలాన్ని కాపాడాలంటూ టి.నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. 16 ఎకరాల పరిధిలో 148 ప్లాట్లతో 1966లో టి.నగర్ లే ఔట్ వేశారు. పార్కు స్థలాన్ని శ్రీనివాస చౌదరి అనే వ్యక్తి కబ్జా చేశారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

లీజుకు ఓయూ క్వార్టర్లు



లీజుకు ఇచ్చిన ప్రొఫెసర్ల క్వార్టర్లు

- ఆది ధ్వని సంస్థకు ప్రొఫెసర్ల నివాస భవనాలు
- వ్యతిరేకిస్తున్న ఔటా, విద్యార్థి సంఘాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ప్రొఫెసర్ల పాత క్వార్టర్లను ఆది ధ్వని స్వచ్ఛంద సంస్థకు 30 ఏళ్లపాటు లీజు ఇచ్చారు. ఈ మేరకు మూడు నెలలుగా హెచ్ఎండీఏ అధికారులు పాత భవనాలను మరమ్మతు చేయిస్తున్నారు. విశ్రాంత ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు 12 ఏళ్లుగా సేకరించిన ఆదివాసుల సంగీత పనిముట్లను భద్రపరిచి మ్యూజియంగా ఏర్పాటు చేసేందుకు బీఆర్ఎస్ హయాంలో మాజీ వీసీ ప్రొ.రవీందర్ క్వార్టర్లను లీజుకు ఇచ్చారు. కానీ, కొన్ని కారణాల వల్ల మరమ్మతు పనులు ప్రారంభించలేదు. ప్రస్తుత పాలక మండలి అనుమతితో క్వార్టర్లను మరమ్మతులు చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు, ఔటా లీజును రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఔటా, విద్యార్థి సంఘాల వ్యతిరేకత

తార్నాక ఆర్టీసీ ఆసుపత్రి ఎదుట ప్రధాన రహదారిపై రూ.లక్షల కోట్ల విలువ చేసే 10 ఎకరాల స్థలంలో గల విశాలమైన ప్రొఫెసర్ల నివాస భవనాలను 30 ఏళ్ల వరకు లీజుకు ఇవ్వడాన్ని ఓయూ టీచర్స్ అసోసియేషన్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చిన్నప్పరెడ్డి కమిషన్‌కు విరుద్ధంగా ఓయూ భవనాలను, భూములను లీజుకిస్తే సహించేదన్నారు. కోట్ల విలువ చేసే భూమిని కేవలం నెలకు రూ.వెయ్యి లీజుకు ఇవ్వడం పట్ల ప్రొఫెసర్లు, విద్యార్థులు విస్మయం చెందుతున్నారు. గతంలో ప్రొఫెసర్ల నుంచి నెలకు రూ.40 వేల అద్దె వసూలు చేసిన అధికారులు ఇప్పుడు కేవలం రూ.వెయ్యి ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఓయూ క్వార్టర్లను లీజుకు ఇస్తే దాడి చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

పునఃపరిశీలిస్తాం: రిజిస్ట్రార్

ఓయూ క్వార్టర్ల లీజు పై విద్యార్థులు, ఔటా నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నందున పునఃపరిశీలించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డి తెలిపారు. ఔటా, విద్యార్థి సంఘాల ఒత్తిడి మేరకు త్వరలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

కూలిన ఫతేనగర్ ఫ్లైఓవర్ మెట్లు

– ఇద్దరికి గాయాలు..



కుప్పకూలిన ఫతేనగర్ ఫ్లైఓవర్ మెట్లు..

సనత్‌నగర్: ఫతేనగర్ ఫ్లైఓవర్‌మెట్లు ఒక్కసారిగా కూలిపోయాయి. ఈ ఘటనలో ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. సనత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాలు... ఫతేనగర్ ఫ్లైఓవర్ టి ఆకారంలో ఉంటుంది. ఫతేనగర్ నుంచి బల్కంపేటకు, ఇటు సనత్‌నగర్ నుంచి ఫతేనగర్, బల్కంపేట వైపు రాకపోకలు జరుగుతాయి. అయితే ఫ్లైఓవర్‌పై నుంచి కిందికి దిగేందుకు వీలుగా మెట్ల మార్గం కూడా ఉంది. ఈ మెట్ల మార్గం నుంచి ఫతేనగర్ ఎంఎంటీఎస్‌తోపాటు ఫ్లైఓవర్ రెండు వైపులకు ప్రయాణికులు వెళ్తుంటారు. శిథిలావస్థకు చేరిన మెట్లు కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాని మరింత బలహీనంగా మారాయి. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఓ వ్యక్తి మెట్ల మార్గం నుంచి కిందికి దిగుతుండగా మెట్లు కుప్పకూలిపోయాయి. ఈ ఘటనలో అతడి రెండు కాళ్లకు తీవ్రంగా గాయలయ్యాయి. సదరు వ్యక్తి బిహార్ నుంచి వలసవచ్చి ఓ లాడ్జిలో ఉంటున్న రవిశంకర్‌గా పోలీసులు గుర్తించారు. ఇదే ఘటనలో మరో వ్యక్తి భుజానికి స్వల్పంగా గాయాలయ్యాయి. 1990 ప్రాంతంలో ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి ముందు వరకు బాలానగర్, జీడిమెట్ల, చింతల్, షాపూర్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి నగరానికి రావాలంటే కూకట్‌పల్లి వై జంక్షన్ వరకు వెళ్లి మూసాపేట మీదుగా వెళ్లాల్సి వచ్చేది. ఈ బ్రిడ్జి నిర్మాణంతో ఆయా ప్రాంతవాసులకు దూరభారం చాలా తగ్గింది.

గురుకులాల్లో తాత్కాలిక బోధన సిబ్బంది భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్: చార్మినార్ జోన్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో అంగ్ల మాధ్యమంలో బోధించే తాత్కాలిక ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జోనల్ అధికారి నిర్మల, జిల్లా సమన్వయ అధికారి వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, అంగ్లం, స్పెషల్ టీచర్స్, హెల్త్ సూపర్‌వైజర్స్, పీఈటీ, పీడీలు, లైబ్రేరియన్ ఉద్యోగాలకు ఈ నెల 30న చిలుకూరు బాలుర తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఉదయం 8 గంటల నుంచి పాఠ్యాంశ బోధన డెమోలు, 31న బోటనీ, జువాలజీ, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ ఉద్యోగాలకు డెమో ఉంటుందని, బాలికల విద్యాలయాల్లో పనిచేయడానికి మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ వెంట తీసుకురావాలని, జూనియర్ కళాశాల అధ్యాపకులకు రూ. 23,400 వేతనం, పీజీటీ, టీజీటీలకు రూ. 18,200 వేతనం ఉంటుందని తెలిపారు.

కడచూపునకు నోచుకోని కన్నతండ్రి

- మావోయిస్టు భూమిక మృతదేహాన్ని అప్పగించని ఛత్తీస్‌గఢ్ పోలీసులు
- నారాయణపూర్ అటవీ ప్రాంతంలోనే ఖననం



భూమిక మృతదేహాన్ని అప్పగించాలని ఆందోళన చేస్తున్న ఆమె తండ్రి సాయిలు తదితరులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కన్నబిడ్డ ముఖాన్ని కడసారి చూసుకునేందుకు వెళ్లిన ఆ తండ్రికి చివరికి నిరాశ, తీరని దుఃఖమే మిగిలింది. ఆదివాసీ, గిరిజనుల హక్కుల సాధన కోసం 12 ఏళ్ల క్రితం అడవిబాట పట్టిన బిడ్డ చివరకు అదే అడవిలో పోలీసుల తూటాలకు బలైంది. బిడ్డ మృతదేహాన్ని అప్పగించాలని, కడసారి చూసేందుకు అవకాశం కల్పించాలని కోరినా పోలీసుల మనసు కరగలేదు. భారీ పోలీసు బందోబస్తు మధ్య అదే అడవిలో ఆమె మృతదేహాన్ని ఖననం చేశారు. ఈ నెల 21న ఛత్తీస్‌గఢ్‌లోని అబుజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలకనేత నంబాల కేశవరావుసహా కేశంపేట మండలం వేములనర్వకి చెందిన వన్నాడ సాయిలు కుమార్తె విజయలక్ష్మి(36) అలియాస్ భూమిక మృతి చెందిన విషయం తెలిసిందే.

మూడు రోజులుగా అక్కడే మకాం..

ఉన్నత చదువుల కోసం ఊరు నుంచి ఉస్మానియా యూనివర్సిటీకి చేరుకున్న విజయలక్ష్మి ఆ తర్వాతి కొద్దిరోజులకే అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. ఇటీవల అబుజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయింది. పోస్టుమార్టం తర్వాత నంబాల సహా ఆమె మృతదేహాలను నారాయణపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచిన విషయం తెలుసుకొని ఆమె తండ్రి సాయిలు, కుటుంబసభ్యులు శనివారం షాద్‌నగర్ నుంచి పయనమయ్యారు. ఆదివారం అక్కడికి చేరుకున్నా తెలంగాణ పోలీసుల నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో మృతదేహాన్ని అప్పగించేందుకు ఛత్తీస్‌గఢ్ పోలీసులు నిరాకరించారు. మృతదేహాలను బంధువులకు అప్పగించాలని కోరుతూ పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో మృతుల బంధువులు సోమవారం నారాయ ణపూర్ జిల్లా ఎస్పీ ఆఫీసు వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. మూడురోజులుగా ఎదురు చూసినా మృత దేహాలను అప్పగించలేదు.

త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుంటారని...

మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగిస్తే అంతిమయాత్ర పేరుతో సానుభూతి పరులంతా ఒకే చోట చేరే అవకాశం ఉందని, అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని కొత్తగా మరి కొంతమంది అడవిబాట పట్టే ప్రమాదం ఉందని పోలీసులు భావించి నంబాల సహా విజయలక్ష్మి, ఇతర మావోయిస్టుల మృతదేహాలకు అక్కడే అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిసింది. కుమార్తె మృతదేహాన్ని సొంతూరికి తీసుకొచ్చి,అభిమానులు, బంధువుల అశ్రు నివాళుల మధ్య వీడ్కోలు పలకాలని భావించిన తండ్రి ఆశలు చివరకు అడియాశలుగానే మిగిలిపోయాయి. సోమవారం పొద్దు పోవడం, రహదారి సరిగా లేకపోవడంతో మృతదేహాల కోసం వెళ్లిన వారంతా మంగళవారం ఉదయం అక్కడి నుంచి సొంతూళ్లకు తిరుగు ముఖం పట్టనున్నారు.

దారుణాలను ప్రభుత్వాలు తీవ్రంగా పరిగణించాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం ఫ్రంట్ చైర్మన్ డిమాండ్



హిమాయత్‌నగర్: ఎస్సీ, ఎస్టీ, మహిళలు, ముస్లిం మైనారిటీలపై జరుగుతున్న దారుణాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా పరిగణించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం ఫ్రంట్ చైర్మన్ సనా ఉల్లాఖాన్ డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫ్రంట్ కన్వీనర్లు యాదగిరి, ముజాహిద్ యాష్మి, ఎస్.తన్వీ, అధికార ప్రతినిధి ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఎస్సీలు, ఎస్టీల కోసం ఉప ప్రణాళికలను రూపొందించినా అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. యూపీ, ఎంపీల రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లింలపై దాడులు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రేక్షకపాత్ర వహిస్తోందని ఆరోపించారు. గతంలో పర్యవేక్షించిన విధంగా 'వక్ఫ్ బోర్డులను' దాని పురాతన లక్ష్యాలకు భంగం కలిగించకుండా సంరక్షించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. పలు సమస్యలపై జూన్ 7 రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వారు వెల్లడించారు.

వర్షాలొస్తున్నాయి..

పరిసరాలు జాగ్రత్త: మేయర్



ప్రీ మాన్సూన్ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ

ప్రీ మాన్సూన్ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ప్రారంభం

బంజారాహిల్స్: నగర ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. సోమవారం బంజారాహిల్స్‌లోని ఎన్‌బీటీ నగర్‌లో ప్రీ మాన్సూన్ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇంట్లో ఉన్న చెత్తను తప్పనిసరిగా స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలని, బహిరంగ ప్రదేశాల్లో పారబోయవద్దని, డస్ట్ బిన్స్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. భవన నిర్మాణ వ్యర్థాలను కూడా రోడ్డుపై వేయొద్దని, ఫోన్ చేసి సమాచారం ఇస్తే జీహెచ్ఎంసీ సీ అండ్ డీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ వారే తీసుకువెళ్తారన్నారు. బంజారాహిల్స్ వార్డులో ఎన్‌బీటీ నగర్, భోళానగర్, ఉదయ్‌నగర్, ఖాజానగర్, శ్రీరామ్‌నగర్‌లలో ఇళ్లు కట్టుకోవడానికి అనుమతులు ఇచ్చామని, నిర్మాణ సందర్భంగా ఏర్పడిన వ్యర్థాలను రోడ్డుపైన గానీ, నాలాల్లోగానీ వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బయట వేయడం మూలంగా ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ఇంకుడుగుంతలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలు వద్దని, ఎన్నికల సందర్భంలో మాత్రమే అవి ఉండాలన్నారు. పరిశుభ్రతకు అందరూ ఏకమై నగరాన్ని స్వచ్ఛ హైదరాబాద్‌గా నెలకొల్పేందుకు సహకరించాలని కోరారు. దోమల బెడదను నివారించేందుకు ముందస్తుగానే అన్ని కాలనీల్లో ఫాగింగ్ చేస్తారని మేయర్ తెలిపారు.

150 వార్డుల్లో క్లీనింగ్‌కు చర్యలు

అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్ మాట్లాడుతూ ప్రీ శానిటేషన్ డ్రైవ్‌లో బంజారాహిల్స్‌ను 3 నుంచి 5 రోజుల్లో క్లీన్ చేయనున్నట్లు చెప్పారు. గ్రేటర్ ఉన్న 150 వార్డులను క్లీన్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జలమండలి జీఎం హరిశంకర్ మాట్లాడుతూ వర్షాకాలంలో పబ్లిక్, వర్కర్ సేఫ్టీకి ప్రాధాన్యనిచ్చామని చెప్పారు. వాటర్ లాగింగ్ ఏరియాలో రెడ్ కలర్‌లో ఉన్న మ్యాన్‌హోళ్లను ప్రజలు తెరవవద్దని సూచించారు. జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఈసారి వర్షాలు ముందుగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు, ఫాగింగ్ లాంటి చర్యలు తీసుకుంటామన్నారు. నీటినిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

– అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్

లక్డీకాపూల్: ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగర నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమస్యలపై అందించిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల అర్జీలను అధికారులు బాధ్యతతో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో 62 విన్నపాలు, ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు వచ్చాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 104 అర్జీలు దాఖలయ్యాయి. సమావేశంలో అడిషనల్ కమిషనర్లు యాదగిరిరావు, అశోక్ సామ్రాట్, వేణుగోపాల్‌రెడ్డి, అడిషనల్ సీసీపీలు గంగాధర్, వెంకన్న, ఎల్.ఏ.ఓ రాము నాయక్, హార్టికల్చర్ అధికారి సునంద, ఎలక్ట్రిసిటీ ఈఈ మమత, డిప్యూటీ సీఈలు పనస రెడ్డి, పీవీ రావు, హౌసింగ్ ఈఈ రాజేశ్వర రావు, జాయింట్ కమిషనర్ రెవెన్యూ మహేష్ కులకర్ణి, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, ఏఎంసీ జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆదివాసీ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర డెమోక్రటిక్ ఫోరం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండను ఆపడంతోపాటు శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో అత్యాచారాలు జరిగినా ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలేదని విచారం వ్యక్తం చేశారు. దేశభక్తి పేరుతో నడుపుతున్న నాటకాన్ని వెంటనే ఆపాలన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యవర్గ సభ్యులు ఎం.హన్మేష్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఆలోచించకుండా, చట్టాలతో సంబంధం లేకుండా వేలాది మంది సైన్యాన్ని దింపి హింసను కొనసాగిస్తున్నారని విమర్శించారు. దేశంలో అసమానతలు, పేదరికం ఎందుకున్నాయనే అంశాలపై చర్చించకుండా మావోయిస్టులను అంతం చేయాలనే లక్ష్యంతో ముందుకుపోవడం సరైనది కాదన్నారు. రైతాంగానికి, కార్మిక వర్గానికి వ్యతిరేకంగా చట్టాలు ఎందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. టీఎస్‌డీఎఫ్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎ.వినాయక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌పీ రాష్ట్ర నాయకులు జానకిరాములు, కృష్ణ ప్రసాద్, ప్రదీప్, ఆరెల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్ అందాలకు ముగ్ధులైన ఆఫ్రికన్లు



సాక్షి, సిటీబ్యూరో: విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 5 రోజుల పర్యటనకుగాను నగరానికి వచ్చిన ఆఫ్రికా దేశాల ప్రతినిధులు సోమవారం చార్మినార్‌ను సందర్శించారు. ఆఫ్రికా ఖండంలోని మధ్య, పశ్చిమ ఆఫ్రికా దేశాల కంటెంట్ క్రియేటర్లు చార్మినార్, సాలార్జంగ్ మ్యూజియం, గోల్కొండ కోటలను సందర్శించారు. నాలుగువందల ఏళ్ల నాటి చార్మినార్ నిర్మాణ కౌశలాన్ని తెలుసుకుని అబ్బురపడ్డారు. తమ కెమెరాల్లో చార్మినార్ అందాలను బంధించారు. సాలార్జంగ్ మ్యూజియంలోని నిజాంకాలానికి చెందిన వస్తువులు, ఫర్నిచర్, శిల్పాలు, చిత్రలేఖనాలు, లిఖితప్రతులు, పింగాణీ వస్తువులు, వస్త్రాలు, గడియారాలు, ఏనుగు దంతాల కళాకృతులు, లోహపు వస్తువులతోపాటు మ్యూజియంలో భారతీయ కళలు, యూరోపియన్ పెయింటింగ్స్, మిడిల్ ఈస్టర్న్ పురాతన వస్తువులు, ఓరియంటల్ కళాఖండాలు వంటి వస్తువులను ఆసక్తిగా తిలకించారు. మనిషి బొమ్మ వచ్చి గంట మోగించే మ్యూజికల్ క్లాక్‌ను వీక్షించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో పాల్గొన్న దక్షిణాఫ్రికా కంటెంట్ క్రియేటర్ యోవానీ నాయుడు శతాబ్దాల నాటి తమ మూలాలను గుర్తు చేసుకున్నారు. ఆమె తండ్రి తెలుగు వ్యక్తికాగా, తల్లి తమిళనాడుకు చెందినవారు. వారి పూర్వీకులు శతాబ్దాల క్రితమే ఆఫ్రికాకు వలస వెళ్లారు. యోవానీ నాయుడు ఆరో తరానికి చెందిన మహిళ కావడం విశేషం. ఆమెకు తెలుగు, తమిళభాషలు రాకపోయినప్పటికీ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను మాత్రం పాటిస్తున్నారు. ఆమె వెస్టన్, ట్రెడిషన్ సంగీతాన్ని మేళవిస్తూ మ్యూజిక్, కల్చర్, లాంగ్వేజ్‌ను ప్రమోట్ చేస్తున్నారు. ఆమె తెలుగు పాటలు చక్కగా పాడగలరు. టాలీవుడ్, కోలీవుడ్ లకు గ్రేట్ ఫ్యాన్‌ను అని చెబుతూ మురిసిపోయారు.

మహమూద్ అలీని పరామర్శించిన కేటీఆర్



మహమూద్ అలీని పరామర్శిస్తున్న కేటీఆర్, ఆనంద్ కుమార్ గౌడ్ తదితరులు

అబిడ్స్: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ హోంమంత్రి మహమూద్ అలీని మాజీమంత్రి కేటీఆర్ పరామర్శించారు. కొద్దిరోజులుగా వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న మహమూద్ అలీ అబిడ్స్ చాపల్ రోడ్డులోని మల్లారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం కేటీఆర్ ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. కేటీఆర్ వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్ కుమార్, ప్రియా గుప్తా, అహ్మద్, ప్రదీప్‌రాజ్, టంపు, శైలేష్, గణేష్ తదితరులు ఉన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 27, మే, 2025

అమెరికా వేదికపై మెరిసిన
తెలుగు అందం

మిస్ తెలుగు యూఎస్ఏ రన్నర్‌గా చూర్ణికా ప్రియ



- అగ్రరాజ్యం మెచ్చిన అందం ఏఎస్‌రావునగర్ సొంతం
- తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో అందాల పోటీలు
- ఈ నెల 26న రన్నరప్ కిరీటాన్ని అందుకున్న యువతి

కాప్రా: అగ్రరాజ్యం వేదికపై తెలంగాణ తేజం మెరిసింది. అమెరికా మెచ్చిన అందం మన హైదరాబాద్ ఏఎస్‌రావునగర్‌కు చెందిన చూర్ణికా ప్రియ కొత్తపల్లి సొంతం. ఓ వైపు చదువులో రాణిస్తూనే.. మరోవైపు అందాల పోటీల్లో దూసుకెళ్లింది. ఎంఎస్ కోసం అమెరికా వెళ్లిన చూర్ణికా ప్రియ డల్లాస్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మిస్ తెలుగు యూఎస్ఏ–2025 పోటీల్లో రన్నరప్‌గా నిలిచింది. పుట్టింది పశ్చిమగోదావరి భీమవరం. పెరిగింది హైదరాబాద్ ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని భవానీనగర్‌లో.. తల్లిదండ్రులు కొత్తపల్లి రాంబాబు, వనజ ప్రోత్సాహంతో హైదరాబాద్ గీతం యూనివర్సిటీలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసిన తర్వాత ఎంఎస్ కోసం అమెరికా వెళ్లింది. సెంట్రల్ ఫ్లోరిడా యూనివర్సిటీలో ఎంఎస్ చేస్తున్న ఆమె ప్రపంచ స్థాయిలో ప్రతిభ కనబర్చాలని నిర్ణయించుకుంది. డల్లాస్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మిస్ తెలుగు యూఎస్ఏ–2025లో పాల్గొంది. ఈ పోటీల్లో మొత్తం 5,300 మంది పాల్గొన్నారు. ఇందులో ఫైనల్‌కు 20 మంది యువతులు ఎంపికయ్యారు. ఆ తర్వాత టాప్–5, టాప్–3లో చోటు దక్కించుకుని సోమవారం తెల్లవారుజున(అమెరికాలో ఆదివారం అర్ధరాత్రి) జరిగిన గ్రాండ్ ఫైనల్‌లో రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్ పోటీలకు ప్రముఖ సింగర్ గీతామాధురితో పాటు మరొకరు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అంతేకాదు.. ప్రతిష్టాత్మకమైన పీపుల్స్ చాయిస్ అవార్డును కూడా సొంతం చేసుకున్నారు. చిన్నప్పటి నుంచి ఆమెకు క్లాసికల్ డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. ఆ తర్వాత మోడలింగ్‌పై ఆసక్తి పెంచుకుంది.

చాలా సంతోషంగా ఉంది

తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ వేదికపై చాటాలనే లక్ష్యంతో చూర్ణికా ప్రియ ఈ పోటీల్లో పాల్గొంది. మిస్ తెలుగు యూఎస్ఏ–2025లో పాల్గొన్నట్లు మొదట మాకు తెలియదు. టాప్–20లో సెలక్ట్ అయిన తర్వాత మాకు చెప్పింది. చిన్నప్పటి నుంచి క్లాసికల్ డ్యాన్స్ అంటే ఎంతో ఇష్టం. తర్వాత మోడలింగ్‌పై ఆసక్తి పెంచుకుంది. తన ఇష్టాలను ఎప్పుడూ కాదనలేదు. తనకు నచ్చిన రంగంలో రాణించేలా ప్రోత్సహిస్తున్నాం. టాప్–3లో ఉన్నాను ఫైనల్‌కు సెలక్ట్ అయ్యాను చెప్పింది. తర్వాత ఫోన్ చేసి ఫైనల్‌లో రన్నరప్‌గా నిలిచాను అని చెప్పడం చాలా సంతోషంగా ఉంది.

– కొత్తపల్లి రాంబాబు, తండ్రి

బంగారం మెరుపులు



శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లో వింధ్య గోల్డ్‌ను నటి ధన్య బాలకృష్ణ సోమవారం సందర్శించారు. గోల్డ్ అండ్ సిల్వర్ బార్ చాలెంజ్ ఈవెంట్‌లో సందర్శకులతో కలిసి ఆమె ఉత్సాహంగా పాల్గొన్నారు. అరుదైన కార్యక్రమాలు ఎప్పటికీ గుర్తుంటాయని ఆమె పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి బంగారు, వెండి నాణేలు అందజేశారు.

– గచ్చిబౌలి





గ్రీన్ రిలేషన్..

ఇచ్చిపుచ్చుకోవడం ఓ ట్రెండ్

నగరంలో టెర్రస్ గార్డెనింగ్(మిద్దె పంట) ఒక ట్రెండ్‌గా, సరికొత్త జీవనశైలిగా మారిన విషయం విధితమే. ఇందులో భాగంగానే నగరంలోని భవనాలు పచ్చదనం అల్లుకుంటున్నాయి. అపార్ట్‌మెంట్లు, ఇండిపెండెంట్ హౌస్ అనే తేడా లేకుండా అవకాశం ఉన్న ప్రతీ ఇంటిపై చిన్న తోట ఉండాలనే ఆకాంక్ష ఒక్కొక్కరి హృదయంలోనూ నాటు వేస్తోంది. ప్రస్తుతం నగరంలోని మిద్దె తోటల ప్రేమికులు వర్షాకాలాన్ని స్వాగతించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది వర్షాలు కాస్త ముందుగానే కురవడం, ఈ తొలకరి జల్లులు వారి ఆనందాన్ని రెట్టింపు చేస్తోంది. ఈ సందర్భంగా మొక్కలు నాటడానికి అనువైన ఈ సమయాన్ని వినియోగించుకోవడానికి విత్తన సేకరణ మొదలుపెట్టారు.

- సాక్షి, సిటీబ్యూరో

- తొలకరి జల్లులతో విత్తన సేకరణ ప్రారంభం
- సోషల్ మీడియా వేదికగా పలు గ్రూపులు
- నగరంలో టెర్రస్ గార్డెనర్స్ కోకొల్లలు
- విత్తనాలు మార్చుకోవడానికి కార్యక్రమాలు

వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో నగరవ్యాప్తంగా విత్తనాల సేకరణ మొదలైంది. పాత కాలపు 'నువ్వు ఇస్తే.. నేను ఇస్తా' పద్ధతిలో విత్తనాల మార్పిడి జరుగుతోంది. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా ఈ విత్తన మార్పిడికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. సోషల్ యాప్స్‌లో వందలు, వేల మందితో ఉన్న మిద్దెపంట గ్రూపులు ఈ విత్తన సేకరణపై దృష్టి సారించాయి. ప్రముఖ సోషల్ మీడియా గ్రూపులు వాట్సప్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్ వంటి వాటిల్లో ఎంతో చురుగ్గా వ్యవహరిస్తున్నాయి. ఈ విత్తనాల మార్పిడి సంస్కృతి మొక్కల కోసం మానవ సంబంధాలు పెరిగే సూచికగా మారాయి. ఈ గ్రూపుల సభ్యులు తమ వద్ద ఉన్న హెయిర్‌లూమ్ సీడ్స్, దేశీ విత్తనాలను ఇతరులకు పంచిపెడుతున్నారు. అయితే హైబ్రిడ్ విత్తనాలకు బదులుగా జెనెటిక్ డైవర్సిటీని నిలబెట్టే పద్ధతుల వైపు మొగ్గుచూపుతుండటం విశేషం.



మీట్స్‌తో పాటు అవగాహన

ఈ నెలాఖరులో నగరంలోని బేగంపేటలో ఒక సీడ్ స్వాప్ మీట్‌ను నిర్వహించనుంది. ఇక్కడ ఎటువంటి డబ్బు లావాదేవీలు ఉండవు. ఇది పూర్తిగా మార్పిడి పద్ధతిపై ఆధారపడిన సదస్సు. దీనితో పాటు జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్, ఎస్ఆర్ నగర్, ఈసీఐఎల్ వంటి ప్రాంతాల్లో విత్తన మార్పిడి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే పలు గ్రూపుల్లో ప్రణాళికలు రూపొందించారు. ఈ మీట్‌లో విత్తనాల మార్పిడితో పాటు విత్తన భద్రతా పద్ధతులు, కంపోస్టింగ్ టెక్నిక్స్, ఇండోర్ ప్లాంట్స్ గురించి అవగాహన, జీరో వేస్ట్ గార్డెనింగ్ వంటి అంశాలపై చిన్న చిన్న సెషన్లు కూడా నిర్వహిస్తారు. విత్తనాల మార్పిడి ద్వారా కేవలం మొక్కలు మాత్రమే కాదు, ఆత్మీయ సంబంధాలు కూడా నాటుతున్నారు.

సిటీలో పచ్చదనపు స్పర్శ

టెర్రస్ గార్డెనింగ్ నగరానికి కొత్త కాకపోయినా, కోవిడ్ తర్వాత ఈ సంస్కృతి విస్తృతమైంది. ఇంటింటా పిల్లలకు మొక్కల తాలూకు పరిచయం కలిగిస్తూ, విత్తనాలు నాటే పద్ధతులపై అవగాహన పెరుగుతోంది. కొన్ని గ్రూపులు ప్రత్యేకంగా కిడ్స్ సీడ్ స్వాప్ సెగ్మెంట్లు ఏర్పాటు చేస్తున్నాయి. ఇది పాత తరం జీవితానికి దగ్గరగా చేరే ఒక మార్గం కావడంలో సందేహం లేదు. ''ఇది మాకు ఆహారం కోసం మాత్రమే కాదు, మనశ్శాంతి కోసం కూడా'' అని అంటున్నారు హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన మిద్దె పంట ప్రేమికురాలు సూర్యప్రభ. శ్రమకోర్చి నాటిన విత్తనాలు తర్వాత మొలక వేసిన మొక్కను చూడటం, తన చేతులతో పండించిన కూరగాయలను ఇంట్లో వండుకోవడం వల్ల కలిగే ఆనందం మాటల్లో వర్ణించలేనిదని ఆమె పేర్కొన్నారు.



ఇంటికి అనువైన మొక్కలు

ఈ వర్షాకాలంలో మిద్దె తోటల ప్రేమికులు ప్రధానంగా కూరగాయలు, పూల మొక్కలు, హెర్బ్స్‌ను నాటేందుకు సన్నద్ధమవుతున్నారు. ముఖ్యంగా గోంగూర, బీరకాయ, దోసకాయ, ముల్లంగి, మిరపకాయ, టమోటా వంటి కూరగాయలు పెంచడానికి ఆసక్తి చూపిస్తున్నారు. జూహీ, చామంతి, గులాబీ, హిబిస్కస్ వంటి పూల మొక్కలతో పాటు తులసి, కరివేపాకు, వెల్లుల్లి కాడ, ధనియాల మొక్క, అలవేరా వంటి హెర్బ్స్ పెంచడానికి ఇష్టపడుతున్నారు. తక్కువ స్థలంలో, కంటైనర్లలో సులభంగా పెరగడం ఈ మొక్కల ప్రత్యేకత. అలాగే ఈ మొక్కల వాసన, ఆకృతి, వండినప్పుడు వచ్చే రుచి, ఆరోగ్య ప్రయోజనాలు మిద్దె తోటల ప్రాధాన్యతను మరింత పెంచుతున్నాయి.





అలరించిన.. స్పాట్‌లైట్..

సాక్షి, సిటీబ్యూరో: ఆహ్లాద సాయంత్రానికి ఆనందాన్ని జతచేసిన ఆ వినసొంపైన సంగీతం.. నగరవాసుల్ని అలరించింది. ప్రముఖ మోటారు వాహనాల సంస్థ హ్యుందయ్ మోటార్ లిమిటెడ్(హెచ్ఎంఐఎల్) ఆధ్వర్యంలో నార్సింగిలోని కన్వెన్షన్స్ అండ్ ఎగ్జిబిషన్స్‌లో నిర్వహించిన 'స్పాట్‌లైట్' సంగీత కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉత్తరాది సంగీతజ్ఞులు కార్తీక్, నరేష్ అయ్యర్ పాల్గొని తమ గానంతో అహుతులను అలరించారు. ఈ సందర్భంగా హ్యుందయ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ మాట్లాడుతూ కొంతకాలంగా తమ వాహనాల పట్ల ఆదరణ చూపిస్తున్న నగరవాసులకు మరపురాని అనుభూతి అందించడం కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు.

అమ్మబాటలో.. రికార్డుల వేటలో..

శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః అన్నారు పెద్దలు. అంటే శిశువులు, పశువులే కాదు.. పాములు కూడా సంగీతాన్ని ఆస్వాదిస్తాయట. అదీ సంగీతానికి ఉన్న మహత్యం అని చెబుతుంటారు. గానంతో మేఘం వర్షిస్తుంది.. అగ్ని ప్రజ్వలిస్తుంది అంటారు. అందులో నిజమెంతుందో తెలియదు గానీ, అప్పదెప్పుడో ఆ తల్లి నేర్చుకున్న సంగీత ఓనమాలను ఆమె పిల్లలు పట్టేశారు. పెళ్లి, పిల్లలు తర్వాత కూడా ఆటవిడుపుగా నేర్చుకున్న ఆ సంగీతాన్ని ఇద్దరు చిన్నారులు అవపోసన పట్టేశారు. ఇప్పుడు తల్లితో పాటు ఆ గారాలపట్టీలు ఇద్దరూ అరుదైన రికార్డును సొంతం చేసుకుని అందరి దృష్టినీ ఆకర్షించారు. 18 దేశాలకు చెందిన కీబోర్డు కళాకారులు పాల్గొన్న కార్యక్రమంలో ఒకే కుటుంబానికి చెందిన ఆ ముగ్గురికి అరుదైన గౌరవం దక్కింది. కేపీహెచ్‌బీకాలనీ ఐదో ఫేజ్‌కు చెందిన తల్లి మేడిది లలితకుమారి తన ఇద్దరు కుమార్తెలు ఎనిమిదేళ్ల లీషా ప్రజ్ఞ, ఐదేళ్ల మేడిది అభిజ్ఞతో కలిసి గిన్నిస్ బుక్ ఆఫ్ ది వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు.

- కేపీహెచ్‌బీకాలనీ



పియానోలో తల్లి, ఇద్దరు కూతుళ్ల ప్రతిభ

గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

మేడిది జానకిరామరాజు, లలితకుమారి దంపతులు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా అమలాపురం సమీపంలోని కొమరగిరి పట్నంలో లలితకుమారి తన ఏడో ఏటా పియానో వాయించడం నేర్చుకున్నారు. అప్పట్లో కేవలం రెండు పాటలు మాత్రమే నేర్చుకోగా పెళ్లి అనంతరం కీ బోర్డు కొనుక్కుని స్వతాహా నేర్చుకోవడం మొదలు పెట్టారు. ఆన్‌లైన్ తరగతులకు హాజరై కీబోర్డుపై మరింత పట్టు సాధించారు. ఆమె ఆసక్తిని గమనించి భర్త జానకిరామరాజు కూడా ప్రోత్సాహాన్ని అందిస్తూ వచ్చారు. లలిత కుమారి సాధన చేస్తుంటే తన ఇద్దరు కుమార్తెలు లిషా ప్రజ్ఞ, అభిజ్ఞలు సైతం అనుసరించడం మొదలుపెట్టారు. వారు కూడా తల్లి ఇంట్లో పియానో కీబోర్డుపై ప్రాక్టీస్ చేయడం చూసి వారికి కూడా ఆసక్తి కలిగింది. ఇంకేం.. వారు సైతం బుల్లి పియానో కీబోర్డు కొనిపించుకుని తల్లితో పాటు ఆన్‌లైన్ క్లాసులకు హాజరై నైపుణ్యాన్ని పెంపొందించుకున్నారు.





తైక్వాండో, స్విమ్మింగ్‌లో సైతం ప్రతిభ

అక్కా చెల్లెళ్లు లిషాప్రజ్ఞ, అభిజ్ఞలు తైక్వాండోలో సైతం రాణిస్తున్నారు. తైక్వాండో నేర్చుకుంటున్న అకాడమీలో జరిగిన ఏజ్ గ్రూప్ పోటీల్లో బంగారు పతకాలను సాధించి నేటితరం చిన్నారులకు స్ఫూర్తిగా నిలిచారు. అంతేకాకుండా ఇద్దరు చిన్నారులు స్విమ్మింగ్‌లో సైతం రాణిస్తుండటం గమనార్హం. లిషా ప్రజ్ఞ సంస్కృతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో నాల్గో తరగతి చదువుతుండగా, అభిజ్ఞ మాంటిస్సోరి స్కూల్‌లో కిండర్ గార్టెన్‌లో చదువుతోంది.

గిన్నిస్ బుక్ ఆఫ్ ది వరల్డ్ రికార్డు

తల్లీ కూతుళ్లు గత ఏడాది డిసెంబర్ 1న గిన్నిస్ బుక్ ఆఫ్ ది వరల్డ్ రికార్డు సృష్టించడానికి హాలెల్ మ్యూజిక్ స్కూల్ విద్యార్థులతో కలిసి గంట వ్యవధిలో ఇన్‌స్టాగామ్ వేదికగా వీడియోలను అప్‌లోడ్ చేశారు. దీనికి లండన్‌లోని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అధినేత రిచర్డ్ స్టన్నింగ్ విజేతలను ప్రకటించగా, అందులో తల్లి, తన ఇద్దరు కూతుళ్లు ఉండటం విశేషం. డిసెంబర్ 9న లండన్ నుంచి జూమ్ మీటింగ్ ద్వారా రిచర్డ్ స్టన్నింగ్ వారిని అభినందించారు. ఈ ఏడాది ఏప్రిల్ 14న మణికొండలో జరిగిన వేడుకల్లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధి ఆనంద్ రాజేంద్రన్, హాలెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు అంగస్టీన్ దండింగి సర్టిఫికెట్లు, పతకాలను అందజేశారు. అతి పిన్న వయస్సులోనే ఈ రికార్డు నెలకొల్పినందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులను అభినందించారు.

క్లుప్తంగా...

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధం: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు సన్నద్ధమైందని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్‌కు 90,000 క్వింటాళ్లు, నేషనల్ సీడ్ కార్పొరేషన్‌కు 40,000 క్వింటాళ్లకు ఇండెంట్ ఇచ్చినట్టు వెల్లడించారు. ఈ మేరకు మంత్రి సోమవారం అధికారులతో సమావేశమయ్యారు. 32 జిల్లాల్లో 20 జిల్లాలు టీజీ సీడ్స్‌కు, 12 జిల్లాలు నేషనల్ సీడ్ కార్పొరేషన్‌కు కేటాయించగా, తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ఇప్పటివరకు 71,535 క్వింటాళ్లను తెప్పించి వారికి కేటాయించిన 20 జిల్లాల్లో పంపిణీ ప్రారంభించినట్లు వివరించారు. మిగతా 12 జిల్లాల్లో కూడా సరఫరా ప్రారంభించాలని, ఆ జిల్లా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తుమ్మల ఆదేశించారు.

ట్రాన్స్‌జెండర్లకు ఇందిరమ్మ ఇళ్లు: సీతక్క



సాక్షి, హైదరాబాద్: ట్రాన్స్‌జెండర్లకు వికలాంగుల కోటా కింద ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని రాష్ట్ర మంత్రి సీతక్క ప్రకటించారు. హైదరాబాద్ ట్రాఫిక్ విభాగంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్ల సేవలు ప్రారంభమై ఆరు నెలలు పూర్తయింది. ఈ నేపథ్యంలో సీతక్క సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్లకు సమాన అవకాశాలు కల్పించి, అందరినీ సమాజంలో భాగం చేయడమే తమ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ విభాగంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ట్రాన్స్‌జెండర్లు రాజీ లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారని సీపీ ఆనంద్ ప్రశంసించారు.

పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్‌లు తొలగించండి

మంత్రి సీతక్కతో పంచాయతీ కార్యదర్శుల చర్చలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు గ్రేడ్లు లేనందున పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్‌లు తొలగించాలని 'తెలంగాణ పంచాయత్ సెక్రటరీస్ ఫెడరేషన్'డిమాండ్ చేసింది. లేనిపక్షంలో ప్రస్తుతం నాలుగు గ్రేడ్‌లుగా ఉన్న కార్యదర్శులను గ్రేడ్ 1, 2గా వర్గీకరిస్తూ కేడర్ స్ట్రెంత్‌ను నిర్ణయించి పదోన్నతులు ఇవ్వాలని కోరింది. ఈ మేరకు సచివాలయంలో సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అధ్యక్షతన పంచాయత్ కార్యదర్శుల ఫెడరేషన్‌తో భేటీ జరిగింది. పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్‌కుమార్, కమిషనర్ సృజన పాల్గొన్న ఈ భేటీలో ఫెడరేషన్ పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. తాము లేవనెత్తిన అంశాలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారని ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్ 'సాక్షి'కి తెలిపారు.

కాకాణి గోవర్ధన్‌రెడ్డికి 14 రోజుల రిమాండ్



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వైఎస్సార్‌సీపీ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి 14 రోజుల పాటు జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ తిరుపతి జిల్లా వెంకటగిరి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. పొదలకూరు మండలం తాటిపర్తి గ్రామంలో ఉన్న రుస్తుం మైన్స్‌లో తవ్వకాలకు సంబంధించి కాకాణిపై అక్రమ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఆయనను కర్ణాటక రాష్ట్రం చింతామణిలోని వెంకటాపురం ఫామ్‌హౌస్‌లో ఉండగా అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. సోమవారం వెంకటగిరి కోర్టులో హాజరుపరిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి 14 రోజుల పాటు కాకాణికి రిమాండ్ విధించారు. దీంతో ఆయనను పోలీసులు వెంకటాచలం మండలం చెముడుగుంటలో ఉన్న సెంట్రల్ జైలుకు తరలించారు.

బీసీల సంఘటిత శక్తితో సమానత్వాన్ని సాధిస్తాం

బీసీ రాజ్యాధికార వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: కోటి సభ్యత్వాల నమోదును పూర్తి చేసి బీసీల సంఘటిత శక్తితో రాష్ట్రంలో సమానత్వాన్ని సాధిస్తామని బీసీ రాజ్యాధికార వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ తెలిపారు. కోటి సభ్యత్వాల కార్యక్రమంపై సోమవారం బాగ్‌లింగంపల్లిలో పలు జిల్లాల ముఖ్య నాయకులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీల సమైక్యతను, సంఘటిత శక్తిని పెంపొందించే దిశగా ప్రతిష్టాత్మకంగా 'బీసీల కోటి సభ్యత్వ నమోదు'కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించామన్నారు. బీసీ రాజ్యాధికార సాధన కోసం మొదటి విడతగా 10 లక్షల మంది కార్యకర్తల సభ్యత్వ నమోదును జూన్ చివరి వరకు పూర్తి చేస్తామన్నారు.

ఏపీలో దళిత, మైనార్టీల ఆత్మగౌరవంపై బాబు సర్కార్ 'బూటు' దెబ్బ

- తెనాలి పట్టణంలో ముగ్గురు దళిత, మైనారిటీ యువకులపై థర్డ్ డిగ్రీ
- నడి రోడ్డుపై..పట్టపగలే..ప్రజల కళ్లెదుటే..అరికాళ్లపై లాఠీలతో స్వైరవిహారం
- ఒక సీఐ బూటు కాలితో తొక్కి పెట్టగా.. మరో సీఐ దాష్టీకం

అంబేద్కర్ మహనీయుడు రాసిన రాజ్యాంగాన్ని కాలరాసి.. రెడ్‌బుక్ రాజ్యాంగం రాక్షసత్వాన్ని ఆచరణలో చూపిస్తూ.. పట్టపగలే.. ఆటవిక పాలనకు అచ్చమైన ప్రతిరూపంలా.. కూటమి ఏడాది దాష్టీక పాలనలో దమనకాండకు అద్దంపడుతూ..

దళిత, మైనార్టీ, బడుగు యువకులపై పోలీస్ లాఠీ కర్కశత్వం చూపింది

ఒక సీఐ కొడుతుంటే.. ఇంకో సీఐ కాళ్లతో తొక్కి కదలకుండా పట్టుకుంటాడు.. మరో పోలీసు వీడియో తీస్తాడు. ఇంకో పోలీసు విరిగిన లాఠీల స్థానంలో ఎడతెగని ఉత్సాహంతో కొత్త కట్టెలు అందిస్తాడు.. చుట్టూ ఉన్న పోలీసులు దెబ్బలు తింటున్న దళిత, ముస్లిం యువకులను చూసి పగలబడి నవ్వుతుంటారు.

ఇదీ కూటమి పాలనలో దళితులు, ముస్లింలు, బడుగుల పట్ల చంద్రబాబు సర్కారు దాష్టీకానికి నిలువెత్తు రూపం

ఈ రాష్ట్రంలో మహనీయుడు అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే అమల్లో ఉందా లేక రెడ్ బుక్ పేరిట ఎస్సీలను, ఎస్టీలను, బీసీలను, మైనార్టీలను బహిరంగంగా చితక్కొట్టే లోకేశ్ రాజ్యాంగం అమల్లోకి వచ్చిందా?

కొట్టీ కొట్టీ చివరికి లాఠీలు విరిగిపోతే కొత్త లాఠీలు తెచ్చుకుని మరీ కొట్టడం స్టేట్ టెర్రరిజం కాదా? ఇది హృదయం లేని పాలన కాదా?

దళితులు, ముస్లింలు, బడుగులను బహిరంగంగా లాఠీలతో చావమోదడమే విజయమని మీరు భావిస్తుంటే..

చంద్రబాబూ మీరు ఈ గద్దెకు అర్హులు కాదు. మీది పాలన కాదు పీడన

తెనాలి నడిరోడ్డుపై పోలీసుల చేతుల్లో చావుదెబ్బలు తిన్న ఆ పేద దళిత, ముస్లిం యువకుల అరుపులు మీకు వినిపించకపోతే..

ప్రాణభయంతో అన్నా కొట్టొద్దు అంటూ విలపించిన వారి కన్నీళ్లు మీకు కనిపించకపోతే...

ఆ యువకుల ఒంటినుంచి కారిన రక్తపు బిందువులే రేపు మీ పాలనను కడతేర్చే మహా విప్లవమవుతాయి.. తస్మాత్ జాగ్రత్త!



యువకులను నడి రోడ్డుపై కూర్చోబెట్టి అరికాళ్లపై లాఠీలతో కొడుతున్న సీఐలు

- ఆలస్యంగా వెలుగులోకి.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో
- బరితెగింపులో సీఎం చంద్రబాబు బాటలోనే రాష్ట్ర పోలీస్‌లు
- రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో హద్దుమీరుతున్న వైనం
- పోలీసుల తీరు ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘనే
- చంద్రబాబుకు సీఎంగా కొనసాగే అర్హత ఏమాత్రమూ లేదు
- ఏపీలో రాక్షస రాజ్యం నడుస్తోందని దళిత సంఘాల తీవ్ర ఆగ్రహం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న సీఎం చంద్రబాబు బాటలోనే పోలీసులు బరితెగించి దళిత, మైనార్టీ, బడుగులపై విరుచుకుపడుతున్నారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి నుంచి క్షేత్రస్థాయి కానిస్టేబుల్ వరకు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో పోటీ పడుతున్నారు. కంచే చేను మేసిన చందంగా చట్టాన్ని పరిరక్షించాల్సిన పోలీసులే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్న వైనం గుంటూరు జిల్లా తెనాలిలో చోటుచేసుకుంది. మానవ హక్కులను నడి వీధిలో నేలరాస్తూ పోలీస్ లాఠీ స్వైర విహారం చేసింది. ముగ్గురు దళిత, మైనారిటీ యువకులపై శరీరాలపై వీరంగం వేసింది. బహిరంగంగా నలుగురూ చూస్తుండగానే కర్కశంగా విరుచుకుపడింది. ఆ వీడియో చూస్తుంటే ప్రతి ఒక్కరికీ ఒళ్లు గగుర్పొడుస్తోంది. అసలు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా? ఆటవిక రాజ్యంలో ఉన్నామా? అనే ఆందోళన కలుగుతుంది. యువకులను నడిరోడ్డుపై కూర్చోబెట్టి.. ఇద్దరు పోలీసు అధికారులు లాఠీలతో విచక్షణారహితంగా కొట్టిన ఘటన గుంటూరు జిల్లా తెనాలిలో జరిగింది. యువకుల అరికాళ్లపై పోలీసులు కర్కశంగా లాఠీలతో చితకబాదిన వీడియో సోమవారం వైరల్ అయింది. గత నెలలో జరిగినదిగా భావిస్తున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల చేతిలో చావుదెబ్బలు తిన్నది దళిత, మైనారిటీ యువకులు. వీరిలో ఇద్దరిది తెనాలి కాగా, మరొకడు మంగళగిరికి చెందినవాడని తెలిసింది. వీరిని చిత్రహింసలకు గురిచేసింది తెనాలి టౌ టౌన్ సీఐ రాములునాయక్, త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు.

జనం చూస్తుండగానే.. వేడుకున్నా వదలకుండా..

తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కన్నా చిరంజీవి (పీసీ 6068)పై ఏప్రిల్ 24వ తేదీ రాత్రి నలుగురు యువకులు హత్యాయత్నం చేశారని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడిగా పేర్కొన్న వేము నవీన్ పోలీసులకు దొరకలేదు. చేబ్రోలు జాన్ విక్టర్ (తెనాలి చెంచుపేట), దోమా రాకేష్ (తెనాలి ఐతానగర్), షేక్ బాబులాల్ (అలియాస్ కరిముల్లా, కల్లా, మంగళగిరి)లను ఏప్రిల్ 27వ తేదీ రాత్రి అరెస్టు చేసినట్టుగా రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

అంటే అరెస్టు చూపిన రెండురోజుల ముందే ఏప్రిల్ 25న ముగ్గురు నిందితులను తెనాలి జయప్రకాష్‌నగర్‌లో టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు రెండు ఫర్లాంగుల దూరంలోనే నడిరోడ్డుపై కూర్చోబెట్టి అరికాళ్లపై తీవ్రంగా కొట్టారు. మూడు రోజుల పాటు దళిత, మైనార్టీ యువకులను అదుపులో ఉంచుకుని తెనాలి వీధులన్నీ తిప్పుతూ విచక్షణారహితంగా కొట్టినట్లు కొందరు చెబుతున్నారు. టూ టౌన్ సీఐ రాములు నాయక్ అతి కర్కశంగా యువకుల కాళ్లపై బూటు కాళ్లతో ఎక్కి తొక్కిపెడితే.. త్రీ టౌన్ సీఐ రమేష్‌బాబు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం గమనార్హం. ప్రస్తుతం ఈ కేసులో నిందితులు రిమాండులో ఉన్నారు.

కాళ్లలో రాడ్లు ఉన్నాయని చెబుతున్నా..

ప్రమాదం కారణంగా తన కాళ్లలో, చేతుల్లో రాడ్లు వేశారని దోమ రాకేష్ చెబుతున్నా సీఐలు పట్టించుకోలేదు. కాళ్లు పట్టుకుని ప్రాధేయపడినా పోలీసులు కనికరించలేదు. ఈ ఘటన తెనాలి ప్రజలను భయాందోళనలకు గురిచేసింది. కాగా, ఏదైనా కేసులో అరెస్టు చేసిన నిందితులను కొట్టే అధికారం పోలీసులకు లేదని అనేకసార్లు న్యాయస్థానాలు సైతం చీవాట్లు పెట్టినా రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న పోలీసుల్లో మార్పు రాలేదని పలువురు హక్కుల నేతలు మండిపడుతున్నారు.

పోలీసుల తీరు హక్కుల ఉల్లంఘనే..

దళిత యువకులు, మరే వ్యక్తిపైన అయినా పోలీసులు థర్డ్ డిగ్రీ పద్ధతులు (శారీరక హింస, కొట్టడం, హింసించడం వంటివి) ప్రయోగించడం రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమే అవుతుంది. తెనాలి పోలీసుల తీరును మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రతి వ్యక్తికి జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛను ప్రసాదించింది. ఆర్టికల్ 14 చట్టం ముందు సమానమేనని, దళిత యువకులు, ఏ ఇతర సముదాయానికి చెందిన వ్యక్తులపై అయినా వివక్షతో కూడిన హింస చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. ఆర్టికల్ 15 జాతి, కులం, మతం, లింగం, జన్మస్థానం ఆధారంగా వివక్ష చూపడాన్ని నిషేధించింది. దళితులను లక్ష్యంగా చేసుకుని హింస చేయడం ఈ ఆర్టికల్స్‌ను ఉల్లంఘించడమే అవుతుంది.

- క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ)లోని సెక్షన్ 41 ప్రకారం అరెస్టు చేసే సమయంలో పోలీసులు తగిన కారణం లేకుండా హింసను ఉపయోగించకూడదు. థర్డ్ డిగ్రీ పద్ధతులు నిబంధనలకు విరుద్ధం. సెక్షన్ 176 ప్రకారం.. కస్టడీలో హింస, మరణం జరిగితే, దానిపై మేజిస్ట్రేట్ విచారణ నిర్వహించాలని స్పష్టంగా ఉంది.
- ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ) సెక్షన్ 323 ప్రకారం స్వచ్ఛందంగా శారీరక హాని కలిగించడం, సెక్షన్ 324 ప్రకారం ఆయుధాలతో, హానికరమైన పద్ధతుల్లో గాయపరచడం, సెక్షన్ 341 అకారణంగా వ్యక్తిని నిర్బంధించడం, సెక్షన్ 506 బెదిరింపులు, ఒప్పుకోవాలని బలవంతం చేయడం నేరం.
- ప్రధానంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ ట్రైబ్స్ (అత్యాచారాల నివారణ) చట్టం– 1989 (ఎస్సీ, ఎస్టీ యాక్ట్) ప్రకారం.. దళితులపై హింస, అవమానం నేరంగా పరిగణిస్తారు. సెక్షన్ 3(1) ప్రకారం దళితులను లక్ష్యంగా చేసుకుని శారీరకంగా, మానసికంగా హింసించడం కఠిన శిక్షకు దారితీస్తుంది. పోలీసులు దళితులను హింసిస్తే అది వివక్షతో కూడిన నేరం. మానవ హక్కుల చట్టం–1993 ప్రకారం పోలీసుల హింసపై జాతీయ, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లు విచారణ జరిపి చర్యలకు సిఫార్సు చేయవచ్చు.

తెనాలిలో యువకులపై పోలీసుల దాష్టీకం వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఇండస్ట్రీలో ఎవరి దారి వారిదే..!

- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలను అభ్యర్థించాల్సిందే
- పవన్‌కల్యాణ్ తిడితే పడతాం
- ఆ నలుగురిలో నేను లేను
- ప్రముఖ నిర్మాత దిల్ రాజు ప్రకటన



సాక్షి, హైదరాబాద్: సినీ ఇండస్ట్రీలో వాదోపవాదాలు, వ్యాఖ్యలు, అనుమానాలు ఎక్కువైపోతున్న వేళ ప్రముఖ నిర్మాత దిల్ రాజు తనదైన శైలిలో స్పందించారు. 'ఇండస్ట్రీలో ఎవరి దారి వారిదే..'అంటూ ఐక్యత అవసరమని సూచించారు. సమస్యలు ఎదురైనా, పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని అభ్యర్థించాల్సిందే అని పేర్కొన్న ఆయన, 'పవన్ కల్యాణ్ తిడితే పడతాం..'అంటూ చురుకైన వ్యాఖ్యలు చేశారు. థియేటర్ల బంద్ సందర్భంగా వినిపించిన నాలుగు పేర్ల విషయంలో ఆయన స్పందిస్తూ, 'ఆ నలుగురిలో నేనూ లేను' అంటూ తేల్చేశారు. థియేటర్ల బంద్ వార్తలు, ఈ నేపథ్యంలో 'మంచి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారంటూ'ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ పవన్ కళ్యాణ్ కార్యాలయం లేఖ, థియేటర్ల బంద్ వార్తల్లో నిజం లేదంటూ ఫిలిం ఛాంబర్ ప్రకటన, థియేటర్ల బంద్ సరికాదని, 'ఆ నలుగురిలో'తాను లేనని అల్లు అరవింద్ వ్యాఖ్యల నేపథ్యంలో దిల్ రాజు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆయన పేర్కొన్న అంశాల్లో కొన్ని... ''ఇండస్ట్రీకి ఏ సమస్య వచ్చినా ప్రభుత్వాలే పరిష్కరించాలి. వాళ్ళు పెద్దన్న లెక్క. మీకు ఏదైనా..ప్రాబ్లమ్ ఉందా...? మేం సాల్వ్ చేస్తామని ప్రభుత్వాలు అన్నప్పుడే ముందుకు వెళ్లగలుగుతాం. రెండు ప్రభుత్వాలు ఇండస్ట్రీకి పాజిటివ్ గానే ఉంటాయి. ఏపీ సినిమాటోగ్రఫీ మినిస్టర్ కందుల దుర్గేష్ చెప్పారు. ఇక్కడ ఎఫ్‌డీసీ చైర్మన్‌గా నేను చెబుతున్నాను. ఐకమత్యం ఉండాలి. ఛాంబర్‌లోనే కొట్టుకుంటాము. ఒకరు రెంట్ కావాలంటారు. మరొకరు పర్సెంటేజ్ కావాలంటారు. ఇంకొకరు ఏదో కావాలంటారు. మరొకరు వద్దంటారు. మాకు ఐక్యత ఉన్నప్పుడే ప్రభుత్వాల దగ్గరకి వెళ్లి మా సమస్యలను చెప్పుకోగలుగుతాం. ప్రభుత్వాలు ఎప్పుడూ ఇండస్ట్రీకి అండగా ఉంటాయి. అది మనం అర్థం చేసుకుని, ప్రభుత్వాల దగ్గరకు వెళ్లి అభ్యర్థించి, మనకు కావాల్సిన పని చేయించుకోవడమే పద్ధతి. సినిమా పరిశ్రమకు రెండు ప్రభుత్వాలు ముఖ్యమే. సినిమా ఇండస్ట్రీలో తొమ్మిది రోజుల నుంచి జరుగుతున్న పరిణామాలకు ముగింపు పలుకుతున్నట్లుగా మంత్రి దుర్గేష్ ఒక ప్రెస్‌నోట్‌ను విడుదల చేయడం పట్ల చాలా సంతోషంగా ఉంది. తెలుగు సినిమా ఇండస్ట్రీ తరఫున ఒక నిర్మాత, ఒక ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్‌గా నేను వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. సమస్య ఎక్కడో మొదలైంది. మంత్రి ఇచ్చిన ప్రకటనతో సమస్యలన్నీ సద్దుమణిగిపోయాయి. ఈ నెల 30న చాంబర్‌లో ఈసీ మీటింగ్ ఉంది. ఈ మీటింగ్‌లో కమిటీలు వేసుకుని, నిర్ణయాలు తీసుకుని, ఆ కమిటీల ద్వారా ముందుకు వెళ్తాం. బంద్ వల్ల ఎవరూ ఏదీ సాధించలేరు.

ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై ఎల్అండ్‌టీ అభ్యంతరం

- మేడిగడ్డ నిర్మాణంలో నాణ్యత పాటించామని వెల్లడి
- నివేదికలో పలు అంశాలపై ఆక్షేపణ

సాక్షి, హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బరాజ్‌లపై జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదికపై ప్రాజెక్టు నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ–పీఈఎస్ జాయింట్ వెంచర్ (జేవీ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. నివేదికలో ఎత్తిచూపిన అంశాలు లోపభూయిష్టమని పేర్కొంది. మేడిగడ్డ నిర్మాణంలో లోపాలకు సంబంధించి ఈ సంస్థ వివరణ ఇచ్చింది. ఈ మేరకు రామగుండం నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు ఈ జాయింట్ వెంచర్ అధీకృత ప్రతినిధి ఎస్.సురేశ్‌కుమార్ ఒక లేఖ రాశారు. తాము వ్యక్తం చేసిన అభ్యంతరాలపై ప్రభుత్వం సమీక్షించాలని కోరారు. బరాజ్‌ల నిర్మాణ దశలో అన్ని రకాల నాణ్యత చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ పలు అంశాలను తన నివేదికలో తప్పుగా పొందుపరిచిందని అభ్యంతరం వ్యక్తం చేశారు. డ్యామ్ భద్రతా సంస్థ నివేదికలో పేర్కొన్న ఆరు ముఖ్యమైన లోపాల్లో నాలుగు అంశాలకు సంబంధించి ఇదివరకే తగిన ఆధారాలతో వివరించినప్పటికీ, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా నివేదిక ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా నాణ్యత, నియంత్రణలో లోపం ఉందన్న ఆరోపణకు ఎలాంటి ఆధారాలను ఎన్‌డీఎస్‌ఏ నివేదిక చూపలేదని స్పష్టం చేశారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికలో ''గ్రౌటింగ్ పనులు ముందుగానే జరిగిపోయిన కారణంగా అసలు భూమి పరిస్థితులను అంచనా వేయలేకపోయాం''అన్న వ్యాఖ్యలను ఎల్అండ్‌టీ తప్పుబట్టింది. తగిన సాంకేతిక ప్రమాణాలు పాటించామని, ప్రాజెక్టు నిర్మాణానికి ముందు, ఆ తరువాత సమయంలో అన్ని పరీక్షలు, ధ్రువీకరణలు జరిగాయని వెల్లడించింది. ప్రతి దశలో రికార్డెడ్ క్వాలిటీ చెక్స్, ల్యాబ్ టెస్టులు నిర్వహించామని, ఐ క్యాడ్ నుంచి ప్రతీ మూడు నెలలకోమారు సంతృప్తి రిపోర్టు తీసుకున్నామని, మెటీరియల్‌కు సంబంధించి త్రైపాక్షిక పరీక్షలు నిర్వహించామని ఆ సంస్థ వివరించింది. కాగా, తామిచ్చిన వివరణను ప్రభుత్వం పరిశీలించాలని, ఎన్‌డీఎస్‌ఏ నివేదికను సమీక్షించి తప్పులను సరిచేయాలని, కాంట్రాక్టు సంస్థగా తమ హక్కులను కూడా పరిరక్షించాలని సురేశ్‌కుమార్ ఆ లేఖలో కోరారు.

సాగుకు దన్నుగా 'ప్రభుత్వ' బ్యాంకులు

▶ మొదటి పేజీ తరువాయి

నివేదిక ఈ విషయం స్పష్టం చేస్తోంది.

లీడ్‌లో లీడ్ బ్యాంక్

రాష్ట్రంలోని 76 బ్యాంకులు వ్యవసాయ, అనుబంధ రంగాలు, మౌలిక సదుపాయాలకు రుణాలు ఇస్తున్నాయి. ఈ క్రమంలో 2024–25లో రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి రూ.1,52,052 కోట్ల రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లు లక్ష్యంగా పెట్టుకోగా, రూ.1,37,346 కోట్లు మాత్రమే ఇచ్చారు. ప్రభుత్వ రంగంలో లీడ్ బ్యాంక్‌గా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవసాయం, అనుబంధ, మౌలిక సదుపాయాల రంగాల్లో కలిపి అత్యధికంగా రూ.41,630 కోట్లు మంజూరు చేసింది. అయితే కేవలం వ్యవసాయం కోసం పంట రుణాల కింద కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ)ల ద్వారా 15.25 లక్షల మందికి రూ.11,146.35 కోట్లు ఇవ్వడం గమనార్హం. మరే బ్యాంకు దాని దరిదాపుల్లోకి రాలేదు. ఇండియన్ బ్యాంక్ రూ.7,973 కోట్లతో రెండో స్థానంలో ఉండగా, కెనరా బ్యాంకు రూ.5,072 కోట్లతో మూడో స్థానంలో ఉంది. యూనియన్ బ్యాంక్ రూ.2,452 కోట్ల రుణాలను మంజూరు చేయగా, ఆ తర్వాతి స్థానాల్లో బ్యాంక్ ఆఫ్ బరోడా (రూ.1,925.90 కోట్లు), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (రూ.1,116 కోట్లు) ఉన్నాయి. పంజాబ్ సింధు బ్యాంకు కేవలం 28 మందికి రూ.95 లక్షలు మంజూరు చేసింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా తక్కువ మొత్తంలోనే రుణాలు ఇచ్చాయి.

ప్రైవేటు బ్యాంకులు అంతంతే..

ప్రభుత్వ రంగంలోని బ్యాంకులతో పాటు వివిధ రంగాల్లోని బ్యాంకులు కూడా రైతులకు రుణాలు జారీ చేస్తున్నప్పటికీ అందులో పంట రుణాలకు ఇచ్చింది అంతంత మాత్రమే. 21 ప్రైవేటు రంగ బ్యాంకుల్లో కొన్ని జీరో రుణాలకే పరిమితం కాగా, కేవలం ఐదు బ్యాంకులే లక్ష్యాలకు కొంత చేరువగా వచ్చాయి. మిగతా బ్యాంకులన్నీ కలిపితే ఓ మోస్తరుగా మాత్రమే రుణాలను మంజూరు చేసినట్లు తేలింది. ప్రైవేటు రంగంలో రుణ మంజూరులో మొదటి స్థానంలో హెచ్‌డీఎఫ్‌సీ ముందుండగా, తర్వాత స్థానాల్లో ఐసీఐసీఐ, యాక్సిస్ నిలిచాయి. ప్రైవేటు బ్యాంకుల రుణ లక్ష్యం రూ.25,731 కోట్లు కాగా, రూ.21,616 కోట్లు మాత్రమే ఇచ్చాయి. అయితే ఇందులో పంట రుణాల కింద ఇచ్చిన మొత్తం 30 శాతం కంటే తక్కువేనని ఎస్ఎల్‌బీసీ నివేదిక వెల్లడించింది. ఇక సిటీ యూనియన్ బ్యాంకు, కరూర్ వైశ్య బ్యాంకు, సౌత్ ఇండియన్ బ్యాంకు, తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు లాంటి కొన్ని బ్యాంకులు రైతులకు రూపాయి కూడా ఇవ్వలేదు.

గ్రామీణ బ్యాంకుల ద్వారా రూ.18,676 కోట్లు

రాష్ట్రంలో 2024–25లో రెండు గ్రామీణ బ్యాంకులు మనుగడలో ఉన్నాయి. తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ), ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్ (ఏపీజీవీబీ)లు విడివిడిగా రైతులకు రుణాలు ఇచ్చాయి. అయితే ఈ రెండు బ్యాంకులు గత డిసెంబర్‌లోనే విలీనం అయ్యాయి. ఇప్పుడు కేవలం తెలంగాణ గ్రామీణ బ్యాంకుగానే కొనసాగుతున్నాయి. ఈ రెండు బ్యాంకులు కలిపి రూ.26,500 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, రూ.18,676 కోట్లు మాత్రమే ఇచ్చాయి. ఇందులో తెలంగాణ గ్రామీణ బ్యాంకు రూ.11,014.91 కోట్లు, ఏపీజీవీబీ రూ.7,661.37 కోట్లు (70.47 శాతం)ఇచ్చాయి. అయితే విలీనం తర్వాత టీజీబీ ద్వారానే ఆర్థిక లావాదేవీలు నడిపిస్తున్నాయి. ఎస్‌బీఐ తరువాత రైతులకు చేరువైన ఏకైక బ్యాంకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు కాగా, ఇది ఎస్‌బీఐకే అనుబంధంగా కొనసాగుతుండడం గమనార్హం.

సహకార బ్యాంకుల రుణాలు రూ.10,297 కోట్లు

రాష్ట్రంలోని సహకార బ్యాంకులు గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.13,540 కోట్లు రుణంగా ఇవ్వాలని నిర్ణయించుకుని, రూ.10,297 కోట్లు ఇచ్చాయి. తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టీఎస్‌కాబ్) పరిధిలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు (డీసీసీబీలు).. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) ద్వారా నేరుగా రైతులకు వ్యవసాయ, అనుబంధ రంగాలకు రుణాలు అందిస్తాయి. 2024–25లో రూ.13,540 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుని రూ.10,297 కోట్లు మంజూరు చేశాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు ఏకంగా రూ.1,434 కోట్లు ఇచ్చాయి. అయితే ఈ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు కేవలం రూ.12 కోట్ల రుణ లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం గమనార్హం. అలాగే విదేశీ బ్యాంకులు రూ.289 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకొని రూ.712 కోట్లు మంజూరు చేశాయి.

కేటగీరీల వారీగా వివిధ రంగాల బ్యాంకులు ఇచ్చిన రుణాల వివరాలు (రూ.కోట్లలో)

బ్యాంకుల కేటగిరీ	లక్ష్యం	మంజూరు	శాతం
ప్రభుత్వ రంగ బ్యాంకులు	85,980	84,610	98.41
ప్రైవేటు రంగ బ్యాంకులు	25,731	21,616	84.01
ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు	26,500	18,676	70.47
సహకార బ్యాంకులు	13,540	10,297	76.05
స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు	12	1,434	11,953
విదేశీ బ్యాంకులు	289	712	246.47
మొత్తం	1,52,052	1,37,346	90.33

(నోట్: స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల లక్ష్యం చాలా తక్కువగా ఉండడం వల్ల లక్ష్య ఛేదన శాతం భారీగా కనిపిస్తుంది)

ప్రైవేటు బ్యాంకులు ఇచ్చిన రుణాల వివరాలు (రూ. కోట్లలో)

బ్యాంకు	లక్ష్యం	ఇచ్చిన రుణం
హెచ్‌డీఎఫ్‌సీ	6,102	5,154
ఐసీఐసీఐ	2,260	2,020
యాక్సిస్	2,640	2,020
ఇండస్ ఇండ్	1,720	1,126
ఐడీఎఫ్‌సీ ఫస్ట్	1,340	843
ఎస్ బ్యాంక్	917	662
కొటక్ మహీంద్రా	810	662
ఇతర ప్రైవేటు బ్యాంకులు	9,942	9,056
మొత్తం	25,731	21,616



అర్చన కొచ్చర్.. బాలీవుడ్‌లో షారూఖ్ ఖాన్, అమితాబ్ బచ్చన్, ప్రియాంక చోప్రా, మలైకా అరోరా, కంగనా రనౌత్, డయానా పెంటీ మొదలైన వారికి కాస్ట్యూమ్ డిజైనర్‌గా, స్టయిలిస్ట్‌గా చేసి సెలబ్రిటీ డిజైనర్ అండ్ స్టయిలిస్ట్‌గా పాపులర్ అయ్యారు. ఇప్పుడు జరుగుతున్న 72వ మిస్ వరల్డ్ అందాల పోటీలలో ఫ్యాషన్, టాలెంట్ సెగ్మెంట్స్ కోసం అవుట్‌ఫిట్స్‌ని డిజైన్ చేసి తెలంగాణ టెక్స్‌టైల్స్, చేనేత కళకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చారు. ఈ నేపథ్యంలో అర్చన పరిచయం ఆమె మాటల్లోనే.

సృజనార్చన

‘నేను పుట్టి, పెరిగింది ముంబైలో. కామర్స్‌లో డిగ్రీ చేశాను. ఫ్యాషన్‌కు సంబంధించిన అకడమిక్ డిగ్రీ ఏమీ లేదు కానీ.. ఫ్యాషన్ పట్ల ప్యాషన్ నాకు ఊహ తెలిసిన నాటి నుంచే మొదలైందని చెప్పొచ్చు. దీనికి స్ఫూర్తి చిన్నప్పటి నుంచి నేను చూసిన చేనేత, ఎంబ్రాయిడరీ కళాకారులే! ఏళ్ల నాటి ఈ కళా సంస్కృతిని ప్రతి తరానికి పరిచయం చేస్తూ వాటిని ప్రిజర్వ్ చేస్తున్న తీరు నన్ను అబ్బురపరచేది. ఆ కళల పట్ల వాళ్లకున్న నిబద్ధత, నైపుణ్యం, సృజనాత్మకతకు ముచ్చటేసేది. వీటన్నిటికీ ఓ వేదిక ఏర్పర్చి.. ప్రపంచమంతా గుర్తించేలా చేయాలనిపించింది. ప్రతి నేత వెనుక ఉన్న చారిత్రక కథనాన్ని ప్రపంచానికి వినిపించాలనిపించింది. ఆ ప్రేరణతోనే ఫ్యాషన్ డిజైనింగ్‌లోకి అడుగు పెట్టాను. పదహారవ ఏటనే ఫస్ట్ ఎగ్జిబిషన్‌ను పెట్టాను. ఇరవయ్యేళ్లకే బ్రైడల్ వేర్ డిజైనర్‌గా పాపులర్ అయ్యాను. అయితే నా ఈ జర్నీకి మా అమ్మనూ ఓ స్ఫూర్తిగా చెప్పుకోవచ్చు. ఫ్యాషన్ డిజైనింగ్ పట్ల నాకున్న ఆసక్తిని గమనించి దాని వివరాల్లోకి వెళ్లేలా ప్రోత్సహించింది. ఈ రోజు నేనీ స్థాయిలో ఉండటానికి మా అమ్మతోపాటు మా వారు రాజీవ్ కొచ్చర్, మా అమ్మాయి సిమ్రాన్ కారణం. వాళ్ల ప్రోత్సాహ సహకారాలు లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు.



అహింసా సిల్క్

పట్టు అనగానే ఆ నేతకు ఎన్ని పట్టుపురుగులను పొట్టన పెట్టుకున్నారో అనే ఆలోచన, అభిప్రాయానికి వచ్చేస్తారు ప్రకృతిని, పర్యావరణాన్ని ప్రేమించే ఎవ్వరైనా! అందులో నేను కూడా! అందుకే ఒక ఫ్యాషన్ డిజైనర్‌గా పర్యావరణహితమైన ఫ్యాషన్‌ను, డిజైన్స్‌ను క్రియేట్ చేసి, ప్రమోట్ చేయాలని నిశ్చయించుకున్నాను. ఆ ప్రాజెక్ట్‌కి ‘అహింసా సిల్క్’ అనే పేరు పెట్టాను. జార్ఖండ్ వెళ్లి.. అక్కడి గిరిజన స్త్రీలతో కలిసి పనిచేయడం మొదలు పెట్టాను. ఈ ప్రాజెక్ట్ వల్ల ఆ గిరిజన మహిళలకు ఉపాధి దొరకడమే కాదు వాళ్ల ఆత్మవిశ్వాసం పెరిగింది, వాళ్లకు ఆర్థిక స్వాతంత్ర్యమూ వచ్చింది. ఈ అహింసా సిల్క్ డిజైన్స్‌తో న్యూయార్క్ ఫ్యాషన్ షోలో పాల్గొన్నాను. అంతర్జాతీయ గుర్తింపు దొరికింది.

మిస్ వరల్డ్ బ్యూటీ ప్యాజెంట్‌లో..

ఫ్యాషన్ ప్రపంచంలో నా ప్రయాణం చిన్నగానే మొదలైంది. కానీ ప్రతిచోటా మన దేశ ప్రతిభను చాటడానికే ప్రయత్నించాను. ‘అహింసా సిల్క్’ ప్రాజెక్ట్‌తో మన దేశానికున్న రిచ్ టెక్స్‌టైల్ హెరిటేజ్‌ని ప్రపంచానికి పరిచయం చేశాను. ప్రతి కలెక్షన్ వెనుక భారతీయ చేనేత కళానైపుణ్యం, సంస్కృతిని చూపించాను. అందుకే ఈ రోజు నాకు మిస్ వరల్డ్ బ్యూటీ పాజెంట్‌లో అవుట్‌ఫిట్స్‌ని డిజైన్ చేసే అవకాశం దక్కింది. ఇది నా ఘనత కాదు.. మన చేనేత సంస్కృతికున్న స్ట్రెంత్. పోచంపల్లి ఇక్కత్, గొల్లభామ, నారాయణ్‌పేట్ చీరలు, లగ్జరియస్ బ్రోకేడ్స్, బంగారు జరీ చీరలు, జర్దోసీ ఎంబ్రాయిడరీ, హైదరాబాద్ ముత్యాలతో 240 అవుట్‌ఫిట్స్‌ను డిజైన్ చేశాం. ప్రతి త్రెడ్‌లో డీటైయిలింగ్ కనపడుతుంది. అది మన కళాకారుల నైపుణ్యం, సృజనాత్మకతకు అద్దం పడుతుంది. ఈ డిజైన్స్‌ను ధరిస్తున్న ప్రతిఒక్క పార్టిసిపెంట్‌కి ఈ దేశ ఘన చరిత్రను ధరిస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. అలా ఈ డిజైన్స్ అన్నీ మన కల్చర్, ప్రైడ్, గ్లోబల్ సిస్టర్‌హుడ్‌కి ప్రతీకగా నిలుస్తున్నాయి. ఇవి పార్టిసిపెంట్స్ అంటున్న మాటలు! ఈ మొత్తం అవుట్‌ఫిట్స్‌ని డిజైన్ చేయడానికి నాకు, నా టీమ్‌కి నెల రోజులు పట్టింది. వీటిని టాప్ మోడల్ రౌండ్, ఫినాలేలో ధరిస్తారు.

దక్షిణ భారత ఫ్యాషన్ కాపిటల్‌గా..

పోచంపల్లి ఇక్కత్ నుంచి గద్వాల దాకా తెలంగాణకు ఘనమైన చేనేత చరిత్ర ఉంది. ఇక్కడ సంప్రదాయ నేతకు ఎంత ప్రాధాన్యం ఉందో ఫ్యాషన్‌కూ అంతే ప్రాముఖ్యత కనిపిస్తుంది. తమ మూలాలను ఎంత గౌరవిస్తారో ట్రెండ్స్‌నూ అంతే ఆదరిస్తారు. ఇక్కడ హెరిటేజ్‌కి, మోడర్న్ స్టయిల్‌కి మధ్య స్ట్రాంగ్ కనెక్షన్ కనిపిస్తుంది. అందుకే ఈ ప్రాంతం నాకు కల్చర్ అండ్ ఫ్యాషన్‌ల ఫ్యూజన్‌గా కనిపిస్తుంది. ఫ్యాషన్ అందంగా.. సస్టెయినబుల్‌గా ఇవాల్వ్ అవడానికి ఈ బ్యాలెన్స్ చాలా ముఖ్యం. తెలంగాణ టెక్స్‌టైల్స్, చేనేత కళను కంటెంపరరీ ఫ్యాషన్‌గా మలచడానికి దీనికి మించి ఇంకేం కావాలి! అంతేకాదు హైదరాబాద్‌లో ఉన్న ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సాంస్కృతిక సంపద, సృజన ఇవన్నీ దీన్ని సౌత్ ఇండియా ఫ్యాషన్ హబ్‌గా మారే స్కోప్‌నిస్తున్నాయి. ఈ బ్యూటీ పాజెంట్ సక్సెస్‌తో ఫ్యాషన్ షోస్‌కు తెలంగాణ మంచి హోస్ట్‌గా ఉండగలదని నిరూపించుకుంది. విరివిగా ఫ్యాషన్ షోలు జరిగితే స్థానిక ఫ్యాషన్ డిజైనర్స్, చేనేత కళాకారులకూ మంచి సపోర్ట్ దొరుకుతుంది’ అని చెప్పారు అర్చన.

– రమ సరస్వతి

ఫొటోలు: ఎస్ ఎస్ ఠాకూర్

రెండు కళ్ళు చూడలేని దృశ్యాలను కెమెరా కన్ను చూస్తుంది. మారుమూల ప్రాంతాలు తిరిగే దీప్తి ఆస్థానా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి పర్యావరణ సమస్యల వరకు తన కెమెరా కంటితో ప్రపంచానికి చూపుతుంది. డాక్యుమెంటరీ-స్టైల్ స్టోరీ టెల్లింగ్ ద్వారా ఎందరో సామాన్యుల జీవితాలను ఆవిష్కరిస్తోంది...



త్రినేత్రం

ఛాయాచిత్ర దీప్తి

‘చెప్పడానికి మన దగ్గర ఎన్నో కథలు ఉంటాయి. నన్ను నేను వ్యక్తీకరించుకోవడానికి ఫొటోగ్రఫీ, స్టోరీ టెల్లింగ్ అనేది ఒక మాధ్యమం’ అంటుంది దీప్తి ఆస్థానా. అనుకోకుండా ఫొటోగ్రఫీలోకి వచ్చింది దీప్తి.

లండన్‌లో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో పనిచేస్తున్నప్పుడు కొలీగ్ ఒకరు తనకు కెమెరా పరిచయం చేశాడు. మొదట్లో కెమెరాకు సంబంధించిన సాంకేతిక విషయాలను తెలుసుకోవడానికే ఆసక్తి చూపేది. ఆ తరువాత ఆమెకు అర్థమయ్యింది ఏమిటంటే...

‘కెమెరా అంటే సాంకేతికతకు సంబంధించిన విషయమే కాదు. అంతకంటే ఎక్కువ. జీవితాలను ఆవిష్కరించే సాధనం’ అనుకుంది. ఇండియాకు తిరిగి వచ్చే సమయానికి దీప్తికి కెమెరా మంచి నేస్తం అయింది. కెమెరాతో రకరకాల ప్రాంతాలకు వెళుతుండేది. కెమెరా కంటితో స్వదేశం తనకు కొత్తగా కనిపించింది. గతంలో ఎన్నడూ చూడని అపురూప దృశ్యాలు కనిపించాయి.

‘అందాలు, అద్భుతాలు మాత్రమే కాదు అసమానతలు, అన్యాయాలు చూశాను’ అని తన ప్రయాణ అనుభవాల గురించి చెబుతుంది దీప్తి, ఆ అసమానతలు, అన్యాయాలకు సంబంధించిన కథనాలను వెలికి తీయడానికి కెమెరాను సాధనం చేసుకుంది.

‘ఏ థౌజెండ్ థ్రోన్స్’ ప్రాజెక్ట్ ద్వారా రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంత మహిళల జీవితాలను వెలుగులోకి తీసుకువచ్చింది. నేషనల్ జియోగ్రాఫిక్ సొసైటీ సహకారంతో ‘వెయిట్ ఆఫ్ ది వాటర్’ పుస్తకాన్ని ప్రచురించింది. ఈ ఫొటోగ్రఫీ స్టోరీ పుస్తకం ద్వారా హిమాలయ ప్రాంతంలో నీటి సమస్యలు ఎదుర్కొంటున్న కుటుంబాల కన్నీటి కథలను ప్రపంచానికి చెప్పింది. ఆ ప్రాంతంలో మహిళలు ప్రాథమిక నీటి అవసరాల కోసం రోజుకు ఆరు నుండి తొమ్మిది గంటలు వెచ్చిస్తున్నారు. నీటి వనరులను కనుగొనడానికి రోజు అయిదు కిలోమీటర్‌ల వరకు నడుస్తున్నారు. నీటి సంక్షోభ ప్రభావం మహిళలు, బాలికలపైనే ఎక్కువ పడుతుంది. బాలికలు విద్యకు దూరం అవుతున్నారు.

‘ఒక అమ్మాయికి అండగా నిలబడి దారి చూపగలిగితే అది వారి జీవితాలను మార్చేస్తుంది. ఇంటికే పరిమితం కాకుండా విద్యా,ఉద్యోగాల్లో వారు రాణిస్తారు’ అంటుంది దీప్తి.

సమస్యలను ప్రపంచానికి చూపే, సమస్యల పరిష్కారానికి వేదికలా ఫొటోగ్రఫీని ఉపయోగించుకుంటుంది దీప్తి.

ఒక స్వచ్ఛంద సంస్థ సహాయం తీసుకొని కొన్ని ప్రాంతాలలో వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం చేసింది.

ఆ మహిళల అరుదైన కృషి

ఫొటోగ్రఫీ అంటే వినూత్నమైన శక్తి. ఫొటోగ్రఫీ అనేది కథ చెప్పడానికే కాదు భావోద్వేగాలను రేకెత్తిస్తుంది. అదే సమయంలో సమస్య పరిష్కారానికి మార్గం ఆలోచించే దృష్టిని ఇస్తుంది. ఫొటోగ్రఫీ... హృదయ ద్వారాలను తెరిచే తాళం చెవి. గతంలో ఎన్నడూ చూడని జీవితాలతో మమేకం కావడానికి ఉపయోగపడుతుంది. గ్రామీణ భారతంలో ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా నదులు, అడవులను సంరక్షించడానికి కృషి చేస్తున్న అరుదైన మహిళలతో మాట్లాడాను. ఎంతో స్ఫూర్తినిచ్చే మహిళలు వారు. ప్రకృతిని గౌరవించడానికి సంబంధించి మూలాలు మన ప్రాచీన చరిత్రలో ఉన్నాయి. ప్రకృతిని గౌరవించాలి, రక్షించుకోవాలి అనే విలువలు మన మూలాలలోనే ఉన్నాయి.

– దీప్తి ఆస్థానా

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) 26న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	96,410
బంగారం (22 క్యారెట్లు)	89,370
వెండి	99,000
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	99,250
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,00,600
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,640
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,11,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	99,250
బంగారం (22 క్యారెట్లు)	92,180
వెండి	1,00,600
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,300
బంగారం (22 క్యారెట్లు)	88,600
వెండి	99,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,640
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,11,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి

రోహిణి కార్తె: మే 25 నుంచి

బ్రౌన్, గ్రీన్ రంగుల్లోనూ దేశీ పత్తి!





పత్తి అంటే తెల్లని దూదే అందరికీ గుర్తొస్తుంది. అయితే, గోధుమ (బ్రౌన్), ఆకుపచ్చ వంటి రంగుల్లో దూదిని అందించే సహజ పత్తి వంగడాలు కూడా ఉన్నాయని మీకు తెలుసా?

హైదరాబాద్‌కు చెందిన హస్తకళల పునరాభివృద్ధి నిపుణుడు రామనాథం రమేశ్ దగ్గర ఏకంగా 12 రకాల పత్తి విత్తనాలు ఉన్నాయి. ఇందులో పది దేశీ పత్తి వంగడాలు కాగా రెండు అమెరికన్ బ్రౌన్ కాటన్ రకాలు. వీటికి సంబంధించిన గింజల దూది, దారాలను ఆయన చాలా కాలంగా భద్రపరచి ఉంచారు. ఆయన దగ్గర ఉన్న వంగడాల్లో లేత ఆకుపచ్చ పత్తి రకం ఒకటి. గోధుమ రంగు పత్తిలో స్వల్ప తేడాలతో 8 వేరియంట్లున్నాయి. ఇవి కాకుండా, తెలుపు రంగు దేశీ రకాలైన గిరిధర్ (తూ.గో. జిల్లా పిఠాపురం ప్రాంత వంగడం), కొండపత్తి (శ్రీకాకుళం జిల్లాలో పొందూరు ఖద్దరు వస్త్రాలను ఈ దూదితోనే నేస్తారు) విత్తనాలు కూడా రమేశ్ దగ్గర ఉన్నాయి.

ఈ వంగడాలను సాగు చేయించటం ద్వారా ఒరిజినల్ ఖాదీ సంస్కృతికి తిరిగి ప్రాణంపోయటం.. ఖాదీ వస్త్రాలకు మంచి ధర దక్కేలా చేయటం.. చేనేత కళాకారులకు తిరిగి గౌరవం, ఆర్థిక పుష్టి కలిగించటమే తన లక్ష్యాలని రమేశ్ ‘సాక్షి సాగుబడి’కి తెలిపారు.

ఈ అపురూప పత్తి రకాలను ప్రకృతి వ్యవసాయంలో పండించటంతో పాటు.. ఏ దశలోనూ యంత్రాలు వాడకుండా స్వాభావిక ఖాదీ పద్ధతుల్లో దారం వడికి, బట్ట నేయించే నిబద్ధత, ఆసక్తి కలిగిన వ్యక్తులు, సంస్థలకు ఈ 12 రకాల వివిధ రంగుల పత్తి విత్తనాలను ఇవ్వటానికి సంసిద్ధంగా ఉన్నానని రమేశ్ (94400 55266) తెలిపారు.

రమేశ్ దగ్గర వున్న రంగుల పత్తి రకాలు



ఎత్తు మడులపై విత్తితే మేలు!



దుక్కి చేసిన తర్వాత ట్రాక్టర్‌తో ఎత్తుమడులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



ఎత్తుమడులపై మొలిచిన పత్తి మొక్కలు

నల్లరేగడి, తేలికపాటి ఎర్రనేలల్లో ఎత్తుమడుల పద్ధతిలో పత్తిని సాగు చేయవచ్చు	పత్తిలో అంతరపంటగా కందిని విత్తుకుంటే.. ఒకవేళ ఏ కారణంగానైనా ఒక పంట దెబ్బతింటే, మరో పంట రైతును ఆదుకుంటుంది	ఎత్తుమడుల వల్ల మురుగు నీటి వ్యవస్థ మెరుగుపడుతుంది. వర్షపు నీరు పొలంలో నిలవకుండా, కాలువల ద్వారా బయటికి వెళ్లిపోతుంది. దీనివల్ల తొలిదశలో మొక్క పెరుగుదల కుంటుపడదు	సాధారణ పద్ధతితో పోలిస్తే, ఎత్తుమడుల పద్ధతిలో 10-20% అధిక దిగుబడులకు అవకాశం



ఎత్తుమడులపై ఏపుగా పెరిగిన పత్తి మొక్కలు

సీజన్ ప్రారంభం కాగానే పొలాన్ని దున్ని, విత్తనాలు వేయటం రైతులు చేసే పని. దీన్ని ‘ఫ్లాట్ బెడ్ మెథడ్’ అంటారు. అయితే, ఎత్తు మడులు చేసి లేదా బోదెలు తోలి వాటిపై పత్తి తదితర పంటలు విత్తుకోవటం మేలని ఆదిలాబాద్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డా. ప్రవీణ్‌కుమార్ సూచిస్తున్నారు. ఇది బహుళ ప్రయోజనాలున్న ‘రెయిజ్‌డ్ బెడ్ మెథడ్.

పంటలు సాగు చేస్తున్నది నల్ల రేగడైనా, ఎర్ర నేలైనా, బంక మట్టి అయినా సరే ఎత్తుమడులపై పంటలు విత్తుకోవటం ఉపయోగకరం. వర్షాలు తక్కువైనా, ఎక్కువైనా.. వర్షానికి వర్షానికి మధ్య ఎక్కువ రోజులు వ్యవధి వచ్చినా రైతులను ఎత్తుమడులు ఆదుకుంటాయని ఆయన తెలిపారు. గత మూడేళ్లలో ఎత్తుమడులపై విత్తుకోవటంలో సౌలభ్యాన్ని రైతులు గుర్తిస్తున్నారని, చాలా మంది ప్రయోజనం పొందుతున్నారని డా. ప్రవీణ్‌కుమార్ ‘సాక్షి సాగుబడి’తో చెప్పారు.

అడుగు-అడుగున్నర ఎత్తు మడి

పత్తి ముఖ్యంగా బరువైన నల్లరేగడి నేలలకు అనుకూలమైనప్పటికీ, రైతులు క్రమేణా తేలిక పాటి నేలల్లో సైతం సాగు చేస్తున్నారు. అధిక వర్షపాతం నమోదయ్యే సమయాల్లో పంటల సంరక్షణకు సమర్థవంతమైన మురుగు నీటి వ్యవస్థ కీలకం. ఎత్తుమడుల పద్ధతిలో పత్తి సాగు చేయడం ద్వారా ఇలాంటి సమస్యలను దూరం చేయవచ్చు. ఎత్తుమడులు చేసుకోవడానికి ట్రాక్టర్‌తో అనుసంధానం చేసే రిడ్జర్ లేదా బెడ్ మేకర్‌ను ఉపయోగించుకోవచ్చు. 30-45 సెం.మీ.(అడుగు-అడుగున్నర)ల ఎత్తు మడులను ఏర్పాటు చేసుకోవాలి. మడి వెడల్పు నేల స్వభావం, ఆ ప్రాంతంలో నమోదయ్యే వర్షపాతాన్ని బట్టి ఎంత కావాలంటే అంత పెట్టుకోవచ్చు. సాళ్ల మధ్య 180/ 150/ 120 సెం.మీ., మొక్కల మధ్య 30/20/30 సెం.మీ. ల దూరంలో పత్తి పంటను సాగు చేయవచ్చు. సాధారణంగా ఒక ఎకరంలో ఎత్తుమడులు చేయడానికి సుమారు 45 నిమిషాల నుంచి ఒక గంట సమయం పడుతుంది.

ఎత్తుమడులపై పత్తి సాగుతో లాభాలు

- ఎత్తుమడుల మీద విత్తిన విత్తనం సాధారణ పొలంలో కన్నా ఒకటి రెండు రోజులు ముందే మొలకెత్తుతుంది.
- సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే మొలక శాతం ఎక్కువ. దాదాపు 90 శాతం వరకు మొలక వస్తుంది.
- ఎత్తుమడుల వల్ల మురుగు నీటి వ్యవస్థ మెరుగుపడుతుంది. వర్షపు నీరు పొలంలో నిలవకుండా, కాలువల ద్వారా బయటికి వెళ్లిపోతుంది. దీనివలన తొలిదశలో మొక్క పెరుగుదల కుంటుపడదు.
- భారీ వర్షాలు కురిసినప్పుడు నల్లరేగడి నేలల్లో వరద పారుతుంది. ఎత్తుమడుల వల్ల ఆ ప్రవాహంలో మొక్కలు కొట్టుకుపోకుండా కాపాడుతుంది.
- వర్షాభావ పరిస్థితుల్లో మడుల్లో నిల్వ ఉన్న నీళ్లు పంటకు ఉపయోగపడతాయి.
- సాంప్రదాయ పద్ధతిలో పత్తి మొక్కల కింది కొమ్మలకు మొదట్లో వచ్చే 5 నుండి 10 కాయలు కుళ్లిపోతూ ఉంటాయి. ఎత్తుమడుల చేయడం వలన గాలి, వెలుతురు బాగా తగిలి కాయకుళ్లు, ఇతర చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుంది.
- యాంత్రీకరణ ద్వారా కలుపు యాజమాన్యం సులభమవుతుంది. తద్వారా కూలీల ఖర్చు ఆదా అవుతుంది.
- మందులు పిచికారీ చేయడం, పత్తి ఏరటం, పంటకోత, పంట అవశేషాల ఏరివేత మరింత సులభతరం అవుతాయి.
- సాధారణ పద్ధతితో పోలిస్తే, ఎత్తుమడుల పద్ధతిలో 10-20 శాతం అధిక దిగుబడులు సాధించవచ్చు.
- నల్లరేగడి నేలలు, తేలికపాటి ఎర్రనేలల్లో ఎత్తుమడుల పద్ధతిలో పత్తిని సాగు చేయవచ్చు. పత్తిలో అంతరపంటగా కందిని విత్తుకుంటే, ఒకవేళ ఏ కారణంగానైనా ఒక పంట దెబ్బతింటే, మరో పంట రైతును ఆదుకుంటుంది.



– డాక్టర్ ప్రవీణ్‌కుమార్ (99896 23829), ప్రధాన శాస్త్రవేత్త,
కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్,
ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం



ఎత్తుమడులపై పంట ఉంటే నీరు నిలిచినా ఉరకెత్తవు



ఎత్తుమడు ల్లేకుండా సాధారణంగా సాగు చేసిన పత్తి పొలం

తడి పెట్టాల్సిన అవసరం రాలేదు



సున్నక్కడి (ఎర్రనేల) నేల 3 ఎకరాలు, నల్లరేగడి 6 ఎకరాలు, చెలక (ఇసుక) భూమి 3 ఎకరాల్లో గత సంవత్సరం ఎత్తుమడుల (కట్టల)పైన పత్తి పెట్టాం. కాయకుళ్లే కనిపించలేదు. మామూలుగా పత్తి సాగు చేసిన వారికి కాయకుళ్లు నష్టం కలిగించింది. మాకు ఆ సమస్య రాలేదు. అధిక సాంద్రతలో ఎకరానికి 14.5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వర్షాలు త్వరగా ఆగిపోవటం వల్ల కట్టలపై పంట పెట్టిన పొలాల్లో చివరి తడి పెట్టాల్సిన అవసరం రాలేదు. నీటి తేమను నిలుపుకునే శక్తి కట్టల వల్ల వచ్చింది. వేరే పొలాలకు చివరి తడి పెట్టాల్సి వచ్చింది. వర్షాలు ఎక్కువ కురిసినా పంటకు ఇబ్బంది ఉండదు. ఈ పద్ధతిలో పత్తి పంట రెండు నెలలు ముందే పూర్తయ్యింది. రెండేళ్ల ఇతర పొలాలు చూసిన తర్వాతే మేం ఈ పద్ధతిలో వేశాం. ఈ సంవత్సరం చాలా మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. అయితే, వర్షం బాగా కురిసి, కట్ట పూర్తిగా తడిచిన తర్వాతనే విత్తనం పెట్టుకోవాలి.

– కట్ల కుమారస్వామి (88858 75575),
యాపల్‌గూడ, ఆదిలాబాద్ జిల్లా

ఎత్తుమడులతో బాగా ఉపయోగం

గత మూడేళ్ల నుంచి 12 ఎకరాల సుంకడి (నలుపు ఎరుపు కాని తెల్ల రాయితో కూడిన) భూమిలో ఎత్తుమడుల (కట్టల)పై పత్తిని అధిక సాంద్రతలో సాగు చేస్తున్నాను. కాయకుళ్లు తెగులు అసలు రాలేదు. ఎకరానికి 17-18 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ పద్ధతి బబాగా ఉపయోగకరంగా వుంది. ఇరుగు పొరుగు రైతులు ఎలా చెయ్యాలని అడుగుతున్నారు.



– గంధి శంకర్
(84988 00958),
యాపల్‌గూడు,
ఆదిలాబాద్ జిల్లా



తేజస్విని 'పసిడి' గురి

అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌ను భారత బృందం పసిడి పతకంతో ముగించింది. జర్మనీలో సోమవారం ముగిసిన ఈ టోర్నీలో భారత్ 3 స్వర్ణాలు, 4 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి మొత్తం 11 పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది. చివరిరోజు మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో తేజస్విని స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 20 ఏళ్ల తేజస్విని 31 పాయింట్లు సాధించి విజేతగా అవతరించింది. 29 పాయింట్లతో రష్యా షూటర్ అలీనా నెస్టియారోవిచ్ రజతం నెగ్గగా... 23 పాయింట్లతో మిరియం జాకో (హంగేరి) కాంస్య పతకాన్ని దక్కించుకుంది. అంతకుముందు 50 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో తేజస్విని 575 పాయింట్లు స్కోరు చేసి నాలుగో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. క్వాలిఫయింగ్‌లో టాప్-8లో నిలిచిన షూటర్లకు ఫైనల్లో పోటీపడే అవకాశం లభిస్తుంది. క్వాలిఫయింగ్‌లో పోటీపడ్డ భారత ఇతర పిస్టల్ షూటర్లు రియా శిరీష్ థట్టె 569 పాయింట్లతో 15వ స్థానంలో, నామ్యా కపూర్ 568 పాయింట్లతో 18వ స్థానంలో, దివాంశి 564 పాయింట్లతో 24వ స్థానంలో నిలిచారు.



స్వియాటెక్ శుభారంభం

- రెండో రౌండ్‌లోకి డిఫెండింగ్ చాంపియన్
- శ్రమించి నెగ్గిన నాలుగో సీడ్ జాస్మిన్
- తొలి రౌండ్‌లోనే ఓడిన గార్సియా

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), నాలుగో సీడ్ జాస్మిన్ పావోలిని (ఇటలీ) రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. సోమవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ స్వియాటెక్ 6-3, 6-3తో ప్రపంచ 42వ ర్యాంకర్ రెబెకా స్రామ్‌కోవా (స్లొవేకియా)పై... జాస్మిన్ 6-1, 4-6, 6-3తో యు యువాన్ (చైనా)పై గెలుపొందారు. గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను వరుసగా మూడోసారి సొంతం చేసుకున్నాక స్వియాటెక్ మరే టోర్నీలోనూ ఫైనల్ చేరలేకపోయింది. దాంతో ఆమె మూడేళ్ల తర్వాత తొలిసారి టాప్-2 ర్యాంకింగ్స్‌లో చోటు కోల్పోయి ఐదో స్థానానికి పడిపోయింది. స్రామ్‌కోవాతో 84 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో స్వియాటెక్ 25 విన్నర్స్ కొట్టి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. యు యువాన్‌తో 98 నిమిషాలపాటు జరిగిన పోరులో జాస్మిన్ తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిదిసార్లు బ్రేక్ చేసింది.

మరోవైపు చివరిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో బరిలోకి దిగిన ఫ్రాన్స్ స్టార్ ప్లేయర్ కరోలినా గార్సియాకు నిరాశ ఎదురైంది. ఆమె తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. గార్సియా 4-6, 4-6తో బెర్నార్డా పెరా (అమెరికా) చేతిలో ఓటమి పాలైంది. మరోవైపు తొమ్మిదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా), ప్రపంచ మాజీ నంబర్‌వన్ నయోమి ఒసాకా (జపాన్) కూడా తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. నవారో 0-6, 1-6తో జెస్సికా బుజాస్ మనేరో (స్పెయిన్) చేతిలో, ఒసాకా 7-6 (7/1), 1-6, 4-6తో పదో సీడ్ పౌలా బదోసా (స్పెయిన్) చేతిలో పరాజయం పాలయ్యారు.

నాలుగో సీడ్ ఫ్రిట్జ్ అవుట్

పురుషుల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్, రెండో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్) శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో అల్‌కరాజ్ 6-3, 6-4, 6-2తో క్వాలిఫయర్ గిలియో జెపెరి (ఇటలీ)పై గెలిచాడు. మరోవైపు నాలుగో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా), 2015 చాంపియన్ వావ్రింకా (స్విట్జర్లాండ్) తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. ఫ్రిట్జ్ 5-7, 6-3, 3-6, 1-6తో అల్ట్‌మేర్ (జర్మనీ) చేతిలో, వావ్రింకా 6-7 (6/8), 3-6, 2-6తో జేకబ్ ఫియరెన్లే (బ్రిటన్) చేతిలో ఓడిపోయారు.

సాత్విక్-చిరాగ్ జోడీ పునరాగమనం

సింగపూర్: మూడు నెలల విరామం తర్వాత భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి పునరాగమనం చేయనుంది. నేడు మొదలయ్యే సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో సాత్విక్-చిరాగ్ ద్వయం బరిలోకి దిగనుంది. గత మార్చిలో చివరిసారి ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో ఆడిన సాత్విక్-చిరాగ్ జోడీ ఆ తర్వాత గాయాల కారణంగా మరే టోర్నీలోనూ ఆడలేదు. నేడు జరిగే తొలి రౌండ్‌లో చూంగ్ హోన్ జియాన్-మొహమ్మద్ హైకాల్ (మలేసియా)లతో సాత్విక్-చిరాగ్ తలపడతారు. పురుషుల సింగిల్స్‌లో భారత్ నుంచి ప్రణయ్, ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జి, లక్ష్య సేన్... మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, అన్‌మోల్, ఆకర్షి కశ్యప్, అనుపమ, మాళవిక, ఉన్నతి హుడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు.

పంజాబ్ 'టాప్' షో

ముంబై ఇండియన్స్‌పై 7 వికెట్లతో జయభేరి

- దంచేసిన ప్రియాన్ష్, ఇన్‌గ్లిస్
- సూర్యకుమార్ ఫిఫ్టీ వృథా
- పాయింట్ల పట్టికలో శ్రేయస్ అయ్యర్ బృందానికి అగ్రస్థానం



ప్రియాన్ష్ ఆర్య, ఇన్‌గ్లిస్



కెప్టెన్ శ్రేయస్‌తో పంజాబ్ సహ యజమాని ప్రీతి జింటా

జైపూర్: పంజాబ్ కింగ్స్ తమ ఆఖరిపోరులో దంచేసింది. పాయింట్ల పట్టికలో అందరిని మించేసింది. ఐదుసార్లు ఐపీఎల్ చాంపియన్ అయిన ముంబై ఇండియన్స్‌ను 'ఎలిమినేటర్' ఆడుకోమని నాలుగో స్థానానికి నెట్టేసింది. సోమవారం జరిగిన ఈ పోరులో పంజాబ్ కింగ్స్ 7 వికెట్ల తేడాతో హార్దిక్ పాండ్యా నేతృత్వంలోని ముంబైపై జయభేరి మోగించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. సూర్యకుమార్ (39 బంతుల్లో 57; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 26; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. అర్ష్‌దీప్, యాన్సెన్, వైశాక్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం పంజాబ్ కింగ్స్ 18.3 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి 187 పరుగులు చేసి గెలిచింది. జోష్ ఇన్‌గ్లిస్ (42 బంతుల్లో 73; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), ప్రియాన్ష్ ఆర్య (35 బంతుల్లో 62; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. సాంట్నర్‌కు 2 వికెట్లు దక్కాయి.

క్వాలిఫయర్-1కు అర్హత

ముంబైపై విజయంతో పంజాబ్ కింగ్స్ 'ప్లే ఆఫ్స్'లో క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో ఆడే అవకాశాన్ని దక్కించుకుంది. అయితే పంజాబ్ ప్రత్యర్థి ఎవరో నేడు తేలిపోతుంది. లక్నోలో ఈరోజు లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు (ఆర్‌సీబీ) గెలిస్తే 19 పాయింట్లతో టాప్-2లో చోటును ఖరారు చేసుకొని క్వాలిఫయర్-1లో పంజాబ్‌తో ఆడుతుంది. ఒకవేళ బెంగళూరు ఓడిపోతే మాత్రం 18 పాయింట్లతో గుజరాత్ టైటాన్స్‌కు రెండో స్థానం దక్కుతుంది. ఇలా జరిగితే క్వాలిఫయర్-1లో పంజాబ్‌తో గుజరాత్ తలపడుతుంది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో బెంగళూరు, ముంబై 'ఢీ'కొంటాయి.

ఆదుకున్న సూర్యకుమార్

ముంబై ఓపెనర్లు రికెల్టన్, రోహిత్ శర్మ ధాటిగా పరుగులు సాధించారు. పవర్‌ప్లే ఆఖరి ఓవర్లో రికెల్టన్ (20 బంతుల్లో 27; 5 ఫోర్లు)ను యాన్సెన్ అవుట్ చేశాడు. తర్వాత రోహిత్, సూర్యకుమార్ నడిపించారు. కానీ దూకుడు పెంచలేకపోయారు. జట్టు స్కోరు 81 వద్ద రోహిత్ (24; 2 ఫోర్లు, 1 సిక్స్), 87 వద్ద తిలక్ వర్మ (1) అవుటవడంతో ముంబై జోరందుకోలేదు. 12వ ఓవర్లో ముంబై స్కోరు వందకు చేరింది. విల్‌జాక్స్ (8 బంతుల్లో 17; 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులకు వైశాక్ ఆదిలోనే చెక్ పెట్టడంతో నాలుగో వికెట్‌గా నిష్క్రమించాడు. ఈ దశలో కెప్టెన్ హార్దిక్ పాండ్యాతో కలిసి సూర్యకుమార్ జట్టు స్కోరు పెంచే బాధ్యత తీసుకున్నాడు. ఇద్దరు వేగంగా పరుగులు రాబట్టడంతో 16.1 ఓవర్లోనే ముంబై 150 మార్క్ అందుకుంది. అదే స్కోరు వద్ద పాండ్యా అవుటయ్యాడు. సూర్యకుమార్ 34 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. నమన్ ధీర్ భారీ సిక్సర్లతో మెరిపించాడు. కానీ ఆఖరి ఓవర్ అద్భుతంగా వేసిన అర్ష్‌దీప్... తొలి బంతికి నమన్ ధీర్ (12 బంతుల్లో 20; 2 సిక్స్‌లు)ను, ఆఖరి బంతికి సూర్యకుమార్‌ను అవుట్ చేసి కేవలం 3 పరుగులే ఇచ్చాడు.

సెంచరీ భాగస్వామ్యం

ఇన్నింగ్స్ తొలి బంతికే బౌండరీతో ప్రియాన్ష్ ఆర్య లక్ష్యఛేదనను ఘనంగా ఆరంభించాడు. బౌల్ట్ వేసిన ఆ ఓవర్లో మరో ఫోర్ కొట్టాడు. మరోవైపు 6, 4తో టచ్‌లోకి వచ్చిన ప్రభ్‌సిమ్రన్ (13)ను బుమ్రా అవుట్ చేసి అతన్ని అంతటితోనే ఆపేశాడు. అయితే ప్రియాన్ష్ దూకుడుకు ఇన్‌గ్లిస్ వేగం జతవడంతో పంజాబ్ స్కోరు పరుగు పెట్టింది. దీపక్ చహర్, హార్దిక్, సాంట్నర్, బుమ్రా, జాక్స్ ఇలా అదేపనిగా బౌలర్లు మారినా ముంబై రాత మారలేదు. ప్రియాన్ష్, ఇన్‌గ్లిస్ చెరోవైపు పోటీపడి మరీ బౌండరీలు బాదారు. ఏమాత్రం చెత్త బంతి పడినా విరుచుకుపడి సిక్సర్‌గా మలిచారు. ఇలా సగటున ఓవర్‌కు పది పరుగుల చొప్పున పంజాబ్ రన్‌రేట్ దూసుకెళ్లింది. ఏ దశలోనూ ముంబైకి రవ్వంతైనా అవకాశమివ్వకుండా లక్ష్యంపైపు నడిపించారు. ఈ క్రమంలో ఒకే ఓవర్లో ముందుగా ఇన్‌గ్లిస్ 29 బంతుల్లో, ప్రియాన్ష్ 27 బంతుల్లో ఫిఫ్టీలు పూర్తి చేసుకున్నారు. రెండో వికెట్‌కు ఈ జోడీ 59 బంతుల్లోనే 109 పరుగుల సెంచరీ భాగస్వామ్యాన్ని జోడించింది. గెలుపు సమీపంలో వీరిద్దరు అవుటయ్యాక మిగతా లాంఛనాన్ని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (16 బంతుల్లో 26 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు), నేహల్ వధేరా (2 నాటౌట్) పూర్తి చేశారు.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) అయ్యర్ (బి) యాన్సెన్ 27; రోహిత్ (సి) వధేరా (బి) హర్‌ప్రీత్ 24; సూర్యకుమార్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్ష్‌దీప్ 57; తిలక్ వర్మ (సి) అర్ష్‌దీప్ (బి) వైశాక్ 1; జాక్స్ (సి) యాన్సెన్ (బి) వైశాక్ 17; హార్దిక్ (సి) ఇన్‌గ్లిస్ (బి) యాన్సెన్ 26; నమన్ ధీర్ (సి) ప్రియాన్ష్ (బి) అర్ష్‌దీప్ 20; సాంట్నర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 184. వికెట్ల పతనం:** 1-45, 2-81, 3-87, 4-106, 5-150, 6-181, 7-184. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-28-2, జేమీసన్ 4-0-42-0, యాన్సెన్ 4-0-34-2, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-36-1, విజయ్ కుమార్ వైశాక్ 4-0-44-2.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ (సి) సూర్య (బి) సాంట్నర్ 62; ప్రభ్‌సిమ్రన్ (సి) అశ్వని (బి) బుమ్రా 13; ఇన్‌గ్లిస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సాంట్నర్ 73; శ్రేయస్ (నాటౌట్) 26; వధేరా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (18.3 ఓవర్లలో 3 వికెట్లకు) 187. వికెట్ల పతనం:** 1-34, 2-143, 3-171. **బౌలింగ్:** బౌల్ట్ 3.3-0-36-0, చహర్ 3-1-28-0, బుమ్రా 4-0-23-1, సాంట్నర్ 4-0-41-2, హార్దిక్ 2-0-29-0, అశ్వని 1-0-16-0, విల్ జాక్స్ 1-0-11-0.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
పంజాబ్	14	9	4	1	19	0.372
గుజరాత్	14	9	5	0	18	0.254
బెంగళూరు	13	8	4	1	17	0.262
ముంబై	14	8	6	0	16	1.142
ఢిల్లీ	14	7	6	1	15	0.011
హైదరాబాద్	14	6	7	1	13	-0.241
లక్నో	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	14	5	7	2	12	-0.305
రాజస్తాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	14	4	10	0	8	-0.647

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో × బెంగళూరు
వేదిక: లక్నో

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా



● వెంకటేశ్, రుక్మిణీ వసంత్

జోడీ కుదిరిందా?

'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత హీరో వెంకటేశ్ నటించనున్న చిత్రం ఏంటి? అనే విషయంపై స్పష్టత లేదు. అయితే హీరో వెంకటేశ్, డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఓ సినిమా రానుందనే ప్రచారం ఇండస్ట్రీలో చాలా రోజులుగా జరుగుతూ ఉంది. అయితే ఈ కాంబినేషన్‌పై ఇప్పటి వరకూ అధికారిక ప్రకటన రాలేదు. అయినప్పటికీ వెంకటేశ్ తర్వాతి చిత్రం మాత్రం త్రివిక్రమ్‌తోనే అని ఫిల్మ్‌నగర్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. 'పుష్ప 2' చిత్రం తర్వాత అల్లు అర్జున్ హీరోగా త్రివిక్రమ్ సినిమా ప్రారంభం అవుతుందనుకున్నారంతా. అయితే తమిళ దర్శకుడు అట్లీ సినిమాకి ఓకే చెప్పారు అల్లు అర్జున్. జూన్‌లో సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ సినిమా పూర్తవడానికి కనీసం ఏడాది అయినా పడుతుంది. అప్పటి వరకూ ఖాళీగా ఉండటం ఇష్టం లేని త్రివిక్రమ్.. వెంకటేశ్ ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టారని టాక్. ఈ సినిమాలో వెంకటేశ్‌కి జోడీగా రుక్మిణీ వసంత్ నటించనున్నారని సమాచారం. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్‌పై ఎస్.రాధాకృష్ణ నిర్మించనున్న ఈ సినిమా జూన్ 6న అధికారికంగా ప్రారంభం కానుందని ఫిల్మ్‌నగర్ టాక్. ఈ చిత్రంలో వెంకటేశ్‌కి జోడీగా రుక్మిణీ వసంత్‌ని ఎంపిక చేశారట. నిఖిల్ హీరోగా నటించిన 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'(2024) సినిమాతో రుక్మిణీ వసంత్ తెలుగుకి పరిచయమయ్యారు. ప్రస్తుతం ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో ఆమె హీరోయిన్‌గా నటిస్తున్నారు.


క్రిస్మస్ కానుకగా...



● మృణాల్ ఠాకూర్, అడివి శేష్

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'డెకాయిట్'. షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న 'డెకాయిట్'ని క్రిస్మస్ కానుకగా డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా తెలుగు, హిందీ భాషల్లో ఓ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ''హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియన్ థ్రిల్లర్ మూవీ 'డెకాయిట్'. మదనపల్లె యాసలో అడివి శేష్ అదరగొట్టారు. అతని వాయిస్ మాడ్యులేషన్, ఎక్స్‌ప్రెషన్స్ బాగున్నాయి. హిందీ వెర్షన్‌కు కూడా తనే డబ్బింగ్ చెప్పారు. మృణాల్ ఠాకూర్ బలమైన పాత్రలో కనిపిస్తారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

సంక్రాంతి బరిలో రాజు



● నవీన్ పొలిశెట్టి

నవీన్ పొలిశెట్టి, మీనాక్షీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ 'అనగనగా ఒక రాజు'. మారి దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. కాగా 'అనగనగా ఒక రాజు' చిత్రాన్ని 2025 సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లు సోమవారం ప్రకటించారు మేకర్స్. ''సంక్రాంతి సమయంలో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాలకు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ ఉంటుంది. ఈ క్రమంలోనే సంక్రాంతికి సరైన సినిమాగా 'అనగనగా ఒక రాజు'ను రిలీజ్ చేయనున్నాం. ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని అందించేలా మా చిత్రం ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: మిక్కీ జె.మేయర్.

యుద్ధం జూదం ఒక్కటే!

'యుద్ధం జూదం ఒక్కటే.. యుద్ధం ఎక్కడ మొదలుపెట్టాలో తెలియాలి.. జూదం ఎక్కడ ఆపాలో తెలియాలి' అనే ఓ సంభాషణతో 'గ్యాంబ్లర్స్' సినిమా టీజర్ మొదలవుతుంది. 'మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' చిత్రాల ఫేమ్ సంగీత్ శోభన్ హీరోగా, ప్రశాంతి చారులింగా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'గ్యాంబ్లర్స్'. కేఎస్‌కే చైతన్య దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రాకింగ్ రాకేష్, పృథ్వీ రాజ్ బన్న, సాయి శ్వేత, జస్విక, భరణీ శంకర్, శివారెడ్డి ముఖ్యపాత్రల్లో నటించారు.



● 'గ్యాంబ్లర్స్' పోస్టర్

రేష్మాస్ స్టూడియోస్, స్నాప్ అండ్ క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సునీత, రాజ్‌కుమార్ బృందావనం నిర్మించిన ఈ చిత్రం జూన్ 6న విడుదల కానుంది. కాగా ఈ సినిమా టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఇదొక మిస్టరీ ఎంటర్‌టైనర్. ఇందులోని థ్రిల్లింగ్ అంశాలు, ట్విస్టులు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయి'' అన్నారు కేఎస్‌కే చైతన్య. ''కొత్త కాన్సెప్ట్‌తో పూర్తి థ్రిల్లింగ్ అంశాలతో రూపొందిన 'గ్యాంబ్లర్స్' ప్రేక్షకులను అలరిస్తుంది'' అని సునీత, రాజ్‌కుమార్ చెప్పారు.

భైరవంకి అది ప్లస్ అవుతుంది - అనిల్ రావిపూడి



● విజయ్, అనిల్ రావిపూడి, సాయి శ్రీనివాస్, అదితీ శంకర్, రోహిత్, మనోజ్, సంపత్ నంది, రాధామోహన్

''ముగ్గురు హీరోలు కలిసి ఓ సినిమా చేస్తున్నప్పుడు ముందుగా పక్కన పెట్టాల్సింది అహం. సాయి శ్రీనివాస్, మనోజ్, రోహిత్‌లను చూస్తే అహంని పక్కనపెట్టి 'భైరవం' చిత్రం చేసినట్లు అనిపిస్తోంది. బ్రదర్స్‌లాగా చాలా కలిసిపోయి ప్రమోషన్స్ చేస్తున్నారు. అది ఈ సినిమాకి కచ్చితంగా ప్లస్ అవుతుంది'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి అన్నారు. విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన చిత్రం 'భైరవం'. సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా నటించారు. పెన్ స్టూడియోస్‌పై డాక్టర్ జయంతిలాల్ గడా సమర్పణలో కేకే రాధామోహన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి డైరెక్టర్స్ అనిల్ రావిపూడి, సంపత్ నంది, నిర్మాత బెల్లంకొండ సురేష్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంపత్ నంది మాట్లాడుతూ– ''ఈ ముగ్గురు హీరోలు కష్టాలు చూసి నిలబడ్డారు. ఈ సినిమాని అందరూ థియేటర్స్‌లో చూడండి'' అని చెప్పారు. ''భైరవం' కచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుంది'' అన్నారు బెల్లంకొండ సురేష్. కేకే రాధామోహన్ మాట్లాడుతూ–''మా సినిమా ప్రేక్షకులకు మరపురాని అనుభూతిని ఇస్తుంది'' అన్నారు. ''ఒక మంచి సినిమా చూశామనే సంతృప్తిని 'భైరవం' ఇస్తుంది'' అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ చెప్పారు. ''ఈ సినిమా విజయం సాధించాలని మా యూనిట్ వెయ్యి కళ్లతో ఎదురు చూస్తోంది'' అని మంచు మనోజ్ పేర్కొన్నారు. ''ఈ చిత్రాన్ని చూసి, మమ్మల్ని ఆశీర్వదించండి'' అన్నారు నారా రోహిత్. ''ఈ సినిమా ఆడియన్స్‌కి నెక్ట్స్ లెవెల్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతోంది'' అని విజయ్ కనక మేడల తెలిపారు. ఈ వేడుకలో ఆనంది, దివ్య పిళ్లై, సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల, నటుడు అజయ్ మాట్లాడారు.

అమ్మానాన్నల విలువ చెప్పే చిత్రం షష్టిపూర్తి - పవన్ ప్రభ



''మాది ఉమ్మడి కుటుంబం. తాతయ్య, అమ్మమ్మ, నానమ్మ, పిన్నమ్మ, పెద్దమ్మ, మేనత్త.. ఇలా అందరి ప్రేమ నాకు తెలుసు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో కొందరికి అమ్మానాన్నలు కూడా భారం అవుతున్నారు. వారిని నడిరోడ్డుపై వదిలేస్తున్నారు. అమ్మానాన్నల గొప్పదనం, ప్రేమ విలువలు చెప్పాలనే 'షష్టిపూర్తి' సినిమా తీశాను. మంచి భావోద్వేగాలతో పాటు ప్రేక్షకులు సర్‌ప్రైజ్ అయ్యే అంశాలు ఉన్నాయి'' అని దర్శకుడు పవన్ ప్రభ అన్నారు. రూపేశ్ కుమార్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'షష్టిపూర్తి'. ఆకాంక్షా సింగ్ హీరోయిన్‌గా నటించగా, రాజేంద్ర ప్రసాద్, అర్చన కీలక పాత్రల్లో నటించారు. ఈ నెల 30న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా పవన్ ప్రభ విలేకరులతో మాట్లాడుతూ–''ఫిట్టింగ్ మాస్టర్' సినిమాకు డైరెక్షన్ టీమ్‌లో పని చేశాను. ఆ తర్వాత గ్యాప్ వచ్చింది. ఈ సమయంలో సినిమా అంటే ఏంటో నేర్చుకున్నాను. ఇక 'షష్టిపూర్తి' కథ రూపేశ్‌గారికి నచ్చడంతో నిర్మించారు. రూపేశ్, ఆకాంక్ష చక్కగా నటించారు. స్ట్రిక్ట్ మదర్‌గా అర్చనగారు, జోవియల్ ఫాదర్ పాత్రలో రాజేంద్ర ప్రసాద్ కనిపిస్తారు. ఈ సినిమాకి సంగీతం చాలా ముఖ్యం. అందుకే ఇళయరాజాగారే కావాలి అనుకున్నాను. రూపేశ్‌గారి వల్ల ఆయన్ని కలిశాను. ఆయన ఒక పాట కోసం ఎన్నో ట్యూన్లు ఇచ్చారు. 'షష్టిపూర్తి' వేడుక గురించి వివరంగా చెప్పే ప్రయత్నం చేశాను. నా తర్వాతి సినిమాని త్వరలోనే ప్రకటిస్తాను'' అని తెలిపారు.

కిల్లర్ యాక్షన్



● జ్యోతి పూర్వజ్

'శుక్ర, మాటరాని మౌనమిది, ఎ మాస్టర్ పీస్' చిత్రాల ఫేమ్ దర్శకుడు పూర్వజ్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన సైన్స్ ఫిక్షన్ అండ్ యాక్షన్ థ్రిల్లర్ 'కిల్లర్'. ఈ చిత్రంలో జ్యోతి పూర్వజ్ హీరోయిన్‌గా నటించగా, విశాల్ రాజ్, దశరథ, చందూ, గౌతమ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. థింక్ సినిమా, మెర్జ్ ఎక్స్ఆర్, ఏయు అండ్ ఐ పతాకాలపై పూర్వజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మ నాభరెడ్డి నిర్మించారు. ఈ సినిమాలో రక్తిక పాత్రలో జ్యోతి పూర్వజ్ నటించినట్లు మేకర్స్ ప్రకటించి, ఆమె ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ''మైథాలజీ, సైన్స్ ఫిక్షన్, సూపర్ హీరో.. ఇలాంటి అంశాలతో ఈ సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. త్వరలోనే మా చిత్రం విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు (తొలి మూడు శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	455	82,176
నిఫ్టీ ▲	148	25,001

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	18,737	▽	189
డోజోన్స్	41,603	▽	256
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,718	▽	21
డాక్స్	24,028	△	398
షాంఘై	3,345	▽	3
నికాయ్	37,532	△	371

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.45	85.47
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	113.90	116.79
€	యూరో	ఎస్‌బీఐ	95.54	98.23
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.76	60.31
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.29	56.49
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.94	68.63
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.79	23.30
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.28	24.06
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.96	12.79



గెట్.. సెట్.. గ్రో!

ఐపీవోకి స్టాక్ బ్రోకింగ్ దిగ్గజం గ్రో రెడీ


- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు
- రూ. 8,500 కోట్ల సమీకరణపై కన్ను
- కంపెనీ విలువ రూ. 60,000 కోట్లుగా అంచనా

న్యూఢిల్లీ: స్టాక్ బ్రోకింగ్ సంస్థ బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి గోప్యతా విధానంలో ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఇష్యూ ద్వారా కంపెనీ బిలియన్ డాలర్ల(రూ. 8,500 కోట్లు)వరకూ సమీకరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. గ్రో బ్రాండుతో కంపెనీ రిటైల్ బ్రోకింగ్ సర్వీసులందించే సంగతి తెలిసిందే. ఐపీవోలో భాగంగా కొత్తగా ఈక్విటీ జారీసహా ప్రస్తుత వాటాదారులు షేర్లను విక్రయించనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. గ్రోలో ఇప్పటికే పీక్ ఎక్స్‌వీ, టైగర్ క్యాపిటల్, సత్య నాదెళ్ల(మైక్రోసాఫ్ట్ సీఈవో) తదితరులు ఇన్వెస్ట్ చేశారు. ఇష్యూ నిధులను టెక్నాలజీ డెవలప్‌మెంట్, వ్యాపార విస్తరణ తదితరాలకు వినియోగించనుంది.

2016లో ఏర్పాటైన కంపెనీ ప్రస్తుత విలువ 7 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 60,000 కోట్లు)కు చేరుకున్నట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. వేగంగా విస్తరించిన కంపెనీ 2025 మార్చికల్లా 26 శాతం మార్కెట్ వాటాను సొంతం చేసుకుంది. ఎన్‌ఎస్‌ఈ గణాంకాల ప్రకారం గతేడాది(2024–25) 34 లక్షల మంది కొత్త కస్టమర్లను జత చేసుకుంది. మొత్తం యాక్టివ్ క్లయింట్ల సంఖ్య 95 లక్షల నుంచి 1.29 కోట్లకు ఎగసింది. 2023లో కంపెనీ టర్న్‌అరౌండ్ సాధించి రూ. 449 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఆదాయం రూ. 1,277 కోట్లను తాకింది. 2024కల్లా ఆదాయం రూ. 3,145 కోట్లకు ఎగసింది. రూ. 535 కోట్ల నిర్వహణ లాభం సాధించినప్పటికీ రూ. 1,340 కోట్ల వన్‌టైమ్ పన్ను చెల్లింపుల కారణంగా రూ. 805 కోట్ల నికర నష్టం ప్రకటించింది.

అరబిందో ఫార్మా లాభం 903 కోట్లు

ఆదాయం రూ. 8,382 కోట్లు



న్యూఢిల్లీ: ఔషధ రంగ హైదరాబాద్ దిగ్గజం అరబిందో ఫార్మా గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం నామమాత్రంగా క్షీణించి రూ. 903 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 907 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 7,580 కోట్ల నుంచి రూ. 8,382 కోట్లకు ఎగసింది. కాగా.. పూర్తి ఏడాదికి నికర లాభం 10 శాతం వృద్ధితో రూ. 3,484 కోట్లకు చేరింది. 2023–24లో రూ. 3,169 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 29,002 కోట్ల నుంచి రూ. 31,724 కోట్లకు బలపడింది. మరోసారి క్యూ4, పూర్తి ఏడాదికి పటిష్ట ఫలితాలు సాధించినట్లు కంపెనీ వైస్‌చైర్మన్, ఎండీ కె.నిత్యానంద రెడ్డి పేర్కొన్నారు. ఈ కాలాలలో రికార్డ్ అమ్మకాలు నమోదైనట్లు తెలిపారు. యూరోపియన్ కార్యకలాపాల ఆదాయం బిలియన్ డాలర్ల(రూ. 8,500 కోట్లు)ను సమీపిస్తున్నట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు 1.5% నష్టంతో రూ.1,179 వద్ద ముగిసింది.

2025 చివరికి గానీ సాధ్యం కాదు...

భారత్ నాలుగో అతిపెద్ద ఎకానమీ హోదాపై నీతి ఆయోగ్ సభ్యుడు విర్మానీ




న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో జపాన్‌ను అధిగమించి భారత్ నాలుగో స్థానాన్ని ఆక్రమించడంపై నీతి ఆయోగ్‌లో భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే భారత్ నాలుగో స్థానానికి చేరిందంటూ నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యన్ ఇటీవల వెల్లడించగా.. ఇంకా ప్రక్రియ కొనసాగుతోందని, ఈ ఏడాది ఆఖరు నాటికి గానీ ఆ హోదా రాదని సంస్థ సభ్యుడు అరవింద్ విర్మానీ వ్యాఖ్యానించారు. ఇందుకు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఏప్రిల్‌లో విడుదల చేసిన వరల్డ్ ఎకనమిక్ ఔట్‌లుక్ (డబ్ల్యూఈవో) నివేదికను ప్రస్తావించారు. 'భారత్ నాలుగో పెద్ద ఎకానమీగా ఎదిగే ప్రక్రియ కొనసాగుతోంది. 2025 ఆఖరు నాటికి భారత్ ఆ స్థానాన్ని తప్పకుండా దక్కించుకుంటుందని నేను వ్యక్తిగతంగా ధీమాగా ఉన్నాను. ఆ హోదాను ధ్రువీకరించుకోవడానికి మొత్తం 12 నెలల జీడీపీ గణాంకాలు అవసరమవుతాయి. అప్పటిదాకా ఇవన్నీ అంచనాలే' అని ఆయన చెప్పారు. ఇక సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలపై స్పందించాలని కోరగా.. 'ఇది ఒక క్లిష్టమైన విషయం. ఆయన కచ్చితంగా ఏం మాట్లాడారో, ఏం పదాలు ఉపయోగించారో నాకు తెలియదు. బహుశా ఏదైనా పదం మిస్ అయి ఉండొచ్చు లేదా ఇంకేమైనా జరిగి ఉండొచ్చు' అని విర్మానీ పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యం కూడా ఐఎంఎఫ్‌నే ఉటంకిస్తూ భారత్ ఇప్పుడు జపాన్‌ను దాటి నాలుగో పెద్ద ఎకానమీగా ఆవిర్భవించిందంటూ గత వారం ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. 2025లో జపాన్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 4.186 లక్షల కోట్ల డాలర్లుగా ఉంటుందని, భారత జీడీపీ దాని కన్నా స్వల్పంగా అధికంగా 4.187 ట్రిలియన్ డాలర్లుగా ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది.

మళ్లీ 25,000 పైకి నిఫ్టీ

సెన్సెక్స్ లాభం 441 పాయింట్లు

- ముందే పలకరించిన నైరుతి రుతుపవనాలు
- ఈయూపై 50% సుంకాల విధింపు వాయిదా
- ఐటీ, ఆటో షేర్లకు భారీ డిమాండ్



ముంబై: ముందుగానే 'నైరుతి' పలకరింపు, ఈయూ దేశాలపై ట్రంప్ 50% సుంకాల విధింపు వాయిదాతో దలాల్ స్ట్రీట్ సోమవారం అరశాతానికిపైగా లాభపడింది. కేంద్రానికి ఆర్‌బీఐ 2.69 లక్షల కోట్ల డివిడెండ్ ప్రకటన, జపాన్‌ను అధిగమించి భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం అంశాలు వంటి కలిసొచ్చాయి. ఫలితంగా ఐటీ, ఆటో షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 455 పాయింట్లు పెరిగి 82,176 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 148 పాయింట్లు బలపడి 25,001 వద్ద నిలిచింది. ఈ ముగింపు ఇరు సూచీలకు వారం గరిష్ట స్థాయి. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు భారీ లాభాల దిశగా కదిలాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 771 పాయింట్లు బలపడి 82,492 వద్ద, నిఫ్టీ 226 పాయింట్లు ఎగసి 25,079 వద్ద గరిష్టాన్ని తాకింది. అయితే ఆసియా మార్కెట్లలోని బలహీన సంకేతాల ప్రభావంతో ఆరంభ లాభాలు కొంతమేర తగ్గాయి. అమెరికా కరెన్సీ బలహీనత, దేశీయ ఈక్విటీ మార్కెట్‌లోని సానుకూలతలు కలిసిరావడంతో డాలర్ మారకంలో రూపాయి విలువ 35 పైసలు బలపడి 85.10 వద్ద స్థిరపడింది.

- ఆసియాలో జపాన్, కొరియా, థాయ్‌లాండ్ స్టాక్ సూచీలు 1% లాభపడగా.., హాంగ్‌కాంగ్, చైనా, సింగపూర్ సూచీలు 1–15% నష్టపోయాయి. యూరప్‌లో జర్మనీ డాక్స్ ఇండెక్స్ 1.50%, ఫ్రాన్స్ సీఏసీ సూచీ ఒక శాతం చొప్పున పెరిగాయి. కాగా, స్ప్రింగ్ బ్యాంక్ హాలిడే సందర్భంగా బ్రిటన్ మార్కెట్, మెమోరియల్ డే సందర్భంగా అమెరికా మార్కెట్ పనిచేయలేదు.
- సర్వీసెస్ మినహా అన్ని రంగాల షేర్లకు డిమాండ్ లభించింది. బీఎస్‌ఈలో రంగాల వారీగా ఆటో, ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, ఇండస్ట్రియల్స్, క్యాపిటల్ గూడ్స్, ఆయిల్‌అండ్ గ్యాస్ ఒకశాతం రాణించాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం పెరిగాయి.
- భూషణ్ స్టీల్ అండ్ పవర్ ఆస్తుల విక్రయంపై సుప్రీం కోర్టు స్టేటస్ కో విధించడంతో జేఎస్ డబ్ల్యూ షేరు 2% పెరిగి రూ.1,032 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 3% ఎగసి రూ. 1,036 వద్ద నిలిచింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

పీసీలకు పెరిగిన గిరాకీ	హైదరాబాద్‌లో ఆఫీస్ అద్దెలు జంప్

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లాభం 39 శాతం అప్

- క్యూ4లో 21 కోట్లు
- పూర్తి సంవత్సరానికి 77% వృద్ధి; రూ. 139 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాల తయారీ దిగ్గజం ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ (ఓజీఎల్) గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.21 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం క్యూ4లో నమోదైన రూ.15 కోట్లతో పోలిస్తే ఇది సుమారు 39% అధికం. మరోవైపు, ఆదాయం 55% వృద్ధితో రూ. 449 కోట్లకు చేరింది. 219 వాహనాలను డెలివర్ చేసింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం 56% పెరిగి రూ. 1,802 కోట్లకు చేరగా, లాభం 77% ఎగిసి రూ. 79 కోట్ల నుంచి రూ. 139 కోట్లకు పెరిగింది. క్యూ4, పూర్తి ఏడాది ఆదాయం, లాభంపరంగా పటిష్టమైన వృద్ధి సాధించినట్లు కంపెనీ సీఎండీ కేవీ ప్రదీప్ తెలిపారు. తయారీ, సాంకేతిక సామర్థ్యాలను పెంచుకోవడంపై మరింత దృష్టి పెడుతున్నామన్నారు. ఇప్పటివరకు 2,718 ఎలక్ట్రిక్ వాహనాలను డెలివర్ చేసినట్లు చెప్పారు. మొత్తం 10,022 బస్సులకు ఆర్డర్లు ఉన్నాయని తెలిపారు.

రిలయన్స్ ఇన్‌ఫ్రాకు లాభాలు

క్యూ4లో రూ. 4,387 కోట్లు



ముంబై: ప్రైవేట్ రంగ కంపెనీ రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 4,387 కోట్ల నికర లాభం ఆర్జించింది. వ్యయాలు తగ్గడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 221 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 4,783 కోట్ల నుంచి రూ. 4,268 కోట్లకు క్షీణించింది. మొత్తం వ్యయాలు రూ. 5,287 కోట్ల నుంచి రూ. 4,828 కోట్లకు తగ్గాయి. కాగా.. పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నష్టాలను వీడి రూ. 4,938 కోట్ల నికర లాభం ప్రకటించింది. 2023–24లో రూ. 1,609 కోట్ల నికర నష్టం నమోదైంది. కంపెనీ కన్సాలిడేటెడ్ నెట్‌వర్త్ రూ. 4,388 కోట్లు పెరిగి రూ. 14,287 కోట్లను తాకింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌ఎండీసీ లిమిటెడ్, హైదరాబాద్‌లో 995 పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌ఎండీసీ), బైలడిల ఐరన్ ఓర్ మైన్ కిరండూల్ కాంప్లెక్స్, బచేలీ కాంప్లెక్స్ దంతెవాడ, దోనిమలై ఐరన్ మైన్‌లలో వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 225.
- » **పోస్టుల వివరాలు:** బీఐఓఎం కిరండూల్ కాంప్లెక్స్–389, బీఐఓఎం బచేలీ కాంప్లెక్స్–356, డీఐఓఎం దోనీమలై కాంప్లెక్స్–250.
- » **పోస్టులు:** ఫీల్డ్ అటెండెంట్(ట్రైనీ), మెయింటెనెన్స్ అసిస్టెంట్ (ఎలక్ట్రికల్ /మెకానికల్) ట్రైనీ, బ్లాస్టర్ గ్రూప్2(ట్రైనీ), ఎలక్ట్రీషియన్ గ్రూప్ 2(ట్రైనీ), ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్ గ్రూప్ 3(ట్రైనీ), హెచ్‌ఈఎం మెకానిక్/ఆపరేటర్ గ్రూప్ 3(ట్రైనీ), ఎంసీఓ గ్రూప్ 3 (ట్రైనీ), క్యూసీఏ గ్రూప్ 3(ట్రైనీ), మెషినిస్ట్, ఫిట్టర్, వెల్డర్, ఆటో ఎలక్ట్రీషియన్.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి/ఐటీఐ, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వేతనం:** నెలకు ఫీల్డ్ అటెండెంట్‌కు రూ.31,850, మెయింటెనెన్స్ అసిస్టెంట్‌కు రూ.32,940, ఇతర పోస్టులకు రూ.35,040.
- » **వయసు:** 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** ఓఎంఆర్/కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష, ఫిజికల్ ఎబిలిటీ టెస్ట్/ట్రేడ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 14.06.2025.
- » **వెబ్‌సైట్:** https://www.nmdc.co.in

ఆర్‌బీఐలో 13 మెడికల్ కన్సల్టెంట్ పోస్టులు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఒప్పంద ప్రాతిపదికన మెడికల్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 13.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **ఎంపిక విధానం:** డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రీజనల్ డైరెక్టర్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, రిక్రూట్‌మెంట్ సెక్షన్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ముంబై రీజనల్ ఆఫీస్, షాహిద్ భగత్ సింగ్ రోడ్, ఫోర్ట్, ముంబై–400001 చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 06.06.2025.
- » **వెబ్‌సైట్:** https://opportunities.rbi.org.in

డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్శిటీలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్శిటీ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం సీట్ల సంఖ్య:** 55.
- » **కోర్సు వ్యవధి:** రెండేళ్లు(నాలుగు సెమిస్టర్లు).
- » **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 31.08.2025 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** పదో తరగతి మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
  దరఖాస్తును రిజిస్ట్రార్, డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్శిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, వెంకటరామన్నగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 19.06.2025.
- » **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

కెరీర్ ప్లానింగ్.. ఫ్యూచర్ షైనింగ్

వందల సంఖ్యలో కోర్సులు.. వేల సంఖ్యలో కెరీర్స్.. లక్షల్లో వేతనాలు! ఏ రంగం చూసినా అవకాశాల హోరమే.. ఏ కెరీర్ చూసినా హాట్ కెరీరే అనే అభిప్రాయం!! వాస్తవానికి ఇవన్నీ సాధ్యమయ్యేది.. సరైన కోర్సు, జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా స్కిల్స్ ఉన్నప్పుడే!! వీటన్నింటి నడుమ సరితూగే కెరీర్‌ను ఎంపిక చేసుకోవడం అంత తేలికకాదు. ముఖ్యంగా కెరీర్ గమనంలో మైలురాళ్లుగా నిలిచే పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఎన్నో సందేహాలు!! ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు కోర్సు, కెరీర్ ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం..

- » పదో తరగతి నుంచే నిర్దిష్ట ప్రణాళిక అవసరం
- » స్వీయ సామర్థ్యం/నైపుణ్యాలు గుర్తించాలి
- » వాస్తవ పరిస్థితులపై అవగాహన ఉండాలి
- » జాబ్ మార్కెట్‌లో అవకాశాలు ముఖ్యమే

పది, ఇంటర్ ఉత్తీర్ణులు.. ఈ దశలోనే సరైన నిర్ణయం తీసుకోవాలి. సరితూగే కెరీర్‌ను అప్రమత్తంగా ఎంచుకోవాలి. విద్యార్థులు కెరీర్ ఎంపికలో ఆసక్తికి ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. దీంతోపాటు తమ వ్యక్తిగత దృక్పథం, ఆర్థిక స్థోమత, అభ్యసన సామర్థ్యం, ఉన్నత విద్య మార్గాలు, జాబ్ మార్కెట్‌లో అవకాశాలు తదితర అంశాలను సైతం పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంటున్నారు.

గ్రూప్ ఎంపిక

- ✦ ఇంజనీరింగ్‌లో చేరాలనుకునే వారు ఎంపీసీ గ్రూప్; మెడికల్ చదవాలనుకునే వారు బైపీసీ గ్రూప్; కామర్స్/మేనేజ్‌మెంట్‌పై ఆసక్తి ఉంటే సీఈసీ గ్రూప్‌ల్లో చేరుతున్నారు.
- ✦ ఇంజనీరింగ్ లక్ష్యంగా పెట్టుకున్న ఎంపీసీ విద్యార్థులు బీటెక్ స్థాయిలో తమకు సరితూగే బ్రాంచ్‌పై ముందుగానే అవగాహన ఏర్పరచుకోవాలి.
- ✦ మెడికల్ అభ్యర్థులు ఎంబీబీఎస్/బీడీఎస్‌తో పాటు ఇతర ప్రత్యామ్నాయ మార్గాలపైనా దృష్టి సారించాలి.
- ✦ కామర్స్/మేనేజ్‌మెంట్ రంగం కోసం బీకాం చదవాలా? లేదా సీఏ/సీఎస్ /ఐసీడబ్ల్యూఏ వంటి కోర్సులను ఎంచుకోవాలా? అనే విషయంలో స్పష్టత అవసరం.
- ✦ హెచ్‌ఈసీ ఎంచుకున్న విద్యార్థులకు సోషల్ వర్క్, ఎన్‌జీఓ మేనేజ్‌మెంట్, రూరల్ డెవలప్‌మెంట్ వంటి విభాగాల్లో అనేక కోర్సులు, కెరీర్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

ఆసక్తి ముఖ్యం

కెరీర్, కోర్సు ఎంపికలో అత్యంత కీలకమైనది వ్యక్తిగత ఆసక్తి. ఇది కెరీర్ ప్రణాళికలో తొలి ప్రామాణికం. ఆసక్తి లేకుండా ఎంత మంచి కోర్సులో చేరినా ఆశించిన ఫలితం కష్టమే. సంప్రదాయ సంగీతం నుంచి సాఫ్ట్‌వేర్ రంగం వరకూ.. ప్రస్తుతం అన్ని రంగాల్లో అవకాశాలు లభిస్తున్నాయి. ఎన్నో కొత్త కొత్త కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. కాబట్టి 'క్రేజీ కెరీర్' అనే కోణానికే పరిమితం కాకుండా.. ఆసక్తి మేరకు కోర్సును ఎంచుకోవచ్చు.

సానుకూల దృక్పథం

కెరీర్ ఎంపికలో విద్యార్థి అటిట్యూడ్(దృక్పథం)ను పరిగణనలోకి తీసుకోవడం ఎంతో ముఖ్యం. కొంతమంది విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే వారి దృక్పథం వారి చర్యల ద్వారా కనిపిస్తుంది. ఉదాహరణకు కొంతమందికి చిన్నప్పటి నుంచే ఇంజనీరింగ్ చదవాలి లేదా డాక్టర్ కావాలి అనే స్పష్టమైన దృక్పథం ఉంటుంది. పాఠశాల స్థాయిలో మ్యాథ్స్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఇంజనీరింగ్.. సైన్స్ పట్ల ఇష్టమున్న వారు మెడికల్ వంటి కోర్సులను ఎంచుకోవచ్చు. ఆయా కోర్సు పట్ల సానుకూల వైఖరి కలిగి ఉండటం భవిష్యత్‌లో కెరీర్‌లో సక్సెస్‌కు చాలా అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు. సానుకూల దృక్పథం కలిగి ఉన్న విద్యార్థులు కెరీర్‌లో ఎదురయ్యే సవాళ్లను స్వీయ ప్రేరణతో పాటు నేర్చుకోవడం ద్వారా, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమను తాము మలచుకోవడం ద్వారా విజయం సాధించగలరని చెబుతున్నారు.

అభ్యసన సామర్థ్యం

కెరీర్ ఎంపికలో విద్యార్థి ఆప్టిట్యూడ్(అభ్యసన సామర్థ్యాన్ని)నూ సైతం పరిగణనలోకి తీసుకోవాలి. ఇందుకోసం రెండు అంశాలను బేరీజు వేసుకోవాలి. అవి.. థియరీ నైపుణ్యాలు, ప్రాక్టికల్ అప్రోచ్. మ్యాథమెటిక్స్, సైన్స్ వంటి కోర్సుల్లో ప్రాక్టికల్ అప్రోచ్‌దే ప్రాధాన్యం. హిస్టరీ, ఎకనామిక్స్, ఇతర సోషల్ సైన్సెస్ విషయంలో థియరీ నైపుణ్యాలు లాభిస్తాయి. విద్యార్థులు తమకు ఈ రెండింటిలో దేనిలో ఎక్కువ నైపుణ్యం ఉందో గుర్తించి.. ఆ మేరకు ఇంటర్మీడియెట్‌లో గ్రూప్‌ను ఎంచుకోవాలి. తద్వారా భవిష్యత్ కెరీర్ దిశగా ప్రణాళిక రూపొందించుకోవాలి. ఈ అభ్యసన సామర్థ్యాలను తెలుసుకునేందుకు పాఠశాల స్థాయిలో విద్యార్థి ఆయా సబ్జెక్ట్‌ల్లో చూపిన ప్రతిభను ప్రామాణికంగా తీసుకోవచ్చు.

ఉన్నత విద్య



కోర్సులు, కెరీర్స్ ఎంపికలో అత్యంత ప్రధానమైన అంశం.. ఉన్నత విద్య. ప్రతి కోర్సులోనూ ఇప్పుడు ఉన్నత విద్య అవకాశాలున్నాయి. కానీ వాటిని అందించే ఇన్‌స్టిట్యూట్‌లు, సీట్ల పరిమితి వంటి వాటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఇటీవల కాలంలో మార్కెట్ క్రేజ్ కోణంలో బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో అనేక కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నారు. కాని వీటికి పీజీ స్థాయిలో స్పెషలైజేషన్లు ఉండట్లేదు. దీనివల్ల విద్యార్థులు సంబంధిత రంగంలో పరిపూర్ణత సాధించలేకపోతున్నారు. కాబట్టి ఉన్నత విద్య అవకాశాలు పుష్కలంగా ఉన్న కోర్సులను ఎంచుకోవడం మేలు.

కోర్సు వ్యవధి

కోర్సు ఎంపికలో సదరు కోర్సు వ్యవధి సైతం కీలకంగా మారుతోంది. కొన్ని కోర్సులకు సంబంధించి పీజీ, పీహెచ్‌డీ చేస్తే కానీ కెరీర్‌లో రాణింపునకు అవకాశం లభించదు. ఉదాహరణకు మెడికల్ కోర్సునే తీసుకుంటే.. పీజీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులు చేస్తేనే సంబంధిత రంగంలో కెరీర్‌లో గుర్తింపు లభిస్తోంది. ఇందుకోసం ఇంటర్మీడియెట్ తర్వాత దాదాపు పదేళ్ల సమయం పడుతోంది. అదే విధంగా సైన్స్ కోర్సుల్లో కూడా పీజీ, పీహెచ్‌డీ చేస్తేనే ఆశించిన స్థాయిలో కెరీర్ అవకాశాలు లభించే వీలుంది. ఇలాంటి కోర్సులతో కెరీర్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించడం ఖాయం. కానీ మన సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో సుదీర్ఘకాలం ఉన్నత విద్య కోసం వెచ్చించే వెసులుబాటు అందరికీ ఉండదు.

ఉపాధి వేదికలు

కోర్సు, కెరీర్ పరంగా స్పష్టత వచ్చిన తర్వాత ఉపాధి వేదికల పరంగానూ ముందుగానే అవగాహన పెంచుకోవాలి. సంబంధిత కోర్సు ఉత్తీర్ణులకు జాబ్ మార్కెట్‌లో లభిస్తున్న ఉద్యోగావకాశాల గురించి తెలుసుకోవాలి. ఎలాంటి కంపెనీలు ఆఫర్లు ఇస్తున్నాయి.. ఎలాంటి జాబ్ ప్రొఫైల్స్ లభిస్తున్నాయి.. దీర్ఘకాలంలో సదరు జాబ్స్‌కు ఏర్పడే డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. అంతేకాకుండా ఆయా రంగం ప్రస్తుత ప్రగతి, సంబంధిత కోర్సు ముగిసే సమయానికి లభించే అవకాశాలపైనా స్పష్టమైన అంచనా ఏర్పరచుకోవాలి. ఇందుకోసం సంబంధిత రంగ నిపుణుల సలహాలు, సూచనలు లాభిస్తాయి.

ఆర్థిక అంశాలు

కెరీర్ ఎంపికలో కుటుంబ ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవడం కూడా ముఖ్యమే. ప్రస్తుతం ఇంజనీరింగ్ కోర్సులకు రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు వార్షిక ఫీజు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే వెనుకబడిన వర్గాలకు, ప్రతిభావంతులకు పలు ఆర్థికపరమైన ప్రోత్సాహకాలు అందుబాటులో ఉంటున్నాయి. బ్యాంకు రుణాలు, స్కాలర్‌షిప్స్ వంటి సదుపాయాలు లభిస్తున్నాయి. కాబట్టి ఎంపిక చేసుకునే కోర్సుకు రుణాలు, స్కాలర్‌షిప్స్ పరంగా ఉన్న అవకాశాల గురించి ముందుగానే తెలుసుకోవడం మేలు.

ప్రత్యామ్నాయాలు

కెరీర్ ప్లానింగ్‌లో తొలి ప్రాధాన్య అంశం 'ఆసక్తి' అయితే.. మలి ప్రాధాన్యం ప్రత్యామ్నాయ కోర్సులని నిపుణులు పేర్కొంటున్నారు. ఆసక్తి, లక్ష్యాలు, ఆర్థిక పరిస్థితులు.. అన్నీ అనుకూలంగా ఉన్నప్పటికీ.. కొన్ని సందర్భాల్లో ఫలితం ఆశించిన విధంగా ఉండదు. అలాంటి సందర్భాల్లో ప్లాన్ బీకి మారేందుకు సిద్ధంగా ఉండాలి. అంటే.. ప్రత్యామ్నాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలి. ఉదాహరణకు ఇంటర్మీడియెట్ బైపీసీ విద్యార్థుల్లో అధిక శాతం మంది లక్ష్యం ఎంబీబీఎస్‌లో చేరడం. కాని పరిమితమైన సీట్లు, అపరిమిత పోటీ కారణంగా అవకాశం అందకపోవచ్చు. వీరు ఎంబీబీఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఉన్న ఇతర వైద్య సంబంధ కోర్సుల (ఆయుష్, వెటర్నరీ సైన్స్, ఫిజియోథెరపీ, నర్సింగ్, ఫార్మసీ వంటివి) గురించి తెలుసుకోవాలి.

హాబీలు.. అందించే హోదాలు

హాబీలంటే.. వ్యక్తిగత ఆసక్తులు! ఇలాంటి హాబీలతోనూ ఇప్పుడు ఉజ్వల కెరీర్ అవకాశాలు అందుకోవచ్చు. ఉదాహరణకు బొమ్మలు గీయడం హాబీగా ఉన్న విద్యార్థులు.. అందులో ప్రతిభను పెంచుకుంటే.. ఫైన్ ఆర్ట్స్, గ్రాఫిక్ డిజైనింగ్ వంటి రంగాల్లో రాణించొచ్చు. అదే విధంగా క్రీడలపై మక్కువ ఉంటే.. క్రీడా రంగంలోనే కెరీర్ సొంతం చేసుకునే విధంగా స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. డ్యాన్సింగ్, యాక్టింగ్ వంటి హాబీలున్న విద్యార్థులకు ఆయా విభాగాల్లో ప్రొఫెషనల్ స్కిల్స్ ద్వారా చక్కటి కెరీర్స్ అందించే కోర్సులు లభిస్తున్నాయి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–తెలుగు
» టెట్/డీఎస్సీ ప్రత్యేకం–బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–జనరల్ అవేర్‌నెస్



'మిస్ వరల్డ్' ఇక్కడ.. టాలీవుడ్ ఎక్కడ?

పోటీలు, కార్యక్రమాల్లో కన్పించని తెలుగు చిత్ర పరిశ్రమ ప్రముఖులు

బెంగళూరు, ముంబైల్లో అలా.. ఇక్కడే ఎందుకు ఇలా..?

హైదరా'బాత్'.. క్యా హై!

తారా హుషార్ ఏదీ...!

సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన, అత్యంత పురాతనమైన అందాల పోటీ మిస్ వరల్డ్. ఈ పోటీలు మన దేశపు అతివల అందాన్ని మాత్రమే కాదు మేధస్సును, శక్తియుక్తులను ప్రపంచానికి అనేకసార్లు చాటి చెప్పాయి. ఈ పోటీలకు ఆతిథ్యం ఇచ్చే అవకాశం తొలిసారి ఓ తెలుగు రాష్ట్రానికి, అందులోనూ తెలంగాణకు దక్కింది. గత కొన్నిరోజుల క్రితం ప్రారంభమైన ఈ పోటీలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. వివిధ రకాల పోటీల్లో పాల్గొంటూ సుందరీమణులు సందడి చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇంత హల్‌చల్ జరుగుతున్నా.. టాలీవుడ్ మాత్రం అంత పట్టించుకున్నట్టు కన్పించడం లేదు. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖుల నిరాసక్తత చర్చనీయాంశంగా మారుతోంది. నేరుగా మోడలింగ్, సినిమాలతో అనుబంధం కలిగి ఉండే ఈ పోటీల విషయంలో చిత్ర పరిశ్రమ తీరు ఆశ్చర్యకరంగా, ఒకింత ఆక్షేపణీయంగా కూడా ఉంది.

తమ గ్లోబల్ ఈవెంట్ మరింత ప్రజాదరణ పొందేలా చేయడానికి మిస్ వరల్డ్ పోటీ నిర్వాహకులు దేశంలోని సినీ రంగ ప్రముఖులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపడం సాధారణమే. ఫ్యాషన్, గ్లామర్, సామాజిక సేవ అనే రంగాల సంగమంగా ఈ వేడుక సాగుతుంది కాబట్టి సినిమా రంగం తోడ్పాటును వారు ఎప్పుడూ ఆహ్వానిస్తారు. కొన్ని సందర్భాల్లో సెలబ్రిటీలు జడ్జీలుగా లేదా స్పెషల్ గెస్టులుగా కూడా పాల్గొంటారు. అయితే ఈ దఫా ఈవెంట్‌లో జడ్జిగా ఇప్పటివరకూ ఒక్క సోనూసూద్ పేరు తప్ప మరెవరి పేరూ వినిపించడం లేదు. అలాగే నగరం వేదికగా జరుగుతున్న ఈ పోటీల్లో నాగార్జున లాంటి ఒకరిద్దరు తప్ప టాలీవుడ్ సెలబ్రిటీల జాడ కనపడడం లేదు. ఇటీవలి కాలంలో పాన్ ఇండియా స్టార్లుగా పేరు తెచ్చుకున్న పలువురు టాలీవుడ్ నటులు ఈ పోటీల వైపు కన్నెత్తి చూస్తున్నట్టు గానీ, వీటి గురించి పన్నెత్తి మాట్లాడుతున్నట్టు గానీ లేదు. తుది పోటీలకు ఇంకా కేవలం 5 రోజులు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో.. ఫైనల్స్‌లో అయినా టాలీవుడ్ తారలు సందడి చేస్తారని, నగర ప్రతిష్టను అంతర్జాతీయంగా ఇనుమడింపజేసే ఈవెంట్‌కు అదనపు జోష్ జత చేస్తారని ఆశిద్దాం.

బెంగళూరు.. బాలీవుడ్ సందడి

ప్రపంచ సుందరి పోటీలు భారత్‌లో ఇంతకుముందు రెండుసార్లు జరిగాయి తొలుత బెంగళూరులో 1996లో జరగగా, 2024లో ముంబయిలో జరిగాయి. ఈ రెండు సందర్భాల్లోనూ మిస్ వరల్డ్ ఈవెంట్‌కు భారతీయ సినిమా పరిశ్రమ నుంచి విశేష మద్దతు లభించింది. తొలిసారి బెంగళూరులో జరిగిన పోటీల నిర్వహణ బాధ్యతలను బిగ్ బి అమితాబ్ బచ్చన్‌కు చెందిన ఏబీసీఎల్ తలకెత్తుకోగా.. బాలీవుడ్ నుంచి పలువురు తారాగణం తరలివచ్చి ఆ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ముఖ్యంగా మన తొలి మిస్ వరల్డ్‌గా ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన, బాలీవుడ్ స్టార్ ఐశ్వర్యా రాయ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ముంబై... స్టార్స్ జై

→ ముంబైలో నిర్వహించిన మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ బాధ్యతల్లో బాలీవుడ్ దర్శక నిర్మాత కరణ్ జోహార్, మేగస్ యంగ్ సంస్థలు పాలుపంచుకున్నాయి. అప్పుడు కూడా భారతీయ సినీ పరిశ్రమల నుంచి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. బాలీవుడ్ నుంచి కరణ్ జోహార్‌తో పాటు దీపికా పదుకొణె, ఆలియా భట్..దక్షిణాది నుంచి మణిరత్నం, ప్రకాశ్ రాజ్, రమ్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఇక ఐశ్వర్యారాయ్, ప్రియాంకా చోప్రా, మానుషి చిల్లర్ వంటి మిస్ వరల్డ్ మాజీ విజేతలు ఆ పోటీలకు అదనపు ఆకర్షణ చేకూర్చారు. ఇక కృతిసనన్, పూజా హెగ్డే, సోనాక్షి సిన్హా, మన్నారా చోప్రా తదితర హీరోయిన్లతో పాటు నిర్మాత, దర్శకుడు సాజిద్ నడియాడ్‌వాలాలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలకు హాజరైన వారిలో బాలీవుడ్ చిన్నితెర ప్రముఖులు కూడా ఉండడం విశేషం. రుబీనా దిలైక్, అభినవ్ శుక్లా, దివ్యాంకా త్రిపాఠి, వివేక్ దహియా తదితర చిన్నితెర స్టార్స్ కూడా హాజరయ్యారు. బాలీవుడ్ గాయనీ గాయకులు నేహా కక్కర్, టోనీ కక్కర్‌లు, షాన్‌లు తమ సంగీత ప్రదర్శనలతో అలరించారు.

30న హెచ్‌ఏఎల్‌కు 'తేజస్' ఫ్యూజ్‌లాజ్ అప్పగింత

సాక్షి, హైదరాబాద్: తేలికపాటి యుద్ధవిమానం తేజస్ ఎంకే1ఏ కోసం హైదరాబాద్ సంస్థ వెమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మించిన మొట్టమొదటి 'సెంటర్ ఫ్యూజ్‌లాజ్ అసెంబ్లీ (యుద్ధవిమాన ప్రధాన భాగం) సిద్ధమైంది. ఈ నెల 30న హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)కు దీన్ని వెమ్ టెక్నాలజీస్ తమ సంస్థ ప్రాంగణంలో అందజేయనుంది. ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రిత్వశాఖలోని రక్షణ ఉత్పత్తుల విభాగం కార్యదర్శి సంజీవ్ కుమార్, హెచ్‌ఏఎల్ చైర్మన్ డీకే సునీల్ తదితరులు పాల్గొననున్నారు. రెండు దశాబ్దాలుగా హెచ్‌ఏఎల్ ఉత్పత్తుల భాగస్వామిగా ఉన్న వెమ్ టెక్నాలజీస్ మెటాలిక్, కార్బన్ ఫైబర్ మిశ్రమంతో సెంటర్ ఫ్యూజ్‌లాజ్‌ను నిర్మించింది. ఇటీవల విడిభాగాలన్నింటినీ బిగించగా హెచ్‌ఏఎల్ నాణ్యతా నిర్ధారణ ఏజెన్సీతోపాటు కేంద్ర ప్రభుత్వ సంస్థ సెమిలాక్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది.

బ్యూటీ విత్ ఎ పర్పస్ గాలా

మిస్ వరల్డ్ పోటీదారులకు అద్భుత ఆతిథ్యం.. సామాజికవేత్త సుధారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు


మిస్‌వరల్డ్ పోటీదారులతో వ్యాపారవేత్త సుధారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ సామాజికవేత్త, వ్యాపారవేత్త సుధారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నిర్వహించిన 'బ్యూటీ విత్ ఎ పర్పస్ గాలా'లో మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న 108 దేశాలకు చెందిన అందాల తారలు సందడి చేశారు. బంజారాహిల్స్‌లోని విలాసవంతమైన నివాసం 'మోన్ అమూర్ ప్యాలెస్'లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం 'మిడ్‌నైట్ పరల్స్' థీమ్‌తో తెలంగాణ సంస్కృతి, అతిథి సత్కారం, మానవతా సేవలకు నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా ఇచ్చిన విందులో భారతీయ వంటకాలతో పాటు ఏషియన్, ఇటాలియన్, అంతర్జాతీయ వంటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. టెండర్ కోకోనట్ కార్పాచ్చియో, పనీర్ మిల్లే-ఫ్యూల్, సాఫ్రన్ ఖిచడి వంటి ఆధునిక భారతీయ వంటకాలు, ఉడాన్ నూడుల్స్‌తో కూడిన ట్రఫిల్ సోస్, లాబ్‌స్టర్ థెర్మిడార్ రిసోటో వంటి ఇతర వంటకాలను అతిథులు ఆస్వాదించారు. రసమలై ట్రెస్లెచెస్, చాకొలేట్ డుల్సే డి లెచే మూస్స్, బాస్క్ చీజ్‌కేక్ లాంటి భారతీయ, పాశ్చాత్య స్వీట్స్ అండ్ డిజర్ట్స్ సమ్మేళనం ఆకట్టుకున్నాయి. కళాత్మక అలంకరణలో శ్వేత-బంగారు రంగులతో కూడిన డెకార్, పుష్ప గుచ్ఛాలు, పెర్ల్స్ అలంకరణ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. శాస్త్రీయ సంగీత బృందం 'తబలా, సన్స్' సంగీత ప్రదర్శన, డెలిగేట్ల ఫ్లాష్ మాబ్ డాన్స్ కార్యక్రమానికి జోష్‌ని తీసుకొచ్చాయి. 'బ్యూటీ విత్ ఎ పర్పస్'ప్రాజెక్టుల ప్రదర్శన కార్యక్రమంలో కొన్ని ఉత్తమమైన మానవతా కార్యక్రమాలను డెలిగేట్లు ప్రదర్శించారు. ఈ గాలా వేడుకకు రాజ కుటుంబ సభ్యులు మహారాణి రాధికా గాయక్వాడ్ (బరోడా), ప్రిన్సెస్ కృష్ణకుమారి (జోధ్‌పూర్), డాక్టర్ మధు చోప్రా, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధారెడ్డి మాట్లాడుతూ.. 'ఈ గాలా ద్వారా భారత సంస్కృతి గొప్పతనాన్ని ప్రపంచానికి పరిచయం చేయగలిగినందుకు గర్వంగా ఉంది..'అని అన్నారు. మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లే ఈ వేడుకను 'సౌందర్యంతో పాటు సమాజసేవకు వేదిక'గా అభివర్ణించారు.

కోవిడ్‌పై నిరంతర నిఘా

జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పాజిటివ్ శాంపిళ్లు పంపించాలి

ప్రజారోగ్య డైరెక్టర్‌కు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కోవిడ్ వ్యాప్తిపై నిరంతరం నిఘా కొనసాగించాలని.. వైరస్ వేరియంట్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. కోవిడ్ పాజిటివ్ శాంపిళ్లను జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పంపించాలని ప్రజారోగ్య డైరెక్టర్ రవీందర్ నాయక్‌కు చెప్పారు. దేశంలో కోవిడ్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నివారణపై సచివాలయంలో సంబంధిత నిపుణులతో మంత్రి దామోదర ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కోవిడ్ ఇతర అనారోగ్యాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సీసీఎంబీ, ఐసీఎంఆర్ వంటి ప్రముఖ సంస్థల నుంచి వచ్చే సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని ప్రజలకు ఆయన సూచించారు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దగ్గు, జలుబు, జ్వరం, డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు సీసీఎంబీ, సీడీఎఫ్‌డీ, బీబీనగర్ ఎయిమ్స్, నిమ్స్ తదితర సంస్థలతో కలిసి ప్రతి జిల్లాలోనూ ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ నందికూరి, ఎన్ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ సుదీప్ ఘోష్, బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ అభిషేక్ అరోరా సహా పలువురు వైద్యరంగ నిపుణులు భారత్ సహా వివిధ దేశాల్లో కోవిడ్ వ్యాప్తి గురించి మంత్రికి వివరించారు. ఇప్పటివరకు ఉన్న సమాచారం, పరిశోధనల ప్రకారం కోవిడ్‌తో ప్రమాదమేమీ లేదని వినయ్ నందికూరి చెప్పారు.

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీపై కఠిన చర్యలు!: రాష్ట్రంలో సీజనల్ వ్యాధులతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ కేసులు పెరిగే అవకాశం ఉన్నందున అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని ఉన్నతాధికారులను మంత్రి దామోదర ఆదేశించారు. ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యం, రోగులకు పౌష్టికాహారం సరిగ్గా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నీటి నమూనాలను సేకరించి సీసీఎంబీ, సీడీఎఫ్‌డీ ల్యాబ్‌లకు పంపించాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రులపై నిఘా పెంచాలని.. డెంగీ పేరుతో ప్రజలను దోచుకునే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

భద్రత భేష్!

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా భద్రత చర్యలు అద్భుతంగా ఉన్నాయని మిస్ వరల్డ్ పోటీదారులు ప్రశంసిస్తున్నారు. వివిధ రకాల కేసుల దర్యాప్తులో రాష్ట్ర పోలీసులు వినియోగిస్తున్న ఆధునిక సాంకేతికతపై కొన్ని దేశాల సుందరీమణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మహిళా భద్రత విభాగం సిబ్బందితో ఈ మేరకు తమ అభిప్రాయాలు పంచుకుంటున్నారు. మిస్ వరల్డ్ పోటీదారుల అభిప్రాయాలతో తెలంగాణ మహిళా భద్రత విభాగం ప్రత్యేకంగా ఒక డాక్యుమెంటరీ తయారు చేస్తున్నట్టు సమాచారం. కాగా మిస్ వరల్డ్-2025 పోటీల్లో భాగంగా గత కొన్ని రోజులుగా తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న సుందరీమణులు, పలు కార్యక్రమాల్లో సైతం పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పోలీసులు వారికి పటిష్టమైన ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేశా రు. వారు బస చేసే హోటల్ వద్ద, పర్యటనలు, కార్యక్రమాల సందర్భంగా మహిళా భద్రత సిబ్బంది సైతం విధుల్లో పాల్గొంటూ కీలకంగా వ్యవహరిస్తున్నారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ సందర్శన: వివిధ ప్రాంతాల పర్యటనలో భాగంగా మే 18న మిస్ వరల్డ్ పోటీదారులు బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)ను సందర్శించారు. నేరాల దర్యాప్తులో రాష్ట్ర పోలీసుల పనితీరు, వినియోగిస్తున్న సాంకేతికతను ఉన్నతాధికారులు వారికి వివరించారు. ఐసీసీసీలోని సీసీటీవీ మానిటరింగ్ వ్యవస్థ, శాంతిభద్రతలు, ట్రాఫిక్ సహా పలు అంశాల పర్యవేక్షణలో పాటిస్తున్న పద్ధతులు, వాడుతున్న తీరును విపులంగా తెలియజేశారు. తెలంగాణ మహిళా భద్రత విభాగం మహిళలు, చిన్నారుల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలు వివరించారు. ఈ నేపథ్యంలో కూడా సుందరీమణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కాగా వీటన్నిటినీ మహిళా భద్రత విభాగం డాక్యుమెంటరీ రూపంలో పొందుపరుస్తున్నట్టు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.


Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
మంగళవారం ၊ 27-5-2025



మత్స్యగిరీంద్రస్వామి ఆలయం

మత్స్యరూపం.. శుభ సంకల్పం



గుట్టపై మత్స్యగిరీంద్రస్వామి భారీ విగ్రహం

- కొత్తగట్టు కొండపై వెలసిన మత్స్యగిరీంద్రుడు
- రాష్ట్రంలోనే ఏకైక ఆలయంగా ప్రసిద్ధి
- కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి పక్కన పుణ్యక్షేత్రం
- కోరిన కోర్కెలు నెరవేర్చే మత్స్యగిరీంద్రుడు

శంకరపట్నం: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం తెలంగాణలోనే అత్యంత ప్రఖ్యాతి గాంచింది. చుట్టూ ఎత్తయిన గుట్టలు, పచ్చని పంట పొలాలు.. మధ్య కొత్తగట్టు. ఆ గుట్టపై మత్స్యగిరీంద్రస్వామి ఆలయం. దీన్ని వందల ఏళ్ల కిందట నిర్మించినదిగా చెబుతారు. స్వామివారి దర్శనంతో భక్తులు పునీతమవుతున్నారు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి పక్కన కరీంనగర్‌కు 30 కి.మీ., వరంగల్‌కు 40 కి.మీ. దూరంలో ఉంది. విష్ణుమూర్తి మత్స్యగిరీంద్ర స్వామి అవతారానికి ప్రతీకగా గుడిలోని గుహలో వెలసిన చేప భక్తులకు దర్శనమిస్తోంది.

గుహలో చేప అవతారం

సృష్టికి మూలమైన చతుర్వేదాలను సోమకాసురుడు అనే రాక్షసుడు తస్కరించి సప్త సముద్రాల అవతల దాక్కున్నాడని, చతుర్వేదాలను పరిరక్షించేందుకు విష్ణుమూర్తి మత్స్యావతారంలో సముద్రాలను దాటి చతుర్వేదాలను పరిరక్షించాడని పురాణాలు చెబుతున్నాయి. విష్ణుమూర్తి మత్స్యావతారం ధరించాక కొత్తగట్టు గుట్టపై గుహలో చేప ప్రతిరూపంతో వెలిశాడని స్థల పురాణం చెబుతోంది. గుహలో చేప ప్రతి ఇప్పటికీ ఉండగా అద్దం ఏర్పాటు చేసి ప్రతిబింబాన్ని భక్తులు వీక్షిస్తారు.

ఆలయ ఉత్సవాలు..

ఆలయంలో మత్స్యగిరీంద్రస్వామి, నర్సింహ స్వామి, గుట్టపై ఆంజనేయస్వామి, శివాలయం, కోనేరు ఆకట్టుకునే రీతిలో ఉన్నాయి. ఏటా మాఘమాసంలో మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. భీష్మేకాదశి సందర్భంగా భూదేవి, నీలాదేవి సహ స్వామివారి కల్యాణం వైభవంగా జరుపుతారు. మాఘపౌర్ణమి సందర్భంగా జాతర, నాకబలి (పుష్పయాగం), కోనేరులో చక్రస్నానం వేదపండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహిస్తారు. అనుబంధ ఆలయాల్లో హనుమాన్ జయంతి, నర్సింహ జయంతి, మహాశివరాత్రి, జాగరణ, శివకల్యాణం, అగ్నిగుండాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.



కోనేరులో ఉత్సవమూర్తుల చక్రస్నానం

పోలు దండ వేసుకుంటే సంతానం..

సంతానం కలుగని దంపతులు నాకబలి రోజు పోలు దండలు వేసుకుంటే సంతానం కలుగుందని భక్తుల విశ్వాసం. ధ్వజారోహణం రోజు గరుడ ముద్దల కోసం భక్తులు ఎగబడతారు. గరుడ ముద్దల ప్రసాదం దక్కిన భక్తులకు స్వామివారు, అమ్మవారి చల్లని దీవెనలు ఉంటాయన్న నమ్మకంతో పాటు సంతానం కలుగుతుందనే నమ్మకం ఉంది.

శేషం వంశస్తుల పూజలు

మత్స్యగిరీంద్రస్వామికి శేషం వంశస్తులు 11 వందల ఏళ్లుగా స్వామివారిని పూజిస్తున్నట్లు స్థల పురాణం చెబుతోంది. ధూప, దీప, నైవేద్యం, బ్రహ్మోత్సవాల ప్రధాన అర్చకులు శేషం మురళీధరాచార్యులు సమక్షంలో జరుగుతున్నాయి.

పోచమ్మను దర్శించుకుని గుట్టపైకి..

గుట్టకింద పోచమ్మ ఆలయంలో దర్శనం చేసుకుని ఘాట్‌రోడ్డుపై నుంచి ఆలయం చేరుకోవాలి. కోనేరులో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తులు మత్స్యగిరీంద్రస్వామి, చేప ప్రతిమను దర్శించుకుంటారు. పక్కనే ఉన్న నర్సింహస్వామికి పూజలుచేసి తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తారు. ఆంజనేయస్వామి, శివాలయంలో శివుడికి పూజలు చేస్తారు.


సాగని అభివృద్ధి..

తెలంగాణలో ఏకైక మత్స్యగిరీంద్రస్వామిగా ప్రసిద్ధి చెందిన కొత్తగట్టు ఆలయ ప్రాకారం నిర్మాణం 12 ఏళ్ల గడిచినా పూర్తి కాలేదు. ఏడాది కిందట గాలిగోపురం నిర్మాణానికి దాతలు కాంట్రిబ్యూషన్ చెల్లించినా.. పనులు ప్రారంభానికి నోచుకోలేదు. కల్యాణ మండపం, ఆంజనేయస్వామి, పోచమ్మ ఆలయాలను దాతలు నిర్మించారు.

ప్రత్యేక ఆకర్షణగా భారీ విగ్రహం


ఎన్‌హెచ్‌ఏ-563 రహదారి టోల్‌గేట్ కొత్తగట్టు ఆలయం వద్ద నిర్మిస్తున్నారు. భారీ మత్స్యగిరీంద్ర స్వామి విగ్రహాన్ని కరీంనగర్-వరంగల్ రహదారి పక్కన గుట్టపై ఓ భక్తుడు నిర్మిస్తున్నారు. దీంతో ఈ విగ్రహం విద్యుత్ దీపాల కాంతులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పోలు దండలు వేసుకుంటే సంతానం



ధ్వజారోహణం రోజు గరుడ ముద్దల ప్రసాదం స్వీకరించి, నాకబలి రోజు సంతానం కలుగని దంపతులు పోలు దండలు వేసుకుంటే సంతానం కలుగుతుందనేది ప్రగాఢ నమ్మకం. ఇలా చేసిన అనేకమంది దంపతులకు సంతానం కలిగింది. కోనేరులో పవిత్రస్నానాలు చేసి దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయి. పంటలకు చీడపీడలు సోకితే కోనేరులో నీటిని చల్లుకుంటే వాటి ఉధృతి తగ్గుతుందని రైతులకు నమ్మకం.

– శేషం మురళీధరాచార్యులు,
ప్రధాన అర్చకుడు,
మత్స్యగిరీంద్రస్వామి ఆలయం, కొత్తగట్టు



శివాలయం



మత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో నర్సింహస్వామి



ఆంజనేయస్వామి ఆలయం

జాతీయ జనగణనకు రోడ్ మ్యాప్ ఇవ్వండి

కేంద్రానికి మాజీ ఎంపీ వినోద్ సూచన



సాక్షి, హైదరాబాద్: జాతీయ జనగణనతో పాటు కుల జనగణన నిర్వహించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే దానికి సంబంధించిన రోడ్ మ్యాప్, అధికారిక నోటిఫికేషన్ లేకుండా కేవలం తీర్మానాలు ఆమోదించడంతో ఎలాంటి ప్రయోజనం ఉండదని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. కుల జనగణన అనేది రాజకీయ ఉపన్యాసం కాదని, సామాజిక న్యాయం, విధాన రూపకల్పన, ప్రాతినిధ్యానికి సంబంధించిన రాజ్యాంగ అవసరమని పేర్కొన్నారు. 2021 జనగణన కోవిడ్ కారణంగా నిర్వహించలేదని, ప్రస్తుతం నిర్వహించే జనగణన గణాంకాలు ప్రజాస్వామ్య, విధాన సంబంధిత ప్రక్రియలకు పునాదిగా ఉంటుందని తెలిపారు. ఈ మేరకు సోమవారం వినోద్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గాల పునర్విభజన, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు, ఆర్థిక కమిషన్ సిఫారసులు, ఓబీసీ, అణగారిన వర్గాల కోసం సంక్షేమ విధానాలు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు, విధానాలకు ఈ జనగణన మూల బిందువుగా నిలుస్తుందని వినోద్ పేర్కొన్నారు.

రేవంత్‌కు దిక్కుతోచకే నోటీసులు

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: యంగ్ ఇండియా కేసులో ఈడీ చార్జిషీటులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరును ప్రస్తావించడం, మిస్‌వరల్డ్ పోటీలపై మిస్ ఇంగ్లండ్ ఆరోపణలు చేయడం, స్వాక్షాత్తు ఆయన పార్టీ అగ్రనేతనే అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి నిరాకరించడంతో సీఎంకు దిక్కుతోచడం లేదని ఎమ్మెల్సీ దాసోజుశ్రవణ్ దుయ్యబట్టారు. అందుకే రేవంత్‌రెడ్డి ఏసీబీని ఆయుధంగా వాడుకొని కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయించారని ఆరోపించారు. ఇది ప్రభుత్వ పాలన కాదని, రాజకీయ వేధింపు చర్యేనన్నారు. అధికారం దుర్వినియోగం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు శ్రవణ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇది ప్రజాపాలనా?..రౌడీ పాలనా?

మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీద కాంగ్రెస్ గూండాల దాడి హేయణీయమని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల అధికారిక క్యాంప్ కార్యాలయాల్లో ఎప్పుడైనా కేసీఆర్ ఫొటో పెట్టుకున్నారా అని నిలదీశారు. మరి ఈరోజు సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలు ఎందుకు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ ప్రొటోకాల్ ఉందని సచివాలయంలోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన చాంబర్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీల ఫొటోలు పెట్టారని వేముల ప్రశ్నించారు. సోమవారం తెలంగాణభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మిస్టర్ రేవంత్‌రెడ్డి.. ఇది ప్రజాపాలనా?.. రౌడీ పాలనా? అని ప్రశ్నించారు. ప్రజల్లో ప్రభుత్వ తీరును ఎండగడుతున్న కేటీఆర్‌పై రేవంత్ సర్కారు కుట్రలు చేస్తోందని, పోలీసులను అడ్డుపెట్టుకుని ఈ ప్రభుత్వం నియంత పాలన చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఎవ్రీ డే ఈస్ నాట్ సండే'అనే విషయాన్ని పోలీసులు గుర్తెరిగి ప్రవర్తించాలని వేముల సూచించారు.

రాహుల్‌గాంధీ కార్యాలయంలో ప్రధాని ఫొటో ఉందా?

తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ రాజీవ్ సాగర్

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్లలో కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టాలని డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్.. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ ఫొటో ఉందా? అని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ ప్రశ్నించారు. నై తెలంగాణ అన్న రేవంత్‌రెడ్డి ఫొటో కోసమే ఇంత హడావుడి చేస్తున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణ సాధించిన కేసీఆర్ ఫొటో ప్రతి ప్రభుత్వ కార్యాలయం, ప్రతి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెట్టాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ అసమర్థతను కేటీఆర్ గట్టిగా ప్రశ్నిస్తున్నారనే సిరిసిల్లలో ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేశారని రాజీవ్ ఆరోపించారు.


చెల్లి కవిత విషయాన్ని పక్కన పెట్టి సీఎంపై విమర్శలా?

కేటీఆర్‌పై విప్ రామచంద్రనాయక్ మండిపాటు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన చెల్లి కవిత విషయాన్ని పక్కన పెట్టి సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ ధ్వజమెత్తారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిస్టర్ స్ట్రోక్‌తో కేటీఆర్‌కు మతిభ్రమించిందని ఎద్దేవాచేశారు. సొంత చెల్లి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడం చేతకాక సీఎంపైన అసభ్యంగా మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ముందు నీ ఇంట్లో సమస్యను పరిష్కరించుకో. బావ హరీశ్‌రావు కాళ్లు ఎలా పట్టుకున్నవో అలాగే నీ చెల్లి కాళ్లు పట్టుకో'అని హితవు పలికారు. కేటీఆర్ అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నాడని, తోక తెగిన బల్లిలా ఎగిరెగిరి పడుతున్నాడని రామచంద్రనాయక్ మండిపడ్డారు. కేటీఆర్ సంస్కార హీన రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఆయన తన బుద్ధి మార్చుకోకపోతే భవిష్యత్తులో ప్రజలు మరింత ఛీ కొడతారని హెచ్చరించారు.

చట్టప్రకారం పింఛన్ ప్రయోజనాలు అందించండి

వైద్యారోగ్య శాఖకు మూడు వారాలు గడువిచ్చిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా వైద్యారోగ్య శాఖలో పని చేసిన కాంట్రాక్టు ఉద్యోగుల పింఛన్ ప్రతిపాదనల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఆ 52 మంది నియామక తేదీని సరిగా లెక్కించి.. చట్టప్రకారం పింఛన్, ఇతర ప్రయోజనాలను కల్పిస్తూ చెల్లింపు ఉత్తర్వులు ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు వెలువడిన నాటి నుంచి మూడు వారాల్లో ఉత్తర్వులివ్వాలని చెప్పింది. 2002 నుంచి 2006 వరకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన తమ సేవలను వినియోగించుకుని.. పింఛన్, ఇతర పదవీ విరమణ ప్రయోజనాలు వర్తింపజేయడం లేదంటూ రంగారెడ్డి జిల్లా హైదర్‌గూడ ఆయుర్వేదిక్ డిస్పెన్సరీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి.నర్మదతోపాటు మరో 51 మంది హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. పింఛన్, ఇతర ప్రయోజనాల కల్పనకు నిరాకరించడం రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నందా ఇటీవల విచారణ చేపట్టారు. పిటిషనర్లు ఏకీకృత వేతనం కింద మంజూరు చేసిన పోస్టుల్లోనే పనిచేశారని, రెగ్యులర్ వైద్యాధికారులతో సమానంగా విధులు నిర్వహించారని వారి తరపు న్యాయవాది వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. చట్టపరమైన నిబంధనల మేరకు పిటిషనర్ల అభ్యర్థనను పరిశీలించాలని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, ఆయుష్ శాఖ డైరెక్టర్, ఆర్థిక, ప్రణాళికా కార్యదర్శిని ఆదేశించారు. గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పులను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. కాగా, హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలని కోరుతూ వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, ఆయుష్ డైరెక్టర్, ఆర్థిక శాఖ కార్యదర్శికి పిటిషనర్ల తరపు న్యాయవాది సీహెచ్. గణేశ్ లేఖ రాశారు.







సోమవారం రాష్ట్రాన్ని నైరుతి రుతుపవనాలు పలకరించాయి. రాష్ట్రంలో 1.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లో కురిసిన వర్షాన్ని నగరవాసులు ఆస్వాదించారు.

సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి


బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: నేషనల్ హెరాల్డ్ కేసులో సీఎం రేవంత్‌రెడ్డిపై ఈడీ చార్జిషీట్ దాఖలు చేసిన నేపథ్యంలో వెంటనే తన పదవికి ఆయన రాజీనామా చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు సీఎం తన పదవిని అపవిత్రం చేయకుండా చూడాలని సోమవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. 'మీరు కేవలం పార్టీ నేత మాత్రమే కాకుండా, రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు. ఈ స్థాయిలో ఉన్న వ్యక్తిగా, మీపై వచ్చిన ఆరోపణలు ప్రభుత్వంపై నెగెటివ్ ప్రభావం చూపుతాయి. భారత పార్లమెంటరీ వ్యవస్థలో నైతిక ప్రవర్తన.. చట్టపరమైన అంశాల కంటే ముఖ్యం. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తిపై అవినీతి ఆరోపణలు వస్తే, అది ప్రభుత్వ నైతికతను దెబ్బతీస్తుంది. మీరు పదవిలో కొనసాగడం, ప్రజల విశ్వాసాన్ని కోల్పోవడమే కాకుండా, ముఖ్యమంత్రి పదవిని అపవిత్రం చేస్తుంది. గవర్నర్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మీరు స్వయంగా రాజీనామా చేసి, న్యాయ ప్రక్రియకు సహకరించాలి. ఇతర రాజకీయ నాయకులు కూడా ఇలాంటి పరిస్థితుల్లో రాజీనామా చేసిన ఉదాహరణలు ఉన్నాయి'అని దాసోజు లేఖలో పేర్కొన్నారు.

రైతుల ఆందోళన 'తుంగ'లోకి...
'భద్ర'త గాల్లోకి..!

గత ఏడాది వరదకు కొట్టుకుపోయిన డ్యాం గేటు	రూ.1.98 కోట్లతో కొత్త గేటు.. డిజైన్ ఆమోదంలో జాప్యం	కొత్త గేటు ఏర్పాటుకు రెండు నెలలే గడువు	గేటు బిగింపు మొదలయ్యేలోపు వర్షాలొచ్చే అవకాశం


తుంగభద్ర డ్యాం 19 గేటు కొట్టుకుపోవడంతో వృథాగా పారుతున్న నీరు(ఫైల్)

తుంగభద్ర జలాశయం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు. అలాంటి ఈ ప్రాజెక్టు విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గతేడాది వరద నీటి ప్రవాహానికి డ్యాం 19వ క్రస్టు గేటు కొట్టుకుపోయింది. తాత్కాలికంగా స్టాప్‌లాక్ గేటు అమర్చారు. దాని స్థానే కొత్త క్రస్ట్ గేటు ఏర్పాటు చేయాలని నిపుణుల కమిటీ సూచించింది. అయితే దీన్ని కూటమి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. నిపుణుల నివేదిక ప్రకారం రూ.1.98 కోట్లతో కొత్త గేటు ఏర్పాటుకు గుజరాత్‌కు చెందిన కంపెనీకి ఆర్డర్ ఇచ్చారు. ఆ కంపెనీ తయారు చేసిన గేట్ డిజైన్‌ను ఏపీ సెంట్రల్ డిజైన్ కమిటీ ఇటీవలే ఆమోదించింది. టెండర్ దక్కించుకున్న కంపెనీకి గేటు బిగించేందుకు రెండు నెలల గడువు ఇచ్చారు. గేటు బిగింపు పనులు మొదలు పెట్టేలోపు డ్యాం ఎగువన వర్షాలు అధికమయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ చెబుతోంది. అయితే ఇప్పటికే తుంగభద్ర డ్యాం ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో 6,700 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో డ్యాంలో నీటి సామర్థ్యం రోజు రోజుకు పెరుగుతోంది. ప్రస్తుతం 10.45 టీఎంసీల నీరు ఉంది. –కర్నూలు సిటీ

'కూటమి'కి ముందు చూపేది?

గతేడాది ఆగస్టు 10న వరద నీటి ప్రవాహానికి తుంగభద్ర గేటు కొట్టుకుపోయింది. అదే నెల తాత్కాలికంగా స్టాప్‌లాక్ గేటు ఏర్పాటు చేశారు. కాగా, 8 నెలలు ఆ గేటు గురించి పట్టించుకోని కూటమి ప్రభుత్వం ఇప్పుడు హడావుడి చేస్తోంది. గతేడాదిలోనే టెండర్ పిలిచి, డిజైన్‌కు ఆమోదం తీసుకొని ఉంటే వర్షాలు మొదలయ్యే సరికి గేటు ఏర్పాటు పూర్తయ్యేది. ఇప్పుడు రెండు నెలల సమయంలో పనులు పూర్తి కాకపోతే డ్యాంలో నీటి నిల్వలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అప్పటి లోపు చేయకుంటే కష్టమే...!

వారం రోజుల్లోపు పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. తుంగభద్ర డ్యాంలో 41 టీఎంసీలకు నీటి నిల్వలు చేరేలోగా కొత్త 19వ గేటు బిగింపు పనులు పూర్తి కావాలి. లేదంటే వరద నీరు గేట్లను తాకుతుంది. ఆ సమయంలో ఎలాంటి పనులు సాధ్యం కావని ఇంజినీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.

కొత్త గేటు డిజైన్‌కు ఆమోదం

తుంగభద్ర డ్యాం 19వ గేటు గతేడాది వరద నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. ఆ సమయంలో నిపుణుల పర్యవేక్షణలో స్టాప్‌లాక్ గేటు ఏర్పాటు చేశారు. కొత్త గేటు ఏర్పాటుకు రూ.1.98 కోట్లతో టెండర్లు ఖరారు చేశాం. డిజైన్‌కు ఆమోదం లభించింది. పనులు మొదలు పెట్టేందుకు ఆదేశాలిచ్చాం. – నారాయణ నాయక్, టీబీ డ్యాం ఎస్ఈ


కొట్టుకుపోయిన గేటు(ఫైల్)

క్లుప్తంగా...

వికసిత్ భారత్ కోసం నోడల్ అధికారులు

సాక్షి, అమరావతి: వికసిత్ భారత్ కోసం అంశాల వారీగా నోట్స్ పంపేందుకు నోడల్ అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నోట్స్ రూపకల్పనకు మహిళా శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి సూర్యకుమారి, పాఠశాల విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్య కార్యదర్శి కోన శశిధర్, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక సీఎస్ అజయ్ జైన్‌లను రాష్ట్ర నోడల్ అధికారులుగా నియమించారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఆలపాటి సురేశ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా సీనియర్ జర్నలిస్టు ఆలపాటి సురేశ్‌ను నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్యకార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో సురేశ్ రెండేళ్ల పాటు కొనసాగుతారు.

కుప్పం అథారిటీకి రూ.10 కోట్లు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం ప్రాంత అభివృద్ధి అథారిటీకి రూ.10 కోట్లు విడుదల చేస్తూ ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

యోగా దినోత్సవ నిర్వహణకు అపెక్స్ కమిటీ

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ యోగా దినోత్సవం–2025 నిర్వహణ కోసం ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన రాష్ట్రస్థాయి అపెక్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో వైద్య, పర్యాటక, మున్సిపల్, పంచాయతీరాజ్ సహా వివిధ శాఖల కార్యదర్శులు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, ఆయుష్ డైరెక్టర్‌తోపాటు 12 మంది సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు సోమవారం సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. యోగా దినోత్సవం, సంబంధిత పోటీల నిర్వహణ కోసం వస్తువుల సేకరణకు మార్గదర్శకాలను టెండర్ కమిటీ రూపొందిస్తుందని, ఇతర అంశాలను అపెక్స్ కమిటీ పర్యవేక్షిస్తుందని వెల్లడించారు.

ఇటు వృథా..అటు వ్యథ!


తిరుచానూరు సమీపంలోని ఓవర్ బ్రిడ్జి వద్ద పడేసిన ఆహారం తింటున్న అభాగ్యుడు

- పెళ్లిళ్లు.. ఫంక్షన్లలో మిగిలిపోయి చెత్తకుండీల్లో చేరుతున్న ఆహార పదార్థాలు
- మరోవైపు తినేందుకు తిండి లేక అభాగ్యుల ఆకలి కేకలు
- తిరుపతి జిల్లాలో సగటున రోజుకు 500 కిలోల భోజనం డస్ట్‌బిన్‌ల పాలు
- శుభకార్యాల నిర్వాహకులు బాధ్యతాయుతంగా ఉండాలంటున్న మేధావులు
- సమాజంలో మార్పు తీసుకువస్తేనే వేలాది మంది క్షుద్బాధ తీరుతుందని సూచనలు

అన్నం పరబ్రహ్మ స్వరూపంగా భావిస్తుంటాం.. భోజనం తినే ముందు పవిత్రంగా కళ్లకు అద్దుకుంటాం.. అయితే అదే ఆహార పదార్థాలను యథేచ్ఛగా వృథా చేస్తుంటాం. వివాహాది శుభకార్యాలకు పదుల సంఖ్యలో వెరైటీలతో వంటకాలను సిద్ధం చేయిస్తుంటాం.. అతిథులు ముందు ఆర్భాటంగా వడ్డిస్తుంటాం.. గొప్పల కోసం సునాయాసంగా రూ.లక్షలు వెచ్చిస్తుంటాం.. మిగిలిపోయిన వాటిని అనాయాసంగా చెత్తకుండీల పాలు చేసేస్తుంటాం.. ఇదే తిండి లేక వేలాది డొక్కలు ఎండిపోతున్నాయని ఏమాత్రం గమనించం.. ఒక్క పూట కడుపు నిండితే చాలని ఎదురు చూస్తున్నాయని అర క్షణం కూడా ఆలోచించం .. ఈ క్రమంలోనే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలని పలువురు మేధావులు కోరుతున్నారు. ఆహారం వృథా చేయకుండా అభాగ్యులకు అందించే దిశగా అడుగులు వేయాలని సూచిస్తున్నారు.

తిరుపతి సిటీ : ఆహారాన్ని భగవంతుని స్వరూపంగా భావించే దేశం మనది. కానీ, భోజనాన్ని భారీగా వృథా చేస్తున్న దేశాలలో జాబితాలో మనం టాప్ ఫైవ్‌లో ఉండడం గమనార్హం. గృహాలు, రెస్టారెంట్లలో పండుగలు, వివాహాలు, బర్త్‌డేలు, ఇతర ఫంక్షన్ల పేరుతో ఆరగించేదానికన్నా వృథా చేస్తున్నదే ఎక్కువగా ఉందని గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత సమాజంలో చాలా మంది వివాహాల నిర్వహణ నిమిత్తం ఖర్చుకు వెనుకాడడం లేదు. ఇందుకు సామాన్య ప్రజలు సైతం అతీతులు కాదు. అందరిలో గొప్పగా ఉండాలనే ఉద్దేశంతో తమ స్థాయికి మించి డబ్బులు వెచ్చిస్తున్నారు. ఈ క్రమంలో నీరు, ఆహారం భారీగానే వృథా అవుతోంది. ఇళ్లు, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాలలోనూ సగటున రోజుకు 500 కిలోల వరకు ఆహారం వృథా అవుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, మరో వైపు అదే ప్రాంతంలో వేల మంది ఆకలితో అలమటిస్తున్నారు. అయితే మిగిలిన ఆహార పదార్థాలను ఖాళీ కడుపుతో నకనకలాడే నిరుపేదలు, అనాథలకు చేరవేయడంలో నేటి ఆధునిక సమాజం విఫలమవుతోంది. కనీస మానవత్వం చూపించకుండా బాధ్యతారహితంగా వ్యవహరిస్తోంది.

ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుంటేనే..

పేదల ఆకలి తీర్చాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుంటేనే సాధ్యమవుతుంది. వివాహాది శుభకార్యాలలో మిగిలిన ఆహారాన్ని వృథా చేయకుండా వెంటనే కార్యనిర్వాహకులు, బంధుమిత్రులు సమీపంలోని అనాథాశ్రయాలు, రోడ్లపై అభాగ్యులకు చేరవేసే ప్రయత్నం చేయాలి. లేదా ఆహారం మిగిలిందంటూ స్వచ్ఛంద సేవాసంస్థలకు సమాచారం అందించగలగాలి. ఈ బాధ్యత కార్యక్రమానికి హాజరైన యువత, నిర్వాహకులు చేపట్టినప్పుడే సమాజంలో మార్పు వచ్చే అవకాశముంటుంది.

30శాతం చెత్తకుండీలకే..!

తిరుపతి జిల్లాలోని ప్రధాన పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీకాళహస్తిలతోపాటు మిగిలిన 33మండలాల్లో శుభ ముహూర్తాల సమయంలో ఏటా వేల సంఖ్యలో వివాహాలు జరుగుతుంటాయి. అందులో భోజనాలకు కనీసం సుమారు రూ.5 లక్షల నుంచి 30 లక్షల వరకు ఖర్చు చేసి 12 నుంచి 100రకాల వంటకాలను అతిథులకు వడ్డిస్తుంటారు. ఇందులో కొందరు కేవలం రెండు, మూడు రకాలు మాత్రమే భుజించి మిగిలినవి వదిలేస్తుంటారు. కనీసం 70శాతం ఆహారం కూడా పూర్తి స్థాయిలో ఖర్చుకాదు. మిగిలిన 30 శాతం చెత్తకుండీలలో వేస్తుండడం బాధాకరం. జిల్లా లో సుమారు 800 కల్యాణమండపాలు ఉండగా, ప్రతి దాంట్లోనూ జరిగే ఒక్కో కార్యక్రమంలో వృథా అవుతున్న ఆహారం సుమారు 50 కేజీలకు పైగా ఉంటోంది. అయితే అదే ఆధ్యాత్మిక పట్టణాలలోని ఆలయాలు, ఆస్పత్రులు,రహదారులు, పట్టణంలోని రద్దీ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో వేల మంది ఆకలితో అలమటిస్తున్నారు. వారికి కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లలో మిగిలిన ఆహారాన్ని అందించే నాథుడే కరువయ్యాడు. కార్యక్రమ నిర్వాహకులు, క్యాటరింగ్ యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరిస్తే వృథాను అరికట్టడంతో పాటు పేదలు, అనాథల ఆకలి తీర్చే అవకాశముంటుంది.

సేవా సంస్థలు ముందుకు రావాలి

గతంలో పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఇలాంటి విషయాలలో చురుకుగా పనిచేసేవి. అయితే ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో వారు సైతం బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో స్వచ్ఛంద సేవాసంస్థలు, అనాథాశ్రమాల నిర్వాహకులు సమీప కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్ల మేనేజర్, సిబ్బందికి చిరునామాతో కూడిన కాంటాక్ట్ నంబర్‌ను ఇవ్వడం ఉత్తమం. దీంతో పాటు కల్యాణ మండపాలలోని భోజనశాలల్లో ఫోన్ నంబర్లను అంటించడం ఎంతో ఉపయోగకరం.




ఇటీవల ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో చెత్తబుట్టలో పడవేసిన ఆహారం


తిరుపతి నగరంలోని ఓ వివాహ వేడుకలో మిగిలిన ఆహార పదార్థాలను చెత్త డబ్బాలకు నింపిన దృశ్యం


రుయా ఆస్పత్రి పరిసరాల్లో ఫుట్‌పాత్‌పై కూర్చుని అన్నదాతల కోసం ఎదురు చూస్తున్న అభాగ్యులు

సమాచారం అందిస్తే చాలు



తిరుపతిలోఅనాథాశ్రయం నడుపుతున్నాం. ఇప్పటికే వందల మంది అభాగ్యుల ను అక్కున చేర్చుకుని సేవ చేస్తున్నాం. వివాహాది శుభకార్యాలలో మిగిల ఆహార పదార్థాలను వృథా చేయకుండా మాకు అప్పగిస్తే అనాథలకు చేరవేస్తాం. మాకు సమాచారం అందిస్తే చాలు. 9700440415 నంబర్‌కు కాల్ చేయండి.
– శ్రీదేవి, అనాథాశ్రమ నిర్వాహకులు, తిరుపతి

యువతలో మార్పు వస్తేనే..



మన దేశానికి యువతే ఆస్తి. ఖాళీ సమయాల్లో స్నేహితులతో కలసి స్వచ్ఛందంగా సేవామార్గంలో నడవాలి. యువత సైతం కళాశాల నుంచి బయటకు రాగానే సేవా భావం మరిచిపోతున్నారు. యువతలో మార్పు వస్తేనే.. సమాజంలో మార్పు ప్రారంభమవుతుంది.
– భార్గవ్ సాయి, స్వచ్ఛంధ సేవా సంస్థ, ట్రెజరర్, తిరుపతి

నెట్టింటి వైద్యం రెట్టింపు రోగం


కర్నూలుకు చెందిన రాజ్‌కుమార్ ఓ ప్రైవేటు సంస్థలో ఎగ్జిక్యూటివ్. రోజూ వందల కిలోమీటర్లు తిరగడంతో అతనికి ఏదో ఒక అనారోగ్య సమస్య వేధిస్తుంటుంది. దీంతో తరచూ డాక్టర్ వద్దకు వెళ్లడం దేనికని ఆన్‌లైన్‌లో తనకు వచ్చిన ఆరోగ్య సమస్యకు పరిష్కారాన్ని వెతికి మెడికల్ షాపులో మందులు కొని వాడుతున్నాడు. ఓ రోజు మందు లు వికటించి ఆసుపత్రికి వెళితే ఎలా పడితే అలా మందులు వాడకూడదని వైద్యులు చికిత్స చేసి పంపించారు.


కర్నూలుకు చెందిన ఓ బి.ఫార్మసి విద్యార్థిని తనకు ఇటీవల ఛాతీలో నొప్పి ఉంటే ఆన్‌లైన్‌లో టైప్ చేసి చూసుకుంటే హార్ట్ ఎటాక్ అని చూపించింది. దీంతో ఆమె తీవ్ర ఆందోళనతో సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి వైద్యులను కలిసింది. పరీక్షించిన వైద్యులు వచ్చింది హార్ట్ ఎటాక్ కాదని, కండరాల నొప్పిగా నిర్ధారించారు.


నంద్యాలకు చెందిన రామాంజనేయులు ప్రభుత్వ ఉద్యోగి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చుని పనిచేయాల్సిందే. ఇంటర్‌నెట్‌పై మంచి పట్టు ఉంది. దీంతో తనతో పాటు ఇంట్లో ఎవరికి అనారోగ్య సమస్యలువచ్చినా ఆన్‌లైన్‌లో వెతికి పరిష్కారం కనుగొనే ప్రయత్నం చేస్తాడు. ఈ క్రమంలో ఆయన తల్లికి ఒకసారి మందులు వికటించి ఇబ్బంది రావడంతో వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. ఆన్‌లైన్ పరిష్కారం ప్రతిసారీ మంచిది కాదని వైద్యులు హితవు పలికారు.



కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 3వేల దాకా రిటైల్ మెడికల్ షాపులు, ఏజెన్సీలు ఉన్నాయి. దీంతో పాటు 12వేల దాకా ఎంబీబీఎస్, స్పెషాలిటీ, సూపర్‌స్పెషాలిటీ కోర్సులు అభ్యసించిన వైద్యులూ ఉన్నారు. వీరితో పాటు వైద్యవిద్యను అభ్యసిస్తున్న వారు మరో 3వేల మంది దాకా ఉంటారు. ఇక ఫార్మాసిస్టులు, నర్సులు, ఏఎన్‌ఎంలు, ఆర్‌ఎంపీలు మరో 15వేల దాకా ఉంటారు. వీరందరూ అల్లోపతి వైద్యంపై ఆధారపడి రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చిన ప్రజలు వీరిలో ఎవరో ఒకరిని సంప్రదించి అవసరమైన చికిత్స తీసుకుంటున్నారు. ఇటీవల ఇంటర్‌నెట్ సదుపాయం అందరికీ అందుబాటులోకి రావడం, విద్యావంతులు పెరగడం, ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, ఇంటర్‌నెట్‌పై యువతకు పట్టురావడం వంటి విషయాల కారణంగా ఆన్‌లైన్‌లో తమకు వచ్చిన ఆరోగ్య సమస్యలకు పరిష్కారాన్ని వెతకడం అధికమైంది. క్షణాల్లో వచ్చే సమాచారం ఆధారంగా తమకు ఈ కారణంగానే ఆరోగ్య సమస్య వచ్చిందని భావించి మెడికల్ షాపులకు వెళ్లి మందులు తీసుకుని వాడే వారి సంఖ్య ఇటీవల పెరుగుతోంది.

భౌతికంగా పరీక్షిస్తేనే..

మంచి పేరున్న వైద్యుని వద్దకు వందల కిలోమీటర్లు ప్రయాణించి రోగులు చికిత్స కోసం వెళ్తుంటారు. అలా వెళ్లిన వారు అవసరమైతే గంటల తరబడి క్యూలో ఉండి చికిత్స తీసుకుని వెళ్తుంటారు. ఫలానా డాక్టర్ చేయి తగిలితేనే(హస్తవాసి) సగం రోగం నయం అవుతుందన్న నమ్మకంతో ఉన్న వారూ ఉన్నారు. ఈ నమ్మకంతోనే ఇప్పటికీ చాలా మంది వారికి ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా నమ్ముకున్న వైద్యుల వద్దే చికిత్స తీసుకుంటారు. సదరు డాక్టర్ భౌతికంగా రోగిని పరిశీలించడమే గాక వారి యోగక్షేమాలు అడగడం, నవ్వుతూ మాట్లాడటం, ఏమీ కాదులే అని ధైర్యం చెప్పడంతో వారికి సగం రోగం నయమవుతుంది. కొందరు సీనియర్ వైద్యులు ఇప్పటికీ రోగిని భౌతికంగా ముట్టుకుని చేతులు, కాళ్లు కదిపి, పొట్టను ఒత్తి చూసి, నాడి పట్టుకుని పరీక్షించి వైద్యం చేస్తుంటారు. ఇలాంటివన్నీ ఆన్‌లైన్‌లో లభించవని పెద్దలు చెబుతుంటారు. ఎంతగా ఆన్‌లైన్ సేవలు అభివృద్ధిలోకి వచ్చినా మనిషిని చూసి వైద్యం ఇచ్చి ధైర్యం చెబితేనే తగ్గుతుందని వారు భావిస్తున్నారు.

ఇవీ నష్టాలు..

- ఆరోగ్య సమస్య కొంతైతే ఆన్‌లైన్‌లో వివరాలు కొండంత ఉంటాయి. దానిని చూసి రోగి మరింత ఆందోళనకు గురవుతారు. ఫలితంగా మానసికంగా మరింత కృంగిపోతాడు.
- ఆందోళనకు గురైతే శారీరకంగా మరిన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.
- కొందరు ఆన్‌లైన్‌లో తమ ఆరోగ్య సమస్యలు వెతికి ముందుగానే అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకుని డాక్టర్ వద్దకు వెళ్తున్నారు. ముందుగానే పరీక్షలు చేయించుకోవద్దని వైద్యులు చెబుతున్నారు.
- ఒక్కో వ్యక్తికీ ఒక్కో శరీరతత్వం ఉంటుంది. వారి జన్యువులు, వారి ఆరోగ్యాన్ని బట్టి రోగ లక్షణాలు ఉంటాయి. అందరినీ ఒకే విధంగా చూడలేమని వైద్యులు చెబుతున్నారు. ఒక్కొక్కరికీ ఒక్కో విధమైన చికిత్స ఉంటుందని, ఆన్‌లైన్ వైద్యాన్ని గుడ్డిగా నమ్మొద్దని సూచిస్తున్నారు.

కొబ్బరి అధరహో!



సాక్షి, అమలాపురం/అంబాజీపేట: శ్రీరామ నవమి నుంచి వినాయక చవితి వరకూ కోనసీమ జిల్లా అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌కు అన్‌సీజన్. చవితి పండుగకు నెల రోజుల ముందు నుంచి కొనుగోలు సీజన్ మొదలవుతుంది. అటువంటిది అన్ సీజన్‌లో కొబ్బరి ఉత్పత్తుల ధరలు గణనీయంగా పెరిగాయి. ఒకవైపు పచ్చి కొబ్బరికాయ ధర పెరగగా.. మరో వైపు కురిడీ కొబ్బరి రికార్డు స్థాయికి చేరడం గమనార్హం. ఒక్కసారిగా ధరలు పెరగడంతో మార్కెట్‌కు కొత్త జోష్ వచ్చింది.

కొనుగోళ్లు... ఎగుమతులు

గత రెండు మూడు రోజుల్లో కొబ్బరి పచ్చికాయ ధర గణనీయంగా పెరిగింది. వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.15,500 నుంచి రూ.16 వేలకు చేరింది. రెండు రోజుల కిందట రూ.13,500 నుంచి రూ.14 వేల వరకూ ఉండేది. తమిళనాడు, కేరళలో కొబ్బరి దిగుబడి గణనీయంగా పడిపోయింది. దీనికితోడు గత మార్చి నెల నుంచి కొబ్బరి బొండాల సేకరణ అధికంగా ఉంది. ఈ కారణంగా ఉత్తరాది రాష్ట్రాల కొబ్బరి అవసరాలను రాష్ట్ర కొబ్బరి తీర్చాల్సి వస్తోంది. ముఖ్యంగా గుజరాత్, ఉత్తర ప్రదేశ్, బిహార్ రాష్ట్రాల స్థానిక అవసరాల కోసం మన రాష్ట్రం నుంచి కొబ్బరికాయ కొనుగోలు పెరిగింది. ఈ కారణంగా ధర పెరిగిందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు.

కురిడీ... సంబరపడి

అంబాజీపేట మార్కెట్‌లో కురిడీ కొబ్బరి ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. వారం రోజుల కిందట కురిడీ కొబ్బరిలో పాతకాయ గండేరా రకం (పెద్ద కాయ) ధర వెయ్యికి రూ.20 వేలు మాత్రమే ఉండేది. ఇది రూ.22,500 వరకూ పెరిగింది. అలాగే గటగటా (చిన్నకాయ) వెయ్యికి రూ.18 వేల నుంచి రూ.20 వేలకు చేరింది. కొత్త కాయలో గండేరా రూ.21,500, గటగటా రూ.19,500 చొప్పున ధర పలుకుతున్నాయి. కురిడీకి ధర రావడం వెనుక తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడులు లేకపోవడం కూడా ఒక కారణం. ఉత్తరాదిలో ఆషాఢ మాసంలో కొబ్బరి వినియోగం అధికంగా ఉంటుంది. ఆ మాసానికి ఇంకా నెల రోజులు ఉండడంతో ధర పెరగడానికి ఇదొక కారణం. ఉభయ గోదావరి జిల్లాల నుంచి రోజుకు సుమారు 70 నుంచి 100 లారీల వరకూ కురిడీ కొబ్బరి ఎగుమతులు జరుగుతున్నాయని అంచనా.

మరింత పెరుగుతుందనే అంచనాతో..

ప్రస్తుతం ఉభయ గోదావరి జిల్లాలో కొబ్బరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. రెండు నెలల దింపు కాలానికి 1,500 నుంచి 2 వేల వరకూ కాయలు దిగుబడిగా వస్తున్నాయి. దిగుబడి ఆశాజనకంగా ఉండడం, అందుకు తగినట్టుగా ధరలు పెరగడంతో చాలా రోజుల తరువాత అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌కు జోష్ వచ్చింది. ధర మరింత పెరుగుతోందనే అంచనాతో కొబ్బరి రైతులు, కురిడీ వ్యాపారులు ఆచితూచి అమ్మకాలు చేస్తున్నారు.

హెల్త్



డా॥ సుధీర్ రెడ్డి
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్

● లంబార్ కెనాల్ స్టెనోసిస్

ప్రతి వ్యక్తి జీవిత కాలంలో అతడు / ఆమె ఏదో ఓ సమయంలో నడుము నొప్పితో బాధపడతారు. అందునా జనాభాలోని 75 - 85 శాతం మందిలో... ఒక వయసు తర్వాత... మరీ ముఖ్యంగా నడి వయసు తర్వాత నడుము నొప్పి తప్పక కనిపించే అవకాశాలే ఎక్కువ. దీనికి అనేక కారణాలున్నప్పటికీ అందులో ఒక కారణమేమిటంటే... వెన్నుపూసల మధ్య భాగంలో ఉండే స్థలం సన్నబడటం. వైద్య పరిభాషలో దీన్నే 'లంబార్ కెనాల్ స్టెనోసిస్' అంటారు. ఇటీవల ఈ సమస్యతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది. అయితే మొదట్లోనే ఈ నొప్పి గురించి కొన్ని జాగ్రత్తలు తీసుకుంటూ, ఫిజియోథెరపీ వ్యాయామాలు చేసుకుంటే సమస్యను అదుపులో పెట్టవచ్చు. ఇంత విస్తృతంగా వచ్చే ఈ నొప్పి గురించి అవగాహన పెంచుకోవడం కోసమే ఈ కథనం.

నడుము నొప్పి ఎందుకంటే...?

ప్రతి వ్యక్తిని నిటారుగా నిలబెట్టే వెన్నెముక నిర్మాణమే ఓ అద్భుతం. ఇందులో 32 నుంచి 34 పూసలు వరసగా ఉంటాయి. ఇంగ్లిష్ అక్షరమైన 'ఎస్'ను దాదాపుగా పోలి ఉంటే ఈ వరస పూసలు ఇంత సమన్వయంతో ఉంటాయంటే... దారం దండలోని పూసల్లా... ఈ ఎముకలన్నీ వరసలో కలిసి ఉంటాయి కాబట్టి వాటిని పూసలుగా చెబుతుంటారు. ఇక పూసల్లోని మధ్యనుండే ఖాళీ స్థలంలోంచి దారం ఉన్నట్టే... ఈ వెన్నుపూసల ఖాళీ స్థలంలోంచి 'వెన్నుపాము' ఒక తాడులా వెళ్తుంది. అయితే ఇది తాడు కాదు.... అనేక నరాలు పెనవేసుకున్న సంక్లిష్ట నిర్మాణం. ఆయా నరాలన్నీ వెన్నుపూసల మధ్యనుండే ఖాళీల నుంచి బయటకు వస్తూ... ఆయా అవయవాలకు వెళ్తూ వాటిని పనిచేయిస్తూ ఉంటాయి. ఈ నరాల ఆదేశాలతో పనిచేసే ఆ అవయవాలు... చేతులూ, కాళ్లూ, వేళ్లూ, కీళ్లు కాగా... ఇవన్నీ సమన్వయంతో పనిచేస్తుండటంతో పాటు... మరికొన్ని ఇతర అవయవాలనూ సమన్వయ పరుస్తూ, వాటినీ పనిచేయిస్తాయి.


ఈ 32 నుంచి 34 పూసలన్నింటితో పాటు... లోపల ఉన్న వెన్నుపాము మొత్తం నిర్మాణమంతటినీ కలుపుకుని దాన్ని 'వెన్ను' (స్పైన్)గా చెబుతారు. ఈ స్పైన్‌లోని... మెడ దగ్గర ఉండే భాగంలో ఏడు (సర్వైకల్ ఎముకలు) పూసలుండగా, ఛాతి, కడుపు భాగంలో పన్నెండూ (థోరాసిక్), అలాగే నడుం భాగంలో ఉండేవి ఐదు (లంబార్), ఇక మిగతావి ఒకదానితో మరోటి కలిసిపోయి ఉండే శాక్రల్ ఎముకలన్నీ కలిసి వెన్ను నిర్మాణాన్ని పూర్తి చేస్తాయి. కాక్సిక్ అనేది చివరన తోకలాగా ఉండే ఎముక. సంక్లిష్టమైన ఈ వెన్ను నిర్మాణంలోని మరో అద్భుతమైన నిర్మాణ ప్రక్రియ ఏమిటంటే... వెన్నుపూసలోని ఎముకకూ ఎముకకూ మధ్య నుంచి ఒక్కోనరం చొప్పున మొత్తం 31 నరాలు బయటకు వస్తాయి. ఈ నరాలే కాళ్లూ, చేతులతో పాటు వివిధ అవయవాలను కదిలిస్తూ, వాటితో పనులు చేయిస్తూ ఉంటాయి.

వెన్నుపూసలూ... నరాల జాబితా ఇలా...

ఏ భాగంలో?	వెన్ను ఎముకలెన్ని?	నరాలెన్ని?
మెడ (సర్వైకల్)	7	8
ఛాతి (థొరాసిక్)	12	12
నడుం (లంబార్)	5	5
నడుం కింద (శాక్రల్)	5	5
టెయిల్‌బోన్ (కాకిక్స్)	3-5 (ఇవి కలసిపోయుంటాయి)	1

వెన్ను నొప్పికి ఒక ప్రధాన కారణం లంబార్ స్టెనోసిస్...

నడుము భాగంలోని వెన్నుపూసల మధ్య స్థలం తగ్గడంతో నడుము నొప్పి వస్తుంటుంది. ఇలా ఖాళీ తగ్గినప్పుడు ఈ పూసలు... వాటి మధ్యనుంచి బయటకు వచ్చే నరాలను నొక్కేస్తుంటాయి. నరం తీవ్రంగా నొక్కుకుపోవడం వల్ల తీవ్రమైన నొప్పి వస్తుంటుంది. అయితే నొప్పికి కారణమయ్యేలా వెన్నుపాము ఉండే 'లంబార్ కెనాల్'లో ఖాళీ తగ్గడాన్ని, తత్ఫలితంగా లంబార్ కెనాల్ ఇరుకుగా మారడాన్ని వైద్య పరిభాషలో 'లంబార్ కెనాల్ స్టెనోసిస్' అంటారు. లంబార్ అనేది నడుము దగ్గర ఉండే పూసలు కాబట్టి... అక్కడి ఖాళీ తగ్గింది కాబట్టి నొప్పి 'నడుము ప్రాంతం'లో వస్తుంటుంది. అయితే ఇది కేవలం నడుము వరకే పరిమితం కాదు. కొన్ని సందర్భాల్లో నడుముకు ఇరువైపులా పిరుదులు, తొడలు, కాళ్లలోనూ నొప్పి కనిపిస్తుంది. చాలాసేపు నడిచినా లేదా ఒకేచోట చాలాసేపు నిలబడ్డా నొప్పి, అలసట ఎక్కువవుతాయి. గతంలో చాలా దూరాలు శ్రమలేకుండా నడిచేవారు కూడా ఇప్పుడు అంతగా నడవలేకపోతున్నామనీ, నడుము లేదా పిరుదులు, తొడలు, కాళ్లలో నొప్పి వస్తుందంటూ కంప్లెయింట్ చేస్తుంటారు. ఇక నడుముతో పాటు కొందరికి నేరుగా వెన్నులోనే నొప్పి కనిపించవచ్చు.



నిర్ధారణకు ఉపయోగపడే ప్రధాన లక్షణం ఏమిటంటే...

కదులుతున్నప్పుడు, నడుస్తున్నప్పుడు కాళ్లు అకస్మాత్తుగా పట్టేస్తాయి. అటు తర్వాత కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటే మళ్లీ నడవగలుగుతారు. వ్యాధి తీవ్రత పెరుగుతున్న కొద్దీ ఇలా నడవగలిగే దూరాలు క్రమంగా తగ్గుతూ పోతాయి. విశ్రాంతి వ్యవధులు క్రమంగా పెరుగుతాయి. ఉదాహరణకు తొలుత 600 మీటర్ల తర్వాత కాళ్లు బిగుసుకుపోతే అటు తర్వాత అలా బిగుసుకుపోవడం అన్నది 400 మీటర్లకే జరగవచ్చు. అటు పిమ్మట 200 మీటర్లకే బిగుసుకుపోవచ్చు. ఇలా దూరాలు తగ్గుతూ... విశ్రాంతి సమయపు వ్యవధి పెరుగుతూ పోతుంది. ఇలా జరగడాన్ని 'క్లాడియేషన్ డిస్టాన్సెస్' అంటారు. ఇది లాంబార్ కెనాల్ స్టెనోసిస్ తాలూకు అత్యంత ప్రధాన లక్షణమని చెప్పవచ్చు.

నిర్ధారణ ఇలా...

బయటికి (క్లినికల్‌గా) కనిపించే నొప్పి లక్షణాలతో 'లంబార్ కెనాల్ స్టెనసిస్'ను స్పష్టంగా అనుమానించవచ్చు, కొంతవరకు గుర్తించవచ్చు. అయితే దీని నిర్ధారణ కోసం ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఎమ్మారై వంటి ఇమేజింగ్ ప్రక్రియలు బాగా ఉపయోగపడతాయి. ఈ సమస్యతో పాటు ఒకవేళ వెన్నుపూసకీ వెన్నుపూసకీ మధ్య నున్న డిస్కులు అటు ఇటు జరిగితే... అలాంటి డిస్‌ప్లేస్‌మెంట్ కూడా సీటీ స్కాన్, ఎమ్మారై వంటి ఇమేజింగ్ ప్రక్రియల్లో కనిపిస్తుంది. డిస్కులు ఇలా స్థానభ్రంశమై కదలిపోవడాన్ని 'హెర్నియేటెడ్ డిస్క్' అని కూడా పిలుస్తారు. సీటీ స్కాన్ కంటే ఎమ్మారై చాలా ముఖ్యం.

వెన్నుపూస సన్నబడ్డట్టు తెలిసేదిలా...

వెన్నుపాముని కలిగి ఉండే వెన్నుపూసల మధ్యనుండే ఖాళీ స్థలం ఒకే గది ఉన్న ఇంటి స్థలంలా ఉంటుంది. కిందనుండే డిస్క్ ఫ్లోరింగ్ అనుకుందాం. అప్పుడు పైన ఉండేది కప్పు అవుతుంది. వెన్నుపూస ఖాళీ తగ్గుతున్న కొద్దీ పైనా కిందా ఉండే ఎముక భాగాలు ఉబ్బుకొచ్చినట్లుగా బయటికి వస్తాయి. వీటినే 'ఆస్టియోఫైట్స్' అంటారు. ఇవి ఇలా ఉబ్బుకుని వచ్చి లోపలికి పెరుగుతాయి కానీ... ఒకసారి పెరిగినవి మళ్లీ తగ్గే అవకాశం దాదాపుగా ఉండదు. ఇలా పొడుచుకొచ్చినట్లుగా ఉండే ఎముకభాగాల (బోనీ స్ట్రక్చర్స్)కు తోడుగా అక్కడి కణజాలం, మెత్తటి ఎముక (మృదులాస్థి) భాగాలు, లిగమెంట్లు... ఇవన్నీ వాపునకు (అంటే ఇన్‌ఫ్లమేషన్‌కు) గురవుతాయి. కేవలం ఎముక మధ్యలో ఉండే ఖాళీ స్థలమే కాకుండా... ఎముకకూ, ఎముకకూ మధ్యన ఉండే రంధ్రం (దీన్ని ఫొరామెన్ అంటారు) కూడా సన్నబారుతుంది. ఎముక మధ్య భాగం ఇంటి ఖాళీ స్థలం అనుకుంటే... దీన్ని ప్రవేశద్వారం అనుకోవచ్చు. అంటే ఇంటి మధ్యభాగంలో ఉన్న స్థలమే కాకుండా... ఇంట్లోకి వచ్చే ప్రదేశద్వారం కూడా సన్నబారిపోతుంది.

సన్నగా అవడంతో జరిగేది ఇదీ...

ఎముకలోని ఖాళీ భాగాలూ, ఎముక ప్రవేశద్వారం లాంటి ఫొరామెన్ అన్నీ సన్నబడటంతో... ఎన్నెన్నో నరాలు పెనవేసుకునిపోయి ఉండే వెన్నుపాము ఒత్తిడికి గురవుతుంది. నడుము భాగం (లంబార్) ప్రాంతం నుంచి కిందికి అంటే శాక్రల్, కాకిక్స్ అనే ప్రాంతాల నుంచి దాదాపు కనీసం 11 నరాల వరకు ఒత్తిడికి గురికావడంతో ఆయా భాగాలకు సప్లై అయ్యే నరాలు బాగా ఒత్తుకుపోయి నడుము వెనక భాగం, నడుము కిందిభాగం, పిరుదులు, వెన్ను కిందిభాగం పరిసరాల్లో నొప్పి వస్తుంటుంది. ఒత్తిడి పెరుగుతున్న కొద్దీ నొప్పి తీవ్రతరమవుతుంటుంది. అందుకే ఈ నరాలు ఒత్తిడికి గురయ్యేందుకు అవకాశమున్న కదలికల్లో... అంటే వ్యక్తులు అకస్మాత్తుగా ముందుకు ఒంగినా, కుర్చీ నుంచి ఒక్కసారిగా లేచినా, అకస్మాత్తుగా కదిలినా తీవ్రమైన నొప్పి వస్తుంది. అంతేకాదు... ఆ నొప్పి... అక్కడికే పరిమితమైపోకుండా... పక్కనుండే పరిసరాల్లోకి పాకినట్లుగా అవుతుంది. దాంతో అవయవం చుట్టుపక్కల ప్రాంతాలూ నొప్పికి గురవుతాయి. అంటే అసలు భాగంలోని కాకుండా ఇలా పక్కలకు నొప్పి పాకడాన్ని 'రిఫర్డ్ పెయిన్' అంటారు. ఇలాంటి రిఫర్డ్ పెయిన్ కారణంగా ఈ నొప్పులు ఒక్కోసారి 'సయాటికా నొప్పి'లాగానే అనిపించవచ్చు. ఇది నొప్పిని అనుకరిస్తున్నట్లుగా ఉండటంతో దీన్ని 'సయాటికా మిమికింగ్ పెయిన్' అని కూడా అంటారు.

పుట్టుకతో వచ్చే... కంజెనిటల్ స్టెనోసిస్...



కొంతమందికి పుట్టుకతోనే వెన్నుపూసల్లోని ఖాళీ స్థలం ఇరుగ్గా ఉండవచ్చు. అయితే వారు పెద్దయ్యాక వెన్నుపూసల మధ్యభాగం ఇరుగ్గా మారి... ఆ వయసులో లక్షణాలు బయటపడవచ్చు. ఇలా పుట్టుకతోనే వెన్నుపూసల మధ్యభాగం సన్నగా ఉండటాన్ని 'కంజెనిటల్ స్టెనోసిస్'గా పేర్కొంటారు. వీళ్లలోనూ నొప్పి, ఇతర లక్షణాలన్నీ మామూలుగా లంబార్ స్టెనోసిస్‌తో బాధపడేవారిలాగే ఉంటాయి. కాకపోతే వీళ్లది చాలావరకు అనువంశీకంగా వచ్చే సమస్య.

కొన్ని అసాధారణమైన ఇతర రకాల నడుము నొప్పులు...



ఓ వయస్సు దాటాక (ముఖ్యంగా మధ్య వయస్కుల్లో) నడుం నొప్పి రావడం చాలా సాధారణం. అయితే మరి కొంత మందిలో అసాధారణంగా నడుం నొప్పి వచ్చే అవకాశం ఉంది. ఇందుకు అనేక కారణాలుంటాయి. అవి...

- పుట్టుకతోనే వెన్నెముకలో లోపాల వల్ల,
- వెన్నుకు అయ్యే గాయాల వల్ల,
- ఇన్ఫెక్షన్లు, గడ్డలు,
- మహిళల్లో మెనోపాజ్,
- వృద్ధుల్లో ఆస్టియోపోరోసిస్ వల్ల,
- స్టెరాయిడ్స్ వాడేవారిలో ఎముకలు మెత్తగా అయిపోవడం వల్ల,
- కొందరిలో స్పైన్ విరగడం,
- డిస్క్ పక్కకు తొలగడం వల్ల... ఇలా వెన్నుకు వచ్చే నొప్పులకు కారణాలు ఎన్నెన్నో ఉంటాయి.

నివారించుకోవడమిలా...



- స్ట్రెచింగ్‌తో బాలెన్స్‌నూ, ఇతర ఎక్సర్‌సైజ్‌లతో శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడం.
- రోజూ ఉదయాన్నే వాకింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్ వంటి వ్యాయామాలు చేయడం.
- వార్మప్ తర్వాతనే ఎక్సర్‌సైజ్ మొదలుపెట్టడం. (అకస్మాత్తుగా మొదలుపెడితే నడుము పట్టేయడం వంటి అనర్థాలతో వెన్ను నొప్పులు మరింత పెరిగే అవకాశం.
- ఒకే పొజిషన్‌లో ఎక్కువసేపు ఉండకుండా జాగ్రత్త తీసుకోవడం. (తరచూ అంటే... ప్రతి 20 నుంచి 30 నిమిషాలకు ఓసారి కాసేపటి కోసమైనా సరే... పొజిషన్ మారుస్తూ ఉండటం.
- నిల్చున్నప్పుడు అవకాశం ఉంటే... స్టూలు వంటి చిన్న ఎత్తుపైనో- కాసేపు ఓ కాలు, ఇంకాసేపు మరో కాలు ఆనిస్తూ నిలబడటం.
- యోగా వంటివి చేస్తున్నప్పుడు శిక్షణ పొందిన ఎక్స్‌పర్ట్స్ పర్యవేక్షణలో మాత్రమే చేయడం. (తమ బరువుకు తగని ఆసనాలు సొంతంగా వేయడం మంచిది కాదు).
- ఏదైనా వస్తువును ఎత్తేప్పుడు దానికి సాధ్యమైనంత దగ్గరగా వెళ్లి కూర్చుని ఎత్తడం. (కేవలం నడుం మాత్రమే వంచి, తానే వంగి ఎత్తకుండా మోకాళ్లు కూడా వంచి కూర్చున్న భంగిమలోకి వెళ్లి ఎత్తడం మంచిది. కింది వస్తువులు ఎత్తేటప్పుడు నడుము మీద కాకుండా... తుంటి, మోకాలు భాగాలను వంచి వాటిమీద మాత్రమే ఒత్తిడి పడేలా ఎత్తడం మంచిది. అంతే తప్ప నిలబడ్డవారు ముందుకు ఒంగి ఏదైనా ఎత్తడం సరికాదు)

అపోహ	వాస్తవం
వెన్నునొప్పి వచ్చినప్పుడు గట్టిగా ఉండే ఉపరితలంపైన పడుకోవాలన్నది ఇప్పటివరకూ ఉన్న ఓ అపోహ.	మరీ మెత్తగా ఉండే పరుపు మీద తప్ప... సౌకర్యంగా (కంఫర్టబుల్)గా ఉన్న ఏ పరుపు మీదైనా పడుకోవచ్చు.

చికిత్స...



నడుము నొప్పి ఏదైనా మొదట డాక్టర్లు ఫిజియోథెరపీ వ్యాయామాలను సూచిస్తారు. ఇక నొప్పి ఉపశమనం కోసం వేణ్నీళ్ల కాపడం లేదా ఐస్‌తో కాపడం పెట్టడంతోపాటు అల్ట్రాసౌండ్ తరంగాల చికిత్స, ఎలక్ట్రికల్ స్టిమ్యులేషన్ థెరపీ ఇస్తారు.

వెన్నుపూసల్లో స్థలం తగ్గి ఆ ఒత్తిడి నరంపై పడుతున్నప్పుడు ఆ నొప్పి భరించలేనిదిగా ఉన్నప్పుడు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు ఇస్తారు. తట్టుకోలేనంత నొప్పి ఉన్న వారికి కొద్దికాలంపాటు నొప్పినివారణ మందులూ ఇవ్వవచ్చు. (ఇది డాక్టర్లు సూచించిన నిర్ణీత వ్యవధి మేరకే వాడాలి. ఆ తర్వాత కూడా అలా కొనసాగించడం సరికాదు). ఇక తప్పని సందర్భాల్లో చివరి ప్రయత్నంగా శస్త్రచికిత్స అవసరం పడవచ్చు. అయితే ఇప్పుడు మినిమల్లీ ఇన్వేజివ్ సర్జరీలతో ఈ తరహా శస్త్రచికిత్సలు మరింత తేలిగ్గా, సులువుగా చేయడం సాధ్యమవుతోంది.

బిజినెస్ రీల్

కనోడియా సిమెంట్ ఐపీవో బాట

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: సిమెంట్ తయారీ కంపెనీ కనోడియా సిమెంట్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా కంపెనీ 1.49 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. దీంతో ఇష్యూ నిధులు ప్రమోటర్లకు, ప్రస్తుత ఇన్వెస్టర్లకు అందనున్నాయి. కాగా.. కంపెనీ ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో శాటిలైట్ గ్రైండింగ్ యూనిట్లను నిర్వహిస్తోంది. బ్లెండెడ్ సిమెంట్ తయారీలో ప్రత్యేకతను కలిగి ఉంది. కాంట్రాక్ట్ తయారీ పద్ధతిలో కార్యకలాపాలతోపాటు.. సొంత సిమెంట్ బ్రాండ్లను సైతం ఉత్పత్తి, మార్కెటింగ్ చేస్తోంది. 2024 డిసెంబర్31కల్లా ఐదు గ్రైండింగ్ యూనిట్ల ద్వారా 3.54 ఎంటీపీఏ సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2024 డిసెంబర్‌కల్లా 9 నెలల కాలంలో రూ. 732 కోట్ల ఆదాయం, రూ. 98 కోట్ల నికర లాభం ఆర్జించింది.

స్థిరపడుతున్న ఇండెక్స్ ఆప్షన్స్ మార్కెట్

రేటింగ్ ఏజెన్సీ ఇక్రా



న్యూఢిల్లీ: నియంత్రణ నిబంధనలు కఠినతరం కావడంతో వరుసగా మూడు నెలల పాటు క్షీణించిన ఇండెక్స్ డెరివేటివ్స్, ఆప్షన్స్ మార్కెట్ క్రమంగా స్థిరపడుతున్న సంకేతాలు కనిపిస్తున్నట్లు రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. మార్కెట్ వర్గాలు తమ వ్యూహాలను మార్చుకుంటున్నాయనడానికి వాల్యూమ్స్ నిదర్శనంగా నిలుస్తున్నాయని పేర్కొంది. గతేడాది నవంబర్ నుంచి కఠినతర నిబంధనల అమలు కారణంగా ఇండెక్స్ ఆప్షన్లలో ట్రేడింగ్ లావాదేవీలు గణనీయంగా పడిపోయాయి. 2024 ఏప్రిల్‌-నవంబర్ మధ్య కాలంతో పోలిస్తే 2024 డిసెంబర్ నుంచి 2025 మార్చి మధ్య సగటున రోజువారీ ప్రీమియం టర్నోవరు 18 శాతం క్షీణించింది. ఆప్షన్స్ కాంట్రాక్టుల సంఖ్య 60 శాతం పడిపోయింది. రూ. 10,000 లోపు నెలవారీ ప్రీమియం టర్నోవరు ఉండే ఇన్వెస్టర్ల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 2025 మార్చిలో 49 శాతం తగ్గింది. 2024-25 నాలుగో త్రైమాసికంలో తొమ్మిది సెక్యూరిటీస్ బ్రోకింగ్ సంస్థలపై నిర్వహించిన సర్వే ప్రకారం వాటి ఆదాయం 19 శాతం, లాభదాయకత 26 శాతం తగ్గిపోయాయి. అయితే, ఇప్పటికీ ట్రేడింగ్ కార్యకలాపాలు చారిత్రక స్థాయుల కన్నా అధికంగానే ఉన్నట్లు ఇక్రా పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-5-2025

విశాఖ	535-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	237.34	3.63
HDFCLIFE	780.65	3.28
JIOFIN	281.4	2.49
POWERGRID	298.05	2.46
ITC	436	2.32

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SUNPHARMA	1,689.10	-1.72
GRASIM	2,656.00	-0.7
BHARTIARTL	1,831.00	-0.02
BEL	383.35	-0.01
BAJAJ-AUTO	8,740.00	0.07

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,775
ఎన్‌ఎస్‌ఈ	93,170
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	3,71,734
ఎఫ్ఐఐ	+ 136
డీఐఐ	+ 1,746

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.53 (రాత్రి 11.30కు)	$ 61.53
బ్రెంట్	64.18 (రాత్రి 11.30కు)	$ 64.21

పీసీలకు పెరిగిన గిరాకీ

- అగ్రస్థానంలో హెచ్‌పీ, తరువాతి స్థానంలో లెనోవో
- ఐడీసీ రీసెర్చ్ నివేదిక వెల్లడి

మార్చి క్వార్టర్‌లో 8% వృద్ధితో 33 లక్షల అమ్మకాలు



ముంబై: రిపబ్లిక్ డే అమ్మకాలు, అధిక ఎగుమతులు కారణంగా భారత వ్యక్తిగత కంప్యూటర్ల (పీసీలు) మార్కెట్ 2025 మార్చి క్వార్టర్‌లో పరుగులు పెట్టింది. వార్షిక ప్రాతిపదికన 8.1% వృద్ధితో మొత్తం 33.17 లక్షల పీసీలు అమ్ముడైనట్లు ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్(ఐడీసీ) నివేదిక తెలిపింది. అంతకుముందు 2024 ఇదే త్రైమాసికంలో మొత్తం విక్రయాలు 30.70 లక్షలుగా ఉన్నాయి.

''ఆఫ్‌లైన్ విస్తరణపై దృష్టి, ఈ-టైలింగ్ చానెల్ కారణంగా భారత పీసీ మార్కెట్ వరుసగా ఏడో క్వార్టర్‌లోనూ వృద్ధి సాధించింది. పీసీ వెండర్లు కొత్త బ్రాండ్ స్టోర్ల ద్వారా కస్టమర్లకు వ్యక్తిగత కంప్యూటర్లను అందుబాటులోకి తీసుకురావడంతో ఆఫ్‌లైన్ విక్రయాలు పెరిగాయి. ఆకర్షణీయమైన డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్ డీల్స్‌తో ఆన్‌లైన్ అమ్మకాలు ఊపందుకున్నాయి. బలమైన షిప్‌మెంట్ మార్కెట్ సానుకూల ధోరణి సూచిస్తున్నప్పటికీ.., సమీప భవిష్యత్తులో ఇన్వెంటరీ(నిల్వల) సవాళ్లు ఎదురవ్వొచ్చు'' అని ఐడీసీ ఇండియా రీసెర్చ్ మేనేజర్ భరత్ షెనాయ్ తెలిపారు.

➔ మార్చి క్వార్టర్‌లో హెచ్‌పీ కంపెనీ 9.6 లక్షల యూనిట్లు విక్రయించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో అమ్మిన 9.2 లక్షల యూనిట్లతో పోలిస్తే ఇది 4.6% అధికం. అయితే పీసీ మార్కెట్లో **29.1% వాటాతో అగ్రస్థానాన్ని నిలుపుకుంది.**

➔ **చైనా కంపెనీ లెనోవో విక్రయాలు 34.8% వృద్ధితో రికార్డు స్థాయిలో 6.26 లక్షల పీసీలు అమ్మింది. గతేడాది ఇదే కాలంలో అమ్మకాలు** 4.64 లక్షలుగా ఉన్నాయి. మొత్తం 18.9 శాతం వాటాతో రెండోస్థానాన్ని దక్కించుకుంది.

➔ అమెరికా కంపెనీ డెల్ టెక్నాలజీస్ అమ్మకాలు 3.4% క్షీణించాయి. అమ్మకాలు 5.37 లక్షల నుంచి 5.18 లక్షలకు పరిమితమయ్యాయి. పీసీ విభాగంలో 15.6% వాటాతో మూడోస్థానంలో ఉంది.

➔ ఏసర్ అమ్మకాల్లో 7.6%, ఆసుస్ విక్రయాల్లో 8.6% వృద్ధి నమోదైంది. మొత్తం మార్కెట్ వాటాల్లో ఏసర్ (15.4%) నాలుగో స్థానంలో, ఆసుస్(6%) అయిదో స్థానాల్లో కొనసాగుతున్నాయి.

➔ వ్యక్తిగత కంప్యూటర్ల విభాగంలో భాగమైన నోట్స్ బుక్స్ విక్రయాల్లో 13.8%, వర్క్‌స్టేషన్ల అమ్మకాల్లో 30.4%, ప్రీమియం నోట్‌బుక్ షిప్‌మెంట్స్ 8% వృద్ధి నమోదైంది. అయితే డెస్క్‌టాప్ అమ్మకాలు స్వల్పంగా 2.4% క్షీణత చవిచూశాయి.

మెరుగైన సేవలు.. స్థిరమైన వృద్ధి

ఎస్‌బీఐ దీర్ఘకాల నమూనా చైర్మన్ సీఎస్ శెట్టి



న్యూఢిల్లీ: వ్యయ నియంత్రణలు, తక్కువ వ్యయాలతో కూడిన డిపాజిట్‌లు, ఫీజుల ఆధారిత ఆదాయం విస్తరణతోపాటు.. స్థిరమైన వృద్ధి, నిలకడైన రాబడులతో కూడిన నమూనాను ఎస్‌బీఐ నిర్మిస్తోందని బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. కాసాలో బలమైన వృద్ధికితోడు, డిజిటల్‌గా ఒకటికి మించిన ఉత్పత్తుల అమ్మకాల సామర్థ్యాలను గుర్తు చేశారు. ఈ బలాలతో ఎస్‌బీఐ భారత్‌లో అతిపెద్ద బ్యాంక్‌గానే కాకుండా.. ఆవిష్కరణలతో దీర్ఘ కాలంలో కస్టమర్లు, ఇన్వెస్టర్లకు విలువను సమకూర్చి పెట్టేదిగా కొనసాగుతుందని శెట్టి ప్రకటించారు. రిస్క్ సర్దుబాటుతో కూడిన వృద్ధిని సాధించేందుకు వీలుగా ఎస్‌బీఐ రుణాల అండర్‌రైటింగ్, పోర్ట్‌ఫోలియో పర్యవేక్షణ కోసం అత్యాధునిక విశ్లేషణ టూల్స్‌ను వినియోగిస్తున్నట్టు చెప్పారు.

సూక్ష్మ రుణాల పోర్ట్‌ఫోలియో డౌన్

- ఆస్తుల నాణ్యతలో కొనసాగుతున్న సవాళ్లు
- క్రిఫ్ హైమార్క్ నివేదిక



ముంబై: సూక్ష్మ రుణాల పోర్ట్‌ఫోలియో వార్షికంగా చూస్తే మార్చి త్రైమాసికం చివరికి 14 శాతం తగ్గి రూ.3.81 లక్షల కోట్లుగా ఉన్నట్టు క్రిఫ్ హైమార్క్ తెలిపింది. 30 రోజులుగా చెల్లింపులు చేయని రుణాల పరంగా కొంత పురోగతి మార్చి త్రైమాసికంలో కనిపించినప్పటికీ, ఆస్తుల నాణ్యత సవాళ్లు కొనసాగుతున్నట్టు వివరించింది. గతేడాది కాలంలో సూక్ష్మ రుణ రంగంలో ఉన్న ప్రతికూలతలను ప్రస్తావించింది. ఒకే రుణ గ్రహీతకు ఒకటికి మించిన సంస్థలు రుణాలు మంజూరు చేయడంతో ఆస్తుల నాణ్యత దిగజారడాన్ని గుర్తు చేసింది. దీంతో ఒక్క రుణ గ్రహీతకు గరిష్ఠంగా నాలుగు సంస్థల వరకే రుణ వితరణ జరిగేలా సూక్ష్మ రుణ పరిశ్రమ పరిమితులు విధించినట్టు తెలిపింది. తమిళనాడు, కర్ణాటకలో సూక్ష్మ రుణ వసూళ్లను కట్టడి చేస్తూ అక్కడి ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌లు పరిశ్రమకు హాని చేస్తాయంటూ.. ఆయా రాష్ట్రాల్లో డిసెంబర్ క్వార్టర్ కంటే మార్చి క్వార్టర్‌లో రుణ వితరణ 7 శాతం తగ్గినట్టు పేర్కొంది. మార్చి క్వార్టర్ చివరికి పరిశ్రమ వ్యాప్తంగా చురుకైన రుణాలు 14 కోట్లకు తగ్గినట్టు తెలిపింది. డిసెంబర్ చివరికి ఇవి 14.6 కోట్లుగా ఉంటే.. 2024 మార్చి నాటికి 16.1 కోట్లుగా ఉన్నట్టు క్రిఫ్ హైమార్క్ నివేదిక వెల్లడించింది. మార్చి త్రైమాసికలో 1.33 కోట్ల రుణాలు మంజూరైనట్టు.. 2024 మార్చి త్రైమాసికంలో మంజూరైన రుణాలు 2.40 కోట్లతో పోల్చితే సగం మేర తగ్గినట్టు తెలిపింది.

ఆస్తుల నాణ్యతలో కొంత మెరుగు

30 రోజుల వరకు చెల్లింపులు చేయని రుణాలు 2024 డిసెంబర్ త్రైమాసికం చివరికి 1.8శాతంగా ఉంటే, మార్చి చివరికి 1.4 శాతానికి తగ్గినట్టు క్రిఫ్ హైమార్క్ నివేదిక వెల్లడించింది. రూ.లక్షకు మించిన రుణాల పోర్ట్‌ఫోలియో 38.5 శాతం పెరగ్గా.. రూ.30వేలలోపు రుణాలు 36 శాతం మేర తగ్గినట్టు తెలిపింది. దీర్ఘకాల సుస్థిరత పథకంలో పరిశ్రమ నడుస్తున్నట్టు పేర్కొంది.

మధ్యశ్రేణి సంస్థలకు మరింత ఆర్థిక చేయూత

- టెక్నాలజీ అనుసంధానత అవసరం
- నీతి ఆయోగ్ నివేదిక సూచన



న్యూఢిల్లీ: మధ్యస్థ సంస్థలకు అనుకూలమైన ఆర్థిక ఉపకరణాలు, టెక్నాలజీ అనుసంధానత, కేంద్రీకృత డిజిటల్ పోర్టల్ ద్వారా వాటిని భవిష్యత్ ఆర్థిక వృద్ధి చోదకాలుగా మార్చాలని నీతి ఆయోగ్ సూచించింది. వాటి పూర్తి సామర్థ్యాలను వెలికితీసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. మధ్యశ్రేణి వ్యాపార సంస్థలు సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. వీటి టర్నోవర్‌తో ముడిపడిన మూలధన రుణ పథకాన్ని తీసుకురావాలని కోరింది. రూ.5 కోట్లతో క్రెడిట్ కార్డ్ సదుపాయాన్ని మార్కెట్ రేట్లపై అందించాలని.. రిటైల్ బ్యాంక్‌ల ద్వారా వాటికి వేగంగా రుణ వితరణ జరిగేలా చూడాలని సూచించింది. ఇండస్ట్రీ 4.0 పరిష్కారాలను అమలు చేసేందుకు, ప్రోత్సహించేందుకు వీలుగా ప్రస్తుతమున్న టెక్నాలజీ కేంద్రాలను మరింత మెరుగుపరచాలని కోరింది. ఎంఎస్‌ఎంఈ శాఖ పరిధిలో పరిశోధన, అభివృద్ధి కేంద్రం (ఆర్అండ్‌డీ సెల్) ఏర్పాటు చేయాలని సూచించింది. రంగాల వారీగా టెస్టింగ్, సర్టిఫికేషన్ కేంద్రాల ఏర్పాటును ప్రతిపాదించింది.

వైఫై సేవలకు స్పెక్ట్రం కోసం డాట్‌కు జియో వినతి



న్యూఢిల్లీ: 5జీ స్పెక్ట్రంతో వైఫై సేవలు అందించడంపై రిలయన్స్ జియో కసరత్తు చేస్తోంది. ఇందుకోసం 26 గిగాహెర్ట్జ్ బ్యాండ్ స్పెక్ట్రంను ఉపయోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ టెలికం శాఖలో సాంకేతిక విభాగమైన టెలికమ్యూనికేషన్ ఇంజినీరింగ్ సెంటర్‌కి (టీఈసీ) కంపెనీ విజ్ఞప్తి చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 2022 స్పెక్ట్రం వేలం నిబంధనల ప్రకారం 5జీ కోసం కేటాయించిన స్పెక్ట్రంను వేరే టెక్నాలజీ కోసం ఉపయోగించుకోవాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. 2022లో నిర్వహించిన స్పెక్ట్రం వేలంలో రూ. 1.5 లక్షల కోట్ల విలువ చేసే బిడ్లు దాఖలయ్యాయి. రూ. 88,078 కోట్ల బిడ్లతో జియో ఇందులో దాదాపు సగం స్పెక్ట్రంను దక్కించుకుంది.

మాపై కావాలనే దుష్ప్రచారం..

పోటీ కంపెనీ సీఎఫ్‌వోపై జెప్టో సీఈవో ఆదిత్ ఆగ్రహం



న్యూఢిల్లీ: జెప్టో కేఫ్‌ల కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నారని, స్టోర్స్ మూసివేస్తున్నారని వస్తున్న వార్తలను క్విక్ కామర్స్ ప్లాట్‌ఫాం జెప్టో సహ-వ్యవస్థాపకుడు, సీఈవో ఆదిత్ పలిచా ఖండించారు. ఓ పోటీ సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) కావాలనే తమపై బురద జల్లుతున్నారని, దుష్ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. నిరాధార ఆరోపణలతో ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆర్థికాంశాలకు సంబంధించి జర్నలిస్టులకు తప్పుడు డేటా ఇస్తున్నారని, బాట్స్‌ను ఉపయోగించి సోషల్ మీడియాలో తమకు వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ సైట్ లింక్డ్‌ఇన్‌లో చేసిన పోస్టులో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'గత కొద్ది రోజులుగా మా పోటీ సంస్థల్లో ఓ కంపెనీ సీఎఫ్‌వో జెప్టో మీద బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. ఇది అలాంటి పెద్ద సంస్థ సీఎఫ్‌వో స్థాయికి తగని పని. మా జెప్టో ఎబిటా వేగంగా పెరుగుతుండటాన్ని చూసి వారిలో ఆందోళన మొదలైందని ఇది సూచిస్తోంది' అని ఆదిత్ పేర్కొన్నారు. అయితే, సదరు సీఎఫ్‌వో పేరును ఆయన వెల్లడించలేదు. 2025 జనవరి-మే మధ్య కాలంలో తమ ఎబిటా 20 పర్సంటేజీ పాయింట్లు పెరిగిందని, వచ్చే క్వార్టర్ నాటికి చాలా మటుకు డార్క్ స్టోర్స్ స్థూల లాభాలను నమోదు చేసే అవకాశాలు ఉన్నాయని ఆదిత్ తెలిపారు. ప్రస్తుత క్వార్టర్ ప్రారంభం నాటికి జెప్టో వద్ద రూ. 7,445 కోట్ల నగదు ఉందని, ప్రస్తుతం చేస్తున్న ఖర్చుల తీరుతెన్నులు బట్టి చూస్తే ఇది చాలా సంవత్సరాలకు సరిపోతుందని పేర్కొన్నారు.

ఏఐపై ఫ్లిప్‌కార్ట్ పెట్టుబడులు ఆరు రెట్లు అప్

న్యూఢిల్లీ: ఐపీవో సన్నాహాల్లో ఉన్న ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్.. కృత్రిమ మేధపై (ఏఐ) పెట్టుబడులను ఈ ఏడాది ఆరు రెట్లు పెంచనుంది. లాభదాయకతపై మరింతగా దృష్టి సారించనుంది. సంస్థ ఉద్యోగులతో భేటీలో కంపెనీ సీఈవో కల్యాణ్ కృష్ణమూర్తి ఈ విషయాలు వెల్లడించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కస్టమర్ల సంఖ్య, ఆర్డర్లు 20-25 శాతం పెరిగాయని, జూన్ నాటికి 30 శాతం స్థాయిని సాధించే దిశగా ముందుకెళ్తున్నామని కృష్ణమూర్తి చెప్పారు. క్విక్ కామర్స్ విభాగం మినిట్స్ మెరుగ్గా రాణిస్తోందని, ఈ ఏడాది ఆఖరు నాటికి 800 డార్క్ స్టోర్స్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని వివరించారు. భారత్‌లో ఆర్థిక, నియంత్రణ పరిస్థితులకు మరింత అనుగుణంగా ఉండేలా కార్యకలాపాలను నిర్వహించుకునే దిశగానే ప్రధాన కార్యాలయాన్ని ఇక్కడికి మార్చాలన్న నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఇక పబ్లిక్ ఇష్యూ అంశంపై స్పందిస్తూ, గత 12 నెలలుగా ఇదే ఉద్దేశంతో పలు చర్యలు తీసుకున్నట్లు కృష్ణమూర్తి తెలిపారు.

హైదరాబాద్‌లో ఆఫీస్ అద్దెలు జంప్

- మూడేళ్లలో 24 శాతం వృద్ధి
- చదరపు అడుగుకు రూ.72
- అత్యధికంగా ముంబైలో 28 శాతం పెరుగుదల
- అనరాక్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్లో అద్దె ఆదాయం గత మూడేళ్లలో 24 శాతం పెరిగినట్టు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ వెల్లడించింది. చదరపు అడుగు నెలవారీ అద్దె ధర 2022లో రూ.58గా ఉంటే.. అది 2025 నాటికి రూ.72కు పెరిగింది. అత్యధికంగా ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో (ఎంఎంఆర్) చదరపు అడుగుకు అద్దె రూ.131 నుంచి రూ.168కి చేరింది. 2022 నుంచి 2025 మధ్య కాలంలో (కరోనా అనంతరం) ప్రీమియం ఆఫీసు వసతులకు డిమాండ్ స్థిరంగా వృద్ధి చెందినట్టు.. ముఖ్యంగా ఎంఎంఆర్, ఢిల్లీ ఎన్‌సీఆర్, హైదరాబాద్ కీలక కేంద్రాలుగా ఉన్నట్టు అనరాక్ నివేదిక తెలిపింది. అన్ని మెట్రోల్లోనూ అద్దె ధరల్లో మంచి వృద్ధి నమోదైనట్టు పేర్కొంది.

➤ ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో ఆఫీస్ వసతుల అద్దె చదరపు అడుగునకు రూ.92 నుంచి రూ.110కి పెరిగింది. 20 శాతం వృద్ధి నమోదైంది.

➤ బెంగళూరులో నెలవారీ అద్దె చదరపు అడుగునకు రూ.16% పెరిగి రూ.82 నుంచి రూ.95కి చేరింది.

➤ పుణెలో 11 శాతం పెరుగుదలతో రూ.80కి, చెన్నైలో 9.1 శాతం పెరిగి రూ.72కు చదరపు అడుగు అద్దె చేరుకుంది.

యూఎస్ కంపెనీల నుంచి అధిక డిమాండ్

గ్రేడ్ ఏ ఆఫీస్ లీజింగ్‌లో 45 శాతం యూఎస్ కంపెనీల నుంచే ఉన్నట్టు అనరాక్ గ్రూప్ కమర్షియల్ లీజింగ్ ఎండీ పీయూష్ జైన్ తెలిపారు. ముంబైలో బీఎఫ్ఎస్ఐ ఆఫీస్ లీజింగ్‌లో 48 శాతం యూఎస్‌కు చెందిన బ్యాంక్‌లు లీజింగ్‌కు తీసుకున్నట్టు చెప్పారు. భారత్‌లో గ్రేడ్ ఏ ఆఫీస్ వసతులకు అమెరికన్ కంపెనీల నుంచి బలమైన డిమాండ్ ఉన్నట్టు తెలిపారు.

మార్చి త్రైమాసిక ఫలితాలు

జిల్లెట్ ఇండియా లాభం జూమ్

- క్యూ4లో రూ. 159 కోట్లు
- షేరుకి రూ. 47 డివిడెండ్



ముంబై: షేవింగ్ ప్రొడక్టుల దిగ్గజం జిల్లెట్ ఇండియా గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 60 శాతం జంప్‌చేసి రూ. 159 కోట్లకు చేరింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 99 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 47 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం 13 శాతం ఎగసి రూ. 767 కోట్లను అధిగమించింది. అంతక్రితం క్యూ4లో రూ. 681 కోట్ల టర్నోవర్ అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు సైతం 5 శాతం పెరిగి రూ. 569 కోట్లను దాటాయి.

ఫలితాల నేపథ్యంలో జిల్లెట్ షేరు బీఎస్‌ఈలో 7.5% జంప్‌చేసి రూ. 9,404 వద్ద ముగిసింది.

ముత్తూట్ ఫిన్‌కార్ప్ లాభం డౌన్

క్యూ4లో రూ. 192 కోట్లు



న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ.. ముత్తూట్ ఫిన్‌కార్ప్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 20 శాతం క్షీణించి రూ. 192 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 240 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 1,197 కోట్ల నుంచి రూ. 1,479 కోట్లకు ఎగసింది. నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 46 శాతం జంప్‌చేసి రూ. 32,055 కోట్లను తాకాయి. కాగా.. పూర్తి ఏడాదికి స్టాండెలోన్ నికర లాభం 40 శాతం జంప్‌చేసి రూ. 787 కోట్లకు చేరింది. 2023-24లో రూ. 563 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 4,016 కోట్ల నుంచి రూ. 5,551 కోట్లకు ఎగసింది. ఈ ఏడాది(2025-26) వివిధ బాండ్ల జారీ ద్వారా రూ. 8,000 కోట్లు సమీకరించేందుకు బోర్డు అనుమతించినట్లు ముత్తూట్ వెల్లడించింది.

పీటీసీ ఇండియా లాభం హైజంప్

- క్యూ4లో రూ. 372 కోట్లు
- షేరుకి రూ. 6.7 డివిడెండ్




ముంబై: విద్యుత్ ట్రేడింగ్ సొల్యూషన్లు అందించే పీటీసీ ఇండియా గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 4 రెట్లు జంప్‌చేసి రూ. 372 కోట్లకు చేరింది. ఇందుకు ప్రధానంగా రూ. 306 కోట్ల అనుకోని లాభం సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 91 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 6.7 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 3,510 కోట్ల నుంచి రూ. 3,031 కోట్లకు నీరసించింది. సొంత అనుబంధ సంస్థ పీటీసీ ఎనర్జీలో వాటాను ఓఎన్‌జీసీ గ్రీన్‌కు విక్రయించడం ద్వారా రూ. 306 కోట్లు ఆర్జించినట్లు కంపెనీ పేర్కొంది. మొత్తం విక్రయ విలువను రూ. 1,176 కోట్లుగా వెల్లడించింది. కాగా.. పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 533 కోట్ల నుంచి రూ. 976 కోట్లకు జంప్‌చేసింది. అయితే మొత్తం ఆదాయం రూ. 16,805 కోట్ల నుంచి రూ. 16,277 కోట్లకు బలహీనపడింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 0.75% లాభంతో రూ. 187 వద్ద ముగిసింది.

లాభాల్లోకి పీసీ జ్యువెలర్స్

క్యూ4లో రూ. 95 కోట్లు



ముంబై: బంగారు ఆభరణాల వర్తక కంపెనీ పీసీ జ్యువెలర్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 95 కోట్ల నికర లాభం ఆర్జించింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 122 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 48 కోట్ల నుంచి రూ. 699 కోట్లకు భారీగా జంప్ చేసింది. కాగా.. పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నష్టాలను వీడి రూ. 578 కోట్ల నికర లాభం ప్రకటించింది. 2023-24లో రూ. 629 కోట్ల నికర నష్టం నమోదైంది. ఈ కాలంలో పూర్తిగా మార్పిడికి వీలయ్యే వారంట్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా రూ. 2,702 కోట్ల నిధులను సమీకరించినట్లు కంపెనీ వెల్లడించింది. అంతేకాకుండా బ్యాంకుల కన్సార్షియంతో సెటిల్‌మెంట్ ఒప్పందం సైతం కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. సుమారు 50 శాతం రుణభారాన్ని తగ్గించుకోవడంతోపాటు.. మిగిలిన రుణ చెల్లింపులను ఈ ఏడాది(2025-26) చివరికల్లా చెల్లించనున్నట్లు వివరించింది. తద్వారా రుణరహిత కంపెనీగా అవతరించనున్నట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 1 శాతం నష్టంతో రూ. 13 వద్ద ముగిసింది.

బ్లూ డార్ట్ ఎక్స్‌ప్రెస్ లాభం వీక్

క్యూ4లో రూ. 55 కోట్లు

ముంబై: లాజిస్టిక్స్ దిగ్గజం బ్లూ డార్ట్ ఎక్స్‌ప్రెస్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 29 శాతం క్షీణించి రూ. 55 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 78 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం 7 శాతం వృద్ధితో రూ. 1,417 కోట్లను అధిగమించింది. అంతక్రితం క్యూ4లో రూ. 1,323 కోట్ల టర్నోవర్ అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు సైతం 10 శాతం పెరిగి రూ. 1,349 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో షేరు బీఎస్‌ఈలో 2.4% నష్టంతో రూ. 7,184 వద్ద ముగిసింది.



‘పోల్’ దాటడమే పరీక్ష!

భద్రత కారణంగా పదే పదే అవరోధాలు

భారత డెకాథ్లెట్ తేజస్విన్ శంకర్ మనోగతం





ఆసియా క్రీడల రజత పతకంతో తేజస్విన్ (ఫైల్)

సాక్షి క్రీడా విభాగం

ఒకవైపు ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు తీవ్ర ఒత్తిడి మధ్య ప్రయాణానికి సిద్ధమవుతున్న తరుణం... మరోవైపు పోటీలు జరిగే దేశంలో ఉండే పరిస్థితులు, అనుకూలతల గురించి ఆలోచిస్తూ తమ వ్యూహాలు సిద్ధం చేసుకోవాల్సిన అవసరం... సాధారణంగా అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఇలాంటి దశను ఎదుర్కొంటూనే ఉంటారు. టీమ్ గేమ్‌లకు సంబంధించి ఏర్పాట్లను చక్కబెట్టేందుకు ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉంటాయి. అదే వ్యక్తిగత క్రీడాంశాల్లో పాల్గొనే ఆటగాళ్లు మాత్రం అన్నీ తామే చూసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్ విషయంలో ఎన్నో ఏర్పాట్లు, మరెన్నో అదనపు జాగ్రత్తలతో వారు పోటీలకు వెళుతుంటారు. కానీ ఇలాంటి ఆటగాళ్లకు విమానాశ్రయంలో ప్రతీసారి నిబంధనల పేరుతో ప్రతిబంధకాలు ఎదురవుతూనే ఉంటాయి. ప్రశాంతంగా, సమస్య లేకుండా ప్రయాణం చేయాల్సిన అథ్లెట్లు సామాన్యుల తరహాలో అనేక తనిఖీలను ఎదుర్కొంటూ అడ్డంకులను అధిగమించాల్సి ఉంటుంది. భారత డెకాథ్లెట్ తేజస్విన్ శంకర్‌కు ప్రతీసారి ఇలాంటి అనుభవమే ఎదురవుతూ ఉంటుంది.

2022 ఆసియా క్రీడల డెకాథ్లాన్ (పది క్రీడాంశాల సమాహారం) ఈవెంట్‌లో శంకర్ రజత పతకం సాధించాడు. ఈ పోటీల్లో భాగంగా అతను పోల్‌వాల్ట్ ఈవెంట్‌లో కూడా పాల్గొనాల్సి ఉంటుంది. దాని కోసమే అతను ఎక్కడికైనా తన సొంత ‘పోల్’లను తీసుకెళతాడు. సుమారు 15.7 అడుగుల పొడవు ఉండే ఈ పోల్‌ను ముందుగా విమానాశ్రయం కార్గోలోకి తీసుకెళ్లడం మొదలు విమానం దిగిన తర్వాత ఆయా ఎయిర్‌పోర్ట్‌నుంచి బయటకు తీసుకు రావడం వరకు పెద్ద ప్రహసనం సాగుతుంది. భారత్‌లో జరిగే ఈవెంట్లలో అయితే అతను తన పోల్‌లను ట్రైన్‌ల ద్వారా సునాయాసంగా పంపించేస్తాడు. అదే విదేశాలకు వెళ్లేటప్పుడే సమస్య ఎదురవుతుంది. టోర్నీ జరిగే సమయంలో నిర్వాహకులు పోల్‌లను సిద్ధం చేస్తారు కానీ కొత్త వాటిని ఉపయోగించడంలో చాలా సమస్యలు ఉంటాయి. వాటి పొడవు, బరువును బట్టి ప్రాక్టీస్‌లో వాడటం బాగా అలవాటైన పోల్‌లనే పోటీల్లోనూ వాడితే సౌకర్యంగా ఉంటుంది. అందుకే తేజస్విన్ కూడా ఎక్కడికి వెళ్లినా వాటిని తీసుకెళతాడు. యూరోప్, అమెరికా దేశాల్లో ఇలాంటి సమస్య తక్కువ. అగ్రశ్రేణి అథ్లెట్లంతా ఈ రెండు ఖండాల్లో తమకు అనువైన చోట ఒక్కో సెట్‌ను ఉంచుతారు. వాటిని తరలించడంలో వారికి పెద్దగా ఇబ్బంది ఎదురు కాదు. ఈనెల 27 నుంచి దక్షిణ కొరియాలో జరిగే ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తేజస్విన్ పాల్గొంటున్నాడు. అతని ఈవెంట్ రెండు రోజులపాటు ఉంటుంది. మే 27న తొలి రోజు ఐదు ఈవెంట్స్ (100 మీటర్లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, హైజంప్, 400 మీటర్లు)... రెండో రోజు మే 28న మరో ఐదు ఈవెంట్స్ (110 మీటర్ల హర్డిల్స్, డిస్కస్ త్రో, పోల్‌వాల్ట్, జావెలిన్ త్రో, 1500 మీటర్లు) జరుగుతాయి. అత్యధిక పాయింట్లు సాధించిన టాప్–3 డెకాథ్లెట్‌లకు వరుసగా స్వర్ణ, రజత, కాంస్యాలు లభిస్తాయి. ఈ నేపథ్యంలో తేజస్విన్ తన గతానుభవాలను వివరించాడు. వివరాలు అతని మాటల్లోనే....

‘నా ఈవెంట్‌కు సంబంధించిన స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్‌లో జావెలిన్, డిస్కస్, షాట్‌పుట్ సహా అన్నింటిని ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సాధారణ చెకింగ్ ద్వారానే నేను దాటించగలుగుతాను. కానీ అసలు సమస్య పోల్‌వాల్ట్ పోటీల్లో వాడే పోల్ గురించే వస్తుంది. దాదాపు 5 మీటర్ల పొడవు ఉండే పోల్‌ను తీసుకెళ్లడం నాకు ఎప్పుడూ సమస్యే. అన్నింటికంటే ముందు ప్రధాన ద్వారం వద్దే సీఐఎస్ఎఫ్ జవాన్లు నన్ను ఆపేస్తారు. నా గురించి మొత్తం చెప్పిన గతంలోనూ ఇలా వెళ్లానని వివరించాల్సి వస్తుంది. మరోవైపు ప్రయాణీకులేమో నేనేదో ఆయుధాలు తీసుకెళుతున్నట్లు చూస్తారు. సాధారణంగా లగేజీకి వాడే రెండు కార్గో లిఫ్ట్‌లలో ఈ పోల్‌లు పట్టవు. అందుకే మరో లిఫ్ట్‌ను వాడాల్సి ఉంటుంది. మొదటిసారి నేను ఈ పోల్స్ తీసుకొని భారత్‌కు తిరిగొచ్చాక వాటిని ఎలా బయటకు తీసుకురావాలో తెలీక కొందరు అధికారులు వెనక్కి పంపాలని కూడా ఆలోచించారు. చివరకు నాలుగు రోజుల తర్వాత అలాంటి వాటి కోసం స్టీల్ గేట్ ఒకటి ఉంటుందని తెలిసింది. దానిని కేవలం ప్రధానమంత్రి విదేశాలకు వెళ్లేటప్పుడు మాత్రమే వాడతారని వారు చెప్పారు. ఈ గేట్‌ను వాడేందుకు నేను ముందుగా సదరు ఎయిర్‌లైన్స్ అధికారుల లెటర్ తీసుకోవాలి. ఆపై సెక్యూరిటీ హెడ్, కస్టమ్స్ హెడ్‌తో కూడా దానిపై సంతకం చేయించాలి. వేర్వేరు చోట్ల బిజీగా ఉండేవారంతా ఒకే సమయంలో మనకు దొరకరు. చివరకు ఆ స్టీల్ గేట్‌ను తెరుస్తారు. ఈ ప్రక్రియ అంతా దాదాపు ఐదు గంటల పాటు సాగుతుంది! అందుకే నేను ప్రయాణ సమయానికన్నా ఎన్నో గంటల ముందు అక్కడుంటాను. కాస్త ఆలస్యం అయితే వారు నన్ను పట్టించుకోరు. ఎన్నిసార్లు నేను ఇదే చేస్తున్నా ప్రతీసారి మళ్లీ కొత్తగా మొదలు పెట్టాల్సి ఉంటుంది. భారత్ నుంచి వెళ్లిన తర్వాత మనం ఏ దేశంలో అడుగుపెడుతున్నాం అనేదానిపై తర్వాతి అంశాలు ఆధారపడి ఉంటాయి. కొన్ని ఎయిర్‌లైన్స్‌లు బాగా సహకరిస్తే కొన్ని పోల్స్‌ను తీసుకెళ్లమని గట్టిగా చెప్పేస్తాయి. నాకు ఇదంతా చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. అయితే పతకం గెలిచి వస్తున్నప్పుడు ఎంతో చక్కగా మనకు సహాయం చేస్తారు కూడా. ఇది ఒక అథ్లెట్‌గా నాకు కలిగే ఆనందం’ అని తేజస్విన్ వివరించాడు.

కేసీ కార్టీ 170 విండీస్‌దే విజయం



డబ్లిన్: ఐర్లాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను వెస్టిండీస్ 1–1తో సమంగా ముగించింది. చివరిదైన మూడో వన్డేలో వెస్టిండీస్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 197 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 385 పరుగులు సాధించింది. వన్డేల్లో విండీస్‌కిది రెండో అత్యధిక స్కోరు. వన్‌డౌన్ బ్యాటర్ కేసీ కార్టీ (142 బంతుల్లో 170; 15 ఫోర్లు, 8 సిక్స్‌లు) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ సెంచరీతో అదరగొట్టాడు. కెప్టెన్ షై హోప్ (75; 9 ఫోర్లు, 2 సిక్స్), జస్టిన్ గ్రీవెస్ (23 బంతుల్లో 50; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో రాణించారు. విండీస్ ఇన్నింగ్స్ ముగిశాక వర్షం రావడంతో ఐర్లాండ్ లక్ష్యాన్ని 46 ఓవర్లలో 363 పరుగులుగా నిర్ణయించారు. ఐర్లాండ్ జట్టు 29.5 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కేసీ కార్టీకి ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’తోపాటు ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ అవార్డు లభించింది. తొలి వన్డేలో ఐర్లాండ్ నెగ్గగా... రెండో వన్డే వర్షం కారణంగా రద్దయింది.



తెలంగాణ సీనియర్ అంతర్ జిల్లా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో ఐదు స్వర్ణాల చొప్పున గెలిచి వ్యక్తిగత చాంపియన్స్‌గా నిలిచిన స్విమ్మర్లు వ్రితి అగర్వాల్ (రంగారెడ్డి జిల్లా), వర్షిత్ ధూళిపూడి (హైదరాబాద్ జిల్లా)

ప్రియాంక్ పాంచాల్ గుడ్‌బై



అహ్మదాబాద్: జాతీయ సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలనే స్వప్నం సాకారం కాకుండానే గుజరాత్ సీనియర్ క్రికెటర్ ప్రియాంక్ పాంచాల్ తన ప్రస్థానాన్ని ముగించాడు. అన్ని రకాల క్రికెట్ నుంచి తాను వీడ్కోలు తీసుకుంటున్నట్లు 35 ఏళ్ల ప్రియాంక్ పాంచాల్ సోమవారం ప్రకటించాడు. గతంలో భారత ‘ఎ’ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన ప్రియాంక్‌కు భారత సీనియర్ జట్టుకు ఆడే అవకాశం మాత్రం రాలేదు. 2021–2022లో దక్షిణాఫ్రికాలో పర్యటించిన భారత జట్టులో గాయపడ్డ రోహిత్ శర్మ స్థానంలో ప్రత్యామ్నాయ ఆటగాడిగా ప్రియాంక్ పాంచాల్‌ను పంపించినా అతనికి అరంగేట్రం చేసే అవకాశం దక్కలేదు. 2008లో దేశవాళీ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ప్రియాంక్ గుజరాత్ జట్టు తరఫున 127 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి 8,856 పరుగులు సాధించాడు. ఇందులో 29 సెంచరీలు, 34 అర్ధ సెంచరీలు ఉన్నాయి. లిస్ట్ ‘ఎ’ (దేశవాళీ వన్డేలు) ఫార్మాట్‌లో 97 మ్యాచ్‌లు ఆడిన ప్రియాంక్ 3,672 పరుగులు చేశాడు. ఇందులో 8 సెంచరీలు, 21 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఇక టి20 ఫార్మాట్‌లో 59 మ్యాచ్‌లు ఆడిన ప్రియాంక్ 1,522 పరుగులు సాధించాడు. ఇందులో తొమ్మిది అర్ధ సెంచరీలు ఉన్నాయి. దేశవాళీ క్రికెట్‌లో 17 ఏళ్లపాటు గుజరాత్ జట్టుకు ఆడిన ప్రియాంక్... రంజీ ట్రోఫీ (ఫస్ట్‌క్లాస్; 2016–2017), విజయ్ హజారే ట్రోఫీ (వన్డే; 2015–2016), సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (టి20; 2016–2017) టైటిల్స్ సాధించిన గుజరాత్ జట్టులో కీలక సభ్యుడిగా వ్యవహరించడం విశేషం.

సెమీస్‌లో సంజూ, అన్షుల్



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ ఇన్విటేషనల్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు రెండు పతకాలు ఖరారయ్యాయి. మహిళల 60 కేజీల విభాగంలో సంజూ... పురుషుల 90 ప్లస్ కేజీల విభాగంలో అన్షుల్ గిల్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాలను ఖాయం చేసుకున్నారు. ఇండోనేసియా బాక్సర్ రెకా మరియానా కాసిబులాన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో సంజూ 5–0తో ఏకపక్ష విజయాన్ని అందుకుంది. కజకిస్తాన్ బాక్సర్ డానియల్ సపర్బేతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో అన్షుల్ కూడా 5–0తో గెలుపొందాడు. చైనా, కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, దక్షిణ కొరియా తదితర దేశాలు పోటీ పడుతున్న ఈ టోర్నీలో భారత్ నుంచి 19 మంది బాక్సర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

భారత్‌కు రెండో గెలుపు



రొసారియో (అర్జెంటీనా): నాలుగు దేశాల జూనియర్ మహిళల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. సోమవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 3–2 గోల్స్ తేడాతో ఉరుగ్వే జట్టును ఓడించింది. భారత్ తరఫున కనిక సివాచ్ (46వ, 50వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... సోనమ్ (21వ నిమిషంలో) ఒక గోల్ సాధించింది. ఉరుగ్వే జట్టుకు మిలాగ్రోస్ సెగాల్ (3వ నిమిషంలో), అగస్టినా మారి (24వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. మంగళవారం జరిగే మూడో మ్యాచ్‌లో ఆతిథ్య అర్జెంటీనాతో భారత్ తలపడుతుంది.

యు ముంబా హెడ్ కోచ్‌గా అనిల్

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో యు ముంబా జట్టుకు అనిల్ చప్రానా హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. పీకేఎల్ 11వ సీజన్‌లో యు ముంబా జట్టుకు హెడ్ కోచ్‌గా ఉన్న గులామ్‌రజా మజందరాని (ఇరాన్) సీజన్ ముగిశాక తన బాధ్యతల నుంచి వైదొలిగాడు. గత సీజన్‌లో అనిల్ చప్రానా యు ముంబా జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా పని చేశాడు. గులాంరజా తప్పుకున్న తర్వాత 12వ సీజన్ కోసం భారత మాజీ ప్లేయర్ రాకేశ్ కుమార్‌ను యు ముంబా కొత్త హెడ్ కోచ్‌గా నియమించుకుంది. అయితే ఆదివారం అనూహ్య పరిణామంచోటు చేసుకుంది. రాకేశ్‌ను హెడ్ కోచ్ పదవి నుంచి తప్పిస్తున్నామని ముంబా సీఈఓ సుహైల్ చందోక్ తెలిపారు. రాకేశ్‌తో సంప్రదింపులు చేశాకే ఈ నిర్ణయం తీసుకున్నామని చందోక్ వివరించారు. 2022లో యు ముంబా జట్టుకు హెడ్ కోచ్‌గా ఉన్న అనిల్ చప్రానాకు మరోసారి ఆ బాధ్యతలు అప్పగిస్తున్నామని, అసిస్టెంట్ కోచ్‌గా పార్థిబన్‌ను ఎంపిక చేశామని సోమవారం సదరు ఫ్రాంచైజీ పేర్కొంది. ఈనెల 31న, జూన్ 1న పీకేఎల్ 12వ సీజన్ కోసం ఆటగాళ్ల వేలం కార్యక్రమం జరగనుంది. 2014లో పీకేఎల్ ఆరంభ సీజన్ నుంచి పోటీపడుతున్న యు ముంబా జట్టు రెండుసార్లు రన్నరప్‌గా, ఒకసారి చాంపియన్‌గా (2015) నిలిచింది. గత సీజన్‌లో యు ముంబా టాప్–6లో నిలిచి ఎలిమినేటర్ మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ చేతిలో ఓడింది.



బెంగళూరుకు ‘ఆఖరి’ చాన్స్



- నేడు లక్నో పోరుతో ముగియనున్న లీగ్ దశ
- గెలుపు, టాప్–2లో నిలవడమే ఆర్‌సీబీ లక్ష్యం
- విజయంతో సీజన్ ముగించాలనుకుంటున్న సూపర్ జెయింట్స్
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

లక్నో: ఐపీఎల్ లీగ్ దశ ఆఖరి అంకానికి చేరింది. 66 రోజులుగా జరుగుతున్న లీగ్ దశకు నేడు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) ఫలితంతో తెర పడుతుంది. ఈ సీజన్‌లో ఎప్పుడో నాలుగు జట్లు ‘ప్లే ఆఫ్స్’ చేరాయి. అలాగని ఈ మ్యాచ్ పూర్తిగా నామమాత్రమని కొట్టిపారేయడానికి వీలు లేదు. ఎందుకంటే ‘ప్లే ఆఫ్స్’ చేరిన నాలుగు జట్లలో ఒకటైన ఆర్‌సీబీ ‘సేఫ్ జోన్’ టాప్–2లో నిలిచేందుకు ఇదే ఆఖరి అవకాశం. ఈడెన్ గడ్డపై మార్చి 22న మొదలైన ఐపీఎల్‌లో కోల్‌కతాపై గెలిచి శుభారంభం చేసిన బెంగళూరు... ఇప్పుడు మరో పరాయిగడ్డ లక్నోలోనూ సూపర్ జెయింట్స్‌పై గెలిచి టాప్–2లో చేరాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. మరోవైపు ఈ సీజన్‌లో ఎలాగూ ముందంజ వేయలేకపోయిన లక్నో... కనీసం సొంత ప్రేక్షకుల మధ్య విజయంతో ముగింపు పలకాలనే పట్టుదలతో ఉంది.

మిడిలార్డర్ మెరిపిస్తే...

బెంగళూరు జట్టులో ఓపెనర్లు ఫిల్ సాల్ట్, కోహ్లి మంచి ఆరంభాన్నే ఇస్తున్నారు. హైదరాబాద్‌తో జరిగిన తమ చివరి మ్యాచ్‌లో ఓపెనింగ్ వికెట్‌కు 7 ఓవర్లలో 80 పరుగులు జోడించారు. తర్వాత వచ్చిన మిడిలార్డర్ బ్యాటర్లు రజత్ పాటీదార్, జితేశ్ శర్మ, షెఫర్డ్, కృనాల్ పాండ్యా, టిమ్ డేవిడ్‌లు తీవ్రంగా నిరుత్సాహపరిచారు. వీళ్లందరూ మూకుమ్మడిగా విఫలమవడం మ్యాచ్ ఫలితాన్నే మార్చింది. లేదంటే 200 పైచిలుకు లక్ష్యాన్ని బెంగళూరు ఛేదించేంది. ఇక బౌలర్లు గత మ్యాచ్‌లో విరివిగా పరుగులు సమర్పించుకున్నారు. యశ్ దయాళ్, ఇన్‌గిడి, షెఫర్డ్, సుయశ్‌లు తేలిపోవడం ప్రత్యర్థి బ్యాటర్లకు అనుకూలతనిచ్చింది. అయితే టాప్–2లో నిలిపే కీలకమైన పోరులో సమష్టిగా బాధ్యత కనబరిస్తే ఆర్సీబీకి ఢోకా ఉండదు.

తడాఖా చూపేనా

లక్నో ప్లే ఆఫ్స్‌కు మాత్రమే దూరమైంది. అంత మాత్రాన పోరాటానికి విరామమివ్వలేదు. గత రెండు మ్యాచ్‌ల్ని పరిశీలిస్తే ఈ విషయమే అర్థమవుతుంది. సొంతగడ్డపై లక్నో 205 పరుగులు చేసింది. కానీ సన్‌రైజర్స్ దూకుడుతో ఓడింది. ఇక గుజరాత్ గడ్డ అహ్మదాబాద్‌పై టైటాన్స్‌పై 235 పరుగులు చేసి గెలిచింది. గత రెండు మ్యాచ్‌ల్లోనూ సులువుగా 200 పైచిలుకు పరుగులు చేసిన లక్నో బ్యాటింగ్ దుర్భేధ్యంగా ఉంది. ముఖ్యంగా ఓపెనర్లు మిచెల్ మార్ష్, మార్క్‌రమ్, మిడిలార్డర్‌లో నికోలస్ పూరన్ ఫామ్‌లో ఉన్నారు. ప్రత్యర్థి బౌలర్లపై చెలరేగుతున్నారు. లక్నో బ్యాటింగ్‌కు అండ, దండా ఈ ముగ్గురే! బౌలింగ్ విభాగానికి వస్తే రూర్కే, అవేశ్ ఖాన్‌లు నిలకడగా వికెట్లు తీస్తున్నారు. ఒక మ్యాచ్ సస్పెన్షన్‌తో గత మ్యాచ్‌కు దూరమైన స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీ ఈ మ్యాచ్‌కు అందుబాటులోకి రావడం కలిసొచ్చే అంశం. అతని ప్రవర్తన పక్కనబెడితే స్పిన్‌తో బ్యాటర్లను బాగా ఇబ్బంది పెడుతున్నాడు. నేటి మ్యాచ్‌లో వీళ్లందరూ ఆశించిన మేర రాణిస్తే విజయంతో బైబై చెప్పడం ఏమంత కష్టం కానేకాదు.

పిచ్, వాతావరణం

బ్యాటింగ్‌కు కలిసొచ్చే పిచ్ ఇది. మూడు మ్యాచ్‌ల్లో 200 పైచిలుకు స్కోరు సాధ్యమైంది. ఇందులో ఒకసారైతే 206 లక్ష్యఛేదన సులువైంది. టాస్ నెగ్గిన జట్టు మొదట ఫీల్డింగ్‌కే మొగ్గుచూపుతుంది.. మంగళవారం వర్ష సూచనైతే లేదు.

తుది జట్లు (అంచనా)

బెంగళూరు: రజత్ పాటీదార్ (కెప్టెన్), సాల్ట్, కోహ్లి, మయాంక్, జితేశ్, రొమారియో షెఫర్డ్, కృనాల్, టిమ్ డేవిడ్, భువనేశ్వర్, యశ్ దయాళ్, ఇన్‌గిడి.

లక్నో: రిషభ్ పంత్ (కెప్టెన్), మార్క్‌రమ్, మిచెల్ మార్ష్, పూరన్, ఆయుశ్ బదోని, సమద్, హిమ్మత్ సింగ్, షాబాజ్, అవేశ్‌ఖాన్, ఆకాశ్‌దీప్, విల్ రూర్కే.



అమెరికాలో ఊటా రాష్ట్రంలోని స్పానిష్ ఫోర్క్‌లో
శ్రీశ్రీ రాధాకృష్ణ ఆలయ ప్రాంగణంలో అరుదైన శ్వేత మయూరం



రాష్ట్రపతి భవన్‌లో సోమవారం జరిగిన కళా ఉత్సవ్‌లో సంప్రదాయ, గిరిజన కళా నైపుణ్యాలను
రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు వివరిస్తున్న మధుబని, గోండ్ కళాకారులు

జస్టిస్ వర్మ నోట్ల కట్టల కేసు

నివేదిక వెల్లడికి సుప్రీం నో

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టల కేసులో దర్యాప్తు నివేదికను బయట పెట్టాలని కోరుతూ సమాచార హక్కు చట్టం కింద దాఖలైన దరఖాస్తును సుప్రీంకోర్టు తిరస్కరించింది. కమిటీ నివేదిక కాపీతో పాటు ఈ విషయమై రాష్ట్రపతి, ప్రధానమంత్రికి భారత ప్రధాన న్యాయమూర్తి రాసిన లేఖ కాపీని కోరుతూ అమృత్‌పాల్ సింగ్ ఖల్సా అనే కార్యకర్త చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు కేంద్ర ప్రజా సమాచార అధికారి (సీపీఐఓ) మే 9న తోసిపుచ్చారు. ఆ సమాచారాన్ని బహిర్గతం చేయలేమని సుప్రీంకోర్టు అదనపు రిజిస్ట్రార్, సీపీఐఓ మే 21న లిఖితపూర్వకంగా బదులిచ్చారు. జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉండగా గత మార్చి 14 రాత్రి ఆయన అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం నేపథ్యంలో ఔట్‌హౌస్ స్టోర్ రూమ్‌లో అధికారులకు భారీగా నగదు దొరికడం తెలిసిందే. తీవ్ర కలకలం రేపిన ఈ ఉదంతంపై అప్పటి సీజేఐ జస్టిస్ సంజీవ్‌ఖన్నా నియమించిన ముగ్గురు న్యాయమూర్తుల కమిటీ దర్యాప్తు జరిపి ఆయనకు నివేదిక సమర్పించింది. అనంతరం రాజీనామా చేయాల్సిందిగా సీజేఐ సూచించగా జస్టిస్ వర్మ నిరాకరించినట్టు సమాచారం. దాంతో ఆయనపై చర్యలకు సిఫార్సు చేస్తూ కమిటీ నివేదికను రాష్ట్రపతి, ప్రధానికి జస్టిస్ ఖన్నా పంపారు.

భారత మహిళను అప్పగించిన పాక్

నాగ్‌పూర్: నియంత్రణ రేఖ దాటిన ఓ మహిళను పాకిస్తాన్ శనివారం భారత్‌కు అప్పగించింది. నాగ్‌పూర్‌కు చెందిన 43 ఏళ్ల సునీత జామ్‌గాడే మే 14 నుంచి కనిపించకుండా పోయింది. జమ్మూ కశ్మీర్‌లో కార్గిల్ వద్ద నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) గుండా ఆమె పాక్‌లోకి ప్రవేశించింది. దాంతో పాక్ రేంజర్లు ఆమె అరెస్టు చేశారు. సోమవారం ఆమెను అమృత్‌సర్ పోలీసులకు అప్పగించారు. కనిపించకుండా పోవడానికి ముందు సునీత పాక్ జాతీయులతో సంప్రదింపులు జరిపినట్టు లద్దాఖ్ డీజీపీ ఎస్.డి.సింగ్ చెప్పారు. ఆమె నాగ్‌పూర్‌లో కొంతకాలం నర్సుగా చేసింది. తర్వాత ఇంటింటికీ వెళ్లి దుస్తులమ్మింది. కొన్ని వారాలుగా మానసిక క్షోభతో ఉన్నట్టు చెబుతున్నారు. సునీత కార్గిల్ ఎందుకు వెళ్లింది, సరిహద్దు ఎలా దాటింది వంటివి విచారిస్తామని నాగ్‌పూర్ పోలీసులు తెలిపారు. ఆమె తమ కస్టడీకి వచ్చాక గూఢచర్యం తదితరాలపైనా దర్యాప్తు చేస్తామన్నారు.

గంగూలీ కుటుంబానికి తప్పిన ప్రమాదం

పూరీ: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ సోదరుడు, బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు స్నేహాశీష్ గంగూలీ దంపతులకు సోమవారం ప్రాణాపాయం త్రుటిలో తప్పింది. ఒడిశాలో పూరీ క్షేత్ర సందర్శనకు వెళ్లిన స్నేహాశీష్, భార్య అర్పిత లైట్‌హౌస్ సమీపంలో సముద్రంలో సరదాగా స్పీడ్ బోట్ రైడింగ్ చేశారు. అకస్మాత్తుగా పెద్ద అలలు రావడంతో బోట్ అదుపు తప్పి ఒక్కసారిగా బోల్తా పడింది. అక్కడికి సమీపంలో ఉన్న లైఫ్‌గార్డులు తక్షణం అప్రమత్తమై వారితో పాటు మరో నలుగురు పర్యాటకులను కాపాడారు. ''దేవుని దయతో సురక్షితంగా బయటపడ్డాం. ఇంకా ఆ షాక్‌లోనే ఉన్నా. అక్కడ పర్యాటకుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఇది పూర్తిగా బాధ్యతారాహిత్యం. దారుణం జరక్కముందే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి'' అని అర్పిత కోరారు. ప్రతికూల వాతావరణం చూసి భయపడ్డా బోటు నిర్వాహకులు బలవంతంగా సముద్రంలోకి తీసుకెళ్లినట్టు మరో పర్యాటకుడు వాపోయాడు. స్నేహాశీష్ కూడా క్రికెటరే. బెంగాల్ తరఫున పదేళ్లు ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడారు.

జార్ఖండ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

లతేహార్: జార్ఖండ్‌లోని లతేహార్ జిల్లాలో భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో నిషేధిత సీపీఐ(మావోయిస్టు) సభ్యుడొకరు మృతి చెందారు. మరొకరిని అరెస్ట్ చేశారు. నెటర్హత్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డౌనా అటవీ ప్రాంతంలో సోమవారం వేకువజామున ఘటన చోటుచేసుకుంది. మృతుడిని మనీశ్ యాదవ్‌గా గుర్తించారు. ఇతడిపై పోలీసులు ప్రకటించిన రూ.5 లక్షల రివార్డు ఉందని పలాము డీఐజీ వైఎస్ రమేశ్ చెప్పారు. జోనల్ కమాండర్‌గా వ్యవహరించే కుందన్ సింగ్ ఖర్వార్‌ను అరెస్ట్ చేశామని తెలిపారు.

కేరళ టీచర్లపై 77 పోక్సో కేసులు

తిరువనంతపురం: చిన్నారులపై లైంగిక వేధింపులు(పోక్సో) కేసులున్న ఉపాధ్యాయులపై కఠినచర్యలు తప్పవని కేరళ విద్యాశాఖ మంత్రి వి.శివన్‌కుట్టి తెలిపారు. సోమవారం ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బందిపై మొత్తం 77 కేసులున్నాయన్నారు. ఇందులో సెకండరీ స్కూల్ టీచర్లపై 65, బోధనేతర సిబ్బందిపై 12 కేసులు ఉన్నట్లు మంత్రి వివరించారు. హయ్యర్ సెకండరీ స్కూళ్లలోనే ఇటువంటి కేసులు ఎక్కువగా నమోదైనట్లు చెప్పారు. మొత్తం 65 మంది టీచర్లకు గాను 45 మందిపై కఠినమైన క్రమశిక్షణ చర్యలు చేపట్టామని, మిగతా వారిపైనా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు 21 మంది ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు వేసినట్లు చెప్పారు.

డీఆర్‌డీవో చీఫ్ పదవీ కాలం మళ్లీ పొడిగింపు

న్యూఢిల్లీ: రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) చీఫ్ సమీర్ కామత్ పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఏడాదిపాటు పొడిగించింది. రక్షణ పరిశోధన అభివృద్ధి విభాగం(డీడీఆర్‌అండ్ డీ) సెక్రటరీ, డీఆర్‌డీవో చైర్మన్‌గా కామత్ 2022 ఆగస్టు 25వ తేదీన నియమితులయ్యారు. గతేడాది మేలో ఆయన పదవీ కాలాన్ని మొదటిసారి ఏడాదిపాటు పొడిగించారు. ఆ గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. తాజాగా రెండోసారి పొడిగింపుతో కామత్ 2026 మే వరకు, లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ పదవుల్లో కొనసాగుతారు. ఈ మేరకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని సిబ్బంది వ్యవహారాల శాఖ సోమవారం తెలిపింది.

భారత్‌పై మన విజయానికి సాక్ష్యమిదే

మరోసారి నవ్వుల పాలైన పాక్ ఆర్మీ చీఫ్ మునీర్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ మునీర్ అసత్య ప్రచార డోసు మరీ శ్రుతిమించి నవ్వులపాలవుతోంది. ఇటీవల ఉద్రిక్తతల సమయంలో భారత్‌పైకి తాము జరిపిన భీకర దాడులకు సాక్ష్యమంటూ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌కు బహుమతిగా అందజేసిన ఫొటోను చూసి అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఆపరేషన్ 'బున్యన్ అల్–మర్సూస్'తో భారత్‌పై సాధించిన విజయాన్ని పురస్కరించుకుని ఇటీవల ప్రభుత్వ పెద్దలు, ఆర్మీ అధికారులతో ఫీల్డ్ మార్షల్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ హై ప్రొఫైల్ సమావేశం ఏర్పాటు చేశారు. రాజకీయ నాయకత్వం గొప్పదనం, సైనిక బలగాల చెక్కు చెదరని నిబద్ధతను చాటేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ మునీర్ ప్రధాని షెహబాజ్‌కు 'భారత్‌పై దాడులకు ప్రతీక'అంటూ ఒక భారీ చిత్రపటాన్ని కానుకగా అందజేశారు. ఈ ఫొటోనే మునీర్ దుష్ప్రచారాన్ని మరోసారి బట్టబయలు చేసింది. వాస్తవానికి ఈ ఫొటో 2019లో చైనా ఫొటోగ్రాఫర్ హువాంగ్ హై తీశారు. అది చైనా రూపకల్పన చేసిన పీహెచ్‌ఎల్–03 రకం బహుళ రాకెట్ లాంచర్ల వ్యవస్థకు సంబంధించిన పాత ఫొటో.

మూతబడ్డ బంగ్లా సెక్రటేరియట్

నూతన నిబంధనలపై ప్రభుత్వోద్యోగుల నిరసన

ఢాకా/న్యూఢిల్లీ: మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పరిపాలన, వాణిజ్య రంగాలకు చెందిన వివిధ విభాగాలు చేపడుతున్న నిరసనలతో బంగ్లాదేశ్ అట్టుడుకుతోంది. యూనస్ సర్కారు తీసుకొచ్చిన నూతన చట్టంపై ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు వీధుల్లోకి వస్తున్నారు. దుష్ప్రవర్తన ఆరోపణలున్న అధికారులు, ఉద్యోగులను మరింత సులువుగా బాధ్యతల నుంచి తొలగించేందుకు ప్రభుత్వానికి అధికారం కల్పించే నూతన చట్టంపై మూడు రోజులుగా ఢాకా సెక్రటేరియట్ నిరసనలతో దద్దరిల్లుతోంది. తాత్కాలిక ప్రభుత్వం తీసుకువచ్చిన పబ్లిక్ సర్వీస్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలంటూ సోమవారం ఉద్యోగులు రాజధాని ఢాకా నడిబొడ్డునున్న సెక్రటేరియట్ భవన సముదాయం ప్రధాన గేటుకు సోమవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో తాళం వేశారు. అరగంట తర్వాత తిరిగి గేటును తెరిచారని స్థానిక మీడియా పేర్కొంది. ఉద్యోగులు విధులను బహిష్కరించడంతో సెక్రటేరియట్ సముదాయంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. నూతన చట్టాన్ని వెనక్కి తీసుకునే వరకు ఆందోళనలను ఆపేది లేదని ఉద్యోగ సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

స్కూలు భవనంపై ఇజ్రాయెల్ దాడులు

36 మంది దుర్మరణం

డెయిర్ అల్‌బలా: గాజాపై ఇజ్రాయెల్ దాడులు నానాటికీ ఉధృతమవుతున్నాయి. సోమవారం నాటి దాడుల్లో 46 మంది మృతి చెందారు. దరాజ్ ప్రాంతంలో పునరావస కేంద్రంగా మారిన పాఠశాల భవనంపై జరిగిన దాడిలోనే 36 మంది ప్రాణాలు కోల్పోయారు. 55 మందికి పైగా గాయపడ్డారు. అందులోని వారంతా నిద్రలో ఉండగానే సోమవారం తెల్లవారుజామున మూడుసార్లు దాడులు జరిగాయి. వాటి ధాటికి అంటుకున్న మంటల్లో చాలామంది నిస్సహాయంగా కాలిపోయారు. ఉగ్రవాదులు పాఠశాల నుంచి పని చేస్తున్నందునే దాన్ని లక్ష్యం చేసుకున్నట్టు ఇజ్రాయెల్ చెప్పింది. పౌరుల మరణాలకు హమాస్ కారణమని ఆరోపించింది. జాబాలియాలో ఓ ఇంటిపై జరిగిన దాడిలో ఐదుగురు మహిళలు, ఇద్దరు పిల్లలు సహా ఒకే కుటుంబానికి చెందిన 15 మంది మరణించారు. మరోవైపు గాజాలో మానవతా సహాయాన్ని అమెరికాకు చెందిన సంస్థకు అప్పగించడానికి ఇజ్రాయెల్ ప్రయత్నాలు తీవ్రతరం చేసింది. సోమవారం నుంచి సహాయం ప్రారంభించింది.

నిద్ర లేమితో గుండెకు చేటు

స్టాక్‌హోం: మానవులతో పాటు సకల జీవులకు నిద్ర ఎంత ముఖ్యమే మనందరికీ తెలిసిందే. శరీరంలో జీవ క్రియలు సజావుగా సాగాలంటే తగినంత నిద్ర అవసరం. నిద్ర లేమి కారణంగా ఇతర అవయవాల తోపాటు గుండె సైతం బలహీనపడుతుంది. వరుసగా మూడు రోజులపాటు చాలినంత నిద్ర లేకపోతే గుండెకు తీవ్ర ముప్పు తప్పదని స్వీడన్‌కు చెందిన ఉప్సలా యూనివర్సిటీ నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. రాత్రిపూట నిద్రను కేవలం నాలుగు గంటలకే పరిమితం చేసుకుంటే గుండెకు రక్తం చేరడంలో మార్పులు వస్తాయని, తద్వారా గుండె జబ్బుల ముప్పు పెరగడం ఖాయమని పరిశోధకులు గుర్తించారు. అంటే వరుసగా మూడు రోజులపాటు కేవలం నాలుగు గంటల చొప్పున నిద్రిస్తే గుండెజబ్బుల ముప్పు తప్పదని స్పష్టమవుతోంది.

మూడు రోజులు సరైన నిద్ర లేకుంటే ముప్పు

స్వీడన్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడి

- మనసులో ఒత్తిడిలో ఉన్నప్పుడు, తగినంత నిద్రలేక శరీరం అలసటగా ఉన్నప్పుడు లేదా వ్యాధులతో పోరాడుతున్నప్పుడు రక్తంలో ఇన్‌ఫ్లమేటరీ ప్రొటీన్స్ ఉత్పత్తి అవుతాయి.
- ఈ ప్రొటీన్లు రక్తంలో ఎక్కువకాలం అధిక మోతాదులో ఉంటే రక్త నాళాలు దెబ్బతింటాయి. తద్వారా గుండె వైఫల్యం, గుండె నొప్పి, కరోనరీ గుండె వ్యాధులు తలెత్తుతాయి. గుండె కొట్టుకోవడం అనేది క్రమం తప్పుతుంది.
- అధ్యయనంలో భాగంగా 16 మంది యువకులను పరిశీలించారు. వారిని కొన్నిరోజులపాటు ప్రయోగశాలలోనే ఉంచి అధ్యయనం నిర్వహించారు.
- అధ్యయనంలో భాగంగా యువకులు మొదటి మూడు రోజులు 8.5 గంటల చొప్పున నిద్రపోయారు. తర్వాత మూడు రోజులు 4.2 గంటల చొప్పున నిద్రించారు. నిద్ర నుంచి లేచిన తర్వాత సైక్లింగ్ చేశారు. సైక్లింగ్‌కు ముందు, తర్వాత వారి రక్తాన్ని పరీక్షించారు. ఈ రక్తం నమూనాల్లో 90 రకాల ప్రొటీన్లను గుర్తించారు. 4.2 గంటల చొప్పున నిద్ర పోయినప్పుడు వారి రక్తంలో గుండు జబ్బులకు కారణమయ్యే ఇన్‌ఫ్లమేటరీ ప్రొటీన్లు పెరిగినట్లు వెల్లడయ్యింది.
- సాధారణంగా నిద్ర నుంచి లేచిన తర్వాత వ్యాయామం చేస్తే రక్తంలో ఆరోగ్యకరమైన ప్రొటీన్లు పెరుగుతాయి. కానీ, మూడు రోజులపాటు తక్కువ సమయం నిద్రించినవారిలో ఇలాంటి ప్రొటీన్లు చాలా బలహీనంగా ఉన్నట్లు తేలింది.
- ఆధునిక కాలంలో పని వేళలు మారిపోయాయి. ప్రతి నలుగురిలో ఒకరు రాత్రి పూట పని చేయాల్సి వస్తోంది. వారికి చాలినంత నిద్ర ఉండడం లేదు. అలాంటివారు త్వరగా గుండె జబ్బుల బారిన పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యువకులు, పూర్తి ఆరోగ్యంతో ఉన్నవారు సైతం తగినంత సమయం నిద్ర పోవాలని సూచిస్తున్నారు.
- గుండెను భద్రంగా కాపాడుకోవాలంటే ప్రతిరోజూ కనీసం ఆరు నుంచి ఏడు గంటలపాటు నిద్రించాలని చెబుతున్నారు.
- సెల్‌ఫోన్లతో రాత్రంతా కాలం గడిపే పిల్లలు, యువతీ యువకులు మరింత అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు.

విదేశీ భార్యల మోజులో పడొద్దు

ఢాకాలోని చైనా దౌత్య కార్యాలయం హెచ్చరిక

ఢాకా: బంగ్లాదేశ్‌కు చెందిన ఆన్‌లైన్ డేటింగ్, పెళ్లిళ్ల బ్యూరోల వలలో పడొద్దని చైనా ఎంబసీ తమ పౌరులను హెచ్చరించింది. తమ దేశంలో యువతుల కొరత ఏర్పడటంతో కొందరు అక్రమ మార్గంలో పెళ్లిళ్లు చేసుకుంటున్నట్లు చైనా ప్రభుత్వం గుర్తించింది. అయితే, వీటి కారణంగా కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు గుర్తించింది. దీనిపై తాజాగా పౌరులకు హెచ్చరికలు జారీ చేసిందని చైనా ప్రభుత్వ 'గ్లోబల్ టైమ్స్'పేర్కొంది. ఆన్‌లైన్‌లోని షార్ట్ వీడియో వేదికలపై వచ్చే మోసపూరిత 'క్రాస్–బోర్డర్ డేటింగ్'వలలో పడొద్దని కోరింది. అనధికార నెట్‌వర్క్‌లు, పెళ్లిళ్ల బ్యూరోల్లో 'ఫారిన్ వైఫ్స్'అంటూ వచ్చే ప్రకటనలను చూసి మోసపోవద్దని పేర్కొంది. ఇలాంటి వాటిపై చైనాలో నిషేధం ఉందని వెల్లడించింది. విదేశీయులను భార్యలుగా తెచ్చుకోవాలన్న ఆలోచన మానుకోవాలంది. బంగ్లాదేశీయులను పెళ్లి చేసుకునేముందు అన్ని వివరాలను కూలంకషంగా తెలుసుకోవాలని సూచించింది. ఒకే సంతానం అనే కఠినమైన విధానాన్ని చైనా ప్రభుత్వం ఎత్తి వేయడం, జంటలు మగ సంతానం వైపు చూపుతున్న మొగ్గుతో జనాభాలో లింగపరమైన అసమతుల్యత తీవ్రరూపం దాల్చింది. చైనాలో ప్రస్తుతం దాదాపు 3 కోట్లు మంది పురుషులు అవివాహితులుగా మిగిలిపోయినట్లు అంచనా. దీంతో, విదేశీ మహిళలను పెళ్లి చేసుకునే ఆలోచనలో ఎక్కువమంది ఉంటున్నారు. పెళ్లి పేరుతో బంగ్లాదేశీ మహిళలను చైనీయులకు విక్రయించిన కేసులు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. ఈ అక్రమ రవాణా దందా వెనుక నేరగాళ్ల ముఠాలు ఉన్నట్లు తేలింది. బెదిరించి, చట్ట విరుద్ధంగా చేసుకునే ఇలాంటి పెళ్లిళ్లతో న్యాయపరమైన సమస్యలు ఏర్పడుతున్నట్లు గుర్తించారు. అక్రమ పెళ్లిళ్ల దందాకు వేదికగా మారిన పెళ్లిళ్ల బ్యూరోలపై చైనా ప్రభుత్వం నిషేధం విధించింది. అక్రమ సంబంధాలు, పెళ్లిళ్ల బాధితులు ఎవరైనా ఉంటే వెంటనే తమను సంప్రదించాలని కూడా చైనా రాయబార కార్యాలయం కోరింది. బంగ్లాదేశ్ మహిళలతో చట్ట విరుద్ధంగా లైంగిక సంబంధాలు పెట్టుకునే వారు మానవ అక్రమ రవాణా కేసులను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. బంగ్లాదేశ్ చట్టాల ప్రకారం మానవ అక్రమ రవాణాకు పాల్పడిన వారికి కనిష్టంగా ఏడేళ్ల జైలు శిక్ష, జరిమానా, గరిష్టంగా జీవిత ఖైదు, రూ.16 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. కొన్ని ముఠాలు బంగ్లాదేశ్ మహిళలను పొరుగునున్న భారత్‌కు అక్రమంగా తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. టిక్‌టాక్ ద్వారా మహిళలను వేశ్యావృత్తిలోకి దించుతున్న 11 మందిని గతంలో ఢాకా పోలీసులు అరెస్ట్ చేశారు.

జ్యోతికి పాక్‌లో ఏకే-47లతో భద్రత

న్యూఢిల్లీ: పాకిస్తాన్ తరఫున గూఢచర్యం చేస్తున్న ఆరోపణలతో అరెస్టయిన జ్యోతి మల్హోత్రా(33) గురించిన మరో వీడియో సోషల్ మీడియాలో వైరలవుతోంది. స్కాట్లాండ్‌కు చెందిన ఓ యూట్యూబర్ పెట్టిన వీడియోలో కనిపిస్తున్న జ్యోతి మల్హోత్రాకు సంబంధించిన ఫొటోలున్నాయి. ట్రావెల్ బ్లాగర్ అయిన జ్యోతి పాక్‌లో పర్యటించిన సమయంలోనే యూట్యూబర్ క్యాలమ్ మిల్ సైతం అక్కడ తిరుగుతూ పలు వీడియోలను షేర్ చేశాడు. వాటిలోని ఓ వీడియోలో లాహోర్‌లోని అనార్కలి బజార్‌లో జ్యోతి వీడియోలు తీస్తూ క్యాలమ్ మిల్‌కు ఎదురుపడింది. వీరిద్దరూ ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. తాను భారత్ నుంచి వచ్చినట్లు తెలిపిన జ్యోతి.. మొదటిసారి పాక్‌కు వచ్చారా అంటూ మిల్‌ను ప్రశ్నించింది. ఇప్పటి వరకు ఐదు సార్లు వచ్చినట్లు అతడు బదులిచ్చాడు. పాకిస్తాన్ ఆతిథ్యం గురించి మిల్ అడగ్గా..చాలా బాగుందని జ్యోతి తెలిపింది. అనంతరం ఆమె వెళ్తుండగా..ఆరుగురు వ్యక్తులు సాధారణ దుస్తుల్లో ఏకే–47 తుపాకులతో జ్యోతికి భద్రత కల్పించడం చూసి ఆశ్చర్యపోయాడు. వారు ధరించిన దుస్తులపై 'నో ఫియర్'అని ఉంది. ఆమెకు భద్రత కల్పించాల్సిన అవసరం ఏముందని మిల్ తన అభిమానులనుద్దేశించి అడిగాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరలవుతోంది. గూఢచర్యం కేసు విచారణలో పాక్ ఇంటెలిజెన్స్ అధికారులతో తనకు సంబంధాలున్నట్లు జ్యోతి మల్హోత్రా అంగీకరించిందని అధికారులు తెలిపారు.

జ్యుడీషియల్ కస్టడీకి జ్యోతి మల్హోత్రా

పాకిస్తాన్ నిఘా సంస్థలకు సున్నితమైన సమాచారం అందజేస్తున్న ఆరోపణలపై అరెస్టయిన జ్యోతి మల్హోత్రాకు హరియాణాలోని కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. అంతకు ముందు నాలుగు రోజులపాటు ఆమె పోలీసుల కస్టడీలో ఉంది. కాగా, జ్యోతి నుంచి స్వాధీనం చేసుకున్న మూడు సెల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్ నుంచి సుమారు 12 టెరాబైట్ల డేటాను రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సమాచారంతోపాటు జ్యోతికి చెందిన నాలుగు బ్యాంకు అకౌంట్ల లావాదేవీల వివరాలను సైతం పరిశీలిస్తున్నామన్నారు.

'సిందూర్'పై అరగంట తర్వాతే

పాక్‌కు సమాచారం: జైశంకర్

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ మొదలైన అరగంట తర్వాతే దాని గురించి పాకిస్తాన్‌కు సమాచారమిచ్చినట్టు విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు. ఆయన సారథ్యంలో పార్లమెంటు సంప్రదింపుల కమిటీ సోమవారం సమావేశమైంది. పహల్గాం దాడికి తెగబడ్డ ఉగ్రమూకల పీచమణచేందుకు చేపట్టిన ఆ ఆపరేషన్‌తో పాటు పాక్ సీమాంతర ఉగ్రవాదం తదితరాలపై చర్చించింది. అన్ని పార్టీల ఎంపీలూ భేటీలో పాల్గొన్నారు. ''సిందూర్ గురించి ఆపరేషన్ మొదలైన అరగంటకు పాక్‌కు సమాచారమిచ్చాం. కేవలం ఉగ్ర శిబిరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నట్టు స్పష్టం చేశాం''అని మంత్రి వెల్లడించారు. సైనిక చర్య గురించి పాక్‌కు జైశంకర్ ముందే సమాచారమిచ్చారని విపక్ష నేత రాహుల్‌గాంధీ కొద్దిరోజులుగా తీవ్ర ఆరోపణలు చేస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఇలా స్పష్టతనివ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాల్పుల విరమణలో అమెరికా పాత్ర ఏ మాత్రమూ లేదని కూడా ఆయన స్పష్టం చేశారు. భారత డీజీఎంఓకు పాక్ డీజీఎంఓ విజ్ఞప్తి చేసిన కారణంగానే ఒప్పందం కుదిరిందని పునరుద్ఘాటించారు. ''పాక్ భారీ దాడికి సిద్ధమవుతోందని అమెరికా విదేశాంగ మంత్రి మనకు సమాచారమిచ్చారు. అదే జరిగితే అంతే స్థాయిలో వాళ్లకు బదులిస్తామని చెప్పాం''అన్నారు. సిందూర్ అనంతర ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్, పాక్ నడుమ అణుయుద్ధం తరహా పరిస్థితి నెలకొందన్న వాదన పూర్తిగా సత్య దూరమని జర్మనీ వార్తాపత్రిక ఫజ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జైశంకర్ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని పాక్ ఓ వ్యాపారంగా బాహాటంగా నిర్వహిస్తోందంటూ నిప్పులు చెరిగారు. పాక్ ప్రభుత్వం, సైన్యం ఉగ్రవాదానికి అన్నివిధాలా వెన్నుదన్నుగా నిలుస్తూ పెంచి పోషిస్తున్నాయని మండిపడ్డారు.

సహజీవనం చెడిపోవడం..

నేరారోపణలకు కారణం కారాదు: సుప్రీం

న్యూఢిల్లీ: పరస్పర అంగీకారంతో సంబంధాలు సాగించే వారు విభేదాలు తలెత్తగానే చట్టాన్ని ఉపయోగించుకుని నేరారోపణలకు దిగడం ఏమాత్రం మంచిది కాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ రకమైన వైఖరి కోర్టులకు భారంగా మారడమే కాదు, బాధితుల ప్రతిష్టను మసకబారుస్తాయని పేర్కొంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారం చేశాడంటూ ఓ వ్యక్తిపై మహారాష్ట్రలో 2023 జూలైలో నమోదైన కేసును ఈ సందర్భంగా కొట్టివేసింది. ఎఫ్‌ఐఆర్‌లోని ఆరోపణలు నిజమని అనుకున్నప్పటికీ.. ఇష్టానికి వ్యతిరేకంగా నేరం జరిగినట్లు కానీ, కేవలం వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చినట్లుగా గానీ ఎటువంటి ఆధారాలు లేవని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్ శర్మల ధర్మాసనం తెలిపింది. సతారాకు చెందిన ఓ వ్యక్తి తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ వేసిన పిటిషన్‌ను బాంబే హైకోర్టు కొట్టివేసింది. దీంతో, అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి 2022 జూన్ నుంచి 2023 జూలై వరకు పలుమార్లు అత్యాచారం చేశాడని మహిళ చేస్తున్న ఆరోపణలను పరిశీలించిన ధర్మాసనం.. ఒక వివాహంతో సంతానం కూడా కలిగిన మహిళ దీర్ఘకాలం మరొకరితో లైంగిక వేధింపులకు గురికావడానికి, శారీరక సంబంధాన్ని కొనసాగించడానికి అవకాశం కూడా లేదని పేర్కొంది.



ఒడ్డుకు కొట్టుకొస్తున్న కంటెయినర్లు

లైబీరియా ఓడ నుంచి చమురు లీకేజీ

- కేరళ తీరం వెంబడి హై అలెర్ట్

కొల్లం: కేరళ తీరానికి సమీపంలో మునిగిన లైబీరియా ఓడ నుంచి చమురు లీకేజీ కొనసాగుతోంది. ఓడలోని కంటెయినర్లు ఒడ్డుకు కొడ్డుకు వస్తున్నాయి. కొల్లం, అలప్పుఝలోని తీరం సమీపానికి తొమ్మిది కంటెయినర్లు అలల తాకిడితో కొట్టుకు వచ్చాయని సోమవారం అధికారులు తెలిపారు. ఆయిల్ లీకవుతున్నందున తీర ప్రాంత జిల్లాల్లో హై అలెర్ట్ ప్రకటించారు. అధికారులతో సమావేశమైన సీఎం విజయన్ అక్కడి పరిస్థితులపై సమీక్ష జరిపారు. అప్రమత్తంగా ఉండాలని తీరప్రాంతాల ప్రజలను, మత్స్యకారులను ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో) హెచ్చరించింది. ఆదివారం వేకువజామున సముద్రంలో మునిగిన ఈ ఓడలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్ ఆయిల్ ఉన్నట్లు భారత తీర రక్షణ దళం(ఐసీజీ) తెలిపింది. కొన్ని కంటెయినర్లలో ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్ ఉందన్న వార్తలు అధికారులను కలవర పెడుతున్నాయి. ఇది లీకై సముద్ర జలాలతో కలిస్తే మండే స్వభావమున్న ఎసిటలీన్ వాయువుగా మారుతుందని చెబుతున్నారు. 'ఓడ నుంచి చమురు లీకవుతోంది. ఇది గంటకు మూడు కిలోమీటర్ల మేర వ్యాపిస్తూ సముద్ర పర్యావరణానికి ప్రమాదకరంగా మారింది. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం మధ్యలో 9 కంటెయినర్లు ఒడ్డుకు చేరాయి. మరో నాలుగు కంటెయినర్లు శక్తికులంగర హార్బర్ సమీపంలో, మూడు చావర సమీపంలో, ఒకటి చెరియాజికల్ వద్ద, మరొకటి త్రిక్కున్నపుఝ వద్ద కనిపించాయి. ఆయిల్ లీకేజీని అరికట్టేందుకు ఐసీజీ ప్రయత్నాలు చేపట్టింది. చమురు తెట్టు ఏర్పడకుండా డార్నియర్ విమానం సాయంతో రసాయనాలను వెదజల్లుతున్నారని సీఎంవో వివరించింది. ఈ ఘటన టయర్–2 కేటగిరీకి చెందినది కావడంతో ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు జాతీయ స్థాయిలో వనరులు, సిబ్బందిని వినియోగిస్తున్నట్లు తెలిపింది. ఈ మొత్తం వ్యవహారాన్ని ఐసీజీ డైరెక్టర్ జనరల్ స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు సీఎంవో పేర్కొంది. మునిగిన ఓడలోని మరికొన్ని కంటెయినర్లు అలప్పుజ, కొల్లం, ఎర్నాకులం, తిరువనంతపురం జిల్లాల దిశగా కొట్టుకు వచ్చే అవకాశముందని తెలిపింది. ఒడ్డుకు చేరిన, సముద్ర జలాల్లో కనిపించే కంటెయినర్లు, ఇతర అసాధారణ వస్తువులను తాకవద్దని, వాటి సమీపంలో గుమికూడవద్దని ప్రజలను, మత్స్యకారులను హెచ్చరించింది.

ఉగ్రవాదంపై స్పందన తీవ్రంగా ఉంటుంది

ప్రపంచ దేశాల నేతలతో ఎంపీలు

సియోల్/కువాయిట్ సిటీ/పారిస్: ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా భారత్ కఠినంగా అణచివేస్తుందని దక్షిణ కొరియా, కువైట్, ఖతార్, కాంగో, స్లొవేనియాల్లో పర్యటిస్తున్న దేశాల నేతలకు ఎంపీల బృందాలు స్పష్టం చేశాయి. ఉగ్రముఠాలను, వారికి ఆర్థికంగా మద్దతుగా పలికేవారిని చట్టం ముందు నిలబెట్టడంలో సాయమందించాల్సిందిగా కోరాయి. ఎంపీ సంజయ్ ఝా సారథ్యంలోని బృందం దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి చో టే యుల్ తదితరులతో భేటీ అయింది. బైజయంత్ పాండా బృందం కువైట్ ఉపప్రధాని షెరిదా అల్ మౌషర్జీ; సుప్రియా సూలే బృందం ఖతార్ షేక్ అబ్దులజీజ్‌తో భేటీ అయ్యాయి. కనిమొళి బృందం స్లొవేనియాలో, శశిథరూర్ బృందం గయానా, శ్రీకాంత్ షిండే బృందం కాంగో, రవిశంకర్ ప్రసాద్ బృందం ఫ్రాన్స్‌లో పర్యటిస్తున్నాయి.

మనసు విప్పి మాట్లాడుకోండి

విడాకులు కోరిన జంటతో సుప్రీం

న్యూఢిల్లీ: మనసు విప్పి చర్చించుకుంటే పరిష్కారం కాని సమస్యంటూ ఉండదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ''మీకు మూడేళ్ల కొడుకున్నాడు. వైవాహిక సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడంలో భేషజాలెందుకు? గతమొక చేదుమాత్ర అనుకుని మర్చిపొండి. భవిష్యత్తు గురించి ఆలోచించండి. ఓ కప్పు చాయ్ తాగుతూ మాట్లాడుకుంటే ఏదైనా సాధ్యమే. ఈ రాత్రి కలిసి భోంచేయండి. విభేదాలను సామరస్యంగా మాట్లాడుకుని పరిష్కరించుకోండి'' అని విడాకుల కోసం తమను ఆశ్రయించిన ఓ జంటకు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ ధర్మాసనం సూచించింది. విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

సుదర్శన తటాకాన్ని నిర్మించినవారెవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మౌర్య సామ్రాజ్యం

మౌర్యయుగం గురించి అధ్యయనం చేయడానికి అనేక ఆధారాలు లభిస్తున్నాయి. వీటి ద్వారా మౌర్యుల పుట్టు పూర్వోత్తరాలు, వారు రాజ్యానికి వచ్చిన విధానం, పాలనా యంత్రాంగం తదితర అంశాలకు చెందిన సమగ్ర సమాచారం లభిస్తోంది. వి.ఎ. స్మిత్ అనే ఆంగ్ల చరిత్రకారుడు 'మౌర్యుల రాకతో చరిత్రకారుడు అంధకారం నుంచి వెలుగులోకి వచ్చాడు' అని వ్యాఖ్యానించాడు.

మౌర్యుల చరిత్రకు ఆధారాలు

పురావస్తు ఆధారాలు

శాసనాధారాలు: పర్షియాను పాలించిన అకిమేనియన్ రాజుల ప్రభావంతో అశోకుడు రాతిపై శాసనాలను వేయడం ప్రారంభించాడు. భారత్‌లో లభిస్తున్న తొలి శాసనాధారాలు అశోకునికి చెందినవే. శాసనాల్లోని అంశాలు, అవి జారీ చేసిన ఉద్దేశాల ఆధారంగా అశోకుడి శాసనాలను ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. బౌద్ధ మతాభిమానిగా అశోకుడు జారీ చేసినవి మొదటి వర్గానికి చెందిన శాసనాలు. రెండో వర్గానికి చెందినవి రాజ శాసనాలు. ఇందులోనే అశోకుని ధమ్మ గురించి ప్రస్తావన ఉంది. భారతదేశ చరిత్రకు సంబంధించి లభిస్తున్న తొలి లిఖితాధారాలు కూడా అశోకుని శిలా శాసనాలే.

ఈ శాసనాల్లో ముఖ్యమైనవి...

- **బృహత్ శిలా శాసనాలు:** అశోకుడు తన 13వ పాలనా సంవత్సరం నుంచి వీటిని జారీ చేయడం మొదలుపెట్టాడు. 13వ శిలా శాసనంలోనే అశోకుడు భేరి ఘోష బదులుగా ధమ్మఘోష గురించి వివరించి, ధమ్మ విజయమే గొప్పదని చాటాడు.
- **చిన్న శిలా శాసనాలు:** ఇందులోని మస్కి శాసనంలోనే తొలిసారిగా అశోక పియదశ్శి అనే పేరు కనిపిస్తుంది. మిగిలిన శాసనాలన్నింటిలో అశోకుడు పియదశ్శి అనే బిరుదును మాత్రమే వాడాడు.
- **ఉత్తర శాసనాలు:** వీటిని తక్షశిల, కాందహార్‌లో వేశారు. ఈ శాసనాల్లో గ్రీకు, అరామిక్ లిపి, భాష వాడారు.
- **7 స్తంభ శాసనాలు:** వీటిలోని 3 శాసనాలను వాటి వాస్తవ ప్రదేశాల నుంచి మార్చారు. తోప్రా, మీరట్ స్తంభ శాసనాలను ఫిరోజ్‌షా తుగ్లక్ ఢిల్లీకి మార్పించాడు. కౌశాంబిలో ఉన్న మరో శాసనాన్ని అక్బర్ అలహాబాద్‌కు మార్పించాడు. ఈ స్తంభ శాసనంపైనే మరోవైపు సముద్రగుప్తుని ప్రయాగ ప్రశస్తి ఉంటుంది. మొఘల్ చక్రవర్తి జహంగీర్ కూడా ఈ స్తంభంపైనే తన శాసనాన్ని జారీ చేశాడు.
- **చిన్న స్తంభ శాసనాలు:** ఇవి అశోకుని బౌద్ధ మతాభిమానాన్ని చాటేవిధంగా ఉన్నాయి. రుమిండీ స్తంభ శాసనం వీటిలో ముఖ్యమైంది. దీన్ని బుద్ధుని జన్మస్థలమైన లుంబినిలో వేశారు. బుద్ధునికి జన్మనిచ్చిన లుంబిని గ్రామాన్ని బలీ, భాగ అనే పన్నుల నుంచి మినహాయింపులు ఇస్తూ ఈ శాసనాన్ని జారీ చేశారు.
- **2 కళింగ శిలా శాసనాలు:** వీటిని ఒడిశాలోని ధౌలి, జౌగడలో వేశారు. అశోకుడు ఇందులో ప్రజలందరూ తన కన్నబిడ్డల లాంటివారనీ, వారి సంక్షేమాన్నే తను కోరుకుంటాననీ తెలిపాడు.
- **భబ్రు శాసనం:** బౌద్ధ మతం పట్ల అశోకుడు తన విశ్వాసాన్ని ప్రకటించిన శాసనం ఇది. దీన్ని వాస్తవంగా బైరాత్ కొండల్లో వేశారు. కానీ, తర్వాతి కాలంలో అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్ దీన్ని కోల్‌కతాకు మార్చాడు.
- **గుహ శాసనాలు:** గయ సమీపంలోని బరాబర కొండలపై అశోకుడు వేయించిన 3 గుహ శాసనాలున్నాయి. ఈ గుహలను అశోకుడు అజీవి కులకు దానమిచ్చినట్లుగా తెలుస్తోంది. దీని పక్కనే నాగార్జునుడి గుహలో అశోకుని మనుమడు దశరథుడు వేయించిన 3 శాసనాలు లభిస్తున్నాయి.
- ఇటీవల గుల్బర్గా జిల్లా సన్నతాయి గ్రామం వద్ద ఒక చిన్న స్తంభ శాసనం బయటపడింది.

1. అశోకుని శాసనాలన్నింటిలో ప్రధానంగా ప్రాకృత భాష, బ్రాహ్మి, ఖరోష్టి లిపిని వాడారు. షాబాజ్‌ఘరి, మాన్సేరా శాసనాలు మాత్రమే ఖరోష్టి లిపిలో ఉన్నాయి. అశోక శాసనాల్లోని బ్రాహ్మి లిపిని ఈస్టిండియా కంపెనీ ఉద్యోగి జేమ్స్ ప్రిన్సెస్ 1837లో తొలిసారిగా కనుగొన్నాడు. దీని ద్వారా పియదశ్శి అనే గొప్ప రాజు గురించి తెలిసినప్పటికీ.. దీపవంశ, మహావంశ గ్రంథాలు; 1915లో దొరికిన మస్కి శాసనాల ద్వారా అది అశోకుని బిరుదు అని రూఢీ అయింది.
2. పాట్నా సమీపంలోని కుమ్రహర్‌లో బయట పడిన చంద్రగుప్తుని రాజభవన అవశేషాలు, మౌర్యుల కాలంలో నిర్మించిన స్తూప, విహారాల అవశేషాలు, ఎన్‌బీపీడబ్ల్యూ వర్గానికి చెందిన మట్టి పాత్రలు, మౌర్యుల కాలంనాటి నాణేలు ఇతర పురావస్తు ఆధారాల్లో ప్రధానమైనవి.

లిఖిత ఆధారాలు

1. **కౌటిల్యుని అర్థశాస్త్రం:** 1924లో మైసూరు లోని ఒక పురాతన గ్రంథాలయంలో ఆర్. శామ శాస్త్రి దీన్ని కనుగొన్నాడు. ఇందులోని వివిధ అంశాలు అశోకుని శాసనాల్లోని అంశాలకు



సారూప్యంగా ఉన్నాయి.

2. **మెగస్తనీస్ ఇండికా:** పర్షియా రాజు సెల్యూకస్ నికేటర్ రాయబారిగా ఐదేళ్లపాటు చంద్రగుప్తుని ఆస్థానంలో ఉండి, మెగస్తనీస్ 'ఇండికా' గ్రంథాన్ని రాశాడు. వాస్తవ రూపంలో ప్రస్తుతం ఇది లభించకపోయినప్పటికీ తర్వాతి గ్రీకు రచయితల వ్యాఖ్యానాల్లో చోటు సంపాదించి మౌర్య యుగానికి సంబంధించిన విలువైన సమాచారాన్ని అందిస్తోంది.
3. **అశోకవదన, దివ్యవదన, దీపవంశ, మహావంశ, మంజుశ్రీ మూలకల్ప అనే బౌద్ధ గ్రంథాలు;** పరిశిష్ట పర్వనే అనే జైన గ్రంథం; హిందూ మతానికి చెందిన పురాణాలు (ముఖ్యంగా మత్స్య, విష్ణు పురాణాలు) తదితర మత గ్రంథాలు మౌర్యులకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తున్నాయి.

మౌర్యుల రాజకీయ చరిత్ర

మౌర్య చక్రవర్తులు క్రీ.పూ. 321 నుంచి 184 వరకు 137 ఏళ్ల పాటు భారతదేశాన్ని పాలించారు. ఇందులో మొదటి ముగ్గురు రాజులే 90 ఏళ్లు పాలించగా, తర్వాతి రాజులు కేవలం 47 ఏళ్లే పాలించారు.

- **చంద్రగుప్త మౌర్యుడు:** ఇతని జన్మ వృత్తాంతం గురించి వివిధ మత గ్రంథాలు వేర్వేరు రకాలుగా వ్యాఖ్యానిస్తున్నాయి. బౌద్ధ గ్రంథాలు ఇతడు పిప్పలివనమును పాలించే మోరియా అనే క్షత్రియ తెగకు చెందిన వాడని పేర్కొంటున్నాయి. పరిశిష్ట పర్వన్ మాత్రం ఒక గ్రామపెద్ద కుమార్తెకు జన్మించినవాడిగా తెలుపుతున్నాయి.

విశాఖదత్తుని 'ముద్రారాక్షసం' గ్రంథంలో ఇతడు వ్రిశాలుడు లేదా కులహీనుడని ఉంది. బ్రాహ్మణ గ్రంథాల్లో ఇతడు శూద్రస్త్రీకి జన్మించినవాడని ఉంది.

నందుల అపకీర్తి, ప్రజల్లో వారిపాలన పట్ల ఉన్న వ్యతిరేకతను ఆసరాగా చేసుకొని చాణక్యుని సహాయంతో ఇతడు నంద వంశాన్ని అంతం చేసి మౌర్య పాలనను స్థాపించాడు. నందులతో ఇతడికి జరిగిన యుద్ధం గురించి బౌద్ధమత గ్రంథం మిళిందపన్హ వివరంగా తెలియజేస్తోంది. ఈ యుద్ధంలో బద్ధపాలుడు నంద సైన్యానికి నాయకత్వం వహించాడు. క్రీ.పూ.304లో చంద్రగుప్తునికి సెల్యూకస్ నికేటర్ అనే గ్రీకురాజుకు మధ్య యుద్ధం జరిగింది. ఇందులో చంద్రగుప్తుడు విజయం సాధించి, సంధిలో భాగంలో సెల్యూకస్‌కు 500 ఏనుగులు ఇచ్చి అతడి కుటుంబంతో వైవాహిక సంబంధాన్ని కలుపుకున్నట్లు తెలుస్తోంది. గ్రీకు రచయిత ప్లూటార్క్ ఇతడు 6 లక్షల సైన్యంతో భారత దేశాన్నంతటినీ జయించాడని తెలిపాడు. గ్రీకు రచయితలు ఇతడిని సాండ్రొకొట్టస్, ఆండ్రొకొట్టస్ అని పిలిచారు.

రుద్రదమనుడి జునాఘడ్ శాసనం ప్రకారం సౌరాష్ట్రలో చంద్రగుప్తుని రాజప్రతినిధిగా ఉన్న పుష్యగుప్తుడు ప్రసిద్ధి చెందిన సుదర్శన తటాకాన్ని ఈ కాలంలోనే తవ్వించాడు.

పరిశిష్ట పర్వనే గ్రంథం ప్రకారం చంద్రగుప్తుడు తన చివరి కాలంలో సింహాసనాన్ని అతడి కుమారుడు బిందుసారునికి అప్పగించి జైనమతాన్ని స్వీకరించాడు. భద్రబాహు అనే జైన సన్యాసి ఆధ్వర్యంలో శ్రావణబెళగొళకు వెళ్లి, అక్కడ చంద్రగిరి పర్వతంపై ఒక నిజమైన జైన సన్యాసిలా సల్లేఖన వ్రతం ఆచరించి ప్రాణత్యాగం చేశాడని ఈ గ్రంథంలో ఉంది.

బిందుసారుడు: గ్రీకు రచయితలు ఇతడిని అమిత్రోఖేటస్ అని, సంస్కృత గ్రంథాలు అమిత్రఘాత అని పేర్కొంటున్నాయి. ఇతడు గ్రీకు రాజ్యాలతో సంబంధాలను కొనసాగించాడు. ఇతని కాలంలో మెగస్తనీస్ స్థానంలో డైమాకస్ అనే గ్రీకు రాయబారి మౌర్యుల ఆస్థానంలో ఉన్నాడు. ఇతడి కాలంలోనే తక్షశిలలో ప్రజలు తిరుగుబాటు చేస్తే ఉజ్జయిని రాజప్రతినిధిగా ఉన్న అశోకుడు దాన్ని అణచివేసినట్లు దివ్యవదన అనే బౌద్ధ గ్రంథం తెలియజేస్తోంది. ఇతని ఆస్థానంలో పింగళివత్స అనే అజీవిక జ్యోతిష్యుడు ఉండేవాడు.

అశోకుడు: ఇతడిని కామాశోక, చండాశోక, ధమ్మాశోకగా బౌద్ధ గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఇతడు తన 99 మంది సోదరులను వధించి రాజ్యానికి వచ్చినట్లుగా ఒక అభిప్రాయం ఉంది. ఇతని పాలనా కాలంలోనే క్రీ.పూ. 250లో పాటలీపుత్రంలో మూడో బౌద్ధసంగీతిని నిర్వహించారు. క్రీ.పూ. 261లో కళింగయుద్ధం తర్వాత అశోకుడు సామ్రాజ్యవాదానికి స్వస్తి పలికాడు. తర్వాత రెండున్నరేళ్లకు బౌద్ధ మతాన్ని స్వీకరించాడు. నీగ్రోథుడు అనే బాలసన్యాసి అశోకునికి బౌద్ధమత దీక్ష నిచ్చినట్లుగా మహావంశ గ్రంథం వివరిస్తోంది. అశోకుని కుమార్తెలు, కుమారులు బౌద్ధాన్ని ప్రచారం చేయడానికి శ్రీలంక, నేపాల్‌కు వెళ్లారు. అలహాబాద్ రాణి శాసనంలో ఇతని రాణి కారువాకి బౌద్ధ సంఘానికి చేసిన దానధర్మాల గురించి ప్రస్తావించారు. రాజతరంగిణి గ్రంథం కాశ్మీర్‌ను నిర్మించింది అశోకుడే అని తెలియజేస్తోంది. అశోకునికి ఎంతో ఇష్టమైన బోధి వృక్షానికి హాని తలపెట్టే రాణిగా తిష్య రక్షితను బౌద్ధ గ్రంథాలు పేర్కొంటున్నాయి. చైనా యాత్రికుడు పాహియాన్ కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించాడు.

రాజ్యానికి వచ్చిన పదేళ్ల తర్వాత అశోకుడు తన ధమ్మ సిద్ధాంతాన్ని ప్రారంభించాడు. ఇది రాజకీయ, మత సిద్ధాంతాలకు అతీతమైంది. ప్రతి ఒక్కరూ తమ మత సాంప్రదాయాలకు అతీతంగా పాటింపదగింది. నైతిక ప్రవర్తనలకు సంబంధించిన నియమావళితో కూడిన ఈ సిద్ధాంతాన్ని అశోకుడు తన రాజ్యమంతా ప్రచారం చేశాడు. శిలా శాసనాలను వేయించడం ద్వారా, ధర్మ మహామాత్రలు అనే ఉద్యోగుల నియామకం ద్వారా అశోకుడు తన ధమ్మ ప్రచారానికి కృషి చేశాడు. ఇందులో భాగంగా స్వయంగా ధమ్మయాత్రలు చేపట్టాడు.

మౌర్య వంశానికి చెందిన చివరి రాజులు: అశోకుడి తర్వాత రాజ్యం రెండుగా విభజితమైంది. కుణాలుడు, దశరథుడు వీటిని పాలించారు. తర్వాత రెండు భాగాలను ఏకంచేసి సంప్రతి పాలించాడు. అతని తర్వాత శాలిసుక, దేవ వర్మన్, శతధన్వన్, బృహద్రథ పాలించారు. చివరివాడైన బృహద్రథుడిని అతని సేనాని పుష్యమిత్రశుంగుడు వధించి శుంగ వంశాన్ని స్థాపించాడు.

మౌర్యుల పరిపాలన: భారతదేశంలోనే తొలిసారిగా పూర్తిగా కేంద్రీకృతమైన పాలనా వ్యవస్థను మౌర్యులు ప్రవేశపెట్టారు. ఈ పాలనా యంత్రాంగానికి అధిపతి చక్రవర్తి. అర్థశాస్త్రంలో చెప్పిన సప్తాంగాల్లో ముఖ్యమైనవాడు రాజు. మౌర్యులు అతి విస్తారమైన ఉద్యోగ బృందాన్ని ఏర్పరిచారు. అర్థశాస్త్రంలో 32 శాఖలు, వాటి అధిపతుల పేర్ల గురించి ప్రస్తావించారు. ఈ శాఖలు, వాటి అధ్యక్షుల్లో ముఖ్యమైనవారు.. అకారాధ్యక్ష (గనులు), సీతా ధ్యక్ష (వ్యవసాయం), లక్షణాధ్యక్ష (నాణేల ముద్రణ), అక్షపటలాధ్యక్ష (గణాంక శాఖ), పౌన్యాధ్యక్ష (వ్యాపార వాణిజ్య శాఖ), పౌత్వాధ్యక్ష (తూని కలు కొలతల శాఖ).

అశోకుడు తన 14వ పాలనా సంవత్సరంలో ధర్మ మహామాత్రులనే కొత్త ఉద్యోగ బృందాన్ని ప్రవేశపెట్టాడు. వీరు ప్రజల్లో నైతిక ధర్మాన్ని పెంచేందుకు కృషి చేశారు. పన్ను వసూలు అధికారిని సంహర్త అనీ, కోశాధికారిని సన్నిధాత అని పిలిచారు.

పాలనా విభాగాలు: మౌర్య సామ్రాజ్యాన్ని నాలుగు రాష్ట్రాలుగా విభజించారు. అవి ఉత్తరా పథం, దక్షిణాపథం, అవంతీ పథం, ప్రాచ్య పథం. ఆర్య పుత్రులు లేదా రాకుమారులు వీటికి పాలకులుగా (రాజప్రతినిధులుగా) ఉండేవారు. రాష్ట్రాలను తిరిగి ఆహారాలుగా విభజించారు. రాజుక, ప్రాదేశికులు వీటికి అధిపతులు. పాలనలో చివరి విభాగం గ్రామం. దీనికి అధిపతి గ్రామణి.

పట్టణ పాలనను 30 మంది సభ్యులతో కూడిన 6 కమిటీలు నిర్వహించేవని మెగస్తనీస్ ఇండికాలో తెలిపాడు. ఇతర అధికారుల్లో ప్రాదేశిక, యుక్త, గోప, స్థానిక లాంటివారి ప్రస్తావన ఉంది.

- **న్యాయ పాలన:** దివ్య పరీక్షల ఆధారంగా జరిగే న్యాయపాలనలో అత్యున్నత న్యాయాధిపతి చక్రవర్తి. ధర్మస్థయ (సివిల్), కంటకశోధన (క్రిమినల్) అనే రెండు రకాల న్యాయస్థానాలు ఉండేవి.
- **సైనిక పాలన:** దీని గురించి సమగ్ర సమాచారాన్ని మెగస్తనీస్ 'ఇండికా' అందిస్తోంది. సైన్యంలో ప్రధానంగా 6 విభాగాలు (కాల్బలం, అశ్విక దళం, గజ దళం, రథబలం, నౌకాదళం, రవాణాదళం) ఉండేవి. వీటి నిర్వహణకు ఐదుగురు సభ్యులతో కూడిన 6 కమిటీలు ఉండేవి. అశోకుడు పతివేదకులు అనే గూఢచారులకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లుగా అతని శాసనాల ద్వారా తెలుస్తోంది.

మౌర్య సామ్రాజ్య పతనం: అశోకుని తర్వాత బలహీనపడుతూ వచ్చిన మౌర్య సామ్రాజ్యం ఆ తర్వాత 47 ఏళ్లకే అంతమైంది. అశోకుని తర్వాత సామ్రాజ్యం రెండు విభాగాలుగా విభజన చెందడం, బలహీన చక్రవర్తులు రాజ్యానికి రావడం, అశోకుని శాంతికాముక విధానాల వల్ల సైన్యం బలహీనపడటం, మితిమీరిన కేంద్రీకృత పాలనా వ్యవస్థ దీనికి కారణాలుగా చరిత్రకారులు అభిప్రాయపడ్డారు.

బహువ్రీహి సమాసానికి ఉదాహరణలు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు (ఎస్‌జీటీ, ఎస్ఏ) - మెథడ్స్

ఏడో ప్రకరణం - సమాసాలు

డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్స్, లాంగ్వేజీ పండిట్స్ అభ్యర్థులకు వ్యాకరణంలో సమాసాలు ముఖ్యమైనవి. గత డీఎస్సీ 2012లో, టెట్‌లో సమాసాలపై ఆరు ప్రశ్నలు అడిగారు. ఈ డీఎస్సీలో కూడా వీటికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. వీటిపై సమగ్రమైన అవగాహన కలిగే విధంగా సమాసం అంటే ఏమిటి? వీటిల్లో రకాలు మొదలైన అంశాలను పరిశీలిద్దాం.

సమాసం అంటే: 'సమర్థంబులగు పదంబు' లేదా 'పదం బగుట' సమాసమని చిన్నయసూరి నిర్వచించాడు. సమ ప్రాధాన్యం ఉన్న రెండు వేర్వేరు పదాలు కలిసి కొత్త అర్థాన్ని సూచిస్తే దాన్ని సమాసం అంటారు. ఉదా: 'పని, మనిషి' అనే రెండు పదాలు కలిసి 'పనిమనిషి' ప్రత్యేకార్థాన్ని సూచిస్తున్నందున ఇది సమాస పదం. వేర్వేరుగా ఉన్న పదాల అర్థాలకు ఒకే అర్థం ఏర్పడటాన్ని 'సామర్థ్యం' అంటారు. దీన్నే అర్థ సమ్మేళనమని కూడా అంటారు. రెండు పదాల అన్వయాన్ని తెలియజేసేది విగ్రహవాక్యం. పదాల సంబంధం విభక్తి ప్రత్యయాల మీద ఆధారపడి ఉంటుంది. సమాస సంబంధాలను వివరించి చెప్పేవి 'విగ్రహ వాక్యాలు'.

ఉదా: 'రామబాణము' సమాసానికి 'రాముని యొక్క బాణము' విగ్రహవాక్యం.

సమాసాలు - భేదాలు: తెలుగులో శబ్ద స్వరూపాన్ని బట్టి సమాసాలు మూడు విధాలు. అవి..

1) సాంస్కృతికం 2) ఆచ్ఛికం 3) మిశ్రమం

1. **సాంస్కృతికం: ఇది రెండు విధాలు. అవి..**

i) సిద్ధ సమాసం ii) సాధ్య సమాసం

i. **సిద్ధ సమాసం:** కేవలం సంస్కృత శబ్దాలతో ఏర్పడే సమాసం.. సిద్ధ సమాసం.

ఉదా: 'రాజాజ్ఞ' రాజః+ ఆజ్ఞః = రాజాజ్ఞః రెండు సంస్కృత శబ్దాలతో ఏర్పడిన సమాసం 'రాజాజ్ఞ'.

ii. **సాధ్య సమాసం:** తత్సమ పదాలతో ఏర్పడే సమాసం సాధ్య సమాసం.

ఉదా: రాజు + ఆజ్ఞ = రాజునాజ్ఞ, రాజు (తత్సమపదం) = ఆజ్ఞ (తత్సమం). ఈ పదాలు కలిసి 'రాజునాజ్ఞ' పదం ఏర్పడింది. ఇది సాధ్య సమాసం

2. **ఆచ్ఛిక సమాసం:** కేవలం తెలుగు పదాలతో ఏర్పడే సమాసాన్ని ఆచ్ఛిక సమాసం అంటారు. ఆచ్ఛికం అంటే అచ్చ తెలుగు అని అర్థం. **ఉదా:** జేని ఆనతి=జేనియానతి. జేని, ఆనతి రెండూ తెలుగు పదాలు కాబట్టి ఇది ఆచ్ఛిక సమాసం.

సిరి చెలువుడు – సిరి, చెలువుడు రెండూ అచ్చ తెలుగు పదాలు కాబట్టి ఇది ఆచ్ఛిక సమాసం.

3. **మిశ్ర సమాసం:** తత్సమ శబ్దాలు, ఆచ్ఛిక శబ్దాల కలయికతో ఏర్పడిన సమాసాన్ని 'మిశ్ర సమాసం' అంటారు. **ఉదా:** రాజుముదల – సమాసంలో 'రాజు' తత్సమ శబ్దం. 'ముదల' ఆచ్ఛిక పదం. ఈ రెండింటి కలయికతో ఏర్పడిన 'రాజుముదల' మిశ్ర సమాసం.

'సిరివల్లభుడు'-సమాస పదంలో 'సిరి' ఆచ్ఛిక పదం. 'వల్లభుడు' తత్సమ శబ్దం. ఈ రెండింటి కలయికతో ఏర్పడిన 'సిరివల్లభుడు' మిశ్ర సమాస పదం.

పద ప్రాధాన్యాన్ని అనుసరించి సమాసాలు ప్రధానంగా నాలుగు రకాలు. అవి..

1. అవ్యయీభావ సమాసం
2. తత్పురుష సమాసం
3. ద్వంద్వ సమాసం
4. బహువ్రీహి సమాసం

1. **అవ్యయీభావ సమాసం:** అవ్యయం పూర్వ పదంగా గల సమాసం అవ్యయీభావ సమాసం.

అవ్యయాలు: లింగవచన, విభక్తి రహితాలు అవ్యయాలు. స్వర్, అంతర్, పునర్, ప్రాతర్, మిథ్యా, పురా, సర్వదా, ఆద్య, యధా, బహుశః, నిర్ మొదలైనవి అవ్యయాలు. అవ్యయాలు పూర్వపదంగా ఉన్న సమాసాలు అవ్యయీభావ సమాసాలు. ఉదా:

సమాస పదం	విగ్రహవాక్యం
యథాశక్తి	శక్తిని అనుసరించి
ప్రతిదినం	దినము, దినము
నిశ్చలం	చలనం లేనిది
నిరుపయోగం	ఉపయోగం లేనిది
ఆపూర్ణత	మిక్కిలి పూర్ణమైంది

2. **తత్పురుష సమాసం:** ఉత్తర పద ప్రాధాన్యం ఉన్న సమాసం తత్పురుష. ఇది రెండు విధాలు. అవి..

ఎ) వ్యధికరణం బి) సమానాధికరణం

ఎ) వ్యధికరణం: (వి+ అధికరణం) = వ్యధికరణం. అధికరణం అంటే ఆధారం అని అర్థం. 'వి' అనే ఉపసర్గ భిన్న లేదా విరుద్ధ అనే అర్థంలో చేరింది. పూర్వ పదంలో విభక్తికి పరపదంలో ఉన్న విభక్తి భిన్నంగా ఉంటుంది. అందుకే దీనికి 'వ్యధికరణం' అని పేరు. ఇందులో విభక్తి ప్రత్యయాలు ఆధారంగా సమాసాన్ని నిర్ణయించవచ్చు. విభక్తులతోపాటు వ్యతిరేకార్థంలో విగ్రహ వాక్యాన్ని సూచించే నఞ్ తత్పురుషతో కలిపి మొత్తం ఎనిమిది విధాల తత్పురుష సమాసాలు వ్యధికరణంలో ఉంటాయి. పదాల మధ్య అన్వయాన్ని, సంబంధాన్ని తెలియజేసేవి విభక్తులు.

i. **ప్రథమా తత్పురుష సమాసం:** సమాసంలో పూర్వపదం ప్రథమా విభక్తిలో (డు, ము, వు, లు) ఉండి, ఉత్తరపద ప్రాధాన్యం కలిగి ఉంటుంది. ఇందులో పూర్వ, ఉత్తర పదాలు రెండూ ప్రథమా విభక్తిలో ఉంటాయి. ప్రథమా తత్పురుష సమాసానికి ఏకదేశ సమాసం అనే పేరుంది. ఉదా:

సమాస పదం	విగ్రహవాక్యం
మధ్యాహ్నం	అహ్నము మధ్య భాగం
అర్ధ రాజ్యం	రాజ్యం అర్ధ భాగం
నడిరేయి	రేయి నడిమి భాగం

ii. **ద్వితీయా తత్పురుష సమాసం:** విగ్రహ వాక్యాల్లో పూర్వ పదం తర్వాత ద్వితీయా విభక్తి ప్రత్యయాలు నిన్, నున్, లన్, కూర్చి, గురించి ప్రత్యయాలు ఉంటాయి. ఉదా:

- ప్రాణిబాధకంబు – ప్రాణులను బాధించేది ('ను' – ద్వితీయ)
- బ్రహ్మవిత్తములు – బ్రహ్మను గురించి తెలిసిన వారు (గూర్చి – ద్వితీయ)
- వేదవిదులు – వేదాలను గురించి తెలిసిన వారు (గూర్చి – ద్వితీయ)
- దుఃఖాతీతుడు – దుఃఖాన్ని అతిక్రమించు వాడు ('ను' ద్వితీయ)

iii. **తృతీయా తత్పురుష సమాసం:** సమాసంలో పూర్వ పదానికి తృతీయావిభక్తి ప్రత్యయాలు చేతన్, చేన్, తోడన్, తోన్ వంటివి చేరితే అది తృతీయా తత్పురుష సమాసం. ఉదా:

- శోక సంతాపిత – శోకం చేత సంతాపిత (చేత – తృతీయా విభక్తి)
- గుణహీనుడు – గుణం చేత హీనుడు (చేత – తృతీయా విభక్తి)
- ఖడ్గ యుద్ధం = ఖడ్గంతో యుద్ధం (తో – తృతీయా విభక్తి)

iv. **చతుర్థీ తత్పురుష సమాసం:** సమాసంలో పూర్వ పదానికి చతుర్థీ విభక్తి ప్రత్యయాలైన 'కొరకు, కై' చేరితే అది చతుర్థీ తత్పురుష సమాసం. ఉదా:

- యూపదారువు-యూపము కొరకు దారువు (కొరకు)
- సభాభవనం – సభ కొరకు భవనం (కొరకు)
- **పంచమీ తత్పురుష సమాసం:** సమాసంలో పూర్వ పదానికి వలనన్, కంటెన్, పట్టి ప్రత్యయాలు చేరితే అది పంచమీ తత్పురుష సమాసం.ఉదా:
- దహనక్లేశం – దహనం వలన క్లేశం (వలన – పంచమీ)
- అగ్నిభయం – అగ్ని వల్ల భయం (వలన – పంచమీ)
- నిపాత దాహం = నిపాతం వల్ల దాహం (వల్ల – పంచమీ)
- జ్ఞానముక్తుడు – జ్ఞానం వలన ముక్తుడు (వలన – పంచమీ)

vi. **షష్ఠీ తత్పురుష సమాసం:** సమాసంలో పూర్వ పదానికి షష్ఠీ విభక్తి ప్రత్యయాలు (కిన్, కున్, యొక్క, లోన్, లోపల) చేరితే అది షష్ఠీ తత్పురుష సమాసం. ఉదా:

- శుక్రాజ్ఞ – శుక్రుని యొక్క ఆజ్ఞ (యొక్క)
- ధరణీపతి – ధరణికి పతి (కి–షష్ఠీ)
- అశ్వరాజము – అశ్వములలో రాజము ('లో') షష్ఠీ)

vii. **సప్తమీ తత్పురుష సమాసం:** సమాసంలో పూర్వ పదానికి సప్తమీ విభక్తి ప్రత్యయాలు (అందున్, నన్) చేరితే అది సప్తమీ తత్పురుష సమాసం. **ఉదా:**

- అరణ్య భూములు – అరణ్య మందలి భూములు (అందలి – సప్తమీ)
- శాస్త్ర కోవిదుడు – శాస్త్రమందు కోవిదుడు (అందు – సప్తమీ)
- పురుషోత్తముడు – పురుషలందు ఉత్తముడు (అందు – సప్తమీ)

viii. **నఞ్ తత్పురుష సమాసం:** సమాసంలో 'న' అనే అవ్యయం పూర్వపదంగా ఉంటుంది. విగ్రహవాక్యం వ్యతిరేకార్థంలో ఉంటుంది.

- అసత్యము – సత్యము కానిది
- అధర్మము – ధర్మం కానిది
- అనుచితము – ఉచితము కానిది
- అసాధ్యము – సాధ్యం కానిది

బి) **సమానాధికరణం:** సమానమైన అధికరణలు కలది సమానాధికరణం. ఇది తత్పురుషలో ఒక భేదం. ఇది రెండు రకాలు. అవి..

1) కర్మధారయం 2) ద్విగువు

1. **కర్మధారయ సమాసం:** విశేషణ విశేష్యాలతో కూడింది కర్మధారయ సమాసం. ఇందులో విశేష్యం (నామవాచకం), విశేషణం ఉంటాయి. ఉపమాన, ఉపమేయాలు కూడా ఉంటాయి. ఇందులో ఏడు రకాలున్నాయి. అవి..

విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం
విశేషణ ఉత్తరపద కర్మధారయం
విశేషణ ఉభయ పద కర్మధారయం
ఉపమాన పూర్వ పద కర్మధారయం
ఉపమాన ఉత్తరపద కర్మధారయం
సంభావన పూర్వపద కర్మధారయం
అవధారణ పూర్వపద కర్మధారయం

ఎ. **విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం:** విశేషణం పూర్వపదంగా, విశేష్యం (నామవాచకం) ఉత్తర పదంగా ఉండే సమాసం విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం. ఉదా:

- ఘోరవనము – ఘోరమైన వనము -(విశేషణం – పూర్వపదం)
- సచ్ఛాత్రులు – మంచివారైన ఛాత్రులు – (విశేషణం – పూర్వపదం)
- నల్లకలువ – నల్లదైన కలువ (విశేషణం – పూర్వపదం)

బి. **విశేషణ ఉత్తర పద కర్మధారయ సమాసం:** విశేషణం ఉత్తరపదంగా, విశేష్యం పూర్వపదంగా ఉన్న సమాసం విశేషణ ఉత్తర పద కర్మధారయం.ఉదా:

- కపోతవృద్ధము – వృద్ధమైన కపోతము (విశేషణం– ఉత్తరపదం)
- పురుషోత్తముడు – ఉత్తముడైన పురుషుడు (విశేషణం–ఉత్తరపదం)
- పండిత శ్రేష్ఠుడు – శ్రేష్ఠుడైన పండితుడు (విశేషణం – ఉత్తర పదం)

సి. **విశేషణ ఉభయ పద కర్మధారయ సమాసం:** ఇందులో పూర్వ, పర పదాలు రెండూ విశేషణాలుగా ఉంటాయి. కాబట్టి ఇది విశేషణ ఉభయ పద కర్మధారయ సమాసం. ఉదా:

- ధీరోదాత్తుడు – ధీరుడు, ఉదాత్తుడు.
- శీతోష్ణము – శీతలమైనది, ఉష్ణమైనది.
- మృదుమధురం – మృదువైనది, మధురమైనది

(ఉదాహరణల్లో రెండు పదాలూ విశేషణాలే)

డి. **ఉపమాన పూర్వపద కర్మధారయ సమాసం:** ఉపమానం పూర్వపదంగా, ఉపమేయం ఉత్తర పదంగా ఉండే సమాసం ఉపమాన పూర్వపద కర్మధారయం. ఉదా:

- చిగురుకేలు– చిగురు వంటి కేలు (ఉపమానం పూర్వపదం), కేలు (ఉపమేయం). విగ్రహవాక్యాల్లో వంటి, లాంటి, వలె, పోలె వంటి ఉపమావాచకాలు వస్తాయి.
- జుంటిమోవి – జున్ను వంటి మోవి (పెదవి) (జుంటి, జున్ను – ఉపమానం పూర్వపదం)
- 'తేనే మాట' – తేనె వంటి మాట (ఉపమానం – పూర్వపదం)

ఇ. **ఉపమాన ఉత్తర పద కర్మధారయ సమాసం:** ఉపమానం ఉత్తర పదంగా, ఉపమేయం పూర్వ పదంగా ఉండే సమాసం 'ఉపమాన ఉత్తరపద కర్మధారయ సమాసం'. ఉదా:

- పురుష సింహము – సింహము వంటి పురుషుడు (ఉపమానం– ఉత్తరపదం)
- తనూలత – లత వంటి తనువు (ఉపమానం –ఉత్తరపదం)

ఈ. **సంభావన పూర్వపద కర్మధారయ సమాసం**

ఈ సమాసంలో మొదటి పదం సంజ్ఞా వాచకంగా, రెండో పదం జాతి నామవాచకంగా ఉంటుంది. సంభావన అంటే సంజ్ఞ లేదా ఊహ అని అర్థం. ఉదా:

- **గుంటూరు నగరం** – గుంటూరు అనే పేరు గల నగరం (**పూర్వపదం– సంజ్ఞావాచకం**)
- పారిజాత వృక్షం – పారిజాతము అనే పేరు గల వృక్షం–(**మొదటి పదం– సంజ్ఞావాచకం**)

మానస సరోవరం – మానసమను పేరు గల సరోవరం (**మొదటి పదం– సంజ్ఞావాచకం**)

ఎఫ్. **అవధారణ పూర్వపద కర్మధారయ సమాసం లేదా రూపక సమాసం:** అవధారణ అంటే నిర్ధారించడమని అర్థం. నిర్ధారించే పదం పూర్వపదంగా ఉండి, ఉత్తర పదంగా నామవాచకం ఉంటే దాన్ని అవధారణ పూర్వపద కర్మధారయం అంటారు. సంస్కృతంలో 'పివ' అవధారణార్థం. తెలుగులో 'అనెడి' అనేది అవధారణార్థం. విగ్రహ వాక్యంలో అనెడి వస్తుంది. ఉపమేయ, ఉపమానాలకు అభేదం చెప్పడం రూపకం. ఇందులో పూర్వ ఉత్తర పదాలకు అభేదం చెప్పడం ఉన్నందునే ఇది రూపక సమాసంగా రూఢమైంది. ఉదా:

- సంసార సాగరం – సంసారమనెడి సాగరం – ('సంసారానికి సాగరానికి అభేదం చెప్పినందున ఇది రూపక సమాసం')
- కోపాగ్ని – కోపమనెడి అగ్ని (కోపానికి, అగ్నికి అభేదం చెప్పినందున ఇది రూపక సమాసం)
- లతాలలనలు – లతలనెడి లలనలు (లతలకు, లలనలకు అభేదం చెప్పినందున ఇది రూపక సమాసం).

2. **ద్విగు సమాసం:** సమానాధికరణంలో (కర్మధారయం) ఒక భేదం ద్విగువు సంఖ్యా వాచకం పూర్వపదంగా, నామవాచకం ఉత్తర పదంగా ఉంటే దాన్ని ద్విగు సమాసం అంటారు. ఉదా:

- నలుదిక్కులు – నాలుగు సంఖ్య గల దిక్కులు (సంఖ్యా పదం– పూర్వపదం)
- త్రిజగములు – మూడైన జగములు (సంఖ్యాపదం– పూర్వపదం)
- సహస్రాక్షులు – సహస్ర సంఖ్య గల అక్షులు – (సంఖ్యాపదం– పూర్వపదం)

3. **ద్వంద్వ సమాసం:** ఉభయ పదార్థ ప్రాధాన్యం కలది ద్వంద్వం. పూర్వ, ఉత్తర పదాలకు రెండింటికీ సమ ప్రాధాన్యం ఉంటుంది. ఉదా:

- తల్లిదండ్రులు – తల్లియును, తండ్రియును
- లక్ష్మీ సరస్వతులు – లక్ష్మియును, సరస్వతియును
- అన్నదమ్ములు – అన్నయును, తమ్ముడును

పై పదాల్లో పదాలు రెండింటికి సమ ప్రాధాన్యం ఉన్నందున ఇవి ద్వంద్వ సమాసాలు.

బహు పద ద్వంద్వ సమాసం: రెండు కంటే ఎక్కువ పదాలు సమ ప్రాధాన్యం కలవి ఉంటే అది బహుపద ద్వంద్వ సమాసం. ఉదా:

- సీతారామలక్ష్మణులు– సీతయును, రాముడును, లక్ష్మణుడును.

4. **బహువ్రీహి సమాసం:** అన్యపదార్థ ప్రాధాన్యం కలది బహువ్రీహి. సమాసంలో ఉన్న రెండు పదాల అర్థం కాకుండా వాటి కలయిక వల్ల వేరొక అర్థం ఉంటే దాన్ని బహువ్రీహి సమాసం అంటారు. విగ్రహ వాక్యంలో 'కలది, కలవాడు' పదాలు వస్తాయి. ఉదా:

- **కమలనాభుడు** – కమలము నాభియందు కలవాడు (విష్ణువు)
- **ముక్కంటి** – మూడు కన్నులు కలవాడు (శివుడు)
- **పూబోడి** – 'పూవు వంటి శరీరం కలది' (స్త్రీ)
- **మీనాక్షి** – మీనముల వంటి అక్షములు గలది (స్త్రీ).

ప్రయోగశాల నిర్మాణానికి అనువైన ప్రదేశం?

- జీవశాస్త్ర బోధన లక్ష్యాలంటే విషయ పరిజ్ఞానం మాత్రమే కాదు. విద్యార్థుల్లో సామర్థ్యాలు, నైపుణ్యాలు, అభిరుచులు పెంపొందించడంతోపాటు సమస్యా పరిష్కారం, ప్రయోగాత్మక వివరణ మొదలైనవి కూడా లక్ష్యాలే. ఇవన్నీ ప్రయోగశాలలోనే సాధ్యమవుతాయి.
- ప్రయోగాలు చేయడం ద్వారా నేర్చుకోవడం సాధ్యమవుతుంది. తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను ప్రయోగశాలలో ధ్రువీకరించుకోవచ్చు.
- **ఆవశ్యకత:** పరిశీలించేందుకు, పరీక్షించడానికి, మూఢ నమ్మకాలు తొలగించుకొని శాస్త్రీయ దృక్పథం ఏర్పర్చుకోవడం.
- పరిశీలించిన, పరీక్షించిన అంశాలు జీవితాంతం గుర్తుంచుకోవడం.
- అభిరుచులు, ఆసక్తి, కుతూహలం, ఆలోచన పెంపొందించుకోవడం.
- శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ.
- ప్రయోగాల్లో ఇబ్బందులు ఎదుర్కోవడం వల్ల నిజ జీవితంలో సమస్యా పరిష్కారం కోసం.
- సహకారం, ఓర్పు, క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం, నిర్భయత, నిష్పాక్షికత, వైఖరులు వంటి భావావేశ రంగ లక్ష్యాల సాధన.
- నైపుణ్యాల అభివృద్ధి.
- పరిశీలన అలవాట్ల అభివృద్ధి
- కష్టపడి పనిచేసే తత్వం, పనిపట్ల గౌరవం ఏర్పడటం
- సృజనాత్మకత పెరుగుదల.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ - మెథడాలజీ (ఎస్ఏ)

ప్రయోగశాల: తరగతిలోని విద్యార్థులు వ్యక్తిగతంగా, సామూహికంగా ప్రయోగాలు చేయడానికి ఉపకరించే ప్రయోగ పరికరాలతో కూడిన పెద్ద గదిని ప్రయోగశాల అంటారు.

ప్రయోగశాల రూపకల్పనలో పరిగణించే అంశాలు

- విద్యా జాతీయ లక్ష్యాలు - (దేశానికి ఉపయోగపడే ప్రయోగాలు చేయడం).
- పాఠ్యప్రణాళికా రకం
- ప్రయోగాలు చేసే విద్యార్థుల సంఖ్య
- ఒక్కొక్క విద్యార్థికి కనీస స్థలం
- తరగతి స్థాయి
- బోధన లక్ష్యాలు
- పొదుపును పాటించే విధం

ప్రయోగశాల రకాలు: నాలుగు రకాలైన ప్రయోగశాలలుంటాయి.

1. ఉపన్యాస గది - ప్రయోగశాల
2. సర్వప్రయోజన ప్రయోగశాల
3. ఉపన్యాస ప్రయోగశాల
4. సంచార ప్రయోగశాల

1. ఉపన్యాస గది - ప్రయోగశాల

- ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రయోగాలు చేయడానికి పొదుపుతో కూడిన ఈ ప్రయోగశాలను డా॥ఆర్.హెచ్. వైట్‌హౌస్ సూచించారు.



- $45' \times 25'$ కొలతలు కలిగి సగం ప్రయోగశాల, సగం తరగతి గది వేరు చేసి ఉంటాయి. 40 మంది తరగతి బోధన వినడానికి, 20 మంది ప్రయోగాలు చేయడానికి సరిపోతుంది.
- గోడలకు వెల్ల వేయడం కంటే పెయింట్ వేసి ఉండాలి.
- ప్రయోగశాల ఫ్లోరింగ్ కొంచెం ఏటవాలుగా ఉండి మూలాలు వంపు తిరిగి ఉండాలి. (దుమ్ము, ధూళి, బూజు నివారించడానికి)
- ప్రయోగశాలకు 2 తలుపులుండాలి.
- $6' \times 4'$ కొలతలో కిటికీలు, తలుపులు బయటకు తెరుచుకునేటట్లు ఉండాలి. కిటికీలకు వైర్‌గేజ్, తెరలు అమర్చాలి.
- $10' \times 4'$ కొలతలతో నల్లబల్ల
- $6 \times 2.5' \times 2.5'$ కొలతలతో ప్రదర్శనా బల్ల (ఉపాధ్యాయుడు ప్రయోగం చేసి చూపించడానికి)
- $3\frac{1}{2}' \times 1\frac{1}{2}' \times 1'$ కొలతలతో విద్యార్థుల బల్ల (ఇది ఇద్దరు విద్యార్థులకు)
- ప్రయోగ బల్లలు 10 ఉండాలి.
- ప్రదర్శన బల్లకు సీసపు పూత పూసి ఉండాలి.
- గోడలకు సింక్‌లుండాలి. వేయి గ్యాలన్ల నీరు నిల్వ చేసే ట్యాంక్ ఉండాలి.
- $6' \times 3\frac{1}{2}' \times 2'$ కొలతలతో విద్యార్థుల ప్రయోగ బల్ల ఉండాలి.

2. సర్వప్రయోజన ప్రయోగశాల

- సామాన్య విజ్ఞాన శాస్త్ర లక్ష్యాలకు అనుగుణంగా అధ్యయనం, అభ్యాసం రెండూ జరిగే విధంగా ఉండే ప్రయోగశాల.
- ప్రత్యేక సబ్జెక్టుల బోధనకు ఇది ఉపయోగపడదు.
- $47' \times 25'$ కొలతలు కలిగి $7' \times 25'$ కొలతలతో సామాన్ల నిల్వ గది వేరు చేసి ఉండాలి.
- 42 మంది విద్యార్థులకు సరిపోతుంది.
- $6 \times 2 \times 2\frac{1}{2}$ విద్యార్థుల బల్ల $4' \times 1\frac{1}{2}' \times 3\frac{1}{2}'$ కొలతలతో ఉపాధ్యాయుని ప్రదర్శన బల్ల ఉంటాయి.
- గోడల మందం $1\frac{1}{2}$ అడుగులు ఉండి అల్మరాలు గోడలోనికి ఉంటాయి.
- సున్నితపు త్రాసు, ప్రమాదకర రసాయనాలు, అక్వేరియాలు 'రిసెస్‌షెల్ఫ్'లలో ఉంచుతారు.

3. ఉపన్యాస ప్రయోగశాల

- యునెస్కో ప్లానింగ్ కమిషన్ సూచనల మేరకు శాస్త్రీయ విద్యా ప్యానెల్ వారు మాధ్యమిక పాఠశాలల కోసం దీన్ని రూపొందించారు.
- ఉపన్యాసం, ప్రయోగం రెండూ ఒకే గదిలో జరుగుతాయి.
- ప్రయోగశాల.. పాఠశాలలో నేల అంతస్తులో ఉండాలి.
- ఒక మూలకు ఉండి ఉత్తర, దక్షిణాభిముఖంగా నిర్మితమై ఉండాలి. (గాలి, వెలుతురు వచ్చే విధంగా)
- జీవశాస్త్ర ప్రయోగశాల బడి తోటకి ఆనుకొని ఉండాలి.
- 825 చ.అ॥ ప్రయోగశాల 42 మంది విద్యార్థులకు సరిపోతుంది.
- 42 మంది కంటే ఎక్కువ ఉంటే 490 చ॥అ కొలతలతో ల్యాబ్ - బి నిర్మించాలి.
- ల్యాబ్ - 'ఎ'లో రసాయన శాస్త్ర ప్రయోగాలు, ల్యాబ్ - 'బి'లో భౌతిక శాస్త్ర, జీవశాస్త్ర ప్రయోగాలు జరగాలి.
- యునెస్కో సూచనల మేరకు నల్లబల్లకు ఆకుపచ్చ లేదా ముదురు గోధుమ రంగు వేయాలి.

4. సంచార ప్రయోగశాల

- NCERT సూచనలతో నిర్మితమైంది. ప్రయోగశాలలు లేని ఒకటి కంటే ఎక్కువ పాఠశాలలకు ఉపయోగపడే ప్రయోగశాల.
- ప్రయోగ పరికరాలతో కూడిన పెద్ద మోటారు వాహనం వివిధ పాఠశాలలకు వెళ్లి ప్రయోగాలు చూపించే వీలుంటుంది.
- ఇందులో ప్రయోగ నైపుణ్యం కలిగిన నిపుణులు ప్రయోగం చేసి చూపెడతారు.

గత డీఎస్సీలలో అడిగిన ప్రశ్నలు

1. డా॥ ఆర్.హెచ్. వైట్‌హౌస్ సూచించిన ఉపన్యాస గది ప్రయోగశాల ప్లాన్ ప్రకారం డిమానిస్ట్రేషన్ టేబుల్‌తో కలిపి ప్రాక్టికల్ టేబుళ్ల సంఖ్య? (డీఎస్సీ-2012)
   1) 7 2) 4 3) 5 4) 6
2. 20 మంది విద్యార్థులకు అనువైన ప్రయోగశాల పరిమాణం? (డీఎస్సీ-2006)
   1) $35' \times 15'$ 2) $25' \times 10'$
   3) $20' \times 15'$ 4) $45' \times 25'$
3. జీవశాస్త్రానికి కుటీర పరిశ్రమలతో, సామాజిక, భౌతిక పర్యావరణంతో సహ సంబంధాన్ని కల్పించేది? (డీఎస్సీ-2006)
   1) ప్రయోగశాల సూచికలు
   2) బోధన సూచికలు
   3) జీవశాస్త్ర పాఠ్యపుస్తకం
   4) జీవశాస్త్ర ప్రయోగశాల
4. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమైక్య పాఠ్య ప్రణాళికను అనుసరించి జీవశాస్త్ర బోధనకు కావాల్సిన అక్వేరియాల సైజులు? (డీఎస్సీ-2004)
   1) $38'' \times 38'' \times 24''$, $44'' \times 32'' \times 20''$
   2) $8'' \times 8'' \times 2'$, $14'' \times 10' \times 5''$
   3) $28' \times 28'' \times 14'$, $34'' \times 22'' \times 10'$
   4) $18'' \times 18'' \times 12''$, $24' \times 12'' \times 5''$
5. యునెస్కో ప్లానింగ్ కమిషన్ నిపుణుల నివేదికను దృష్టిలో ఉంచుకొని శాస్త్రీయ విద్యాప్యానెల్ 1964లో రూపొందించిన సూచనల ప్రకారం మాధ్యమిక పాఠశాలల్లోని ప్రయోగశాలలో ఉపాధ్యాయుడి బల్ల పరిమాణం ఎంత ఉండాలి?
   1) $6' \times 2' \times 2'$ 2) $8' \times 4' \times 4'$
   3) $8' \times 2.6' \times 2.9'$ 4) $6 \times 2.6 \times 2.9$

సమాధానాలు

1) 4; 2) 4; 3) 4; 4) 4; 5) 3.

మాదిరి ప్రశ్నలు

1. శాస్త్రం పట్ల నమ్మకం కలగడానికి విద్యార్థులకు ఎక్కువగా ఉపయోగపడేది?
   1) ఆధ్యాత్మిక ప్రసంగాలు వినడం
   2) గ్రంథాలయాలకు వెళ్లడం
   3) ప్రయోగాలు చేయడం
   4) విజ్ఞాన శాస్త్ర విషయాలు వల్లె వేయడం
2. ఆర్.హెచ్. వైట్‌హౌస్ సూచించిన ప్రయోగశాల రకం?
   1) ఉపన్యాస గది - ప్రయోగశాల
   2) సంచార ప్రయోగశాల
   3) జీవశాస్త్ర ప్రయోగశాల
   4) సర్వ ప్రయోజన ప్రయోగశాల
3. ఉపన్యాస గది - ప్రయోగశాల ఎంతమంది విద్యార్థుల ప్రయోగాచరణకు ఉపకరిస్తుంది?
   1) 40 2) 20
   3) 30 4) 10
4. 2 నుంచి 3 శాతం చక్కెర ద్రావణంతో ఫార్మలిన్ కలిపి ప్రయోగశాలలో చల్లడం వల్ల వేటిని నివారించవచ్చు?
   1) దోమలు 2) ఎలుకలు
   3) బొద్దింకలు 4) ఈగలు
5. $47' \times 25'$ కొలతలు కలిగిన ప్రయోగశాల ఏ రకమైంది?
   1) సంచార ప్రయోగశాల
   2) ఉపన్యాస గది ప్రయోగశాల
   3) సర్వప్రయోజన ప్రయోగశాల
   4) ఉపన్యాస ప్రయోగశాల
6. ప్రయోగశాల నిర్మాణానికి అనువైన ప్రదేశం?
   1) భవనంపై అంతస్తు
   2) 2వ అంతస్తుపైన
   3) పాఠశాల మధ్య గదిలో
   4) నేల అంతస్తులో ఒక చివర
7. ప్రయోగశాలలో ప్రతి విద్యార్థికి ఉండాల్సిన సగటు స్థలం
   1) 100 చ.అ. 2) 15 చ.అ.
   3) 60 చ.అ. 4) 30 చ.అ.
8. ఉపన్యాస ప్రయోగశాలలో $7' \times 25'$ కొలతలతో ఉండే గది ప్రయోజనం?
   1) ఉపన్యాస గది
   2) ప్రయోగ నిర్వహణ
   3) నిల్వ సన్నాహక గది
   4) ఉపాధ్యాయుడి విశ్రాంతి కోసం
9. ప్రయోగశాల రూపకల్పనలో పరిగణనలోనికి తీసుకోని అంశం?
   1) పొదుపు 2) పాఠ్యప్రణాళిక
   3) ఉపాధ్యాయుని అభీష్టం
   4) తరగతి స్థాయి
10. కింది వాటిలో ప్రయోగశాల కొలతలకు సంబంధించి సరికాని జత?
    i) ఉపన్యాస ప్రయోగశాల - $47' \times 25'$
    ii) సర్వ ప్రయోజన ప్రయోగశాల - $45' \times 25'$
    iii) ఉపన్యాస గది - ప్రయోగశాల - 825 చ.అ.
    iv) సన్నాహక నిల్వ గది - $7' \times 25'$
    1) i, iii 2) i, ii
    3) ii, iii 4) iii, iv
11. కిందివాటిలో ఏ ప్రయోగశాలను యునెస్కో ప్లానింగ్ కమిషన్ సూచనల నుంచి రూపొందించారు?
    1) సంచార ప్రయోగశాల
    2) ఉపన్యాస - గది ప్రయోగశాల
    3) ఉపన్యాస ప్రయోగశాల
    4) సర్వప్రయోజన ప్రయోగశాల
12. సాధారణంగా ప్రయోగశాలలో ఉండే నల్లబల్ల పరిమాణం?
    1) $6' \times 4'$ 2) $10' \times 4'$
    3) $4' \times 8'$ 4) $8' \times 6'$
13. నల్లబల్లకు ముదురు ఆకుపచ్చ రంగు వేయాలనేది వీరి సూచన?
    1) UNICEF 2) NCERT
    3) SCERT 4) UNESCO
14. ప్రయోగశాల కిటికీలకు తెరలు బిగించాలి. ఎందుకంటే?
    1) కీటకాలు రాకుండా
    2) ఇతరులు ప్రయోగాలు చూడకుండా
    3) అవసరమైనప్పుడు చీకటి గది చేసేందుకు
    4) విద్యార్థుల్లో ఏకాగ్రత కోసం
15. ప్రమాదకర రసాయనాలు ఉంచడానికి కేటాయించిన ప్రదేశం?
    1) నీటి ట్యాంక్
    2) సన్నాహక గది
    3) రిసెస్ షెల్ఫ్
    4) ఉపాధ్యాయుడి ప్రదర్శన బల్ల

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 4; 5) 3; 6) 4; 7) 4; 8) 3; 9) 3; 10) 2; 11) 3; 12) 2; 13) 4; 14) 3; 15) 3.

Financial statements includes?

BANK EXAMS

BANKING AWARENESS



1. Banks obtain photograph at the time of opening of the account with a view to:
   a) Avoid benami accounts
   b) Verify the identity of the customer
   c) Verify with police records
   d) a & b e) a to c
2. Banks are required to submit CTR (Cash Transaction Report) to ___within__of succeeding month.
   a) FIU, 30 days b) FIU, 15 days
   c) FIU, 7 days d) RBI, 7 days
   e) RBI, 15 days
3. Premium payable on deposit insurance on every Rs.100 per annum is
   a) 10 paise b) 5 paise
   c) 25 paise d) 50 paise
   e) None
4. Which of the following can't be a nominee?
   a) Illiterate Person
   b) Minor c) NRI
   d) HUF e) None
5. In case of dishonor of cheques on financial grounds, the holder is required to issue notice to the drawer within ___ days to claim remedy under section 138 of NI Act
   a) 7 Days b) 30 Days
   c) One Year d) Three Years
   e) None
6. National Payment Corporation of India (NPCI) has set up payment network to enable the member banks to issue Domestic Payment Cards with a brand ___
   a) Visa Card b) Master Card
   c) Prepaid Card d) RuPay
   e) Travel Card
7. Permanent Account Number (PAN) is mandatory for
   a) Bank transactions (cash) of Rs. 50000/- & above
   b) Purchase and sale of shares/debentures/bonds of Rs. 500-00/- & above
   c) Purchase and sale of immovable property where the value of the property is Rs. 5 lakh & above
   d) a & c e) All
8. High Debt Service Coverage Ratio (DSCR) indicates
   a) Unable to meet the installment obligations
   b) Able to meet payment of installments comfortably
   c) Liquidity problem
   d) a & c e) None
9. Which of the following statement is not true with regard to Capital Gains Deposit Scheme?
   a) Income Tax Assess who are eligible for exemption under section 54 of the IT Act are alone can open account with Banks
   b) Accounts can be opened under Savings, Fixed and Term Deposits
   c) Cheque book can be issued to eligible accounts.
   d) No lien or deposit loan is allowed against such deposits
   e) None
10. Which of the following statement is not correct with regard to Tax Saver Scheme of Banks?
    a) Tax exemption is available for the deposit amount under section 80C of IT Act
    b) Period of deposit is allowed up to 5 Years
    c) TDS is applicable, if interest payment is above Rs.10000/- in a financial year
    d) Maximum amount of deposit allowed is Rs. 5 lakhs
    e) c & d
11. Financial statements includes
    a) Balance Sheet b) P & L
    c) Cash & Funds Flow
    d) a & b e) a, b & c
12. Banks are permitted to take over borrowal accounts from other Banks & Financial institutions provided
    a) Account should be Standard Asset with positive net worth
    b) Copy of the borrowal account for preceding 12 months is to be obtained
    c) P & C report is to be obtained from other bank before disbursement
    d) Branch to take approval from next sanctioning authority
    e) All of the above
13. RBI extending incentives to Banks for the following services
    a) Adjudication of Mutilated Bank Notes
    b) Exchange of Soiled Notes
    c) Distribution of Coins over the counter
    d) Establishment of Coin vending Machines
    e) All of the above
14. Which agency is enabling the transfer of subsidies directly to beneficiary accounts through Aadhaar Enabled Payment Bridge (APB)?
    a) RBI b) SEBI c) IDRBT
    d) NPCI e) SBI
15. Call Money Market interest are linked to
    a) Bank Rate b) Repo Rate
    c) Reverse Repo Rate
    d) Market forces e) None
16. Transaction Password relates to
    a) Core Banking
    b) ATM operations
    c) Internet Banking
    d) Tele banking e) None
17. Nomination in respect of the following is to be witnessed by two persons.
    a) All deposit accounts
    b) Deposit accounts where the nominee is a minor
    c) Physically challenged accounts
    d) Thumb impression accounts (illiterate) e) None
18. When the contents of the Negotiable Instrument are modified by the drawer, it is treated as
    a) Forgery b) Fraud
    c) Material alteration
    d) suppression of facts
    e) None
19. Prepayment charges are exempted for
    a) Housing Loans
    b) Education Loans
    c) Agr. Loans d) Corporate Loans
    e) a, b & c
20. IFSC code consists of ___ Digits.
    a) 9 b) 10 c) 11 d) 15
    e) None
21. One Bank account per family is mandatory to avail
    a) Credit facility from bank
    b) Direct Benefit Transfer benefit (subsidy)
    c) Interest subvention – Housing Loan
    d) either a or b e) none
22. What is the time limit to furnish the requested information under Right to Information Act (RTI) and what is the penalty for non-compliance of the said norm?
    a) 30 days & Rs. 100 per day
    b) 60 days & Rs. 100 per day
    c) 30 days & Rs. 250 per day maximum of Rs. 25000/-
    d) 60 days & Rs. 250 per day
    e) None
23. The documents to be insisted from a NRI for opening an account is
    a) Copies of Passport and VISA
    b) Local and Overseas addresses
    c) Compliance of KYC norms
    d) Latest Passport size photographs
    e) All of the above
24. Minimum and Maximum period of Certificate of Deposits
    a) 15 days & 1 year
    b) 30 days & 1 year
    c) 7 days & 1 year
    d) 7 days & no limit e) None
25. Loans not exempted from Base Rate Purview?
    a) Consortium Advance
    b) Loans against deposits
    c) Export Credit
    d) Loans to staff members
    e) None
26. Visually challenged persons are allowed to avail the following banking facilities?
    a) Cheque Book b) Debit Card
    c) ATM Card d) Locker e) All
27. Housing Loan up to ___ is treated as Priority Sector.
    a) 10 lakh b) 15 lakh
    c) 25 lakh in Metro with population above 10 lakh to 15 lakh in other centers
    d) 25 lakh at all places e) None
28. Nominee can exercise his right
    a) During the tenure of deposit
    b) On maturity of deposit
    c) Any time since he will be treated as joint depositor
    d) He has no right on deposit since it is in the name of the depositor
    e) On the death of the depositor
29. Balances under Cash Reserve Ratio (CRR) earn interest @___
    a) 3% p.a.
    b) Applicable SB Interest Rate
    c) 5% p.a. d) No interest
    e) None
30. Banks are allowed to accept deposits under Capital Gains Scheme in ___
    a) Savings b) Fixed
    c) Current d) a & b
    e) Any scheme
31. During March 2015, a Reserve Bank of India (RBI) committee had recommended introduction of PSLCs to enable banks "to meet their PSL requirements even while leveraging their comparative advantage in lending". What does the PSLC stands for?
    a) Priority Sector Lending Certificates
    b) Priority sector Loan Certificates
    c) Primary and Secondary Sector Certificates
    d) Public Sector Lending Certificates
    e) None of the above
32. Zero Coupon Bonds refers to
    a) Bond issued at face value
    b) Bond issued with face value & interest
    c) Bond issued at discount from its face value with interest
    d) Bond issued at discount from its face value without interest
    e) None
33. ATMs that are owned and managed by non-banking entities are called as ___
    a) Onsite ATM b) Offsite ATM
    c) Third Party ATM
    d) Red label ATM
    e) White label ATM
34. For transfer of funds through NEFT (National Electronic Fund Transfer) and minimum and maximum amount that can be transferred are
    a) Rs.1,000 and maximum Rs. 5 lakhs.
    b) Rs. 1000 and maximum no limit
    c) Rs. 5,000 and maximum 1 lakh
    d) No minimum & maximum amount e) None
35. Cash kept in the currency chest is owned by
    a) Currency Chest Branch Bank
    b) Central Government
    c) Reserve Bank of India
    d) State Bank of India
    e) None of the above
36. Bank can't proceed against the borrower under SARFAESI Act where
    a) Security is agri land
    b) Liability is less than 1 lakh
    c) Liability is less than 20% of the principal
    d) Pledge of movables
    e) All of the above

KEY

1) d; 2) b; 3) a; 4) d; 5) b; 6) d; 7) e; 8) b; 9) c; 10) d; 11) e; 12) e; 13) e; 14) d; 15) d; 16) c; 17) d; 18) c; 19) e; 20) c; 21) b; 22) a; 23) e; 24) c; 25) a; 26) b; 27) c; 28) e; 29) d; 30) d; 31) a; 32) d; 33) e; 34) c; 35) c; 36) b;